

'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 323

సోమవారం 5-8-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



10 మందితోనే గెలిచాం

పారిస్ ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లి పతకం రేసులో నిలిచింది. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 'షూటౌట్'లో 4-2తో బ్రిటన్ జట్టును ఓడించింది.

- వివరాలు 12లో

మరో సర్కారీ హత్య

పోలీసుల సాక్షిగా టీడీపీ నేతల కిరాతకం

శ్రీశైలం నియోజకవర్గం సీతారామాపురంలో అతి దారుణంగా వైఎస్సార్‌సీపీ నేత హతం

- ఎస్‌ఐ, కానిస్టేబుళ్ల కళ్లెదుటే సుబ్బరాయుడిని ఇంట్లో నుంచి బయటికి లాగి చంపిన వైనం
- రాత్రి 9.30 గంటల నుంచే పోలీసులను అప్రమత్తం చేసిన మరో నేత జయనారపురెడ్డి
- అదనపు బందోబస్తుకు విన్నవించినా పట్టించుకోని పోలీసు ఉన్నతాధికారులు.. ఊరంతా చూస్తుండగా 'పచ్చ' మూకా విధ్వంసం.. పక్కా ప్రణాళికతోనే హత్య
- 'పచ్చ మూకా' ఊరు దాటేంత వరకు గ్రామంలోకి రాని అదనపు పోలీసు బలగాలు.. చంపేందుకు ఎక్కువ మంది రావడంతో ఏమీ చేయలేక పోయామన్న పోలీసులు
- అర్ధరాత్రి 12.20-12.30 గంటల మధ్య హత్య జరిగాక అదనపు బలగాల రాక
- జిల్లా కేంద్రానికి కేవలం 12 కిలోమీటర్ల దూరంలో ఘటన

10లో




సుబ్బరాయుడు (ఫైల్)

సంద్యాల జిల్లా మహానంది మండలం సీతారామాపురంలో టీడీపీ నేతల కిరాతక దాడిలో ప్రాణాలు కోల్పోయిన పసుపులేటి సుబ్బరాయుడు

మీపైనా పెట్రోల్ పోసి తగలబెడతాం

- సీతారామాపురంలో పోలీసులనూ బెదిరించిన 'పచ్చ' మూకా
- మహిళలని కూడా చూడకుండా చేయి చేసుకున్న గూండాలు
- సుబ్బరాయుడి ఇంటి వద్దకు చేరుకుని అరుపులు, కేకలు, దాడి
- చనిపోయాడనుకుని వెనుదిరుగుతూ పరీక్షించి చూసిన వైనం
- వీడింకా బతికే ఉన్నాడంటూ బండరాయితో తలపై మోది హత్య

10లో

ఏపీలో ముఠాల పాలన

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపాటు
- రాష్ట్రం రాజకీయ హింసకు మారుపేరుగా మారింది
- ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహంతోనే నిత్యం దాడులు
- హామీలు అమలు చేయలేకే ఈ దుర్మార్గాలు
- బాధితులకు అండగా నిలిచి పోరాటం సాగిస్తాం

10లో

రాజకీయ కక్షతోనే ఈ దారుణం

- తొలిసారి నిన్నటి ఎన్నికల్లో సీతారామాపురంలో వైఎస్సార్‌సీపీ తరఫున ఏజెంట్లు
- హత్యకు గురైన సుబ్బరాయుడి కుమారుడు ప్రసాద్ ఏజెంటుగా కూర్చున్నాడని అక్కసు

10లో



ఎన్టీఆర్ జిల్లా కొనకంచి క్రాస్ రోడ్డు వద్ద నవాబుపేట వైఎస్సార్‌సీపీ నేత గింజుపల్లి శ్రీనివాసరావుపై పాశవికంగా దాడి చేస్తున్న టీడీపీ గూండాలు

జగ్గయ్యపేటలో పచ్చ మూకల దాడి

2లో

- తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ నేత గింజుపల్లి శ్రీనివాసరావు
- నిందితులను కఠినంగా శిక్షించాలని నవాబుపేట గ్రామస్తుల ఆందోళన

బంగ్లాలో మళ్లీ ఘర్షణలు

- 97 మంది మృతి
- విద్యార్థులు, యువత ఆందోళనలు హింసాత్మకం
- హసీనా రాజీనామాకు డిమాండ్, కర్ఫ్యూ

6లో


వలంటీర్ల వ్యవస్థకు ఉరి!



- చంద్రబాబు సర్కార్ మరో మోసం
- వలంటీర్ల వాట్సాప్ గ్రూపులన్నీ తొలగించాలని ఆదేశాలు
- సెలవు రోజే కీలక నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఇప్పటికే వేతన బకాయిలు ఇవ్వకుండా వేధింపులు
- హామీలు నెరవేర్చాలని కోరినందుకు కక్షసాధింపు.. ప్రజల మనసు గెలిచిన వ్యవస్థ నిర్వీర్యానికి కుట్ర

3లో

నిండుకుండలా సాగర్



- నేడు ప్రాజెక్టులో గరిష్ఠ స్థాయికి నీటి నిల్వ
- ఉదయం 8 గంటలకు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల.. శ్రీశైలం ప్రాజెక్టులోకి కొనసాగుతున్న వరద ఉద్ధృతి
- కృష్ణా నది ఎగువన స్థిరంగా వరద

2లో

'రక్షణ' ఎగుమతుల్లో నంబర్ వన్ కానున్న భారత్..



- భారత రక్షణరంగ సాంకేతిక సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి
- సతీష్‌రెడ్డికి మండలి వెంకటకృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం ప్రదానం

3లో

ఇదండీ సంగతి



ఇక్కడికి తేవడం కుదరదంటే మనమే అక్కడికి వెళితే బెటర్!!

రైలు బోగీలో మంటలు


మంటలను ఆర్పుతున్న సిబ్బంది

- విశాఖ రైల్వేస్టేషన్‌లో 'కోర్బా–విశాఖ' రైలు ఆగి ఉండగా ఘటన
- ఒక థర్డ్ ఏసీ కోచ్ పూర్తిగా, మరో 2 కోచ్‌లు పాక్షికంగా ఆహుతి

14లో

క్లుప్తంగా...

ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ

- రూ.29 లక్షలు అపహరణ



అనంతపురం: అనంతపురం రాంనగర్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో ఆదివారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. గ్యాస్‌కట్టర్‌తో ఏటీఎంను ధ్వంసం చేసి, అందులోని రూ.29 లక్షలను దుండగులు ఎత్తుకెళ్లారు. అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ ఆర్.ప్రతాప్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. రాంనగర్ మెయిన్ రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు తెల్లవారుజామున 2.40 గంటలకు ఐదుగురు దొంగలు వచ్చారు. ఇద్దరు బయట కాపలా ఉండగా, ముగ్గురు ఏటీఎంను ధ్వంసం చేశారు. ఏటీఎం డోర్లను గ్యాస్ కట్టర్‌తో తొలగించారు. సీసీ కెమెరాలకు నల్లని మసి పూశారు. ఆ తరువాత రూ.29 లక్షల నగదు తీసుకుని ఉడాయించారు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఏటీఎం అలారమ్ సిస్టమ్ పనిచేయడంతో పోలీసులకు సమాచారం వచ్చింది. వారు ఘటనాస్థలికి చేరుకునే లోపే దొంగలు పరారయ్యారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దొంగల కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా, ఈ ఘటన జరిగిన రెండు రోజులకు ముందే గార్లదిన్నెలో ఏటీఎంను పగులగొట్టి రూ.3.60 లక్షలను దుండగులు అపహరించారు. హరియాణ రాష్ట్రానికి చెందిన ఓ ముఠానే ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

పరిపాలనాధికారి పోస్టులు మంజూరు చేయాలి

- వ్యవసాయ శాఖ ఉద్యోగుల సేవా సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: నూతన జిల్లాల్లోని వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో పరిపాలనాధికారి పోస్టులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉద్యోగుల సేవా సంఘం డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్ అధ్యక్షతన ఆదివారం విజయవాడలో జరిగిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో ప్రతి జిల్లాకు మూడు సూపరింటెండెంట్ పోస్టులు మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్, పర్యవేక్షకులు, పరిపాలనాధికారుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని సమావేశం తీర్మానించింది.



వీరరాఘవయ్య (ఫైల్)

వైద్య సేవలందక వ్యక్తి మృతి

సైదాపురం పీహెచ్‌సీ ఎదుట మృతుని బంధువుల ఆందోళన

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సకాలంలో వైద్య సేవలు అందక నెల్లూరు జిల్లా సైదాపురంలో ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆగ్రహించిన ప్రజలు పీహెచ్‌సీ ఎదుట ధర్నాకు దిగారు. సైదాపురం దళితవాడకు చెందిన మల్లారపు వీరరాఘవయ్య (49) ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం అతడి నోట్లో నుంచి నురుగు రావడంతో సమీపంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ కేవలం స్టాఫ్ నర్సు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రథమ చికిత్స కూడా చేయకుండానే గూడూరు ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సలహా ఇవ్వడంతో గూడూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే అతడు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులతో పాటు దళితవాడకు చెందిన యువత పీహెచ్‌సీకి చేరుకుని ధర్నాకు దిగారు. కనీస వైద్య సేవలు అందకపోవడం వల్లే వీరరాఘవయ్య మృతి చెందాడని వాపోయారు. వివిధ పార్టీల నేతలు ఆందోళనకారులకు మద్దతు ప్రకటించారు. ఉన్నతాధికారులు వచ్చేంత వరకు ఆందోళన విరమించమని భీష్మించుకు కూర్చున్నారు. ఎస్ఐ డీఎస్ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని సమగ్ర విచారణ జరిపారు. ఇక్కడి పరిస్థితిని రాపూరు సీఐ విజయకృష్ణకు వివరించారు. అక్కడి నుంచే సీఐ ఆందోళనకారులను శాంతింపజేశారు. - సైదాపురం

హైవేతో అమరావతి అనుసంధానం

- ఆరు లేన్ల రోడ్ల ఏర్పాటుకు సీఆర్‌డీఏ చర్యలు
- 4 మార్గాల్లో ఎన్‌హెచ్–16ను కలుపుతూ నిర్మాణం
- డీపీఆర్ సిద్ధం చేసిన సీఆర్‌డీఏ.. త్వరలో టెండర్లు
- సీడ్ యాక్సెస్ రోడ్డును పూర్తి చేసేందుకు చర్యలు



సాక్షి, అమరావతి: రాజధాని(అమరావతి) ప్రాంతాన్ని చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి(ఎన్‌హెచ్–16)తో కలిపేందుకు సీఆర్‌డీఏ చర్యలు చేపట్టింది. ఇక్కడి గ్రామాల మీదుగా ఆరు లేన్లతో నాలుగు ప్రధాన రహదారులను నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించింది. ఆరు లేన్ల రోడ్ల పనులకు సంబంధించి అధికారులు సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సైతం సిద్ధం చేశారు. త్వరలో సీఎం చంద్రబాబుతో సమావేశమై నిర్ణయం తీసుకుని టెండర్లకు వెళ్లాలని సీఆర్‌డీఏ యోచిస్తోంది. రాజధాని అభివృద్ధిలో భాగంగా గతంలోనే ఈ రోడ్లకు అలైన్‌మెంట్ కూడా చేశారు. ఆ ప్రణాళిక ప్రకారమే వీటిని నిర్మించనున్నట్టు తెలుస్తోంది. అమరావతిలోని ప్రధాన రహదారులను తూర్పు నుంచి పడమరకు, ఉత్తరం నుంచి దక్షిణానికి గ్రిడ్ విధానంలో నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. తూర్పు నుంచి పడమరకు వెళ్లే రహదారులు ఈ–1 నుంచి ఈ–16 వరకు, ఉత్తరం నుంచి దక్షిణానికి వెళ్లే మార్గాలు ఎస్–1 నుంచి ఎస్–18 వరకు ఉన్నాయి. ఇప్పుడు ఈ–5, ఈ–11, ఈ–13, ఈ–15 రోడ్లు నిర్మించి.. పడమర వైపు ఉన్న ఎన్‌హెచ్–16తో అనుసంధానం చేస్తారు. కాగా, రాజధాని నుంచి గ్రామాల మీదుగా వెళ్తున్న ఈ రహదారుల నిర్మాణానికి పలుచోట్ల భూసేకరణ చేయాల్సి ఉంది.

ఈ–5 రహదారి

ఈ రోడ్డు నిర్మాణం ఉండవల్లి నుంచి ప్రారంభమవుతుంది. ఉండవల్లి, మందడం, రాయపూడి, తుళ్లూరు, అనంతవరం మీదుగా జాతీయ రహదారికి అనుసంధానం చేస్తారు. మొత్తం 18 కి.మీలు మేర ఈ రోడ్డును నిర్మిస్తారు. సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమాంతరంగా ఉండే ఈ మార్గం.. గ్రామాల మీదుగా వెళ్తుంది. ఈ క్రమంలో పలుచోట్ల భూసేకరణ చేయాల్సి ఉంది.

ఈ–11 రహదారి

నీరుకొండ నుంచి నవులూరు వరకు 6.3 కి.మీ మేర.. జాతీయ రహదారితో అనుసంధానించేందుకు మరో 4.50 కి.మీ మేర ఈ రోడ్డును నిర్మిస్తారు. ఈ రోడ్డును నీరుకొండ, కురగల్లు, నవులూరు మీదుగా మంగళగిరిలోని ఎయిమ్స్ ముందు నుంచి ఎన్‌హెచ్–16తో అనుసంధానం చేస్తారు.

ఈ–13 రహదారి


నీరుకొండ నుంచి నవులూరు వరకు 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తారు. అనంతరం మంగళగిరి వద్ద ఎన్‌హెచ్–16తో అనుసంధానించేందుకు మరో 2.5 కి.మీ మేర రోడ్డును విస్తరించి ఎయిమ్స్ వెనుక నుంచి జాతీయ రహదారితో కలుపుతారు. ఈ రోడ్డు నీరుకొండ డౌన్ నుంచి నిడమర్రు, ఎర్రబాలెం, నవులూరు, మంగళగిరి మీదుగా వెళుతుంది.

ఈ–15 రహదారి

నిడమర్రు నుంచి జగనన్న లేఅవుట్, నవులూరు, క్రికెట్ స్టేడియం మీదుగా ఎయిమ్స్ వద్ద ఉన్న పాత హైవేకు అనుసంధానం చేస్తారు.

సీడ్ యాక్సెస్ రోడ్డు

ప్రస్తుతం అసెంబ్లీ, సచివాలయాలకు వెళ్లేందుకు వినియోగిస్తున్న సీడ్ యాక్సెస్ రోడ్డు(ఈ–3)ను.. దొండపాడు నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు 21 కి.మీ.ల మేర నిర్మించతలపెట్టారు. అయితే, దొండపాడు నుంచి మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమం వరకు 14 కి.మీ మేర రోడ్డు పూర్తయ్యాక అనేక వివాదాలతో పనులు నిలిచిపోయాయి. రెండో ప్యాకేజీగా బ్యారేజీ నుంచి మణిపాల్ ఆస్పత్రి వరకు 3 కి.మీ మేర రోడ్డును నిర్మించనున్నారు. మరో 4 కి.మీ మేర మార్గంలోని రైతులను ఒప్పించి మొత్తం సీడ్ యాక్సెస్ రోడ్డును పూర్తి చేయాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. ముఖ్యమంత్రి ఆమోదం తెలపడంతో ఈ నెలలోనే టెండర్లకు నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం.



నిండుకుండలా సాగర్

- నేడు ప్రాజెక్టులో గరిష్ట స్థాయికి నీటి నిల్వ
- ఉదయం 8 గంటలకు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

సాక్షి, అమరావతి/విజయపురిసౌత్/సత్రశాల (రెంటచింతల)/శ్రీశైలంప్రాజెక్ట్/పోలవరం రూరల్: నాగార్జునసాగర్ నిండుకుండలా మారింది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రాజెక్టులోకి 3,22,817 క్యూసెక్కులు చేరుతుండగా.. విద్యుదుత్పత్తి చేస్తూ, కుడి, ఎడమ కాలువల ద్వారా 37,873 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్‌లో నీటి నిల్వ 576.1 అడుగుల్లో 271.9 టీఎంసీలకు చేరుకుంది. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 590 అడుగులు.. పూర్తి నీటి నిల్వ 312.05 టీఎంసీలు. మరో 41 టీఎంసీలు చేరితే సాగర్ పూర్తిగా నిండిపోతుంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో సోమవారం ఉదయం సాగర్‌లో నీటి నిల్వ గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. ఉదయం 8 గంటలకు పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి చేస్తూ, వరద జలాలను గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తామని అధికారవర్గాలు తెలిపాయి. ఇటు సుంకేశుల, అటు జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి 4,87,451 క్యూసెక్కులు చేరుతుండగా.. 882.9 అడుగుల్లో 203.89 టీఎంసీలను నిల్వ చేస్తూ.. పది గేట్లు 15 అడుగుల మేర ఎత్తి, అలాగే కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి చేస్తూ దిగువకు 4,27,711 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇక నాగార్జున సాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రెండు యూనిట్లు నుంచి, 4 క్రస్ట్‌గేట్లు ద్వారా 25 వేల క్యూసెక్కులు దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు నీరు విడుదల చేస్తున్నట్లు ఏపీ జెన్‌కో ఈఈ శ్రీనివాస సుబ్రమణ్యం, ప్రాజెక్టు డ్యామ్ ఏడీఈ ఎస్.జయశంకర్ ఆదివారం తెలిపారు. పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ 5.91 టీఎంసీలకు చేరుకుంది. కృష్ణా బేసిన్‌లో ఎగువన ఉన్న ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర డ్యామ్ నుంచి దిగువకు నీరు విడుదల నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టులోకి సోమవారం కూడా వరద ప్రవాహం కొనసాగనుంది.

స్వల్పంగా పెరుగుతున్న గోదావరి

పరీవాహక ప్రాంతంలో ఉపనదులు, కొండవాగుల నీటితో గోదావరిలో వరద స్వల్పంగా పెరుగుతోంది. భద్రాచలం వద్ద వరద తగ్గి మరలా పెరుగుతూ 37.30 అడుగులకు నీటిమట్టం చేరుకుంది.

ఎన్నో అరాచకాలు.. ఇవిగో సాక్ష్యాలు..

'రాష్ట్రంలో ప్రజలందరూ దాడుల గురించే మాట్లాడుకోవాలి.. హత్యల గురించే చర్చించుకోవాలి.. విధ్వంసాల తాలూకు వీడియోలు, ఫొటోలు రోజూ వారి కంట పడాలి.. అప్పుడే హామీల గురించి ఎవరూ నోరెత్తరు' అనేది టీడీపీ కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రోజూ విధ్వంసకాండ కొనసాగుతూనే ఉంది. ఊరూరా అరాచకత్వం రాజ్యమేలుతోంది. అంబేడ్కర్ రాజ్యాంగం మాయమై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. ప్రజాస్వామ్యం అంటే అర్థం మారిపోయింది. హత్యలు, ఆత్మహత్యలు, ప్రభుత్వ.. ప్రైవేట్ ఆస్తుల విధ్వంసాలు, కూల్చివేతలు, బెదిరింపులు, ప్రకృతి వనరుల దోపిడీ.. యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

జగనన్న కాలనీలో ఇల్లు కూల్చివేత

జేసీబీలతో విరుచుకుపడిన కూటమి నేతలు



కశింకోట: అనకాపల్లి జిల్లా కశింకోటలో జగనన్న కాలనీలో ఇంటిని ఆదివారం కూటమి నేతలు ధ్వంసం చేశారు. స్థానిక వడ్డివీధిలోని జగనన్న కాలనీలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు బందారు గణేష్ కొత్తగా నిర్మించుకున్న ఇంటిపై వారు రెండు జేసీబీలతో విరుచుకుపడ్డారు. ఇంటి మెట్లు, ప్రహరీని ధ్వంసం చేశారు. ఇది కోర్టు వివాదంలో ఉందని, తమ స్థలంలో ఇల్లు కట్టారని బెదిరిస్తూ కొంతమంది రౌడీలతో వచ్చి దౌర్జన్యంగా ధ్వంసం చేశారని బాధితుడు గణేష్ తెలిపారు. ఈ స్థలం వివాదంలో లేదని, ఏడాది కిందట ప్రభుత్వం స్థలం ఇవ్వడంతో ఇల్లు నిర్మించుకున్నానని చెప్పారు. గత నెలలో గృహప్రవేశం కూడా చేశామన్నారు. ఇంటిపన్ను కడుతున్నట్లు చెప్పారు. ఇవన్నీ చెప్పినా వినిపించుకోకుండా దౌర్జన్యంగా ఇంటిని ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడి ఫిర్యాదుతో వచ్చిన పోలీసులు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ల సహా పదిమందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



పగిలిన జెడ్పీటీసీ ఇంటి అద్దాలు



పీలేరు ఆస్పత్రిలో తారకనాథరెడ్డి

జెడ్పీటీసీ సభ్యురాలి ఇంటిపై దాడి

అన్నమయ్య జిల్లాలో టీడీపీ వర్గీయుల అరాచకం

కేవీపల్లె/పీలేరు: అన్నమయ్య జిల్లా కేవీపల్లె జెడ్పీటీసీ సభ్యురాలు గజ్జెల శృతి ఇంటిపై శనివారం రాత్రి టీడీపీ వర్గీయులు దాడిచేశారు. శృతి, ఆమె భర్త గజ్జెల శ్రీనివాసులురెడ్డి ఇంట్లో లేని సమయంలో గాలివారిపల్లె పంచాయతీ తిప్పన్నగారిపల్లెకు చెందిన గాలి రెడ్డెయ్య నాయుడు కుమారుడు గాలి ఆనంద్‌నాయుడు (జేసీబీ ఆనంద్), మద్దిపట్ల వెంకటరమణనాయుడు కుమారుడు జయరామనాయుడు 20 మంది అనుచరులతో కలిసి ఆమె ఇంటిపై దాడి చేయగా.. ఇంటి అద్దాలు ధ్వంసమయ్యాయి. గర్నిమిట్ట పెట్రోల్‌బంకు వద్ద తమ కారు షెడ్డును కూడా కూల్చేశారని ఆమె ఆదివారం ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి: మరోవైపు గాలి ఆనంద్‌నాయుడు, జయరామనాయుడులు తమ అనుచరులతో కలసి ఆదివారం కేవీపల్లె మండలం దిగువగల్లకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తారకనాథరెడ్డి (38)ని తీవ్రంగా కొట్టి గాయపరిచారు. తరువాత కారులో తీసుకెళ్లి రోడ్డుపక్కన పడేసి వెళ్లిపోయారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు గాలించి గొల్లపల్లె సమీపంలో ఉన్న తారకనాథరెడ్డిని పోలీస్ వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పేట్రేగిన పచ్చమూక

తిప్పినాయుడుపల్లెలో వైఎస్సార్‌సీపీ నేతలపై మూకుమ్మడి దాడి

వెదురుకుప్పం: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం తిప్పినాయుడుపల్లె సమీపంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు ఆదివారం రాత్రి దాడులకు తెగబడ్డారు. స్థానికుల సమాచారం ప్రకారం.. తిప్పినాయుడుపల్లె ఎస్సీ కాలనీ నుంచి శ్మశానానికి వెళ్లే రోడ్డుపై నిలబడి ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఉప సర్పంచ్ శేషగిరిని టీడీపీ నాయకుడు విజయనరసింహారెడ్డి, అతని అనుచరులు శివయ్య, సి.రాంబాబు, నిరంజన్, గుణశేఖర్, సతీష్, అబ్బులు, గుణశేఖర్, దివాకర్ అటకాయించి మూకుమ్మడిగా దాడిచేశారు. అదే గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్ దాడిని అడ్డుకునే క్రమంలో టీడీపీ నాయకులు విజయనరసింహారెడ్డి కులం పేరుతో దూషించి నువ్వెవరంటూ ఆయనపై చేయిచేసుకున్నాడు. ఈ ఘటనపై వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్ తెలిపారు. గాయపడిన శేషగిరిని పచ్చికాపల్లం పీహెచ్‌సీకి తీసుకెళ్లగా.. ప్రాథమిక చికిత్స చేసి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు గ్రామస్తులు తెలిపారు. బీసీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం వేసిన కొత్త బోరు పక్కనే 10 అడుగు దూరంలో అక్రమంగా సొంతంగా బోరు వేసుకున్న టీడీపీ నాయకుడు విజయనరసింహారెడ్డిని అడ్డుకున్నందుకు కక్ష పెంచుకుని దాడులు చేయిస్తున్నాడని వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు. వీధి దీపాలు లేక అవస్థలు పడుతున్న క్రమంలో సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వీధి దీపాలు వేస్తున్నా టీడీపీకి ఓటు వేయలేదన్న సాకుతో లైట్లు వేయకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. తమపై దౌర్జన్యం చేసి.. తమపైనే తప్పుడు కేసులు పెడుతున్నారని చెప్పారు.



శేషగిరిని ఆస్పత్రికి తీసుకెళుతున్న బంధువులు

జగ్గయ్యపేటలో పచ్చమూకల దాడి

వైఎస్సార్‌సీపీ నేత గింజుపల్లి శ్రీనివాసరావును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఉదయభాను

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలంలోని నవాబుపేట మాజీ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత గింజుపల్లి శ్రీనివాసరావుపై హత్యాయత్నం చేసిన వారంతా గతంలో అతని తండ్రి గింజుపల్లి వీరయ్య హత్య కేసులో ముద్దాయిలేనని జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను చెప్పారు. శనివారం రాత్రి టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడిన గింజుపల్లి శ్రీనివాసరావును విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆయనను సామినేని ఉదయభాను ఆదివారం పరామర్శించారు. అనంతరం ఉదయభాను మీడియాతో మాట్లాడుతూ 2009లో శ్రీనివాసరావు తండ్రి గింజుపల్లి వీరయ్యను టీడీపీ గూండాలు అత్యంత పాశవికంగా హత్య చేశారని తెలిపారు. వీరయ్య హత్య కేసులో టీడీపీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సోదరుడు శ్రీరాం ధనుంజయ్(చినబాబు), చింతా వెంకటేశ్వరరావు(బుల్లి) ముద్దాయిలుగా ఉన్నారని గుర్తుచేశారు. వారే రెండు నెలలుగా రెక్కీ నిర్వహించి శ్రీనివాసరావుపై హత్యాయత్నం చేశారన్నారు. ఈ ఘటనలో బాధ్యులైన వారిపై పీడీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీనివాసరావును ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, మొండితోక అరుణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ కూడా పరామర్శించారు. కాగా, గింజుపల్లి శ్రీనివాసరావుపై దాడి చేసినవారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ నవాబుపేట గ్రామస్తులు ఆదివారం ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు.

కేసు నమోదు.. నలుగురికి రిమాండ్

శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చింతా వెంకటేశ్వరరావు, దండగల నాగరాజు, తమ్మిశెట్టి హనుమంతరావు, వేమూరి సత్యనారాయణలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



గింజుపల్లి శ్రీనివాసరావును పరామర్శిస్తున్న జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే ఉదయభాను

టీడీపీ నేతల బెదిరింపు.. రైతు ఆత్మహత్యాయత్నం

- పరిస్థితి విషమం
- కర్నూలు జిల్లా బిల్లేకల్లులో ఘటన



ఆస్పత్రిలో లక్ష్మీనారాయణ

ఆలూరు రూరల్/ఆస్పరి: టీడీపీ నేతలు చంపుతామని బెదిరించడంతో ఓ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన కర్నూలు జిల్లా ఆస్పరి మండలం బిల్లేకల్లులో శనివారం రాత్రి జరిగింది. బిల్లేకల్లుకు చెందిన రైతు లక్ష్మీనారాయణ వైఎస్సార్‌సీపీ కార్యకర్త కూడా. శుక్రవారం కూరగాయల మార్కెట్ వేలాల విషయంలో సుమారు వందమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై రాళ్లు రువ్వి కట్టెలతో దాడి చేశారు. ఈ ఘటనలో 10 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో పాటు ఆస్పరి సీఐ హనుమంతప్ప తలకు గాయమై మూడు కుట్లు పడ్డాయి. దాడి సమయంలో రైతు లక్ష్మీనారాయణ కూడా అక్కడే ఉన్నారు. దీంతో అతడిపైనా టీడీపీ నేతలు కక్ష పెంచుకున్నారు. లక్ష్మీనారాయణ శనివారం రాత్రి తన పొలానికి నీరు పెడుతుండగా.. టీడీపీ నాయకుడు ఈడిగ శ్రీను, మరికొందరు అక్కడికి వెళ్లి 'నిన్ను చంపేస్తాం' అంటూ బెదిరించారు. దీంతో భయపడిన లక్ష్మీనారాయణ ఇంటికి వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు సీఐ హనుమంతప్ప చెప్పారు.

వృద్ధురాలి చావుకు కారణమైనా.. పోలీసులు వదిలేశారు

వ్యాన్‌తో ఢీకొట్టి దళిత మహిళ మరణానికి కారణమైన టీడీపీ కార్యకర్త
కేసు లేకుండా చేసిన పోలీసులు
సత్యసాయి జిల్లా సోమందేపల్లిలో ఘటన

సోమందేపల్లి: తామేం ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే నైజం టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో స్పష్టంగా కనిపిస్తోంది. టీడీపీ కార్యకర్త తన వాహనంతో వృద్ధురాలిని తొక్కించి.. ఆమె మృతికి కారణమైనా కేసు నమోదు చేసేందుకు పోలీసులు సైతం వెనుకాడిన దారుణమిది. శ్రీసత్యసాయి జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత సొంత ఇలాకా సోమందేపల్లిలో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు.. గ్రామంలోని పాతూరులో ఈ నెల 1వ తేదీన రోడ్డు పక్కనే కూర్చుని ఉన్న దళిత మహిళ లక్ష్మమ్మ (70) మీదుగా మినీ వ్యాన్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులను తీసుకెళ్లే క్రమంలో డ్రైవర్ చంద్ర అజాగ్రత్తతో వాహనాన్ని నడుపుతూ ప్రమాదానికి కారణమయ్యాడు. అయినా డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. వృద్ధురాలి కుటుంబ సభ్యులు వెంటనే ప్రైవేట్ పాఠశాలకు వెళ్లి డ్రైవర్‌ను నిలదీశారు. ఆ సమయంలో బాధిత కుటుంబ సభ్యులపై డ్రైవర్ చంద్ర బెదిరింపులకు దిగాడు. తాను టీడీపీలో క్రియాశీలక కార్యకర్తనని ఎదురుదాడికి దిగాడు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా.. అప్పటికే టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన పోలీసులు కేసు నమోదుకు వెనుకంజ వేశారు. రాజీపడండంటూ బాధితులను బెదిరించారు. దీంతో వారు నిస్సహాయ స్థితిలో వెనుదిరిగారు. కాగా.. ప్రమాదం జరిగిన ప్రాంతానికి ఎదురుగా ఉన్న ఓ దుకాణానికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డయిన ఫుటేజీలు రెండు రోజుల తర్వాత సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో టీడీపీ నేతల దురాగతం వెలుగు చూసింది.



కారు కింద నలిగిపోయిన వృద్ధురాలు (సీసీ ఫుటేజీ దృశ్యం)

తాగునీటి సరఫరా బంద్

జాతరకు మంచినీళ్లు లేకుండా చేసిన టీడీపీ నేతలు



మోటారు స్టాటర్ గది వద్ద గ్రామస్తులు

భాకరాపేట: తిరుపతి జిల్లాలోని చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ మాదిగపల్లెలో మంచి నీటి సరఫరా గదికి టీడీపీ నేతలు తాళం వేశారు. ఆదివారం గ్రామంలో మాతమ్మ జాతర జరుగుతుంది. జాతర టీడీపీకి సంబంధించిన కుటుంబాలు చెప్పినట్లు జరగలేదని పక్క గ్రామమైన బోడిరెడ్డిగారిపల్లెకు చెందిన టీడీపీ నేతలు వచ్చి తమ పార్టీకి చెందిన నేతలు చెప్పినట్లు వినకపోతే పండుగకు మంచినీరు లేకుండా చేస్తామంటూ మంచినీటిని సరఫరా చేసే మోటారు స్టాటర్ ఉన్న గదికి తాళం వేసుకుని వెళ్లారు. దీంతో గ్రామస్తులు పంచాయతీని కోరగా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయించి జాతర వేడుకలు ఆగకుండా చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి నాగమణిని వివరణ కోరగా తాళం వేసిన వారిని అడిగితే తాళం వచ్చి తీసుకెళ్లమని చెప్పినట్లు తెలిపారు.

వలంటీర్ల వ్యవస్థకు ఉరి!

చంద్రబాబు సర్కార్ మరో మోసం

సాక్షి, అమరావతి: గత ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా కోటిన్నర కుటుంబాలకు ఇంటి వద్దే సేవలు అందించిన వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయడానికి చంద్రబాబు సర్కార్ రంగం సిద్ధం చేసింది. ప్రతి సంక్షేమ పథకం నుంచి సర్టిఫికెట్ వరకు వివిధ సేవలను ప్రజలకు సత్వరం అందించి మన్ననలు పొందిన ఆ వ్యవస్థపై కక్ష సాధించే దిశగా అడుగులు వేస్తోంది. ప్రజల మనసు గెలిచిన వలంటీర్ వ్యవస్థ నిర్వీర్యానికి కుటిల పన్నాగం పన్నిన చంద్రబాబు తన నైజాన్ని మరోసారి బయట పెట్టుకుంటూ ఆ ప్రజల నుంచి వారికి సంబంధాలు లేకుండా చేయాలని నిర్ణయించారు. రెండు నెలల నుంచి వారికి వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్నారు. పింఛన్ల పంపిణీ విధుల నుంచి వారిని తొలగించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఉద్యోగ భద్రత హామీ నెరవేర్చలేదు. మేనిఫెస్టోలో పెట్టిన రూ. 10 వేతనం పెంపు ఊసే లేదు. తాజాగా, వారి వాట్సాప్ గ్రూపులన్నింటినీ తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడం చూస్తే.. ఈ చిన్న వేతన జీవులపై చంద్రబాబు సర్కార్ ఎంత కక్షగట్టిందో అర్థమవుతుంది. అధికారంలోకి రాకముందు నుంచే ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా ఒక్కో పావు కదుపుతూ వస్తున్న చంద్రబాబు.. తానిచ్చిన ఎన్నికల హామీలనే విస్మరిస్తూ ఇప్పుడు ఆ వ్యవస్థకు మంగళం పాడేందుకు సిద్ధమయ్యారు. ఉగాది పర్వదినం రోజునే చంద్రబాబు ఓ బహిరంగ సభలో మాట్లాడుతూ.. వలంటీర్ల వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని హామీ కూడా ఇచ్చారు. ఎన్నికల ముందు ఆయన హామీలు ఇచ్చి ఆనక మోసం చేస్తాడు అనడానికి వలంటీర్ల వ్యవస్థపై నిర్ణయాలనే ఉదాహరణగా చెప్పవచ్చు.


GOVERNMENT OF ANDHRA PRADESH
O/O THE DIRECTOR, GSWS DEPARTMENT
JAWAHAR AUTO NAGAR, VIJAYAWADA – 520007

File No. GWS02-GWS0SM/2/2024-ADC(HRT) Dated: 04/08/2024

From
M.Sivaprasad, I.F.S.,
Director,
GSWS Department,
Auto Nagar, Vijayawada

To
All the District Collectors

Sir/ Madam

Sub: GSWS Department - Grama /Ward Volunteers - Request to delete groups created by volunteers in certain messaging platforms and sensitize Citizens to exit such groups - certain instructions issued - Regarding

In this context, The District Collectors are requested to have necessary instructions to the Municipal Commissioners and MPDOs with a direction to ensure all such groups in all the messaging platforms are deleted with immediate effect and also shall ensure that the Village/ Ward Secretariat functionaries create necessary awareness among citizens to exit voluntarily from such groups created by the Grama /Ward Volunteers.

వలంటీర్ల వాట్సాప్ గ్రూపులన్నింటినీ తక్షణమే తొలగించాలని గ్రామ సచివాలయ శాఖ ఇన్‌చార్జ్‌లకు సూచిస్తూ ఆ శాఖ డైరెక్టర్ జారీ చేసిన ఆదేశాలు



23-4-2024న (ఈనాడు) విజయనగరం జిల్లా బొండపల్లి జరిగిన సభలో మాట్లాడుతున్న చంద్రబాబు. అదే సభలో వలంటీర్లకు రూ. 10వేలు జీతమంటూ ఇచ్చిన హామీ

ఇప్పుడు వలంటీర్ల విషయంలో సెలవు దినం రోజే నిర్ణయం తీసుకుని భారీ మోసానికి పాల్పడటం చూస్తే.. ఇది ఆయన నైజానికి పరాకాష్టగా భావించవచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

హామీలు నెరవేర్చమనడమే పాపమా

ఎన్నికల్లో ఇచ్చిన, మేనిఫెస్టోలో పెట్టిన హామీలు నెరవేర్చమని అడగడమే వలంటీర్ల విషయంలో పాపమైంది. వలంటీర్లను ఎవరినీ తొలగించబోమని, పైగా ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. అలాగే వారి వేతనాలను రూ. 10 వేలకు పెంచుతామని మేనిఫెస్టోలో కూడా పెట్టారు. అయితే అధికారం చేపట్టాక వారిని పింఛన్ విధుల నుంచి తొలగించారు. రెండు నెలల నుంచి ఉన్న వేతన బకాయిలు చెల్లించాలని వలంటీర్లు డిమాండ్ చేస్తున్నారు. హామీ ఇచ్చిన మేరకు వేతనాలు పెంచాలని కోరుతున్నారు. దీంతో కక్ష గట్టిన ప్రభుత్వం ఆ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది.

వాట్సాప్ గ్రూపులన్నీ తొలగించండి..

ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాల సమాచారం క్షణాల్లో ప్రజలందరికీ తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన వలంటీర్ల వాట్సాప్ గ్రూపులన్నింటినీ తక్షణమే తొలగించాలంటూ గ్రామ వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లు, వార్డు సచివాలయ శాఖ ఇన్‌చార్జిలకు ఆదేశాలు ఇచ్చారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ శాఖ డైరెక్టర్ ఫోన్ మెసేజ్ ద్వారా హడావుడిగా ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా వలంటీర్ల వాట్సాప్ గ్రూపుల తొలగించిన వివరాలను తనకు సోమవారం ఐదు గంటల లోపు తెలియజేయాలని కూడా ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. అంతేగాక ప్రజలను కూడా వాట్సాప్ గ్రూపుల నుంచి ఎగ్జిట్ అయ్యేలాగ అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల నుంచి అందిన ఆదేశాలతో జిల్లాలోనూ గ్రామ వార్డు సచివాలయాల శాఖ ఇన్‌చార్జిలు హడావుడి ఆ సమాచారాన్ని మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు పంపి వెంటనే తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కాగా, ఈ ఏడాది మార్చి 16న ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఆదేశాల మేరకు రాష్ట్రంలోని వలంటీర్ల అందరికీ అప్పట్లో ప్రభుత్వం అందజేసిన మొబైల్ ఫోన్లు, సిమ్‌కార్డులను గ్రామ వార్డు సచివాలయాల శాఖ స్వాధీనం చేసుకుంది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కూడా ఇప్పటి వరకు వలంటీర్లు ఎవ్వరికీ ఆ ఫోన్లను, సిమ్‌కార్డులను తిరిగి అందజేయలేదు.

క్లుప్తంగా...

పీఎంజీఎస్‌వై రోడ్లకు రూ.400 కోట్లు

- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లకు రూ.70 కోట్లు
- కేటాయించిన కేంద్రం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) ద్వారా రోడ్ల నిర్మాణానికి కేంద్రం రూ.400 కోట్లు కేటాయించింది. పీఎంజీఎస్‌వైలో రోడ్ల నిర్మాణానికి కేంద్రప్రభుత్వం 60 శాతం నిధులు కేటాయిస్తే, రాష్ట్రాలు 40 శాతం కేటాయించాల్సి ఉంది. ప్రస్తుత (2024–25) ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పీఎంజీఎస్‌లో రోడ్ల నిర్మాణానికి కేంద్రం రూ.17,163 కోట్లు కేటాయించింది. దీన్లో మన రాష్ట్రానికి రూ.400 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. రాష్ట్రంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కేంద్రం మరో రూ.70 కోట్లు కేటాయించింది. ఈ కేటాయింపులపై కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఆయా రాష్ట్రాలకు గతంలోనే లేఖలు రాసింది.

మారుమూల గ్రామాలకూ బీఎస్ఎన్ఎల్ సేవలు

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



తాడికొండ: మారుమూల గ్రామాలకు కూడా బీఎస్ఎన్ఎల్ సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, టెలికమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. తాడికొండలో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 4జీ టీసీఎస్ సెల్ టవర్ సేవలను స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి మంత్రి పెమ్మసాని ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ సేవలను మారుమూల గ్రామాలకు చేరువ చేసేందుకు కేంద్రం వేల కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి నెట్ కనెక్షన్ అందించనున్నట్లు పేర్కొన్నారు.

బందరు పోర్టు పనులు వేగవంతం: కొల్లు రవీంద్ర

25న కొరియన్ బృందం రాక



మచిలీపట్నం టౌన్: మచిలీపట్నం పోర్టు పనులను మరింత వేగవంతం చేస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం మంత్రి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మచిలీపట్నం ప్రాంతాభివృద్ధికి ఈనెల 25న కొరియన్ బృందం పర్యటించనున్నదని, బీచ్ అభివృద్ధి, విద్యాపరమైన అంశాలపై పరిశీలన జరుపుతుందన్నారు. గిలకలదిండి, బందరు కోట, పోలాటితిప్ప, గరాలదిబ్బ రహదారులు, రెండు వంతెనల నిర్మాణం దాదాపు రూ.8 కోట్లతో చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు నాలుగు ప్రజాదర్బార్‌లు నిర్వహించగా 1,159 అర్జీలు అందాయన్నారు. వాటిలో 850 పరిష్కరించామన్నారు. త్వరలో మచిలీపట్నంలో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు.

త్వరలో ఆర్టీసీకి 1000 బస్సులు

- ప్రస్తుతం 400 కొత్త బస్సులు
- కడపలో 18 కొత్త బస్సులను ప్రారంభించిన మంత్రి మండిపల్లి



కడప కోటిరెడ్డి సర్కిల్: ఆర్టీసీకి సంబంధించి 1400 బస్సులు ప్రారంభించాల్సి ఉండగా, ప్రస్తుతం 400 కొత్త బస్సులు ప్రారంభించామని, మరో 1000 కొత్త బస్సులు త్వరలోనే అందుబాటులోకి వస్తాయని రవాణా, యువజన క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా, కడప ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజ్ వద్ద 18 నూతన బస్సులను జెండా ఊపి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలోనే విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టే ఆలోచన ఉందనీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై కూడా చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవీరెడ్డి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 80 శాతం రాయితీపై విత్తనాలు

మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి



సాక్షి, అమరావతి: అధిక వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు 80శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో జూన్, జూలై నెలలో సాధారణానికి మించి 48.6శాతం అధిక వర్షపాతం నమోదు కావడం వల్ల ఇప్పటికే సుమారు 1,406 హెక్టార్లలో నారుమళ్లు, హెక్టార్లలో నాట్లు వేసిన వరి పంట ముంపునకు గురైందని తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు మంత్రుల బృందం ముంపు ప్రాంతాల్లో పర్యటించామని తెలిపారు. తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి జిల్లాలోని రైతు సేవా కేంద్రాల వద్ద విత్తనాల పంపిణీకి సిద్ధం చేసినట్లు ఆయన వివరించారు.

'రక్షణ' ఎగుమతుల్లో నంబర్ వన్ కానున్న భారత్

- భారత రక్షణరంగ సాంకేతిక సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి
- సతీష్‌రెడ్డికి మండలి వెంకటకృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం ప్రదానం

అవనిగడ్డ: రక్షణరంగ ఎగుమతుల్లో భారత్ నంబర్ వన్ స్థానానికి ఎదిగేరోజు దగ్గరలోనే ఉందని భారత రక్షణరంగ సాంకేతిక సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి చెప్పారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ గాంధీక్షేత్రంలో ఆదివారం దివంగత మంత్రి మండలి వెంకటకృష్ణారావు 99వ జయంతి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలి వెంకటకృష్ణారావు తెలుగు వైభవ పురస్కారాన్ని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ చేతుల మీదుగా డాక్టర్ జి.సతీష్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు రక్షణ రంగానికి సంబంధించి ప్రతీదీ విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవాళ్లమని చెప్పారు. గత ఏడాది రూ.21 వేలకోట్ల విలువైన రక్షణరంగ పరికరాలను మనం విదేశాలకు ఎగుమతి చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మన దేశం రూ.50 వేలకోట్ల నుంచి రూ.80 వేలకోట్ల పరికరాలు ఎగుమతి చేసేస్థాయికి చేరుతుందన్నారు. మాజీ రాష్ట్రపతి ఎ.పి.జె.అబ్దుల్‌కలాం సారథ్యంలో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో చేపట్టిన ప్రాజెక్టులు నేడు మన దేశాన్ని అగ్రదేశాల సరసన చేర్చాయని చెప్పారు. నిమ్మకూరులో ఏర్పాటు చేసిన భెల్ కంపెనీ నుంచి ఇతర దేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి చేరుకుంటామన్నారు. కృష్ణాజిల్లా నాగాయలంకలో ఏర్పాటు చేయనున్న క్షిపణి ప్రయోగ కేంద్రానికి ఎదురైన ఆటంకాలను తొలగించి అన్ని అనుమతులు వచ్చేలా కృషిచేస్తామని చెప్పారు.


సతీష్‌రెడ్డికి పురస్కారం అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ తదితరులు

తెలుగువారిని ఒక్కటి చేసిన మండలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సరసన చేర్చదగిన గొప్ప వ్యక్తి సతీష్‌రెడ్డి అని కొనియాడారు. తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడిన మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. వెంకటకృష్ణారావు ప్రపంచ తెలుగు మహాసభల ఏర్పాటు ద్వారా తెలుగువారందరినీ ఒక్కటి చేశారని పేర్కొన్నారు. సతీష్‌రెడ్డి జీవితచరిత్రపై మండలి ఫౌండేషన్ ప్రచురించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు.

సమున్న'తరంగ్'

- త్రివిధ దళాల శక్తి చాటేలా రేపటి నుంచి యుద్ధ విన్యాసాలు
- ఆర్మీ, నౌకా, వైమానిక దళాల ఆధ్వర్యంలో ప్రారంభం
- తమిళనాడులోని సూలూరులో ఈ నెల 14 వరకూ మొదటిదశ విన్యాసాలు



యుద్ధ విన్యాసాలు (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: రక్షణ రంగంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న భారత్ వరుస అంతర్జాతీయ విన్యాసాలకు వేదికగా నిలుస్తూ.. ప్రపంచ దేశాలకు ఆతిథ్యమిస్తోంది. మిలాన్, ఐఎఫ్ఆర్ లాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాల్ని నిర్వహించిన భారత్.. మరో కీలక విన్యాసాలకు సిద్ధమైంది. ఈ నెల 6వ తేదీ నుంచి రెండు దశల్లో జరిగే తరంగ్‌శక్తి యుద్ధ విన్యాసాలు తమిళనాడులోని సూలూరులో జరగనున్నాయి. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆధ్వర్యంలో భారత నౌకాదళ సహకారంతో ప్రారంభం కానున్న విన్యాసాల్లో 30 దేశాలకు పైగా పాల్గొంటున్నాయి.

భారత్ సత్తా చాటేలా..

భారత రక్షణ వ్యవస్థ సత్తా ప్రపంచానికి చాటేలా త్రివిధ దళాల సమన్వయం ఎలా ఉంటుందో శత్రు దేశాలకు తెలియజేసేలా.. భాగస్వామ్య దేశాల మధ్య పరస్పర సహకారం మరింత పెంపొందేలా 'తరంగ్ శక్తి' యుద్ధ విన్యాసాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. భారత వాయుసేన, ఆర్మీ, ఇండియన్ నేవీ కలిసి నిర్వహిస్తున్న అంతర్జాతీయ విన్యాసాలకు 51 దేశాలకు ఆహ్వానమందించగా.. 30కి పైగా దేశాలు హాజరవుతున్నాయి. మొదటి దశ ఆగస్టు 6 నుంచి 14వ తేదీ వరకూ తమిళనాడులో నిర్వహిస్తున్నారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 12 వరకూ రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో రెండో దశ విన్యాసాలు జరగనున్నాయి. భారత త్రివిధ దళాల అధిపతులతో పాటు జర్మనీ, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, కెన్యా, జపాన్, నేపాల్, గినియా దేశాలకు చెందిన చీఫ్ ఆఫ్ ఎయిర్‌స్టాఫ్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. ఈ విన్యాసాలకు రష్యా, ఇజ్రాయిల్ దూరంగా ఉంటున్నాయి.


సత్తా చాటనున్న ఐఏఎఫ్

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఈ విన్యాసాల్లో సత్తా చాటనుంది. ఎల్‌సీఏ తేజస్ యుద్ధ విమానాలు, రాఫెల్, మిరాజ్ 2000, ఎల్‌సీహెచ్ ప్రచండ్, ధృవ్, రుద్ర, జాగ్వర్, మిగ్–29, సీ–130, ఐఎల్–78 తదితర యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు విన్యాసాల్లో పాల్గొంటున్నాయి. భారత వైమానిక దళంతో పాటుగా ఆస్ట్రేలియాకు చెందిన ఎఫ్–18, బంగ్లాదేశ్‌కు చెందిన సీ–130, ఫ్రాన్స్‌కు చెందిన రాఫెల్, జర్మనీకి చెందిన టైఫూన్, గ్రీస్‌కు చెందిన ఎఫ్–16, స్పెయిన్‌కు చెందిన టైఫూన్, యూఏఈకి చెందిన ఎఫ్–16, యూకేకి చెందిన టైఫూన్, యూఎస్‌ఏకి చెందిన ఏ–10, ఎఫ్–16, ఎఫ్ఆర్ఏ, సింగపూర్‌కు చెందిన సీ–130 యుద్ధ విమానాలు, బలగాలు విన్యాసాల్లో భాగస్వామ్యం అవుతున్నాయి.

తొలి దశలో భారత నౌకాదళం

తమిళనాడులో జరిగే ఫేజ్–1 విన్యాసాల్లో భారత నౌకాదళం ప్రాతినిధ్యం వహిస్తోంది. తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో జరిగే విన్యాసాల్లో యుద్ధ నౌకలపై హెలికాప్టర్ల ల్యాండింగ్, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లపై మిగ్–29, రాఫెల్ యుద్ధ విమానాల ల్యాండింగ్, ఫైరింగ్ తదితర విన్యాసాలు నిర్వహించనున్నారు. రక్షణ రంగంలో స్వావలంబన, అంతర్జాతీయంగా భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు తరంగ్ శక్తి కీలకంగా మారనుంది.

షార్క్‌లకే షాకిచ్చే షార్క్..



సముద్రాల్లో షార్క్‌లదే రాజ్యం. వాటికి ఏ జీవి దొరికినా పరపరా నమిలి మింగేస్తాయి. అలాంటి షార్క్‌లలో గ్రేట్ వైట్ షార్క్ జాతికి చెందినవి మరింత పెద్దగా ఉంటాయి. ఈ పెద్ద షార్క్‌లలోనే అతిపెద్దది 'డీప్ బ్లూ'. ఏకంగా 22 ఫీట్ల పొడవు, రెండున్నర టన్నులకుపైగా బరువున్న ఈ షార్క్‌ను.. 2019లో హవాయి సముద్రతీరంలో మొదటిసారిగా గుర్తించారు. దాని వయసు 50 ఏళ్లకుపైనే ఉంటుందని అంచనా వేశారు. షార్క్ చేపలతో డైవింగ్ చేసే (షార్క్ డైవర్) ఓసియన్ రామ్సే ధైర్యంగా ఈ 'డీప్ బ్లూ'కు దగ్గరగా వెళ్లి వీడియో చిత్రీకరించాడు. తర్వాత కూడా అప్పుడప్పుడూ ఈ షార్క్ చాలా మందికి కనిపించింది. అయితే ఎప్పుడూ ఎవరిపై దాడి చేయలేదు. సాధారణంగా గ్రేట్ వైట్ షార్కులు 30–40 ఏళ్ల జీవిస్తాయి. 15 అడుగుల వరకు పొడవు పెరుగుతాయి. కానీ 'డీప్ బ్లూ' ఏకంగా 22 అడుగుల పొడవు ఉండటం గమనార్హం.

నాట్యమయూరికి తుది వీడ్కోలు

కుటుంబ సభ్యులు, శిష్యులు, అభిమానుల మధ్య యామినీ కృష్ణమూర్తి అంత్యక్రియలు పూర్తి

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రసిద్ధ నాట్య కళాకారిణి, పద్మ విభూషణ్ యామినీ కృష్ణమూర్తి అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం పూర్తయ్యాయి. ఢిల్లీలోని గ్రీన్‌పార్క్ శ్మశాన వాటికలో కుటుంబ సభ్యులు, శిష్యులు, కళాకారులు, పలువురు ప్రముఖులు ఆమెకు తుది వీడ్కోలు పలికారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు జరిగిన అంతిమయాత్రలో వందలాది మంది అభిమానులు, కళాకారులు పాల్గొన్నారు. అంతకుముందు.. యామినీ కృష్ణమూర్తి పార్థివదేహాన్ని హౌజ్‌ఖాస్‌లోని బల్‌బీర్ సక్సేనా మార్గ్‌లో ఆమె నిర్వహిస్తున్న 'యామిని స్కూల్ ఆఫ్ డ్యాన్స్'లో ప్రజల సందర్శనార్థం ఉంచారు. పలువురు ప్రముఖులు, కళాకారులు, అభిమానులు ఆమె పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. కళా రంగానికి ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. యామినీ కృష్ణమూర్తి లేనిలోటు తీర్చలేనిదంటూ ఆవేదనకు గురయ్యారు.


యామినీ కృష్ణమూర్తి (ఫైల్)

నేడు ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై రౌజ్ అవెన్యూ కోర్టు సోమవారం విచారించనుంది. ఈ కేసులో సీబీఐ ఇటీవల దాఖలు చేసిన చార్జిషీట్‌లో లోపాలున్నాయని దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా విచారించనున్నారు. మరోవైపు, తిహార్ జైలులో ఉన్న కవితను బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు ములాఖత్ కానున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై వైద్య పరీక్షలు చేయించుకున్న కవిత తాజా ఆరోగ్య పరిస్థితిపై చర్చించనున్నారు. అదే సమయంలో కవిత బెయిల్‌పై వారిద్దరూ న్యాయ నిపుణులతో చర్చిస్తున్నట్లు సమాచారం.

హైపర్ లూప్ ట్యూబ్ ఆవిష్కరణ

ఐఐటీ మద్రాస్ మరో ఘనత

సాక్షి, చెన్నై: ఐఐటీ మద్రాస్ నేతృత్వంలో అతిపెద్ద హైపర్ లూప్ ట్యూబ్‌ను ఆవిష్కరించారు. ఈ టెక్నాలజీతో రవాణా రంగంలో సరికొత్త ఒరవడిని సృష్టించారు. ఐఐటీ మద్రాస్ తయ్యూరు క్యాంపస్ నేతృత్వంలో 425 మీటర్ల పొడవైన ఈ హైపర్ లూప్ ట్యూబ్‌ను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ కామకోటి మాట్లాడుతూ హైపర్ లూప్ ట్యూబ్ టెక్నాలజీతో రవాణా రంగంలో మరో సరికొత్త విప్లవం సృష్టించనున్నట్లు పేర్కొన్నారు. 2025 జనవరి నుంచి ఏప్రిల్ వరకు జరిగే హైపర్ లూప్ ట్యూబ్ ఇంటర్నేషనల్ పోటీల్లో దీన్ని ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఇందులో అనేక కీలక విభాగాలున్నాయని, లూప్ ట్యూబ్ అంటే అత్యల్ప గాలిపీడనంతో కూడిన నిర్మాణమని వివరించారు. ఇది రైలు బోగీలాంటి ఒక వాహనమని తెలిపారు. ఆవిష్కార్ హైపర్ లూప్ పేరుతో 11 కోర్సులకు చెందిన 76 మంది అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్థులు ఈ డిజైన్‌ను ఆవిష్కరించారని చెప్పారు. దీన్ని నాలుగుదశల్లో పరీక్షిస్తామని ఆయన తెలిపారు.

పెయిన్ కిల్లర్స్‌తో బీ కేర్‌ఫుల్

నెల్లూరు వేదాయపాలేనికి చెందిన 58 ఏళ్ల రమణయ్య ఇటీవల నగరంలోని ప్రభుత్వాస్పత్రికి నడుంనొప్పితో వెళ్లాడు. స్కానింగ్, రక్తపరీక్షలు చేయగా కిడ్నీ సమస్య ఉందని తేలింది. రక్తంలో క్రియాటిన్ లెవల్ పెరిగిపోవడంతో డయాలసిస్ చేయాలని డాక్టర్ చెప్పాడు. తనకు ఎలాంటి అలవాట్లు లేవని, ఈ పరిస్థితి ఎందుకొచ్చిందని అతను అడిగాడు. దీంతో డాక్టర్ నొప్పుల మాత్రలు వాడుతున్నావా అనడిగాడు. కాళ్ల నొప్పులుండగా మెడికల్ షాపునకు వెళ్లి టాబ్లెట్స్ తీసుకుని వాడుతున్నట్లు చెప్పాడు. ఆ మందులు వాడినందు వల్ల కిడ్నీ సమస్య వచ్చిఉండొచ్చని డాక్టర్ తెలిపాడు. ఇలాంటి సంఘటనలు చాలాచోట్ల జరుగుతూనే ఉంటాయి.

- మోతాదుకి మించి వాడితే ఎన్నో అనర్థాలు
- ప్రధానంగా కిడ్నీ, లివర్, గుండెపై ప్రభావం
- డాక్టర్ల సిఫార్సు ఎంతో ముఖ్యం
- ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇచ్చేస్తున్న మెడికల్ షాపుల యజమానులు
- చోద్యం చూస్తున్న జిల్లా ఔషధ నియంత్రణ శాఖ



నెల్లూరు(అర్బన్): మనుషుల జీవనశైలిలో చాలా మార్పులొచ్చాయి. ఆహార పదార్థాల కల్తీమయం కావొచ్చు. ఇతర కారణాలు ఏమైనా ఉండొచ్చు. చాలామంది ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. 40 ఏళ్లకే మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు ఎందరో ఉన్నారు. తలనొప్పి, నడుం నొప్పితో తరచూ ఇబ్బంది పడేవారి సంఖ్య ఎక్కువగానే ఉంది. 60 ఏళ్లు నిండిన వారిలో అధిక శాతం మందికి నిత్యం మోకాళ్లు, కీళ్ల నొప్పులు వస్తున్నాయి. దీంతో వారు అందుబాటులో ఉండే మెడికల్ షాపులకెళ్లి పెయిన్ కిల్లర్స్ మాత్రలు తెచ్చుకుని తాత్కాలికంగా ఉపశమనం పొందుతున్నారు. ఇంకొందరు ఇంజెక్షన్లు వేయించుకుంటున్నారు. వైద్యులతో సంబంధం లేకుండా ఇష్టారాజ్యంగా మందులు వినియోగిస్తే కిడ్నీలు దెబ్బతినే అవకాశముంది. సొంత నిర్ణయాలతో నొప్పుల మాత్రలు తరచూ వాడే వారు అనారోగ్యం బారిన పడుతున్న ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఆ పరిస్థితిని నుంచి బయట పడేందుకు ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నారు.

దాడులు చేయకుండా..

జిల్లాలో రిటైల్ మందుల దుకాణాదారులు రోగులకు సొంతంగా వైద్యం చేస్తున్న పరిస్థితి ఉంది. నొప్పులు, జ్వరం, మోషన్స్, కడుపులో మంట, మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లు, గాయాలకు ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులిస్తున్నారు. నెల్లూరులో చూస్తే బుజబుజనెల్లూరు, శివగిరికాలనీ, వెంకటేశ్వరపురం తదితర అనేక ప్రాంతాల్లో రోగిని నిలబెట్టే ఇంజెక్షన్ సైతం వేస్తున్నారు. వీరు కనీసం ఆర్ఎంపీలు కూడా కాదు. రోగికి ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారో.. ఇలాంటి వారిపై ఆకస్మిక దాడులు చేసి కేసులు నమోదు చేయాల్సిన జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. నెలవారీ మామూళ్లు తీసుకుని దాడులు చేయడం లేదనే ఆరోపణలున్నాయి.

సమస్యలొస్తాయి



నొప్పుల మాత్రలను ఇష్టమొచ్చినట్లు వాడకూడదు. నొప్పుల నివారణకు ఇంజెక్షన్లు వేయించుకునే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. డాక్టర్లను సంప్రదించి వారి సిఫార్సుతో మాత్రమే పరిమితులకు లోబడి మాత్రలు వేసుకోవాలి. లేదంటే కిడ్నీతోపాటు అల్సర్, ఇతర సమస్యలొస్తాయి.

– డాక్టర్ గంగాధర్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్, నెల్లూరు

ఎంతో ప్రభావం ఉంటుంది



నొప్పుల మాత్రలు ఇష్టారాజ్యంగా దీర్ఘకాలికంగా వాడితే సమస్యలు కొని తెచ్చుకున్నట్టే. అలా వాడే వారికి కిడ్నీ సమస్యలతో పాటు పేగుల్లో అల్సర్స్(పుండ్లు) ఏర్పడవచ్చు. ఒక్కోసారి పేగుకు చిల్లు పడే అవకాశం ఉంది. అలా జరిగితే తక్షణమే ఆపరేషన్ చేయాల్సి వస్తుంది. లేదంటే ప్రాణాంతకం. శరీరంలోని ఇతర ఆర్గాన్స్‌పై కూడా నొప్పుల మాత్రలు ప్రభావం చూపుతాయి. అందువల్ల డాక్టర్ల సూచనతోనే వినియోగించాలి.

– డాక్టర్ శ్రీనునాయక్, డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, నెల్లూరు

ఎన్నో కేసులు



జిల్లా వ్యాప్తంగా 52 పీహెచ్‌సీలు, 28 అర్బన్‌హెల్త్ సెంటర్లు, ఆత్మకూరులో ఒక జిల్లా ఆస్పత్రి, కందుకూరు, కావలిలో ఏరియా ఆస్పత్రులు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా కేంద్రంలో ఒక బోధనాస్పత్రి (సర్వజన ఆస్పత్రి) ఉన్నాయి. వీటి పరిధిలో వైద్యశాఖ గణాంకాల ప్రకారం 3,185 మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ ఒక్క సంవత్సరంలో ఇప్పటి వరకు 405 కిడ్నీ కేసులు నమోదయ్యాయి. గతేడాది లెక్కల ప్రకారం 3,274 మంది గుండె జబ్బుతో బాధపడుతున్నారు. కేవలం పీహెచ్‌సీల స్థాయిలోనే 64,119 మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నారు. రకరకాల కారణాలతో జబ్బులు వచ్చినా వీరిలో అనేక మంది నొప్పుల మాత్రలు సొంతంగా వాడుకుంటున్నారు. నెల్లూరు నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలోనే రోజుకు సరాసరి పది మంది డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇక నారాయణ, కిమ్స్, మెడికవర్, అపోలో హాస్పిటళ్లను కలిపి లెక్క చూస్తే ఆ సంఖ్య అధికంగానే ఉంటుంది.

ఇబ్బందులిలా..

- కిడ్నీలతోపాటు లివర్, గుండె, రక్తప్రసరణలో సమస్యలొస్తాయి.
- కడుపులో మంట, పేగులో పొక్కడం, పుండ్లు ఏర్పడడం, ముక్కుకు సంబంధించి నాసియా సమస్యలు.
- మలబద్ధకం, డయేరియాలాంటివి రావొచ్చు.



ప్రతి ఒక్కరికీ స్వర్గద్వారాలను తెరిచే తాళంచెవిని ఇచ్చారు. అదే తాళంచెవి నరక ద్వారాలను కూడా తెరుస్తుంది.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 5 ఆగస్టు 2024

నిద్రారాక్షసం

కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర లేకుండా రోజుల తరబడి గడపడం అసాధ్యం. బొందిలో ప్రాణం నిలిచి ఉండాలంటే, ఈ రెండూ తప్పనిసరి. తిండి, నిద్ర మనుషులకే కాదు, జంతువులకూ అవసరమే! జంతువులకు నిద్ర ముంచుకొచ్చినప్పుడు నిద్రపోవడమే తెలుసు గాని, నిద్ర గురించి ఆలోచించడం తెలీదు. మనం మనుషులం. జంతువులతో పోల్చుకుంటే జ్ఞానులం. ‘ఆహార నిద్రా భయ మైథునాని/ సామాన్య మేతత్పశుభి ర్నరాణాం/ జ్ఞానం హి తేషా మధికో విశేషో/ జ్ఞానేన హీనాః పశుభిస్సమానాః’ అని పూర్వకవి సంస్కృతంలో పలికాడు. ఆహార నిద్రా భయ మైథునాలు మనుషులకు, జంతువులకు సమానమే! మిగిలిన జంతు సమూహం నుంచి మనిషిని వేరు చేసే లక్షణం జ్ఞానం మాత్రమే! జ్ఞానమే గనుక లేకుంటే, మనుషులకు, జంతువులకు తేడా ఏమీ ఉండదు.

అందువల్ల జంతువుల కంటే జ్ఞానులైన మనుషులకు నానా విషయాలలో అవసర పరిజ్ఞానమూ అనవసర పరిజ్ఞానమూ సహజ లక్షణం. అందులో భాగంగానే మనుషులకు నిద్ర గురించిన పరిజ్ఞానం ఉండటం అంతే సహజం. నిద్ర ఎప్పుడు రావడం సహజమో, ఎంతసేపు నిద్రపోవాలో, సుఖనిద్రకు ఎలాంటి పరిసరాలు, పరిస్థితులు అనుకూలిస్తాయో మనుషులకు బాగా తెలుసు. బహుశా, ఈ జ్ఞానభారం వల్లనే నిద్రలేమి సమస్యలు కూడా మనుషుల్లోనే ఎక్కువ. ‘ఆకలి రుచి ఎరుగదు, నిద్ర సుఖమెరుగదు’ అని మనకో నానుడి ఉంది. కొంత వరకు ఆ మాట నిజమే కావచ్చు గాని, సర్వసుఖాలు అందుబాటులో ఉన్నా, కంటి నిండా కునుకు లేక తిప్పలు పడే మనుషులు ప్రపంచమంతటా లెక్కకు మిక్కిలిగా ఉన్నారు.

‘నిద్ర మంచిది, మరణం మెరుగైనది; అయితే, అత్యుత్తమమైనదేదీ ఇంకా పుట్టలేదు’ అని జర్మన్ కవి, రచయిత హేన్రిక్ హేనీ అన్నాడు. మరణాన్ని మనవాళ్లు శాశ్వతనిద్రగా అభివర్ణిస్తారు. శాశ్వతనిద్రలోకి జారుకునేలోగా మనిషికి జీవనయాత్ర తప్పదు. జీవనయాత్ర సజావుగా సాగడానికి ప్రతిరోజూ తగినంత నిద్ర అవసరం. ప్రశాంతమైన నిద్రతోనే మనశ్శరీరాలు జవజీవాలను పుంజుకుంటాయి. దైనందిన నిత్య నైమిత్తిక కార్యకలాపాలకు సంసిద్ధమవుతాయి. రోజంతా పనిచేసి అలసి సొలసిన శరీరానికి విశ్రాంతి, మనసుకు ప్రశాంతత అవసరం. ఈ రెండూ నిద్రతోనే దొరుకుతాయి. అయితే, సంక్లిష్టమయమైన ఆధునిక జీవనశైలి మనుషులను నిద్రకు దూరం చేస్తోంది.

‘కునుకు పడితె మనసు కాస్త కుదుట పడతది/ కుదుట పడ్డ మనసు తీపి కలలు కంటది’ అన్నాడు మనసుకవి ఆత్రేయ. మనసుకు కుదురు లేనప్పుడు పట్టేది చెదురు మదురు నిద్రే! చెదురు మదురు నిద్రలో తీపికలలు కాదు, పీడకలలు వస్తాయి. ‘కంటికి నిద్రవచ్చునె? సుఖంబగునె రతికేళి? జిహ్వకున్/ వంటక మిందునే? యితర వైభవముల్ పదివేలు మానసం/బంటునె? మానుషంబుగల యట్టి మనుష్యున కెట్టివానికిన్/ గంటకుడైన శాత్రవుడొకండు తనంతటి వాడు గల్గినన్’ అన్నాడు శ్రీనాథుడు. ఈ పద్యం ‘కాశీఖండం’లోనిది. ఇది వింధ్యుడి స్వగతం. వింధ్యుడికి సమ ఉజ్జీ మేరువు. సూర్యుడు మేరువు చుట్టూ ప్రదక్షిణంగా పయనిస్తాడు. దేవతలు మేరుపర్వతాన్నే గౌరవిస్తారు. మేరువు కన్నా తానేమీ తక్కువ కాకున్నా, తనకు దక్కని గౌరవం మేరువుకు దక్కడం పట్ల అసూయతో రగిలిపోయే వింధ్యుడి కంటికి కునుకు పట్టకపోవడం సహజమే కదా! పురాణాల్లో మేరువు, వింధ్య పర్వతాలే అయినా, శ్రీనాథుడు రాసిన ఈ పద్యం మాత్రం మానవ ప్రవృత్తులకు అద్దం పడుతుంది. నిద్రను కరవు చేసే అనేకానేక కారణాల్లో సమ ఉజ్జీ అయిన ప్రత్యర్థితో తలెత్తే స్పర్ధ కూడా ఒకటి.

నిద్ర పట్ల అవగాహన మనుషులకు ప్రాచీనకాలం నుంచి ఉండేది. నిద్రకు భంగం కలిగించే అంశాలు, ప్రశాంతమైన నిద్ర ఆవశ్యకతను నాటి మానవులు బాగానే గుర్తించారు. ప్రాచీన నాగరికతలలో నిద్రను దేవతగా ఆరాధించేవారు. కావ్య పురాణేతిహాసాల్లో నిద్ర ప్రస్తావన విరివిగా కనిపిస్తుంది. రామాయణంలో కుంభకర్ణుడి నిద్ర, ఊర్మిళాదేవి నిద్ర సుదీర్ఘకాల నిద్రలకు ఉదాహరణలు. ఆకలి దప్పులను, నిద్రను జయించడానికి విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు బల అతిబల విద్యలను ఉపదేశించిన ఉదంతం కూడా రామాయణంలో ఉంది. అరణ్యవాస కాలంలోను, లంకలో రామరావణ యుద్ధకాలంలోను బల అతిబల విద్యలు లక్ష్మణుడికి బాగా అక్కరకు వచ్చాయి. అరణ్యవాసానికి వెళ్లినది మొదలుకొని, రావణ సంహారం తర్వాత శ్రీరామ పట్టాభిషేకం వరకు లక్ష్మణుడు నిద్రపోలేదు. అంతకాలమూ అతడి అర్ధాంగి ఊర్మిళ నిద్రపోతూనే ఉంది.

సరిగా రామ పట్టాభిషేకం జరుగుతుండగా, లక్ష్మణుడికి నిద్ర ముంచుకొచ్చి రెప్పలు మూతబడ్డాయి. అప్పుడు తన అవస్థకు తానే నవ్వుకున్నాడు లక్ష్మణుడు. పట్టాభిషేక సమయంలో లక్ష్మణుడు నవ్విన నవ్వును అక్కడ ఉన్న ప్రముఖుల్లో ఒక్కొక్కరు ఒక్కోలా అర్థం చేసుకున్నారు. అదంతా వేరే కథ. పురాణాల ప్రకారం నిద్రకు దూరంగా ఎక్కువకాలం గడిపిన రికార్డు లక్ష్మణుడిదే! అయితే, నూయెన్ న్యోక్ మై కిమ్ అనే యాభయ్యేళ్ల వియత్నాం మహిళ గడచిన ముప్పయ్యేళ్లుగా కనీసం నిమిషమైనా నిద్రపోలేదట! ఇన్నాళ్లుగా నిద్రపోకున్నా, ఆమె ఆరోగ్యంగా ఉండటం చూసి వైద్యులు సైతం విస్తుపోతున్నారు. ఈ నిద్రలేని నీలాంబరి ఉదంతం ఒక నిద్రారాక్షసం.

కలిసి ‘కూర్చోవడానికి’ కాని కాలం!

కామెంట్



కరణ్ థాపర్

క్లబ్బులు స్నేహపూర్వకమైన వాతావరణంలో ఇతరులతో కలిసి కూర్చోవడానికి మనల్ని ప్రోత్సహిస్తాయి. క్లబ్బు లోపలికి మీరు ఒక్కరిగానే వచ్చి ఉండవచ్చు. కానీ ఒక సంతోషకరమైన బృందంలో ఒకరిగా కలిసిపోతారు. క్లబ్బు సభ్యులు గౌరవప్రదంగా ప్రవర్తిస్తారనే భావన అంతర్లీనంగా ఉంటుంది. అలాంటి పెద్ద మనుషులను చిన్నబుచ్చే సంగతి ఇది. దేశ రాజధానిలో ప్రతిష్ఠాత్మకమైన ఢిల్లీ జింఖానా క్లబ్బు సభ్యుల ఖాతాలలో ‘పాజిటివ్ క్రెడిట్ బ్యాలెన్స్’ ఉండాలంటోంది. గుప్పెడుమంది డబ్బులు ఎగ్గొట్టి ఉండొచ్చు. మరీ అనుమానాస్పదంగా కనిపిస్తే తప్ప తినేందుకు మీ దగ్గర డబ్బులు ఉన్నాయా అని ఏ రెస్టారెంటూ అడగదు. అలాంటిది ఇంత పెద్ద క్లబ్బే ఇలా చేస్తే? కానికాలం అంటే ఇదే!

మీరు కనుక ఒక క్లబ్బులో సభ్యుడై ఉన్నట్లయితే, అలా ఉండటం ఎంతో ప్రత్యేకమైనదని మీకు తెలిసి ఉంటుంది. సమస్థాయి వ్యక్తులు కలుసుకోవడానికి, సేద తీరేందుకు, అక్కడ తాము మాట్లాడేవి, చేసేవి బయటికి బహిర్గతం అవుతాయనే భయం లేకుండా ఒక సమూహంగా మసలుకునేందుకు బ్రిటిష్‌వాళ్లు ప్రవేశపెట్టినవే ఈ క్లబ్బులు. నిర్వచనం ప్రకారం అవి ఆంతరంగికమైనవి, గోప్యనీయతను కలిగి ఉండేవి. బహుశా అందువల్లే సభ్యులకు తమ క్లబ్బులు ప్రియమైనవిగా ఉండి, వారు తరచు వాటి పట్ల అపరిమితమైన విధేయతను కలిగి ఉంటారు.

దాంతోపాటుగా క్లబ్బు సభ్యులు ‘పెద్ద మనుషులు’గా పరిగణన పొందుతారు. మహిళా సభ్యుల విషయంలోనూ ఇది నిజం. ఒక అలిఖిత – అయితే అందరూ ఎరిగిన – ప్రవర్తనా నియమావళి క్లబ్బుల్లో అమలులో ఉంటుంది. క్లబ్బు సభ్యులు ఎల్లప్పుడు గౌరవప్రదంగా ప్రవర్తిస్తారనే భావన అంతర్లీనంగా ఉంటుంది. సభ్యతగల పనులే చేస్తారని వారిపై నమ్మకం ఉంచవచ్చు.

సంప్రదాయం ప్రకారం, క్లబ్బు సభ్యులు సభ్యత్వ నియమావళి మేరకు తామక్కడ పొందే సేవలకు డబ్బు చెల్లిస్తారు. అది బారులో డ్రింక్స్‌కి అయినా, డైనింగ్ హాల్‌లో విందుకైనా; లేదా క్రీడల సదుపాయాలను వినియోగించుకున్నా, వాటిల్లో పాల్పంచుకున్నా అందుకు అయిన ఖర్చును కచ్చితంగా, పూర్తిగా చెల్లించవలసి ఉంటుందనటంలో సందేహం లేదు. మొత్తమ్మీదైతే, ఈ మర్యాదస్తులు తమ చెల్లింపు నిబంధనలను గౌరవిస్తారు.

పాడు కాలం, ఇప్పుడేమైందంటే దేశ రాజధానిలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన, సభ్యత్వానికి అపరిమితమైన డిమాండును కలిగి ఉన్న ఢిల్లీ జింఖానా క్లబ్ ఇక మీదట మునుపటిలా ఉండబోవటం లేదు. ఆ క్లబ్బు తన సభ్యత్వానికే అవమానకరంగా, అసంబద్ధంగా – సభ్యులు తాము పొందబోయే సేవలకు గాను ముందుగానే డబ్బును డిపాజిట్ చేయాలన్న పద్ధతిని ప్రవేశపెట్టింది! క్లబ్బు యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని అనుసరించి క్లబ్బు బారులో తాగాలన్నా, క్లబ్బు డైనింగ్ హాలులో తినాలన్నా ఇకపై క్లబ్బు సభ్యుల ఖాతాలలో ‘పాజిటివ్ క్రెడిట్ బ్యాలెన్స్’ ఉండి ఉండాలి. అంటే మిగులు డబ్బులు ఉండాలి. వార్షిక సభ్యత్వ రుసుము కడుతున్నాం కదా అంటే ఇప్పుడు అదొక్కటే సరిపోదు.



ఢిల్లీ జింఖానా క్లబ్ ముఖద్వారం

విషయం ఏంటంటే, మనకు ఇష్టమైనప్పుడు క్లబ్బుకు వెళ్లి కూర్చోవడానికి సదుపాయం కల్పించటమనే క్లబ్బు ప్రధాన ప్రయోజనాన్ని ఈ కొత్త పద్ధతి నెరవేరకుండా చేస్తుంది. మీరు మీ క్లబ్బు ఖాతాలో మిగులు డబ్బు లేకుండా తినలేరు. తాగలేరు. అప్పుడిక పక్క వారి మీద పడిపోవటమొక్కటే మీకుండే మార్గం.

అది అధ్వాన్నమైన పరిస్థితి. క్లబ్బులు అనేవి స్నేహపూర్వకమైన వాతావరణంలో ఇతరుల కోసం మీరు డ్రింక్స్ కొనడానికి, లేదా వారితో కలిసి విందులో కూర్చోవడానికి మిమ్మల్ని ప్రోత్సహిస్తాయి. లోపలికి మీరు ఒక్కరిగానే వచ్చి ఉండవచ్చు. కానీ చివరికి మీరు ఒక సంతోషకరమైన బృందంలో ఒకరిగా కలిసిపోతారు. అయితే మీరు డిపాజిట్ చేసిన అడ్వాన్సు చాలినంతగా లేనప్పుడు మీరలా డ్రింక్స్‌ని కొనివ్వలేరు. లేదా ఫ్రెండ్ ఇచ్చిన డిన్నర్‌కు మీరు బిల్లు చెల్లించలేరు.

ఆఖరికి వాణిజ్యపరమైన రెస్టారెంట్లు కూడా తమ అతిథులతో ఇంతకన్నా గౌరవంగా, సాదరంగా వ్యవహరిస్తాయి. అక్కడ తినటం ముగించి, వెళ్లటానికి సిద్ధం అయ్యాకే బిల్లు చెల్లిస్తారు. తినటానికి ముందే వాళ్లేమీ అడ్వాన్సు డిపాజిట్ చేసి ఉండనక్కర్లేదు. మీరు మరీ అనుమానాస్పదంగా, నమ్మదగనివారిగా కనిపిస్తే తప్ప మీరేం తినదలచుకున్నారో దానిని తినేందుకు మీ దగ్గర డబ్బులు ఉన్నాయా అని ఏ రెస్టారెంటూ మిమ్మల్ని అడగదు. అయినప్పటికీ జిమ్ – జింఖానాను ముద్దుగా సభ్యులు ఇలాగే పిలుచుకుంటారు – ఇకపై కొత్త పద్ధతి అమలు చేయబోతోంది.

తన సభ్యత్వం పట్ల ఈ విధమైన అమర్యాదకర వైఖరికి క్లబ్బు చూపిస్తున్న సాకు ఏమిటంటే – కొంతమంది సభ్యులు తమ బిల్లులు చెల్లించటం లేదని! దురదృష్టవశాత్తూ, ఆ మాట నిజం. బకాయి పడిన వారి పేర్ల జాబితాను అందరికీ కనిపించేలా ఉంచినప్పటికీ కూడా వారికి చీమ కుట్టినట్లయినా ఉండటం లేదు. కానీ సభ్యులలో అలాంటి వారు కొద్ది మంది, లేదంటే కొంత భాగం. సభ్యత్వపు విధి విధానాలకు కట్టుబడి, బహుశా పది వేల మందికి పైగా ఉన్న సభ్యుల జాబితాలో అదే పనిగా, తీరు మార్చుకోకుండా బకాయి పడుతుండే సభ్యులు వందకు మించి ఉండరు. తరచు న్యాయబద్ధమైన, ఆమోదయోగ్యమైన కారణాల వల్ల బాకాయిలను ఆలస్యంగా చెల్లిస్తుండే వారిని ఉద్దేశపూర్వకంగానే నేను ఈ జాబితాలో చేర్చటం లేదు. ఇప్పుడు, మిగతా ప్రతి ఒక్కరూ – గౌరవప్రదంగా, అధిక సంఖ్యాకంగా ఉండేవారు – బకాయి పడుతున్న కొద్దిమంది విషయమై ప్రతిస్పందించటానికి క్లబ్బు ఇంతకన్నా మెరుగైన, ప్రభావవంతమైన మార్గాన్ని కనుగొనలేక పోయిన కారణంగా ఇబ్బంది పడాలా?

చూస్తుంటే క్లబ్బు సమాధానం ‘అవును’ అన్నట్లే కనిపిస్తోంది. అలా కనిపించటమే క్లబ్బు యాజమాన్యం గురించి ఆందోళన కలగటానికి కారణం. క్లబ్ అంటే ఏమిటో, అదెలా ఉండాలని కోరుకుంటారో యాజమాన్యం అర్థం చేసుకోలేక పోయింది.

ఏదేమైనా, ఇందుకు – దాటవేశారని చెప్పటానికి వీల్లేని – మరొక పరిష్కారం ఉంది. క్లబ్బు యాజమాన్యం నిజంగానే బిల్లు చెల్లింపులను బకాయి పెట్టే సభ్యుల సంఖ్య పెరుగుతోందని ఆందోళన చెందుతున్నట్లయితే బయటి రెస్టారెంట్లలో మాదిరిగా తాగిన వెంటనే, లేదా తిన్న వెంటనే బిల్లు చెల్లించాలని వారిని కోరవచ్చు. నిజానికి లండన్‌లోని చాలా క్లబ్బులు ఈ పనే చేస్తున్నాయి. అది మరింత చిత్తశుద్ధిగా, మర్యాదగా ఉంటుంది. ఢిల్లీ జింఖానా క్లబ్ అటువైపుగా ఎందుకు ఆలోచించలేక పోయింది?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

ఉన్నవి చేజారేనా?



యుగాలుగా కశ్మీర్ మీద పాకిస్తాన్ కన్నేసి ఉంచింది. కానీ అక్కడి బలోచిస్తాన్, పఖ్తూన్‌ఖ్వా దాని చేజారే పరిస్థితిని ఎదుర్కొంటోంది. పష్తూన్ల ‘పీటీఎం’, బలోచుల ‘బీవైసీ’ సంఘాలు స్వాతంత్య్రోద్యమాన్ని పునరుద్ధరిస్తున్నాయి. సైన్యం అణిచివేత కొనసాగుతున్నప్పటికీ విస్తారమైన నిరసనలు జరుగుతున్నాయి.

– హబీబ్ ఖాన్, అఫ్గానిస్తాన్ యాక్టివిస్ట్

జన హింస



మీరు గనక ఎందులోనైనా విఫలమైతే, నైజీరియన్లు ఆ వార్తను పెంచి పెద్ద చేసి, తమలో తామే గుసగుసలు పెట్టి, చివరకు అదే మీకు తగిన శాస్తి అనేస్తారు.

– ఒన్యేకా నువేల్యూ, నైజీరియా రచయిత

అమ్మ పాత్ర



పొద్దున్నే నా వేలు కోసుకున్నాను. అంతటా రక్తం (నేను బానేవున్నానిప్పుడు). కానీ ఒక్క క్షణం వెర్రిగా మా అమ్మ కోసం చుట్టూ చూశాను. వెంటనే నేనే అమ్మనని గుర్తొచ్చేసరికి నియంత్రణ వచ్చింది. నాకిప్పుడు 44 ఏళ్లు.

– రీతూపర్ణా ఛటర్జీ, సంపాదకురాలు

అక్కర్లేదా?



ఒకవేళ నిజంగానే అమెరికా, రష్యా చర్చించుకొని, ఏదైనా ఒప్పందానికి రావాలని అనుకుంటే దానికి మోదీ సంవాదం అవసరం లేదని ఇప్పటికే స్పష్టమైపోయింది.

– సుశాంత్ సింగ్, కాలమిస్ట్

అన్నిసార్లు పంపుతున్నారా?



ఆదాయ పన్నుల శాఖ లేదా జీఎస్టీ నుంచి రిమైండర్ మెసేజులు వచ్చిన ప్రతిసారీ గనక నాకో రూపాయి వచ్చేట్టయితే, నేనెంత ధనికురాలిని అవుతానంటే నేను మరింత పన్ను చెల్లించాల్సి వస్తుంది.

– నందితా అయ్యర్, రచయిత్రి

హరిత భవనాలే రక్ష!

జనాభాతో పాటుగా ఇంటి నిర్మాణాలు పెరిగి పర్యావరణ సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఈ సమస్యలను నివారించడానికి ఆహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన, పర్యావరణ అనుకూల జీవన శైలిని కొనసాగించడానికి హరిత భవనాలు ఎంతో ఉపయోగపడతాయి. పర్యావరణ అనుకూల మెటీరియల్, డిజైన్‌తో భవనాన్ని నిర్మించి, పర్యావరణ అనుకూలంగా ఏ భవనాలనైతే నిర్వహిస్తారో వాటిని ‘హరిత భవనాలు’ అంటారు. ఈ భవన నిర్మాణంలో స్థలం ఎంపికకూ ప్రాధాన్యం ఉంది. అంటే పర్యావరణ సున్నితమైన ప్రదేశాలలో హరిత భవనాలను నిర్మించరాదు. ఉదాహరణకు అధిక మొత్తంలో వ్యవసాయ దిగుబడిని ఇచ్చే సారవంతమైన వ్యవసాయ భూములను హరిత భవనాల నిర్మాణాల కోసం వాడరాదు. దీని వలన మనం ప్రకృతి సిద్ధంగా లభించిన విలువైన వ్యవసాయ భూమిని కోల్పోతాము. ఇది ఆహార ఉత్పత్తిపై ప్రభావం చూపుతుంది.

సహజసిద్ధంగా గాలి, వెలుతురు వచ్చే విధంగా వీటి నిర్మాణాన్ని చేపడతారు. వెలుతురు బాగా ఉండే గదులలో చదివే విద్యార్థులు నేర్చుకునే సామర్థ్యం, వెలుతురు సరిగ్గా లేని గదిలో చదివే విద్యార్థుల కన్నా 20 నుండి 26 శాతం ఎక్కువగా ఉంటుందని పరిశోధనలలో తేలింది. హానికర రసాయన పదార్థాలు కలిగిన లెడ్ పెయింట్లు భవనాల లోపల గాలి నాణ్యతను హానికరంగా మారుస్తాయి కావున వాటి స్థానంలో సహజ సిద్ధమైన రంగులను వాడతారు. ఇండోర్ ప్లాంట్స్ ఏర్పాటు కూడా ఈ భవనాలలో ఉంటుంది. దీనివలన భవనాల లోపల గాలి నాణ్యత పెరుగుతుంది.

తక్కువ విద్యుత్‌ను వినియోగించే ఎల్ఈడీ బల్బులను, ఇతరత్రా తక్కువ విద్యుత్‌ను వినియోగించుకొనే ఎలక్ట్రానిక్ పరికరాలను వాడటం వలన ఈ భవనాలలో తక్కువగా విద్యుత్ ఖర్చవుతుంది. అదేవిధంగా సోలార్, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక విద్యుత్‌ను వాడటం వలన గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడంలో హరిత భవనాలు కీలక పాత్ర వహిస్తాయి. హరిత భవన పైకప్పులో కాంతిని రిఫ్లెక్ట్ చేసే పదార్థాలను వాడటం వల్ల ఇంటి పైకప్పు వేడి తగ్గుతుంది. పైకప్పు భాగంలో చిన్న, చిన్న మొక్కలను పెంచడం వలన వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్ వాయువులను ఇవి గ్రహిస్తాయి. అదేవిధంగా ఇంటి పై కప్పు భాగంలో జీవ వైవిధ్యం పెరిగి సీతాకోకచిలుకలు, పక్షులు వంటి వాటిని ఆకర్షించడం వలన భవనం ఆకర్షణీయంగా మారుతుంది.

ఈ భవనాలలో సేంద్రియ వ్యర్థ పదార్థాలను బయో గ్యాస్‌గా మార్చడం లేదా సేంద్రియ ఎరువుగా మార్చి ఉపయోగించే ఏర్పాట్లు ఉంటాయి. వాడిన నీటిని శుద్ధిచేసి తిరిగి గార్డెనింగ్, ఇతరత్రా పనులకు వినియోగించడం వలన నీరు వృథా కాదు. ఈ నిర్మాణాలలో వర్షపు నీరును పట్టి భూమిలోకి ఇంకిపోయేలా చేసే ఏర్పాట్లు ఉండడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. ఇన్ని ప్రయోజనాలు ఉన్న హరిత భవనాలు వాతావరణ మార్పుల నుండి మానవాళిని రక్షించగలుగుతాయి అనడం అతిశయోక్తి కాదు.

– డా॥ శ్రీధరాల రాము,
ఫ్యాకల్టీ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఎన్విరాన్మెంటల్ సైన్సెస్, హైదరాబాద్

అనామకంగా ఆరంభమై అభివృద్ధిపథంలో!

అనుభవం



డా॥ యలమంచిలి శివాజీ

అది 1992 అక్టోబర్ 9. కోట్ల విజయ భాస్కరరెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే రోజు. హైదరాబాద్‌కు ఫోన్ చేస్తే, ఢిల్లీలోనే ఉన్నారని వర్తమానం. పీవీ క్యాబినెట్‌లో న్యాయ శాఖ, కంపెనీ వ్యవహారాల మంత్రిగా ఉన్నారప్పుడు. ఢిల్లీ నివాసానికి ఫోన్ చేస్తే, విజయ భాస్కరరెడ్డి ఫోన్ ఎత్తారు. ‘ఏమిటి సార్ ఈరోజే ప్రమాణ స్వీకారం అన్నారు. మీరింకా ఇక్కడే ఉన్నారేమిటం’టే– ‘ఉదయం విమానం అందుకోలేక పోయాను. ప్రత్యేక విమానంలో వెళ్లబోతున్నాన’న్నారు. సరే వారిని అభినందించి, విజయవాడలో దంత వైద్య కళాశాల నెలకొల్పమని సలహా ఇచ్చాను. ‘ఊరుకో శివాజీ! నా ముందున్న ముఖ్యమంత్రి వైద్య కళాశాలల జోలికిపోయి ఉద్యోగం పోగొట్టుకొన్నాడు. నాకు ఈ సలహా ఇస్తున్నావు’ అన్నారు. ‘అది కాదులెండి, నేను హైదరాబాద్ వచ్చి వివరిస్తాను’ అని అప్పటికా సంభాషణ ముగించాను.

మూడు నాలుగు రోజుల్లో హైదరాబాదు ముఖ్యమంత్రి కార్యాలయంలో కలిసి సవివరంగా వివరించాను. అప్పటికి అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో ఉస్మానియా వైద్య కళాశాలలో మాత్రమే దంత వైద్య విద్య ఉంది. దానిలో మొత్తం సీట్లు 32. అందులో 7 సీట్లు జమ్మూ–కశ్మీరుకు కేంద్ర ప్రభుత్వ కోటాలో పోతే... మిగిలిన 25 సీట్లలో ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర, ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు వరుసగా 11, 6, 8 సీట్లు పంచుతారు. కనుక ‘విజయవాడలో హెల్త్ యూనివర్సిటీలో ఒక కళాశాల నెలకొల్పితే, మరొక 40 సీట్లు వస్తాయి. దానికి పెద్దగా నిధులు కూడా అవసరం ఉండదు కదా! మొదటి, రెండు సంవత్సరాల చదువుకు – అనాటమీ, ఫిజియాలజీ, ప్యాథాలజీ, బాక్టీరియాలజీ, ఫార్మకాలజీలకూ; వాటి నాన్‌క్లినికల్ సబ్జెక్టులకు వైద్య కళాశాలలోనున్న వసతులు సరిపోతాయి కదా. మూడో సంవత్సరం వచ్చేసరికి కాస్త అవుట్ పేషెంట్ పార్టులో ఓ 10, 15 డెంటల్ థియరీలు, కాస్త ఆపరేషన్ థియేటర్, ఇన్‌పేషెంట్లకు వసతి వంటివి ఏర్పాటు చేసుకోవడానికి నామమాత్రపు కేటాయింపులు సరిపోతాయ’ని చెప్పాను. వైద్య విశ్వవిద్యాలయం కులపతిగా ఉన్న డాక్టర్ లింగం సూర్యనారాయణను పిలిపించి, దానికి అవసరమైన నివేదిక తయారు చేయమని పురమాయించమని కోరాను. ఇది ప్రభుత్వ రంగంలో నెలకొంటుంది గనక అవినీతి ఆరోపణలకు తావుండదనీ చెప్పాను.



ఈ సంగతి డాక్టర్ లింగం గారికి ముందుగానే తెలియజేస్తే – ‘అమ్మో! వారిని కలవడం మాటలా? నావల్ల కాదని’ కంగారుపడ్డారు. తరువాత రెండు, మూడు రోజులకు వారికి ఫోన్ చేసి చెప్పాను... ముఖ్యమంత్రి కార్యాలయం నుండి కబురు వస్తుందనీ, కంగారు పడకుండా సవివరంగా నివేదిక తయారు చేసుకొని వెళ్లమనీ. ‘ఫోను వచ్చింది – శివాజీ ఈరోజే వెడుతున్నాను’ అని సెలవిచ్చారు.

ముఖ్యమంత్రి ఆ నివేదిక పరిశీలించి వెంటనే ఐదు లక్షల రూపాయలు కేటాయించి, విజయవాడ పాత ఆర్టీసీ బస్టాండు భవనాన్ని బదలాయించి, కాలేజీ మొదలు పెట్టమన్నారు. ఇకపై, ప్రభుత్వం నుండి నిధుల కోసం ఎదురు చూడకుండా, మీ కాళ్ల మీద మీరు నిలబడి కాలేజీ నడుపుకోవాలని కూడా హెచ్చరించారు. అలా 1992–93లో 40 వార్షిక ప్రవేశాలతో, విజయవాడలో హెల్త్ యూనివర్సిటీ యాజమాన్యంలో ఈ కాలేజీ పురుడు పోసుకుంది. ఇది అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో, ద్వితీయ దంత వైద్య కళాశాల. హెల్త్ యూనివర్సిటీ మొత్తం అవిభక్త ఆంధ్రప్రదేశ్‌కు చెందింది కనుక, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం దానిలో ప్రవేశాలకు అవిభక్త రాష్ట్రమంతటికీ అన్ని జిల్లాలకూ పది సంవత్సరాల పాటు అర్హత ఉంది. ఇప్పుడు ఆ గడువు ముగిసింది కనుక విభజిత ఆంధ్రప్రదేశ్‌కే పరిమితమయ్యింది.

ఇదిలా ఉండగా, డాక్టర్ లింగం పదవీ విరమణ తర్వాత వారి స్థానంలో డాక్టర్ సీఎస్ భాస్కరన్ వైస్ ఛాన్స్‌లర్ అయ్యారు. వారు బ్యాక్టీరియాలజీ ప్రొఫెసర్. వారికి హాస్పిటల్ పని, ఆపరేషన్లు, రోగులు, వైద్యం వంటి బాధ్యతలు ఉండవు. దానితో వారు అడ్మినిస్ట్రేషన్ మీద దృష్టి కేంద్రీకరించారు. గతంలో కూడా డాక్టర్ డి. జగన్నాథరెడ్డి, డాక్టర్ డి. భాస్కర్ రెడ్డి, డాక్టర్ హరినాథ్ వంటి వారు వైద్య కళాశాలల ప్రిన్సిపల్స్‌గాను, వైద్య విద్యాశాఖ సంచాలకులుగాను బాగా రాణించారు. డాక్టర్ భాస్కరన్ విజయవాడలో ప్రైవేట్ ప్రాక్టీసులో ఉన్న సీనియర్ దంత వైద్యులను పిలిచి ‘ఈ కళాశాల అమ్మా, అబ్బా లేని అనాథ. మీరు ఈ ప్రాంతం వారు. ఇవి బతికి, బట్టగట్టేటట్లు కాపాడవలసిన గురుతర బాధ్యత మీ మీద ఉంది. జీతం–భత్యం ఆశించకుండా పని చేయండి’ అని విన్నవించారు. అలాగే పనిచేసి, వారు దాన్ని నిలబెట్టారు. అదే నేడు బీడీఎస్‌తో పాటుగా ఎమ్‌డీఎస్ కోర్సుల్లో కూడా తర్ఫీదు నిస్తూ రాష్ట్రంలో అత్యుత్తమ కళాశాలగా నిలదొక్కుకుంది.

వ్యాసకర్త రాజ్యసభ మాజీ సభ్యులు

ధర్మనిరతే కవచం

విశ్వామిత్రుడు వచ్చి శ్రీరాముడిని యాగపరిరక్షణార్థం పంపించమని అడిగినప్పుడు, కేవలం పదిహేనేండ్ల బాలుడు, ఈ పసివాడు యాగానికి రక్షగా నిలబడడం ఏమిటి? అని కంగారుపడి, పంపించడానికి సంకోచించాడు దశరథ మహారాజు. తపస్సు చేయగా చేయగా కలిగిన సంతానం కాబట్టి దశరథుడి మనసులో ఆ కంగారు, దిగులు సహజమే! అయితే, అలా పంపమని అడిగిన విశ్వామిత్రుడు ఆ మాత్రం ఆలోచన లేకుండానే అడిగాడా? అన్నది ఆ క్షణాలలో దశరథుడు, శ్రీరాముడి మీదనున్న అపారమైన ప్రేమ కారణంగా ఆలోచించలేకపోయిన సంగతి.



జ్యోతిర్మయం

పిల్లల క్షేమానికి ఏది రక్షగా పనిచేస్తుంది? అని ప్రశ్న వేసుకున్నప్పుడు, ఆ పిల్లల తల్లిదండ్రులు ఎంత ధర్మబద్ధంగా జీవనాన్ని సాగిస్తారో అంత క్షేమంగా వారి పిల్లలు ఉంటారన్న సమాధానాన్ని సూచించిన సన్నివేశం ఇది. దశరథుడి సంకోచానికి విశ్వామిత్రుడు కోపగించుకోవడం చూసిన వశిష్ఠుడు కలగజేసుకుని ‘దశరథ మహారాజా! దక్షప్రజాపతి కుమార్తెలైన జయకు, సుప్రభకు భృశాశ్వుడనే ప్రజాపతి ద్వారా కలిగిన కామరూపులు; మహా సత్వసంపన్నులు, అస్త్రములు అయినటువంటి నూర్గురు కొడుకులను విశ్వామిత్రుడు పొంది ఉన్నాడు. వాళ్ళల్లో ఏ ఒక్కడైనా కూడా యాగరక్షణ అనే పనికి సరిపోతాడు. ఇక శస్త్రాస్త్రాల సంగతంటావా? ఈయనకు తెలియని శస్త్రాలు, తలుచుకుంటే ఈయన సృష్టించలేని అస్త్రాలు లేవు. అటువంటి ఆయనతో పంపించడానికా నీవు సంకోచిస్తున్నావు?’ అని ఊరడించి, దశరథుడితో ఇంకా ఇలా చెప్పాడు.

చ॥ అనలము చేత గుప్తమగు నయ్యమృతంబును బోలె నీ తపో
ధనపరిరక్షితుం డగుచు దద్దయు నొప్పెడు నీ తనూభవుం
డని నకృతాస్త్రుడైనను నిరాయుధుడైన నిశాట కోటికిం
జెనకగ రాదు కౌశికుడు చెప్పగ గేవల సంయమీంద్రుడే.

పూర్వం క్షీరసాగర మథనంతో లభించిన అమృతకలశం భయంకరమైన విషాగ్ని కింద దాచబడి ఉన్నట్లుగా, నీ కొడుకైన శ్రీరాముడనే అమృతకలశం నీ తపోధనం అనే ప్రాణశక్తి చేత పరిరక్షించబడుతూ ఉన్నది. అటువంటి స్థితిలో శ్రీరాముడు నిరాయుధుడుగా ఉన్నప్పటికీ ఆ రాక్షస సమూహం అతడిని ఏమీ చేయలేదు. కౌశికుడు కంటికి కనిపిస్తున్నట్లుగా కేవలం మునిమాత్రుడు కాదు సుమా!’ అని వివరించాడు వశిష్ఠుడు ‘భాస్కర రామాయణం’ బాలకాండలోని పై సన్నివేశంలో. సంతానం ప్రాణాలకు వారి తల్లితండ్రుల ధర్మబద్ధ జీవనమే అన్నిటినీ మించిన రక్ష అని పైసన్నివేశం చాలా బలంగా చెప్పింది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం: దక్షిణాయనం, వర్ష ఋతువు; శ్రావణ మాసం; **తిథి:** శు.పాడ్యమి సా.4.48 వరకు, తదుపరి విదియ; **నక్షత్రం:** ఆశ్లేష ప.3.20 వరకు, తదుపరి మఖ; **వర్జ్యం:** తె.4.18 నుండి 6.02 వరకు (తెల్లవారితే మంగళవారం); **దుర్ముహూర్తం:** ప.12.31 నుండి 1.22 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.56 వరకు; **అమృత ఘడియలు:** ప.1.41 నుండి 3.22 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం:** 5.43; **సూర్యాస్తమయం:** 6.29

క్లుప్తంగా...

ఈ నెల 9, 19 తేదీల్లో గరుడ సేవ



తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఈ నెలలో రెండు సార్లు గరుడ వాహన సేవ జరుగనుంది. ఈ నెల 9న గరుడ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మలయప్ప స్వామి వారు రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు తమకు ఇష్టమైన గరుడునిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నారు. అలాగే ప్రతి నెలా పౌర్ణమి సందర్భంగా నిర్వహించే పౌర్ణమి గరుడ సేవను ఆగస్టు 19వ తేదీ శ్రావణ పౌర్ణమి నాడు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

వయోవృద్ధుల దర్శనంపై పుకార్లను నమ్మొద్దు

టీటీడీ విజ్ఞప్తి



తిరుమల: వయోవృద్ధుల దర్శనానికి సంబంధించి తప్పుదోవ పట్టించే కొన్ని వార్తలు సోషల్ మీడియాలో గత కొంతకాలంగా చక్కర్లు కొడుతున్నాయని, అవి పూర్తిగా అవాస్తవమని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. వాస్తవం ఏమిటంటే.. ప్రతిరోజు 1000 మంది వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం టీటీడీ ప్రతి నెల 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు మూడు నెలల ముందుగానే ఒక నెలకు సంబంధించిన ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తోంది. టికెట్ పొందిన వ్యక్తికి ఒక లడ్డూ ఉచితంగా అందిస్తుంది. తిరుమలలోని తిరుమల నంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్, పీహెచ్‌సీ లైన్ ద్వారా ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. భక్తులు సరైన సమాచారానికి టీటీడీ అధికారిక వెబ్‌సైట్ www. tirumala. org, https://ttdevastanams.ap.inను మాత్రమే సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలియజేసింది.

ఆ ప్రచారం అవాస్తవం

పులివెందుల నేత మనోహర్‌రెడ్డి



పులివెందుల: కూటమి ప్రభుత్వం అవాస్తవాలు ప్రచారం చేస్తూ.. ఆ పార్టీలకు చెందిన కొన్ని పత్రికల్లో వాటిని ప్రచురించడం తగదని వైఎస్సార్ జిల్లా పులివెందుల వైఎస్సార్‌సీపీ నేత, మునిసిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం కొన్ని పత్రికల్లో పులివెందులకు చెందిన కర్రెద్దుల విజయ అనే మహిళకు చెందిన ఐదెకరాల్ని తాను ఆక్రమించి.. అందులో వాటర్ ట్యాంక్ నిర్మించి బెదిరిస్తున్నట్టు సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేసిందంటూ వార్త ప్రచురితమైందన్నారు. అయితే తాను గాని.. తన బంధువులు గాని ఎలాంటి భూమిని కబ్జా చేయలేదన్నారు. ఆ వార్తలో వాస్తవాలు ఏమాత్రం లేవన్నారు. పులివెందులలో వైఎస్ కుటుంబీకులు ప్రజలకు అండగా ఉండటం తప్ప.. వారిని ఎలాంటి ఇబ్బందులకు గురి చేయలేదన్నారు. ఈ విషయం పులివెందుల నియోజకవర్గంలో ఉన్న ప్రతి కుటుంబానికి తెలుసన్నారు. ఇలాంటి అవాస్తవాలు ప్రచురిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

కొమ్మినేనికి ఎన్టీఆర్ జర్నలిస్టు అవార్డు ప్రదానం



హైదరాబాద్: దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం రవీంద్రభారతిలో ఎన్టీఆర్ ట్రస్ట్, సీతాస్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావుకు ఎన్టీఆర్ జర్నలిస్టు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మీపార్వతి మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ఢిల్లీకి తెలియజేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జర్నలిస్టు అవార్డు తనకు అందజేయడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ అవార్డు తనపై బాధ్యతను మరింత పెంచిందని కొమ్మినేని పేర్కొన్నారు. 'సాక్షి' యాంకర్ పి.ఈశ్వర్, ప్రముఖ విశ్లేషకుడు ప్రసాద్, సీ తాస్ ట్రస్ట్ డైరెక్టర్ రాణి, గోపాల్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త ఎస్‌ఐ చొక్కా పట్టుకోలేదు


రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ



భట్టిప్రోలు: 'భట్టిప్రోలులో టీడీపీ బరితెగింపు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనం నేపథ్యంలో పోలీసు అధికారులు వాస్తవాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. భట్టిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ 'పోలీసులు, టీడీపీ నాయకులకు మధ్య శనివారం జరిగిన తోపులాటలో ఆ పార్టీ నాయకుడి సెల్‌ఫోన్ కింద పడిపోయింది. టీడీపీ కార్యకర్త వంగి ఫోన్ తీసే క్రమంలో ఎస్‌ఐ కోటేశ్వరరావు చేయి పట్టుకున్నారు. టీడీపీ కార్యకర్త ఎస్‌ఐ చొక్కా పట్టుకోలేదు..' అని వివరించారు. ఈ సమావేశంలో చుండూరు సీఐ శ్రీనివాసరావు, భట్టిప్రోలు, నగరం ఎస్‌ఐలు కాసుల శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కట్టాల్సిందే 'ఎస్' ట్యాక్స్

- సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి దందా
- ఆయన తనయుడి కమీషన్లు 'వేరే లెవెల్'
- కప్పాలు కట్టలేక పరిశ్రమల యజమానుల లబోదిబో



ప్రస్తుత ప్రభుత్వంలో వసూలు చేస్తున్న రూ.800 రసీదు
గత ప్రభుత్వంలో వసూలు చేసిన రూ.300 రసీదు

బూడిదనూ వదిలిపెట్టడం లేదు..

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న సర్వేపల్లి నియోజకవర్గానికి 'ఎస్' ట్యాక్స్ గుదిబండగా మారింది. దినసరి కూలీల నుంచి పారిశ్రామికవేత్తల వరకు స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి కప్పం కట్టాల్సిందే. లేదంటే భౌతిక దాడులతో ఆయన దారిలోకి తెచ్చుకుంటున్నారు. ఇక ఆయన తనయుడు (షాడో ఎమ్మెల్యే).. కాదేదీ కమీషన్లకు అనర్హం అన్నట్లు వ్యవహరిస్తున్నాడు. ఆయన కప్పాలు కట్టలేక పారిశ్రామికుల నుంచి లేబర్ ఏజెన్సీల వరకు తలలు పట్టుకుంటున్నారు.

దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్రాజెక్టులో విడుదలయ్యే బూడిదను కూడా అమ్మేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఆ ప్లాంట్‌లో విడుదలయ్యే ఫ్లయాష్‌లో 20 శాతం ఉచితంగా సిమెంట్ కంపెనీలకు ఇవ్వాలి. మరో 80 శాతం విక్రయించవచ్చు. దీన్ని అవకాశంగా తీసుకున్న షాడో ఎమ్మెల్యే ఉచితంగా ఇచ్చే 20 శాతం బూడిదను తనకే ఇవ్వాలని పట్టుబట్టి చేజిక్కించుకున్నాడు. దానిని సిమెంట్ కంపెనీలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ప్రతి నెలా రూ. 32 లక్షల ఆర్జించే ప్లాన్ ఇది అని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- తోటపల్లి గూడూరు మండలం అనంతపురంలో రొయ్యల ఫీడ్‌తో పాటు మేత తయారు చేసే వాటర్‌బేస్ లిమిటెడ్ కంపెనీలో 150 మంది వరకు రోజువారీ లేబర్‌గా పనిచేస్తున్నారు. ఆ కంపెనీ లేబర్ కాంట్రాక్టుపై టీడీపీ నేతల కన్నుపడింది. తమకే ఆ కాంట్రాక్టు ఇవ్వాలని ఆ కంపెనీ ఉద్యోగులపై భౌతిక దాడులకు దిగారు. దీనితో భయపడ్డ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కూడా జంకింది. లేబర్ కాంట్రాక్ట్‌ను వెంటనే టీడీపీ నేతలకు అప్పగించింది.
- వెంకటాచలం మండలం కాకర్లవారిపాళెం ప్రాంతంలోని బేవరేజస్ పరిశ్రమలో పనిచేసే కార్మికులను తొలగించి టీడీపీ కార్యకర్తల్ని పెట్టుకోమని డిమాండ్ పెట్టారు. అలాగే ఆ పరిశ్రమల్లో మెస్ నిర్వహణ కూడా తన అనుచరుడికే ఇవ్వాలని పట్టుబట్టి యాజమాన్యాన్ని వేధిస్తున్నారు.
- కృష్ణపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పాటయిన ఫ్యాక్టరీలలో తయారయ్యే పామాయిల్‌ను తరలించే ట్యాంకర్ల నుంచి 'ఎస్' ట్యాక్స్ వసూళ్లకు తెరలేపారు. గత కొన్నేళ్లుగా పామాయిల్ ట్యాంకర్ల యజమానులు అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ఆ అసోసియేషన్ నిర్వహణ కోసం ప్రతి లోడ్ ట్యాంకర్ నుంచి రూ. 300 వంతున వసూళ్లు చేసుకొనేవారు. షాడో ఎమ్మెల్యే కన్ను ఆయిల్ ట్యాంకర్లపై పడింది. ఆ అసోసియేషన్ పాలకవర్గాన్ని మార్చేసి వెంటనే తన అధీనంలోకి తెచ్చుకున్నారు. ప్రతి ఆయిల్ ట్యాంకర్ నుంచి అదనంగా రూ. 800 వంతున వసూళ్లు చేసుకునేలా ప్లానింగ్ చేసుకున్నాడు. దీంతో ప్రతిరోజు దాదాపు 150 వరకు ట్యాంకర్లు రూ. 1.2 లక్షలు వరకు ట్యాక్స్ రూపంలో చెల్లించాలి. బయట రాష్ట్రాల నుంచి వచ్చే ట్యాంకర్ల వద్ద అదనంగా రూ.4 వేలు వంతున వసూళ్లు చేస్తున్నారు.



చదువుల్లో'వంట'


చపాతీలు చేస్తున్న విద్యార్థులు

ఇది ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం చెంచు గిరిజన గురుకుల పాఠశాల. ఇక్కడ విద్యార్థులు కూర్చున్నది భోజనానికి కాదు. ఇక్కడందరూ భోజనాలు చేయాలంటే.. విద్యార్థులు గరిట తిప్పాల్సిందే. ఇక్కడిది నిత్యకృత్యం. ఇది అందరికీ తెలిసిందే అయినా.. తెలియనట్టే ఉంటారు. ఆదివారం ఉదయం అల్పాహారం మెనూలో చపాతీ ఉండటంతో విద్యార్థులు దాదాపు 600 చపాతీలు చేశారు. తరువాత భోజనం తయారీలోనూ యథాశక్తి శ్రమించారు. కాగా.. విద్యార్థులతో చపాతీలు చేయిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. విద్యార్థులతో వంట పనులు చేయిస్తుండటంపై వార్డెన్ గీతు నాయక్‌ను వివరణ కోరగా.. విద్యార్థులు సెలవు దినాల్లో వంట గదిలోకి వెళ్లి సరదాగా వంట వారికి సహాయం చేస్తుంటారని చెప్పుకొచ్చారు. హాస్టల్‌లో ఇద్దరు వంట మనుషులు, సహాయకులు ఉన్నారని.. పిల్లలతో పనులు చేయించాల్సిన అవసరం తమకు ఉండదన్నారు. ఈ పాఠశాలలో వంట కోసం రోజూ కొందరి చొప్పున విద్యార్థుల్ని కేటాయిస్తున్నారని విద్యార్థులు బాహాటంగానే చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ తెలిపారు.

– యర్రగొండపాలెం

ఏసీఏ పాలకవర్గం రాజీనామా

- విజయవాడలో టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం
- ఏడాది సమయమున్నా పాలకవర్గంతో రాజీనామాలు చేయించిన వైనం
- ఆ వెంటనే వాటికి ఆమోదం.. త్రీమెన్ కమిటీ ఏర్పాటు


సమావేశం నుంచి బయటకు వస్తున్న ఎంపీ చిన్ని

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్రంలో అధికార మార్పు తర్వాత వ్యవస్థలను స్వాధీనం చేసుకునే పనిలో నిమగ్నమైన 'పచ్చ ముఠా' క్రీడా సంఘాల్లోకి కూడా చొరబడుతోంది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ)ను హస్తగతం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) కేంద్రంగా ఈ క్రీడా రాజకీయం కొనసాగుతోంది. ప్రస్తుతం ఏసీఏ అధ్యక్ష, కార్యదర్శులు శరత్‌చంద్రారెడ్డి, గోపినాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రాకేశ్, కోశాధికారిగా ఎ.వి.చలం, అపెక్స్ కౌన్సిల్ సభ్యుడిగా పురుషోత్తం వ్యవహరిస్తున్నారు. వీరికి ఇంకా ఏడాది సమయముంది. కానీ ఆదివారం విజయవాడలోని ఓ హోటల్‌లో ఎంపీ చిన్ని ఆధ్వర్యంలో ఏసీఏ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి 13 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, క్రికెట్ అకాడమీల ప్రతినిధులు కలిపి మొత్తం 33 మంది హాజరయ్యారు. గోపినాథ్ రెడ్డి, రాకేశ్, చలం తమ రాజీనామా పత్రాలతో పాటు మిగిలిన వారివి కూడా తీసుకొని సమావేశానికి వచ్చారు. ఎలాంటి చర్చ లేకుండానే పాలకవర్గం రాజీనామాలను ఆమోదించినట్లు విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజుతో ఎంపీ కేశినేని చిన్ని ప్రకటింపజేశారు. ఆ వెంటనే గోపీనాథ్‌రెడ్డి, చలం వెళ్లిపోయారు.

ఎన్నికల అధికారిగా నిమ్మగడ్డ రమేశ్..


ఏసీఏకు ఎన్నికలు జరిగే వరకు రాష్ట్రంలో క్రికెట్ కార్యకలాపాలు నిలిచిపోకూడదనే ఉద్దేశంతో త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు విష్ణుకుమార్‌రాజు మీడియాకు వెల్లడించారు. ఈ కమిటీలో ఆర్.వి.ఎస్.కె.రంగారావు, మాంచో ఫెర్రర్, మురళీమోహనరావును నియమించినట్లు తెలిపారు. వారిలో ఇద్దరికి చెక్ పవర్ ఇచ్చామన్నారు. ఎన్నికలు జరిగే వరకు ఈ కమిటీ కొనసాగుతుందని తెలిపారు. పాలకవర్గానికి ఉన్న మిగిలిన ఏడాది కాలానికి ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించామన్నారు. సెప్టెంబర్ 8న ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. ఎన్నికల అధికారిగా మాజీ ఐఏఎస్ నిమ్మగడ్డ రమేశ్ వ్యవహరిస్తారని వెల్లడించారు. ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ.. అన్ని జిల్లాల్లోని క్రికెట్ సంఘాలను సందర్శించి క్రికెట్ సంఘాల్లో ఉన్న సమస్యలను, క్రీడాకారుల ఇబ్బందులను పరిష్కరిస్తామన్నారు.

సత్యదేవుని దేవేరికి నేడు వజ్ర కిరీట సమర్పణ

- సత్యదేవుడు, అమ్మవారికి వజ్ర కర్ణాభరణాలు కూడా..
- రూ.2 కోట్లతో తయారు చేయించిన దాత మట్టే సత్యప్రసాద్



స్వామి, అమ్మవార్ల కర్ణాభరణాలు


దాత చేయించిన వజ్ర కిరీటం

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి 134వ ఆవిర్భావ దినోత్సవాలు (జయంత్యుత్సవాలు) సోమవారం ఘనంగా ప్రారంభం కానున్నాయి. దీన్ని పురస్కరించుకుని సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి పెద్దాపురానికి చెందిన శ్రీ లలితా రైస్ ఇండస్ట్రీ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ దంపతులు వజ్ర కిరీటం సమర్పించనున్నారు. సోమవారం మధ్యాహ్నం స్వామివారి ప్రధాన ఆలయంలో రూ.1.50 కోట్ల విలువైన ఈ వజ్రకిరీటాన్ని అందజేయనున్నట్లు సత్యప్రసాద్ తెలిపారు. ఈ కిరీటంతో పాటు స్వామి, అమ్మవార్లకు రూ.50 లక్షలతో చేయించిన వజ్ర కర్ణాభరణాలు కూడా అందజేయనున్నట్లు చెప్పారు. కాగా, ఇకపై ప్రతి రోజూ స్వామి, అమ్మవార్లు ఈ వజ్రకిరీటాలు, వజ్ర కర్ణాభరణాలు ధరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

443.860 కేజీల గంజాయి స్వాధీనం

ఒకరి అరెస్ట్


గంజాయిని చూపుతున్న డీఎస్పీ అంబికా ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఉమర్

రాజమహేంద్రవరం రూరల్: తూర్పు గోదావరి జిల్లా పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను ఆదివారం బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ వెల్లడించారు. దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద బొమ్మూరు పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శనివారం తనిఖీలు చేపట్టారు. రాజానగరం వైపు నుంచి వస్తోన్న ఓ వ్యాన్‌లోని రహస్య అరల్లో 14 ప్లాస్టిక్ సంచుల్లో ఉన్న 443.86 కేజీల గంజాయిని గుర్తించారు. ఈ కేసులో తమిళనాడులోని కురుంబాపేటకు చెందిన దివాకర్‌ను అరెస్ట్ చేసి గంజాయి, వ్యాన్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఇటీవల దివాన్ చెరువుకి దివాకర్ వచ్చి అక్కడ నుంచి మురారికి వెళ్లి మరో వ్యక్తిని కలిశాడు. అక్కడి నుంచి ముగ్గురూ ఏజెన్సీ వైపు వెళ్లారు. తర్వాత దివాకర్‌ను అక్కడ దింపేసి, మిగిలిన ఇద్దరూ వ్యాన్‌తో ఏజెన్సీ వైపు వెళ్లి కొన్ని గంటల తర్వాత తిరిగి వచ్చి గంజాయి వ్యాన్‌ను దివాకర్‌కు ఇచ్చి జగ్గంపేట దాటిన తర్వాత దిగిపోయారు. గంజాయిని తమిళనాడులోని తిండివనం ప్రాంతానికి చేర్చాలని, అక్కడకు వచ్చి తీసుకుంటామని దివాకర్‌కు చెప్పారు. ఆ వ్యాన్‌తో వస్తుండగా దివాకర్ పోలీసులకు పట్టుబడ్డాడు.

రండి.. దేవుడిచ్చిన డబ్బులు తీసుకువెళ్లండి

- కష్టాల్లో ఉన్నవారికి రూ.10లక్షలు ఇస్తే రూ.44లక్షలు సాయం చేస్తామని నమ్మించిన ముఠా
- నకిలీ నోట్లు అంటగట్టేందుకు ప్రయత్నం
- ఏలూరులో ఇద్దరు అరెస్టు.. రూ.47లక్షల నకిలీ నోట్ల స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: తమకు దేవుడు డబ్బులు ఇస్తాడని, వాటితో కష్టాల్లో ఉన్నవారికి సాయం చేస్తామని నమ్మించి కొంత మొత్తం అసలు నోట్లు తీసుకుని పెద్ద మొత్తంలో నకిలీ నోట్లు అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్న ముఠా సభ్యులను ఏలూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఏఎస్పీ జి.స్వరూపరాణితో కలిసి ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ వివరాలు వెల్లడించారు. ఏలూరులో 108 అంబులెన్స్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న దొండపాటి ఫణికుమార్‌కు జూలై 28న ఒక వ్యక్తి ఫోన్ చేసి తాము కష్టాల్లో ఉన్నవారికి ఆర్థిక సాయం చేస్తామని పరిచయం చేసుకున్నాడు. తమకు దేవుడు డబ్బులు పంపిస్తాడని, అలా పంపిన వాటిలో రూ.44లక్షలు ఉన్నాయని, ఈ మొత్తం కావాలంటే రూ.10లక్షలు ఇవ్వాలని చెప్పాడు. ఇలా కొంత డబ్బు తీసుకుని నాలుగు రెట్లు ఎక్కువగా ఇవ్వడాన్ని తమ పరిభాషలో బ్యారిస్ అని అంటారని వివరించాడు. ఈ డబ్బులు ఎక్కువ రోజులు తమ వద్ద ఉండవని, ఆలస్యం చేస్తే మాయమైపోతాయని తెలిపాడు. వెంటనే డబ్బులు తీసుకుని బ్యాంకులో వేసుకోవాలని సూచించాడు. అయితే తన వద్ద అంత డబ్బులు లేవని ఫణికుమార్ చెప్పగా, కొంత అడ్వాన్స్‌గా ఇవ్వాలని, అనంతరం మిగిలిన సొమ్ము తీసుకురావాలని సూచించాడు. రూ.44లక్షలు వస్తాయనే ఆశతో ఫణికుమార్ జూలై 30వ తేదీన ఫోన్ చేసిన వ్యక్తిని, మరికొందరిని కలిసి రూ.3 లక్షలు ఇచ్చాడు. మిగిలిన డబ్బులు కూడా సిద్ధం చేసుకోవాలని ఆ ముఠా సభ్యులు చెప్పారు. ఈ విషయాన్ని ఫణికుమార్ తన స్నేహితుల వద్ద ప్రస్తావించగా, వారు మోసం చేస్తున్నారని వివరించారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన ఫణికుమార్ శనివారం ఆ ముఠాకు ఫోన్ చేసి మిగిలిన డబ్బులు తీసుకువస్తున్నానని, ఏలూరు కొత్త బస్టాండ్ వెనుక రైల్వే ట్రాక్ రోడ్డు వద్దకు రావాలని కోరాడు. అదేవిధంగా ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు జరిగిన విషయాన్ని తెలియజేయడంతో సీఐ కే.శ్రీనివాసరావు తన సిబ్బందితో వెళ్లి నిఘా పెట్టారు. అక్కడికి వచ్చిన నకిలీ కరెన్సీ ముఠా సభ్యుడు చింతలపూడి మల్లాయిగూడెం ప్రాంతానికి చెందిన మారుమూడి మధుసూదనరావు, కారు డ్రైవర్ గప్పలవారిగూడేనికి చెందిన బిరెల్లి రాంబాబును అరెస్ట్ చేశారు. వారి నుంచి 94 కట్టల నకిలీ 500 నోట్లు రూ.47లక్షలు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ నకిలీ కరెన్సీ ముఠా వద్ద ఉంటూ మార్కెట్‌లో నకిలీ నోట్లు మార్పిడి చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

పారా ఒలింపిక్స్‌కు అనకాపల్లి వాసి

షాట్‌పుట్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్న రవి



షాట్‌పుట్ ప్రాక్టీస్ చేస్తున్న రవి

విజయవాడ స్పోర్ట్స్: పారిస్‌లో ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే పారా ఒలింపిక్స్‌కు అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన రొంగలి రవి ఎంపికయ్యారు. షాట్‌పుట్ విభాగంలో రవి భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన రవి.. ఎన్నో అవమానాలు, ఆటుపోట్లను అధిగమించి అంతర్జాతీయ క్రీడాకారుడిగా ఎదిగాడు. ఇందుకోసం అతని తల్లిదండ్రులు మంగ, బాబు తమ వ్యవసాయ భూమిని సైతం అమ్మేశారు. తల్లిదండ్రులు, కోచ్‌లు ఇచ్చిన స్ఫూర్తితో రవి ఇప్పటివరకు దాదాపు 25కు పైగా పతకాలు సాధించి ప్రపంచ క్రీడా వేదికలపై మువ్వన్నెల జెండా ఎగురవేశాడు. ఆదాయ పన్ను విభాగ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న రవి మాట్లాడుతూ.. పారా ఒలింపిక్స్‌లో భారత్‌కు బంగారు పతకం అందించడమే తన లక్ష్యమని తెలిపాడు. కాగా, రవిని ఆంధ్రప్రదేశ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, వి.రామస్వామి అభినందించారు.

విద్యార్థి చెవి కొరికేశారు..


తెగిపోయిన చెవితో సాయి లోకేశ్వరరెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ శివారులోని ఆర్‌జీఎమ్ కళాశాలలో బీటెక్ విద్యార్థి సాయిలోకేశ్వర్‌రెడ్డి చెవిని కొందరు దుండగులు కొరికిపడేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన రష్మి మణి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్. ఆమె కుమారుడు సాయిలోకేశ్వర్‌రెడ్డి ఆర్‌జీఎం కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల ఒకటో తేదీన నంద్యాల శివారులోని ఎస్‌డీఆర్ కళాశాల చైర్మన్ పుట్టిన రోజు వేడుకల కోసం లోకేశ్వరరెడ్డికి స్నేహితుడైన ఓ మైనర్ బాలుడు హాజరయ్యాడు. కార్యక్రమం పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో ఆ బాలుడిని ఎస్‌డీఆర్ కళాశాల సమీపంలో ఉన్న న్యాయవాది శంకర్‌తో పాటు మరి కొంత మంది అటకాయించి డబ్బులు కావాలని డిమాండ్ చేశారు. తన వద్ద లేవని చెప్పడంతో బాలుడిని విచక్షణ రహితంగా కొట్టారు. దెబ్బలకు భయపడిన బాలుడు తన స్నేహితుడైన.. సాయిలోకేశ్వరరెడ్డికి ఫోన్ చేసి రమ్మని చెప్పాడు. లోకేశ్ అక్కడికి వెళ్లగానే.. శంకర్‌ను అన్నా అని పిలుస్తున్న ఓ వ్యక్తి.. లోకేశ్వర్‌రెడ్డి చెవి కొరికి పడేశాడు. నొప్పి భరించలేని లోకేశ్వర్‌రెడ్డి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఇంతలో అక్కడికి చేరుకున్న లోకేశ్వర్‌రెడ్డి తల్లి.. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య


రామకృష్ణ (ఫైల్)

పోలవరం రూరల్: ఏలూరుజిల్లా పోలవరం మండలం గూటాల గ్రామంలో అప్పుల బాధతో కౌలు రైతు పలకంశెట్టి రామకృష్ణ (41) ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం కలుపుమందు తాగి ప్రాణాలు తీసుకున్నాడు. రామకృష్ణ పదెకరాలు సాగుచేస్తున్నాడు. ఇటీవల పొంగిన కొండవాగుల ఉధృతికి వరినాట్లు మొత్తం నీటమునిగాయి. దీంతో మళ్లీ పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే లక్షల రూపాయల అప్పులు ఉండటంతో దిక్కుతోచక కలుపుమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళుతుండగానే మృతిచెందాడు. రామకృష్ణకు రూ.18 లక్షల బ్యాంకు రుణాలతో పాటు ప్రైవేట్ రుణాలు ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

రికార్డు స్థాయిలో 9,168 రాహుకేతు పూజలు



శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. మునుపెన్నడూ లేని విధంగా దర్శనాలు, ప్రసాదాలు, సేవలు, వసతి సముదాయాలు, విరాళాల ద్వారా రూ.1,00,95,356 ఆదాయం లభించింది. గతంలో ఉన్న 7,597 రాహుకేతు పూజల రికార్డు బద్దలైంది. 9,168 రాహుకేతు పూజలతో సరికొత్త రికార్డు నమోదైంది. రాత్రి వరకు సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనాలు 3,081, రూ.200 శీఘ్రదర్శనం 5,081, రూ.500 రాహుకేతు పూజలు 5,183, రూ.750 రాహుకేతు పూజలు 2,288, రూ.1,500 రాహుకేతు పూజలు 933, రూ.2,500 రాహుకేతు పూజలు 610, రూ.5వేలు రాహుకేతు పూజలు 154 టికెట్లు విక్రయించినట్లు ఈవో తెలిపారు.

నావల్ గన్‌ఫైర్ విజేత 'ఐఎన్‌ఎస్ శివాలిక్'



సింధియా(విశాఖ): తూర్పు నావికాదళానికి చెందిన ఐఎన్‌ఎస్ శివాలిక్ నౌక హవాయిలో రిమ్ ఆఫ్ ది పసిఫిక్ ఎక్సర్‌సైజ్ రిమ్‌పాక్-2024లో నావల్ గన్‌ఫైర్ సపోర్ట్ కాంపిటీషన్‌లో విజేతగా నిలిచింది. 25 భాగస్వామ్య దేశాలు పాల్గొన్న ఈ కాంపిటీషన్‌లో ఐఎన్‌ఎస్ శివాలిక్ నౌక అసాధారణమైన మందుగుండు సామగ్రిని కచ్చితమైన సమయానికి లక్ష్యం చెదరకుండా ప్రదర్శించి విజేతగా నిలిచినట్లు నేవీ వర్గాలు తెలిపాయి. దీంతో భారత నౌకాదళం ఐఎన్‌ఎస్ శివాలిక్ నౌకాబృందానికి అభినందనలు తెలిపాయి.

ఫాక్స్ డిబేట్‌కు రాను: కమల

ఏబీసీ చానెల్‌లో చర్చకు సిద్ధమని వెల్లడి



వాషింగ్టన్: ఫాక్స్ న్యూస్ చానెల్‌లో డిబేట్‌కు రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనను డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ తోసిపుచ్చారు. నిజానికి అధ్యక్షుడు జో బైడెన్ ఆ పార్టీ అభ్యర్థిగా ఉండగా అయనతో సెప్టెంబర్ 10న ఏబీసీ చానల్లో రెండో డిబేట్‌కు ట్రంప్ అంగీకరించారు. అనంతరం బైడెన్ బదులు హారిస్ అభ్యర్థి అవడం తెలిసిందే. ఏబీసీ బదులు ఫాక్స్ న్యూస్ చానల్లో సెప్టెంబర్ 4న డిబేట్‌కు సిద్ధమని ట్రంప్ శనివారం ప్రకటించారు. దీన్ని హారిస్ తప్పుబట్టారు. ''ఎక్కడైనా ఎప్పుడైనా చర్చకు సిద్ధమన్న ట్రంప్ ఇప్పుడేమో ఫలానా సమయంలో, ఫలానా చోటే అనడం ఆశ్చర్యకరం. అంగీకరించిన మేరకు సెప్టెంబర్ 10న ఏబీసీ న్యూస్‌లో చర్చకు నేను సిద్ధం. ఆయన పాల్గొంటారని ఆశిస్తున్నా'' అన్నారు. డిబేట్‌కు ట్రంప్ భయపడుతున్నారని హారిస్ ప్రచార బృందం వ్యాఖ్యానించింది. ఆయన తమాషాలు మానుకోవాలని హితవు పలికింది.

2029లోనూ ఎన్డీఏదే అధికారం: అమిత్ షా



చండీగఢ్: కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మనుగడపై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న అనుమానాలను హోం మంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. తమ ప్రభుత్వం దిగ్విజయంగా మరో ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకోవమే గాక 2029లోనూ అధికారంలోకి వస్తుందని ఆదివారం ధీమా వ్యక్తం చేశారు. విపక్షాలు మరోసారి అదే పాత్రకు ఇప్పట్నుంచే సిద్ధం కావాలన్నారు. ''ప్రతిపక్షాలు ఏమైనా చెప్పనీయండి. 2029లోనూ ఎన్డీఏదే అధికారం. మోదీయే ప్రధాని'' అని పేర్కొన్నారు. ''ప్రతిపక్షాలు కాస్త విజయానికే ఎన్నికల్లో గెలిచేసినట్టు సంబరపడుతున్నాయి. కాంగ్రెస్ గత మూడు లోక్‌సభ ఎన్నికల్లో కలిపి సాధించిన సీట్లను బీజేపీ ఒక్క 2024 ఎన్నికల్లోనే సాధించింది!'' అని అన్నారు. మోదీ ప్రభుత్వం కొనసాగదంటూ కావాలనే అయోమయం సృష్టించేందుకు మళ్లీమళ్లీ విపక్షాలు ప్రయత్నిస్తున్నాయన్నారు.

దేశంకాని దేశంలో.. తమది కాని యుద్ధంలో...

సమిధలుగా మనోళ్లు

రష్యాలో ఉద్యోగాలు, విద్య పేరిట ఉచ్చు ● బలవంతంగా ఉక్రెయిన్ యుద్ధంలోకి

ఏజెంట్ల చేతిలో నిలువునా మోసం ● ప్రధాని చర్చించినా వదలని రష్యా

భవిష్యత్తు మీద బంగారు కలలతో ఆశలకు రెక్కలు కట్టుకొని ఆకాశంలోకి ఎగిరారు. ఉపాధి దొరికితే కొత్త ఉషోదయాలు చూస్తామనుకున్నారు. కానీ చివరకు తమది కాని యుద్ధంలో నిస్సహాయంగా ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరఫున తలపడుతున్న భారత యువకుల విషాదమిది. ఎందుకిలా జరుగుతోంది? తమది కాని దేశంలో, తమకు సంబంధమే లేని యుద్ధంలో వారు ఎందుకిలా బలవుతున్నట్టు...?

అతని పేరు రవి మౌన్. హరియాణాకు చెందిన 22 ఏళ్ల యువకుడు. రష్యాలో డ్రైవర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఏజెంట్ చెప్పాడు. నమ్మిన కుటుంబం భూమి తెగనమ్మి మరీ ఏజెంట్‌కు రూ.11.5 లక్షలు ముట్టజెప్పింది. తీరా జనవరి 13న రష్యాకు వెళ్లాక ఏజెంట్ మోసగించినట్టు అర్థమైంది. ఇప్పుడతని ముందు రెండే ఆప్షన్లు. పదేళ్ల జైలు. లేదంటే ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరఫున పోరాటం. పదేళ్ల జైలు కంటే తనకిష్టం లేకున్నా యుద్ధ క్షేత్రాన్ని ఎంచుకున్నాడు రవి. ఈ విషయం కుటుంబానికి తెలియనివ్వలేదు. రష్యా సైనిక దుస్తుల్లో ఉన్న భారత యువకుల వీడియోలో అతన్ని చూశాకే వారికి తెలిసింది. చివరగా మార్చిలో కుటుంబంతో మాట్లాడాడు. అప్పటినుంచి వారికతని సమాచారమే లేదు. యుద్ధంలో మరణించిన వారి మృతదేహాలను పూడ్చేందుకు రాత్రంతా గోతులు, కందకాలు తవ్వడమే పని! నాలుగు నెలల తర్వాత యుద్ధభూమిలో ప్రాణాలొదిలాడు. రవి సోదరునితో పాటు రష్యాలోని భారత రాయబార కార్యాలయం కూడా సోమవారం దీన్ని ధ్రువీకరించింది. డ్రైవర్ ఉద్యోగం ఆశ చూపి యుద్ధానికి ఎలా బలి పెడతారన్న రవి కుటుంబం ప్రశ్నకు బదులిచ్చేదెవరు...?

భారీ వేతనాలు ఎర చూపి...

ఇది ఒక్క రవి కథే కాదు. ఎంతోమంది భారత యువకులకు భారీ వేతనంతో ఉద్యోగాలంటూ ఊరించి రష్యాకు తీసుకెళ్తున్నారు. చివరికిలా బలవంతంగా యుద్ధాన్ని నెత్తిన రుద్దుతున్నారు. 2023 డిసెంబర్ నుంచి 2024 ఫిబ్రవరి మధ్య చాలామంది భారతీయులు ఇలా రష్యా సైన్యంలో చేరారు. వారిక్కూడా అక్కడికి వెళ్లేదాకా ఆ సంగతి తెలియదు! 2023 డిసెంబర్‌లో హర్ష్ కుమార్ అనే యువకున్ని బెలారస్‌కని చెప్పి తీసుకెళ్లిన ఏజెంట్ మధ్యలోనే వదిలేశాడు. రష్యా సైన్యానికి చిక్కడంతో యుద్ధంలో పాల్గొనాల్సి వచ్చింది. అమృత్‌సర్‌కు చెందిన తేజ్‌పాల్‌సింగ్ పరిస్థితీ అంతే. ఏజెంటుకు రూ.2 లక్షలు చెల్లించి మరీ ఉద్యోగం కోసం రష్యా వెళ్లి చివరకు సైన్యంలో తేలాడు. చివరగా మార్చి 3న కుటుంబంతో మాట్లాడారు. జూన్‌లో మరణించాడు. పశ్చిమ బెంగాల్‌లోని కాలింపాంగ్‌కు చెందిన ఉర్గెన్ తమాంగ్ క్రిమియా యుద్ధ ప్రాంతం నుంచి మార్చిలో వీడియో పంపాడు. సెక్యూరిటీ గార్డు ఉద్యోగం, మంచి జీతం పేరిట ఏజెంట్ మోసగించాడని వాపోయాడు. 10 రోజులు నామమాత్ర ఆయుధ శిక్షణ ఇచ్చి బలవంతంగా వార్ జోన్‌లోకి నెట్టారని వెల్లడించాడు. తన యూనిట్‌లోని 15 మంది రష్యనేతర సైనికుల్లో 13 మంది ఎలా దుర్మరణం పాలయ్యారో వివరంగా చెప్పుకొచ్చాడు. ఏపీ నుంచి కూడా పలువురు యువకులు ఈ వలలో చిక్కి ఉక్రెయిన్ యుద్ధక్షేత్రానికి చేరినట్టు చెబుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఇతని పేరు సయ్యద్ ఇలియాస్ హుసేనీ. కర్నాటకలోని కలబురిగి వాసి. వెనక ఉన్నది అతని మిత్రులు అబ్దుల్ నయీం, మహ్మద్ సమీర్ అహ్మద్. వీళ్లు, తెలంగాణలోని నారాయణపేటకు చెందిన మొహమ్మద్ సూఫియాన్ దుబాయ్ విమానాశ్రయంలో పని చేసేవారు. రష్యాలో సెక్యూరిటీ గార్డులు కావాలంటూ యూట్యూబ్‌లో ప్రకటనలు చూశారు. నెలకు లక్షకు పైగా జీతం వస్తుందన్న ఏజెంట్ మాటలు నమ్మి నలుగురూ గత డిసెంబర్లో రష్యా వెళ్లారు. వారిని బలవంతంగా సైన్యంలో చేర్చుకుని ఉక్రెయిన్ సరిహద్దులకు పంపారు. అక్కడి నుంచి ఇలియాస్ తమ దుస్థితిని ఇలా గోప్యంగా వీడియో తీసి పంపాడు. ఇలియాస్ తండ్రి నవాజ్ అలీ హెడ్ కానిస్టేబుల్. తన కొడుకును, అతని స్నేహితులను ఎలాగైనా సురక్షితంగా తీసుకు రావాలంటూ అప్పటినుంచీ అతను ఎక్కని గడప లేదు.

నేరం నిరుద్యోగానిదే...

సంపాదనకు విదేశీ బాట, ప్రవాస భారతీయుని హోదా మన సమాజంలో గౌరవ చిహ్నాలు. గ్రామీణ నిరుద్యోగిత మరీ ఎక్కువ ఉన్న పంజాబ్, హరియాణా యువత కెనడా, యూరప్ దేశాలకు విపరీతంగా వెళ్తుంటారు. కానీ ఆ దేశాలు వీసా నిబంధనలు కఠినతరం చేశాయి. రష్యన్ స్టాంప్ ఐరోపా దేశాలకు వెళ్లడానికి మార్గం సుగమం చేస్తుందనే ఆశతో పంజాబ్, హరియాణా యువకులు రష్యా బాట పడుతున్నారు. తీరా వెళ్లాక ఏజెంట్ల చేతిలో మోసపోయి యుద్ధంలో తేలుతున్నారు. రష్యా సైన్యంలో మనోళ్లు 40 మంది దాకా ఉన్నట్టు విదేశాంగ శాఖ గణాంకాలు చెబుతున్నా వాస్తవ సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని తెలుస్తోంది.

8 మంది భారతీయుల మృతి: కేంద్రం

విదేశీ యువతను రష్యా ఇలా ఉక్రెయిన్ యుద్ధానికి బలి పెడుతున్న నేపథ్యంలో తమ పౌరులు ఆ దేశాలకు వెళ్లకుండా పలు దేశాలు గట్టి చర్యలు తీసుకుంటున్నాయి. నేపాల్ వంటి చిన్న దేశాలు కూడా ఈ విషయంలో నిబంధనలను కఠినతరం చేశాయి. మన దేశంలో అలాంటి చర్యల ఊసే లేదు! కనీసం మోసగిస్తున్న ఏజెంట్లపైనా చర్యల్లేవు. సరికదాం, రష్యాలో ఉపాధి కోసం వెళ్లే భారతీయులు జాగ్రత్తగా ఉండాలనే ప్రకటనలతో కేంద్రం సరిపెడుతోంది! మన యువకులు ఉక్రెయిన్ యుద్ధంలో బలవుతున్న వైనాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవలి రష్యా పర్యటన సందర్భంగా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రత్యేకంగా చర్చించినా లాభం లేకపోయింది. మనోళ్లను స్వదేశానికి పంపేందుకు రష్యా అధికారులు ససేమిరా అంటున్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో 8 మంది భారతీయులు రష్యా తరఫున పోరాడుతూ మరణించినట్టు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ తాజాగా గత గురువారం రాజ్యసభలో వెల్లడించారు. ''12 మంది భారతీయులు ఇప్పటికే రష్యా సైన్యాన్ని వీడినట్టు సమాచారముంది. మరో 63 మంది కూడా సైన్యం నుంచి త్వరగా విడుదల చేయాలని రష్యా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు'' అని వెల్లడించారు. రష్యా సైన్యం తరఫున యుద్ధక్షేత్రంలో పోరాడుతున్న భారతీయులను వెనక్కు పంపేలా ఆ దేశంతో అత్యున్నత స్థాయిలో సంప్రదింపులు జరుగుతున్నట్టు చెప్పారు.

ఇలా మోసగిస్తున్నారు...

నిరుపేద యువతను వారికే తెలియకుండా రష్యా సైన్యంలోకి పంపేందుకు ఏజెంట్లు ప్రధానంగా లక్షల్లో జీతం, మెరుగైన జీవితాన్ని ఎరగా చూపుతున్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా ఏడు నగరాల్లో సీబీఐ చేసిన దాడుల్లో భారీ మానవ అక్రమ రవాణా రాకెట్ వెలుగు చూసింది. దాని సభ్యులను విచారించగా ఈ వివరాలు బయటికొచ్చాయి.

- ఈ 'రష్యాలో ఉపాధి' ప్రచారానికి వారు ప్రధానంగా సోషల్ మీడియాను వాడుకుంటున్నారు.
- ఒకసారి బాధితులు తమ వల్లో పడగానే స్థానిక ఏజెంట్లు రంగంలోకి దిగుతారు. రంగుల కల చూపి ఒప్పిస్తారు.
- పలు సందర్భాల్లో ఉన్నత విద్యను కూడా ఎర వేస్తున్నారు.
- రష్యాలో దిగీ దిగగానే స్థానిక ఏజెంట్లు వాళ్ల పాస్‌పోర్టులు లాగేసుకుంటారు.
- ఆనక బలవంతంగా రష్యా సైన్యంలో చేరక తప్పని పరిస్థితులు కల్పిస్తారు.

'వక్ఫ్' అధికారాల కట్టడి!

- బోర్డుల్లో మహిళలకు ప్రాతినిధ్యం!
- 40 సవరణలకు కేబినెట్ ఆమోదం
- వచ్చే వారం పార్లమెంటులో బిల్లు
- సహించబోం: పర్సనల్ లా బోర్డు

న్యూఢిల్లీ: వక్ఫ్ చట్టాన్ని సమూలంగా మార్చేందుకు కేంద్రం సిద్ధమైంది. వక్ఫ్ బోర్డు అధికారాలను పరిమితం చేస్తూ వక్ఫ్ చట్టానికి సవరణలకు కసరత్తు పూర్తి చేసింది. మొత్తం 40 సవరణలకు ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో జరిగిన మంత్రి వర్గ సమావేశం శుక్రవారం ఆమోదం తెలిపింది. ఏదైనా ఆస్తిని వక్ఫ్ ప్రాపర్టీగా గుర్తించే వక్ఫ్ బోర్డు అధికారాన్ని పరిమితం చేయడమే సవరణల లక్ష్యమని అధికార వర్గాలు తెలిపాయి. వాటి ప్రకారం వక్ఫ్ బోర్డు క్లెయిం చేసే ఆస్తులకు వెరిఫికేషన్ ప్రక్రియ తప్పనిసరి. కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర బోర్డులలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడం కూడా సవరణల్లో ఒకటి. బిల్లును వచ్చే వారం పార్లమెంటులో ప్రవేశపెట్టవచ్చని సమాచారం. ఈ చర్యలను ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు తీవ్రంగా ఖండించింది. వక్ఫ్ బోర్డుల అధికారాలు తదితరాల్లో ఎలాంటి జోక్యాన్నీ సహించేది లేదని ప్రకటించింది. అవసరమైతే కోర్టుకు వెళ్లయినా వీటిని అడ్డుకుంటామని స్పష్టం చేసింది. వక్ఫ్ బోర్డులు సుమారు 9,40,000 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 8,70,000 ఆస్తులను పర్యవేక్షిస్తున్నాయి. వక్ఫ్ చట్టం 1995కు యూపీఏ ప్రభుత్వం 2013లో కొన్ని సవరణలు చేసి బోర్డుల అధికారాన్ని పెంచింది. పుణ్య, మతపరమైన లేదా ధార్మిక ప్రయోజనాల కోసం ఆస్తిని ఇవ్వడాన్ని వక్ఫ్ అంటారు. ఈ ఆస్తులను నియంత్రించడానికి చట్టం స్థాపించబడింది.ఈ భూములపై వచ్చే ఆదాయం పేద ముస్లింల జీవన స్థితిగతులు మెరుగుపరిచేందుకు, ధార్మిక కార్యక్రమాల నిర్వహణ కొరకు వాడాలి. దాతలు యిచ్చిన ఈ భూముల్ని అమ్మే అధికారం వక్ఫ్ బోర్డుకు సైతం లేదు. అయితే రాష్ట్ర వక్ఫ్ బోర్డులకు విస్తృతమైన హక్కులున్నాయి. ఇలాంటి ఆస్తులను సర్వే చేయడానికి ఆలస్యమవుతోందని ప్రభుత్వం గతంలోనే గుర్తించింది. ఆస్తుల దుర్వినియోగాన్ని నివారించడానికి, వక్ఫ్ ఆస్తులను పర్యవేక్షించడంలో జిల్లా మేజిస్ట్రేట్లను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా పలు మార్పులు చేయాలని నిర్ణయించింది.

మత స్వేచ్ఛకు వ్యతిరేకం: ఒవైసీ

వక్ఫ్ బోర్డు అధికారాలను పరిమితం చేసే ప్రతిపాదనను ఎంఐఎం నేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తప్పుబట్టారు. ''దీని వెనుక బీజేపీ హిందూత్వ ఎజెండా ఉంది. మత స్వేచ్ఛను దెబ్బతీయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం. వక్ఫ్ ఆస్తులను లాక్కునేందుకే ఈ సవరణలు. ఇది మతస్వేచ్ఛకు విరుద్ధం'' అని ఆరోపించారు.

టిక్.. టిక్.. టిక్...

మిగిలింది 19 రోజులే

- ఇంకా ఐఎస్ఎస్‌లోనే సునీత
- 23 కల్లా బయల్దేరి తీరాలి
- లేదంటే క్రూ-9 మిషన్‌కు బ్రేక్



స్టార్‌లైనర్‌కు మరమ్మతులు చేస్తున్న వ్యోమగామి (ఇన్‌సెట్లో) సునీత

వాషింగ్టన్: బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌకలో సాంకేతిక సమస్యలతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికే (ఐఎస్ఎస్) పరిమితమైన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ విషయంలో ఉత్కంఠ పెరుగుతోంది. వారు మరో 19 రోజుల్లో వారం అక్కడి నుంచి బయల్దేరకపోతే మరో కీలక ప్రయోగాన్ని నిలిపివేయక తప్పదు. అందుకే నాసా సైంటిస్టులు, బోయింగ్ ఇంజనీర్లు ఆందోళన చెందుతున్నారు. స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక లోపాలను సరిదిద్దడానికి నిరంతరం శ్రమిస్తున్నారు. అయినా పెద్దగా ఫలితం కనిపించడం లేదు.

ఎందుకీ ఆందోళన?

విమానాల తయారీ దిగ్గజం బోయింగ్ సంస్థ తొలిసారి అభివృద్ధి చేసిన స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్టను ప్రయోగాత్మకంగా పరీక్షించేందుకు సునీత, విల్మోర్ జూన్ 5న ఐఎస్ఎస్‌కు బయలుదేరారు. అయితే నింగిలోకి దూసుకెళ్తున్న క్రమంలోనే అందులో సాంకేతిక లోపాలు తలెత్తాయి. 28 థ్రస్టర్లకు గాను 5 మొరాయించాయి. సర్వీస్ మాడ్యూల్‌లో ఐదు చోట్ల హీలియం లీకేజీలు బయటపడ్డాయి. సొనా సైంటిస్టులు భూమి నుంచే రిమోట్ కంట్రోల్‌తో తాత్కాలిక మరమ్మతులు చేశారు. తర్వాత స్టార్‌లైనర్ ఐఎస్ఎస్‌తో విజయవంతంగా అనుసంధానమై జూన్ 13న సునీత, విల్మోర్ ఐఎస్ఎస్‌లోకి అడుగుపెట్టారు. షెడ్యూల్ ప్రకారం వారం తర్వాత స్టార్‌లైనర్‌లో వెనక్కు రావాలి. కానీ దానికి పూర్తిస్థాయిలో మరమ్మతు చేస్తే తప్ప బయల్దేరలేని పరిస్థితి! మరోవైపు స్పేస్‌ఎక్స్ 'క్రూ-9 మిషన్'లో భాగంగా నాసా వ్యోమగాములు జెనా కార్డ్‌మాన్, నిక్ హేగ్, స్టెఫానీ విల్సన్, అలెగ్జాండర్ గోర్బునోవ్ ఈ నెల 18న ఐఎస్ఎస్‌కు బయలుదేరాల్సి ఉంది. వారు 23 కల్లా అక్కడికి చేరేలా గతంలోనే షెడ్యూల్ ఖరారైంది. ఐఎస్ఎస్ నుంచి స్టార్‌లైనర్ వెనక్కి వస్తే తప్ప 'క్రూ-9'ను పంపలేని పరిస్థితి! దాంతో ఏం చేయాలో అర్థం కాక నాసా తల పట్టుకుంటోంది. దీనికి తోడు ఐఎస్ఎస్‌లో సునీత ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తున్నట్టు సమాచారం. స్టార్‌లైనర్ త్వరలో సిద్ధం కాకుంటే ఆమెను రప్పించడానికి ప్రత్యామ్నాయం చూడాల్సి రావొచ్చు.

లవ్ జిహాద్‌కు జీవిత ఖైదు: అసోం

గువాహటి: హిందూ అమ్మాయిలను ముస్లింలుగా మారుస్తున్న 'లవ్ జిహాద్' దోషులకు యావజ్జీవ ఖైదు పడేలా కొత్త చట్టం తెస్తామని బీజేపీ పాలిత అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఆదివారం ప్రకటించారు. ''ఎన్నికల వాగ్దానాలనే నెరవేర్చబోతున్నాం. లవ్ జిహాద్‌తో సంబంధమున్న వారికి జీవితఖైదు తప్పదు. ఇకపై అసోంలో పుట్టిన వారినే స్థానికులుగా గుర్తిస్తాం. వారికే ప్రభుత్వ ఉద్యోగాల అర్హత ఉంటుంది'' అన్నారు.

బ్రిటన్‌లో వలసదారులపై దాడులు తీవ్రం

ఇప్పటికే 100 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

లండన్: వలసలకు వ్యతిరేకంగా కొన్ని గ్రూపులు ఇచ్చిన పిలుపుతో బ్రిటన్‌వ్యాప్తంగా హింసాత్మక ఘర్షణలు చెలరేగాయి. లివర్‌పూల్, హల్, బ్రిస్టల్, లీడ్స్, బ్లాక్‌పూల్, స్టోక్ ఆన్ ట్రెంట్, బెల్‌ఫాస్ట్, నాటింగ్‌హామ్, మాంచెస్టర్‌లలో శనివారం వలసదారులుండే హోటళ్లపై దాడులు జరిగాయి. పలు చోట్ల పోలీసులతో ఆందోళనకారులు బాహాబాహీకి దిగారు. 100 మందికి పైగా ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతివాదుల చర్యలను ఉక్కుపాదంతో అణచివేయాలని ప్రధాని కెయిర్ స్టార్మర్ ఆదేశించారు. నేరపూరిత చర్యలకు తగు మూల్యం తప్పదని హోం మంత్రి వివెట్ కూపర్ హెచ్చరించారు. ఇంగ్లిష్ డిఫెన్స్ లీగ్ (ఈడీఎల్) అనే గ్రూపు ఈ గొడవలకు కారణమని చెబుతున్నారు. వారం క్రితం సౌత్‌పోర్ట్‌లో కత్తిపోట్లకు ముగ్గురు చిన్నారులు బలైన ఘటన అనంతరం వలసదారులే లక్ష్యంగా దాడులు సాగుతున్నాయి. శరీరం రంగును బట్టి దాడులు చేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

'వర్గీకరణ తీర్పును అంగీకరించం'



లక్నో: ఎస్సీ, ఎస్టీ కులాల వర్గీకరణకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును సమర్థించబోమని బీఎస్పీ అధినేత్రి మాయావతి ఆదివారం స్పష్టం చేశారు. ''ఎస్సీ, ఎస్టీల ప్రజలందరూ అఘాయిత్యాలను ఎదుర్కొన్నారు. ఇందులో అందరూ సమానమే. ఏ ఒక్క కులానికీ మినహాయింపు లేదు. వెనుకబాటుతనంలో కూడా ఈ వర్గ ప్రజలంతా సమానంగా ఉన్నందున వర్గీకరణ సరికాదు'' అన్నారు. వర్గీకరణ అనుకూల తీర్పును పునఃపరిశీలించాలని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్లు అవసరమైన వారిలో 90 శాతం మందికి అన్యాయం జరుగుతుందని తెలిపారు. దీనిపై బీజేపీ, కాంగ్రెస్ వైఖరిని తప్పుపట్టారు.

ఎన్నికల్లేకుండానే పార్లమెంటరీ కమిటీలు

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రక్రియ లేకుండానే పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) వంటి కీలక కమిటీల ఏర్పాటు మొదలైంది. గత లోక్‌సభ హయాంలో వీటిని ఎన్నికల ద్వారా ఏర్పాటు చేయగా ఈసారి అందుకు విరుద్ధంగా బిర్లా ఆయా కమిటీల సభ్యులను ఏకాభిప్రాయం ఆధారంగా స్పీకర్ ఓం నియమించనున్నారు. పీఏసీతోపాటు అంచనాల కమిటీ తదితరాలు ఏర్పాటయ్యాయి. వీటికి చైర్ పర్సన్లను స్పీకర్ త్వరలో నామినేట్ చేయనున్నారు.

వానలతో వణుకుతున్న ఉత్తరాది

న్యూఢిల్లీ: పశ్చిమ, మధ్య భారతాన్ని ఎడతెరిపి లేని వానలు వణికిస్తున్నాయి. పశ్చిమబెంగాల్‌తోపాటు జార్ఖండ్‌లో భారీ వర్షాలతో నదులు ఉప్పొంగుతున్నాయి. కశ్మీర్‌లో కుండపోత వానల కారణంగా శ్రీనగర్–లేహ్ జాతీయ రహదారిని మూసివేశారు. దీంతో, కశ్మీర్‌తో లద్దాఖ్‌కు సంబంధాలు తెగిపోయాయి. కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఆదివారం నాటికి కేరళలో మృతుల సంఖ్య 221కి చేరింది. హిమాచల్‌లో 11 మంది చనిపోగా జాడ తెలియకుండాపోయిన 40 మంది కోసం గాలింపు కొనసాగుతోంది. కేదార్‌నాథ్‌లో చిక్కుకుపోయిన 370 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మహారాష్ట్రలో పుణేలో భారీ వర్షాలతో నివాస ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది.

భారత్‌పై చైనా వాటర్ బాంబ్!

బీజింగ్: చైనా మనపై మరో కుయుక్తికి దిగుతోంది. తన అధీనంలోని టిబెట్ గుండా భారత్‌లోకి ప్రవహించే బ్రహ్మపుత్ర నదిపై భారీ జలవిద్యుత్కేంద్రం, డ్యామ్‌ను నిర్మించాలని తలపోస్తోంది. అదే జరిగితే అరుణాచల్ ప్రదేశ్, అసోంలకు తాగు, సాగు నీటి కష్టాలు తప్పవు. అంతేకాదు, యుద్ధమే వస్తే డ్యామ్‌ను నింపేసి ఒక్కసారిగా గేట్లన్నీ ఎత్తి భారత్‌లో పలు ప్రాంతాలను వరదతో ముంచెత్తే కుట్ర ఇందులో దాగుందని ఆస్ట్రేలియన్ స్ట్రాటజీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ అభిప్రాయపడివంది. 'జల రాజకీయాలు: భారత్, చైనా భద్రతా పోరులో బ్రహ్మపుత్ర పాత్ర' పేరిట ఈ మేరకు తాజాగా నివేదిక విడుదల చేసింది. ''బ్రహ్మపుత్ర జలాలు అరుణాచల్ వద్ద భారత్‌లోకి మహోధృతంగా ప్రవహిస్తాయి. అక్కడే భారీ డ్యామ్‌కు చైనా ప్లాన్ చేస్తోంది. విద్యుదుత్పత్తి కోసమని చెబుతున్నా ప్రాజెక్టు నీటిమట్టం, నిల్వ, కిందకు వదిలే సమయం, పరిమాణం వంటి సమాచారాన్ని భారత్‌తో చైనా పంచుకునే అవకాశాల్లేవు. కనుక ఒక్కసారిగా వచ్చిపడే వరద ఉధృతిని ఎదుర్కొనేందుకు, తగు ఏర్పాట్లు చేసుకునేందుకు భారత్‌కు అస్సలు సమయం ఉండదు. ఇలా డ్యామ్‌తో భారత్‌పైకి వాటర్‌బాంబ్‌ను చైనా గురిపెడుతోంది'' అని పేర్కొంది.

వయనాడ్ విలయానికి...

ఉమ్మడి కుటుంబం బలి!

నలుగురి మృతదేహాలు లభ్యం ● ఇంకా 12 మంది జాడ గల్లంతు

వయనాడ్: అప్పటిదాకా ఇంటినిండా 16 మంది సభ్యుల సందడితో కళకళలాడిన ఆ ఉమ్మడి కుటుంబం ఒక్కసారిగా కళతప్పింది. కొండల మీదుగా దూసుకొచ్చిన ప్రకృతి ప్రళయం కుటుంబాన్ని అమాంతం మింగేసింది. చూరల్మల కుగ్రామంలో ఆ ఉమ్మడి కుటుంబంలో 42 ఏళ్ల మన్సూర్ ఒక్కడే మిగిలాడు. విపత్తు రోజున ఊళ్లో లేకపోవడంతో బతికిపోయాడు. తన ఇంట్లో 16 మందిని కొండలు కబళించాయంటూ విలపిస్తున్నాడు. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డ విలయానికి బలైన వారి సంఖ్య 221కి చేరినట్టు కేరళ ఆదివారం ప్రకటించింది. వాస్తవ సంఖ్య 370 దాటినట్టు స్థానిక మీడియా చెబుతోంది.

జీవనదిలో నిర్జీవ దేహాలు

వయనాడ్ తదితర తీరవాసులకు జీవనాడిగా పేరొందిన చలియార్ నది ఇప్పుడు విలయానికి గుర్తుగా మారింది. కొండచరియలకు బలైన వారి మృతదేహాలు ఆరు రోజులైనా ఇంకా నది ప్రవాహంలో కొట్టుకొస్తున్నాయి! ఘటనాస్థలి మీదుగా 40 కి.మీ.ల పొడవునా తీరం వెంట గాలింపు కొనసాగుతోంది.

సైన్యానికి సెల్యూట్.. బాలుడి లేఖ

వయనాడ్‌లో అన్వేషణ, సహాయక పనుల్లో సైన్యం కృషిని రాయన్ అనే స్థానిక చిన్నారిని కదలించింది. 'మీరు నిజంగా గ్రేట్' అంటూ మూడో తరగతి చదువుతున్న ఆ బాలుడు ఆర్మీకి లేఖ రాశాడు. ''ధ్వంసమైన నా వయనాడ్‌లో బాధితులను ఆర్మీ కాపాడుతున్న తీరు చూసి గర్వపడుతున్నా. మీ ఆకలిని కేవలం బిస్కెట్లతో చంపుకుంటూ శరవేగంగా బ్రిడ్జి కట్టడం టీవీలో చూశా. నేను కూడా ఆర్మీలో చేరి దేశ సేవ చేస్తా'' అని పేర్కొన్నాడు. ''నువ్వు ఆర్మీ యూనిఫాంలో మాతో కలిసి పనిచేసే రోజు కోసం ఎదురుచూస్తున్నాం'' అంటూ ఆర్మీ అతనికి తిరుగు లేఖ రాసింది!

బంగ్లాలో మళ్లీ ఘర్షణలు

97 మంది మృతి

- విద్యార్థులు, యువత ఆందోళనలు హింసాత్మకం
- హసీనా రాజీనామాకు డిమాండ్, దేశవ్యాప్త కర్ఫ్యూ



ఢాకా: బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో నిరసనకారులు, విద్యార్థులు చేపట్టిన సహాయ నిరాకరణోద్యమం తొలిరోజే హింసాత్మకంగా మారింది. అధికార అవామీ పార్టీ కార్యకర్తలకు, ఆందోళకారులకు మధ్య ఆదివారం దేశవ్యాప్తంగా 13 జిల్లాల్లో జరిగిన ఘర్షణల్లో ఏకంగా 97 మంది మరణించారు. ఆందోళనల ధాటికి రాజధాని ఢాకాలో దుకాణాలు మూతబడ్డాయి. షాబాగ్‌లో వేలాది మంది విద్యార్థులు తదితరులు గుమికూడి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు బంగాబంధు షేక్ ముజీబ్ మెడికల్ కాలేజీలో వీరంగం సృష్టించారు. వాహనాలను తగలబెట్టారు. దాంతో రోగులు, వైద్యులు, విద్యార్థులు భయంతో వణికిపోయారు. దేశ విమోచన పోరాట అమరుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటాను తగ్గించాలంటూ యువత, ఆందోళనకారులు ఇటీవల చేపట్టిన భారీ ఆందోళనల్లో 200కు పైగా చనిపోవడం తెలిసిందే. అందుకు బాధ్యత వహిస్తూ హసీనా గద్దె దిగాలంటూ నిరసనకారులు తాజాగా మళ్లీ ఉద్యమబాట పట్టారు. దాంతో దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించారు. ఫేస్‌బుక్, వాట్సప్, మెసేంజర్, ఇన్‌స్టాగ్రాం సేవలను నిలిపేశారు. 4జీ ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపేయాలని మొబైల్ ఆపరేటర్లను ఆదేశించారు. ఉద్యమం చేస్తున్న వారిలో యువత లేరని, ఉగ్రవాదులే ఉన్నారని హసీనా ఆరోపించారు. వారికి ప్రజలే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తాజా పరిస్థితిపై ఆర్మీ, పోలీసు విభాగాల అధిపతులతో ఆమె సమీక్ష జరిపారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకుందామంటూ నిరుద్యోగులను ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించడం, వారు తిరస్కరించడం తెల్సిందే.

రాజుకున్న చిచ్చు...

బంగ్లాదేశ్ విముక్తి యోధుల వారసులకు ప్రభుత్వోద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్ల నిర్ణయం ఇటీవల బంగ్లాలో చిచ్చు రేపడం తెలిసిందే. దాంతో సుప్రీంకోర్టు వాటిని 5 శాతానికి తగ్గించింది.

ఇజ్రాయెల్‌పై రాకెట్ల వర్షం

- హెజ్‌బొల్లా ప్రతీకార దాడులు
- ఇజ్రాయెల్‌పై నేడు ఇరాన్ దాడి!
- అమెరికా అధికారుల అంచనా

జెరూసలేం/టెల్ అవీవ్: మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తత తారస్థాయికి చేరుతోంది. లెబనాన్‌కు చెందిన షియా ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ 'హెజ్‌బొల్లా' ఇజ్రాయెల్‌పై తాజాగా రాకెట్లు ప్రయోగించింది. మొషావ్ బీట్ హిల్లెల్ ప్రాంతంలో పలువురు పౌరులు గాయపడినట్టు సమాచారం. తమపై ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగానే హెజ్‌బొల్లా ఈ చర్యకు దిగింది. మరోవైపు ఇరాన్ కూడా సోమవారం తెల్లవారుజాము నుంచి ఇజ్రాయెల్‌పై భీకర దాడులకు దిగొచ్చని ఆ దేశంతో పాటు అమెరికా అధికారులు కూడా అంచనా వేస్తున్నారు. ఇజ్రాయెల్‌కు అండగా అమెరికా సైన్యం ఇప్పటికే రంగంలోకి దిగుతోంది. ఇరాన్ వెనక్కి తగ్గుతుందని న్నట్టు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆశాభావం వెలిబుచ్చారు.



హెజ్‌బొల్లా ముఖ్య నేత అలీ హతం

దక్షిణ లెబనాన్‌లోని బజౌరీ పట్టణంపై ఇజ్రాయెల్ తాజాగా డ్రోన్ దాడిలో హెజ్‌బొల్లా ముఖ్యనేత అలీ అబిద్ అలీ మరణించాడు. హెజ్‌బొల్లా కూడా దీన్ని ధ్రువీకరించింది. గాజాలో ఆదివారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ దాడుల్లో 18 మంది మరణించారు. టెల్ అవీవ్‌లో పాలస్తీనా పౌరుని దాడిలో ఇద్దరు వృద్ధులు మృతిచెందారు.

కంటైనర్ నౌకపై హౌతీల దాడి

హౌతీ తిరుగుబాటుదారులు శనివారం గల్ఫ్ ఆఫ్ అడెన్‌లో సౌదీ అరేబియాకు వెళ్తున్న నౌకపై క్షిపణి దాడికి పాల్పడ్డారు. దానికి నష్టం వాటిల్లేదని తెలిసింది.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

సోమవారం, 5, ఆగస్టు, 2024

భళా గోకాక్

గత ఏడాది కరువు వల్ల బోసిపోయిన గోకాక్ జలపాతం ఈసారి నవోత్సాహంతో పరుగులు తీస్తోంది. ఆదివారం ఉరకలెత్తిన జల శోభ



న్యూస్‌రీల్

మారెమ్మ దేవికి అమావాస్య శోభ



బొమ్మనహళ్లి: ఆషాఢ భీముని అమావాస్య సందర్భంగా నగరంలో బొమ్మనహళ్లి హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ పరంగిపాళ్యలో గ్రామ దేవత మారెమ్మ దేవికి విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, తులసి మాల, నిమ్మకాయలు, పుష్పాలతో అలంకరించి మంగళహారతి ఇచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా అమావాస్య పూజలు

మైసూరు: ఆషాడ మాసం అమావాస్య (భీముని అమావాస్య) సందర్భంగా జిల్లాలోని హెచ్‌డి కోటె తాలూకాలో ఉన్న మహదేశ్వర స్వామి దేవాలయానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. ఆలయం మొత్తం పచ్చని తోరణాలతో, పూలహారాలతో సింగారించారు. తెల్లవారు జాము నుంచే స్వామికి అభిషేకం, అలంకారం, అర్చనలు నిర్వహించారు. వేలాదిగా భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి ఆషాఢ పూజలు



బనశంకరి: నగరంలోని బనశంకరీదేవి సన్నిధిలో ఆషాఢ అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. ఆదివారం వేకువజామున సుప్రభాత సేవ అనంతరం అర్చకులు ఏ.చంద్రమోహన్ అమ్మవారి మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకం నిర్వహించి నవనీత అలంకరణ చేపట్టారు. అలాగే శాకంబరీ దేవికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున విచ్చేసి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేశారు.

కొడుకు చేతిలో తల్లి హత్య

యశవంతపుర: ఆస్తి వివాదంలో రాక్షసునిగా మారిన కొడుకు.. తల్లి అని జాలి లేకుండా చంపాడు. ఈ ఘటన బెళగావి జిల్లా బైలహొంగల తాలూకా ఉడికేరి గ్రామంలో జరిగింది. తల్లి మహదేవి తోలగి (70)ని ఆమె కొడుకు ఈరణ్ణ కట్టెతో తలపై బాది హత్య చేశాడు. ఆమెకు ఇద్దరు కొడుకులుండగా ఇంటి పంపకంలో తగాదా జరుగుతోంది. ఈరణ్ణ తాగిన మత్తులో శనివారం సాయంత్రం తల్లితో గొడవ పెట్టుకుని అర్ధరాత్రి వరకూ వాదులాడాడు, కోపంతో కట్టెతో బాదడంతో ఆమె మృత్యువాత పడింది. దొడ్డవాడ పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి కిరాతక కొడుకుని అరెస్ట్ చేశారు.

మంత్రి మండలిలో మార్పు ఉండదు: సీఎం సిద్దరామయ్య

బనశంకరి: ఎలాంటి రీషఫుల్ లేదు. నేనే ముఖ్యమంత్రిని చెబుతున్నాను మీకు, నాపై నమ్మకం లేదా అని సిద్దరామయ్య ప్రశ్నించారు. ఆదివారం సీఎం నివాస కార్యాలయం కృష్ణాలో సిద్దరామయ్య మాట్లాడుతూ ఢిల్లీలో పార్టీ సీనియర్ నేతలతో సమావేశంలో మంత్రిమండలి మార్పు గురించి ఏమైనా చర్చ జరిగిందా అనే ప్రశ్నపై ఆయన ఇలా స్పందించారు. అది మామూలు సమావేశమని, ఎలాంటి మార్పులు ఉండబోవని చెప్పారు. బీజేపీ–జేడీఎస్ మైసూరు చలో పాదయాత్ర రాజకీయ అజెండాతో కూడినదని ఆరోపించారు.

క్రీడాకారులకు ఉద్యోగాలు

దొడ్డబళ్లాపురం: ఆదివారంనాడు క్రీడాశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య ఒలింపిక్స్, ప్యారా ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, ప్యారా ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్‌లలో ఉత్తమ ప్రతిభ కనబరచి పతకాలు సాధించిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వంలో గ్రూప్‌– ఏ, బీ ఇతర ఉద్యోగాలకు నియామక పత్రాలను అందజేశారు.

మెట్రో స్టేషన్లు సురక్షితమేనా?

- తరచూ ఆత్మహత్యల ఘటనలు
- ప్రయాణికుల మధ్య గొడవలు
- కానరాని పరిష్కార చర్యలు
- నగరవాసులకు తప్పని పాట్లు



మెట్రోలో ప్రయాణిస్తూ జనంతో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ దయానంద్ (ఫైల్)

బనశంకరి: బెంగళూరు ఆధునిక రవాణాకు ప్రతీక అయిన మెట్రో స్టేషన్లలో తరచూ అవాంఛనీయ సంఘటనలు జరుగుతూ దేశవ్యాప్తంగా దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రశాంత నగరంగా పేరున్న ఉద్యాననగరిలో ఈ మాదిరి ఉదంతాలు మాయని మచ్చగా మారే ప్రమాదముంది. తాజాగా.. దొడ్డకల్లసంద్ర మెట్రో స్టేషన్‌లో రైలు కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని నవీన్ అరోరా (54)గా గుర్తించారు. మృతుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తి కాగా, భార్య కుమార్తె, కుమారునితో కలిసి కుటుంబం బిలేకహళ్లి దివ్య పంచమి అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నారు. కుమారుడు వస్త్రదుకాణం నిర్వహిస్తున్నారు. కుమార్తె ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుంది. నవీన్ అరోరా శనివారం సాయంత్రం కదులుతున్న రైలు కిందకు దూకడంతో ప్రాణాలు పోయాయి. దీంతో సిల్క్ రూట్ మార్గంలో రైళ్లు నిలిచిపోయాయి. కళ్ల ముందు జరిగిన ఈ సంఘటనతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఇతడు గత పదేళ్ల క్రితం కేఆర్ మార్కెట్‌లో హార్డ్‌వేర్ షాపు నడిపేవాడు, నష్టాలు వచ్చాయి, ఆరు నెలల నుంచి ఇంట్లో గొడవలు జరిగి అతడు ఒక్కడే వేరుగా జీవిస్తున్నాడు. జేపీ నగరలోని హోటల్, లాడ్జిల్లో రూమ్ తీసుకుని అక్కడే ఉంటున్నాడు. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి నగదును జమచేయించుకునేవాడు. అలాగే యూపీలో ఉండే చాలా మంది వద్ద అప్పుచేశాడు. ఈ సమస్యలతో విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు చెప్పారు.

కొట్టుకోవడం కూడా..

ఇక రద్దీ ఎక్కువై ప్రయాణికులు కొట్టుకున్న సంఘటన వారం కిందట వైరల్ అయ్యింది. మెట్రో రైలు స్టేషన్లు ఆత్మహత్యల నిలయాలు కాకుండా అడ్డుకోవాలని అనేకమంది నెటిజన్లు డిమాండ్ చేశారు. అసలు మెట్రో స్టేషన్లలో, రైళ్ల లోపల పరిస్థితి ఎలా ఉందో చూద్దామని నగర పోలీసు కమిషనర్ దయానంద ఇటీవల స్వయంగా మెట్రో రైలులో ప్రయాణించారు. ప్రయాణికులతో మాట్లాడి సాదక బాధకాలను తెలుసుకున్నారు. కానీ గణనీయమైన మార్పుల గురించి ఏమీ ఆయన ప్రస్తావించలేదు.



మెట్రో రైల్వే స్టేషన్లలో ఆత్మహత్యల బెడద

నివారణ చర్యలు ఎక్కడ?

- నెల కిందట అత్తిగుప్పె స్టేషన్‌లో ఓ న్యాయ విద్యార్థి కూడా ఇదే మాదిరిగా మెట్రో రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు.
- జూన్ 10న ఓ 30 ఏళ్ల యువకుడు హొసహళ్లి స్టేషన్‌లో రైలు వస్తుండగా దూకడంతో తలకు తీవ్ర గాయమైంది. తరచూ ఇటువంటి సంఘటనలు జరగడంతో మెట్రో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.
- మెట్రో స్టేషన్లలో గాజు గోడలను నిర్మించి పట్టాలపైకి దూకే అవకాశం లేకుండా చేస్తామన్న సంస్థ అధికారుల మాటలు ఉత్తుత్తి అని తేలిపోయింది. గాజు గోడల నిర్మాణం ముందుకు సాగలేదు. రద్దీగా ఉండడంతో సెక్యూరిటీ సిబ్బంది కూడా చేతులెత్తేస్తారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

బనశంకరి: బీడీఏ స్థలంలో కొందరు కబ్జాలు చేసి చేపట్టిన అనధికార నిర్మాణాలను అధికారులు తొలగించారు. నగరంలోని సర్ ఎం విశ్వేశ్వరయ్య లేఔట్ 8వ బ్లాక్‌లో నిర్మించిన కట్టడాలను ఆదివారం బీడీఏ అధికారులు జేసీబీ యంత్రాలతో నేలమట్టం చేశారు. సుమారు 7 కిలోమీటర్లు పొడవునా రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లపై నిర్మించిన షెడ్లు, షాపులు, ప్రకటన బోర్డులను తొలగించారు. స్వాధీనం చేసుకున్న స్థలం విలువ రూ. 57 కోట్లు అని తెలిపారు.

రౌడీపై కాల్పులు



రౌడీషీటర్ వెంకటరాజు, గాయపడిన దృశ్యం

బనశంకరి: రౌడీషీటర్‌పై పోలీసులు కాల్పులు జరిపి అరెస్ట్ చేశారు. ఈ ఘటన జిగణి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. ఆనేకల్ పట్టణం తుకిడి అలియాస్ వెంకటరాజు ఓ హత్య కేసులో నిందితుడు. బన్నేరుఘట్ట రాగిహళ్లి సమీపంలో ఉన్నట్లు తెలిసి పోలీసులు పట్టుకోవడానికి వెళ్లారు. పోలీసులపై అతడు కత్తితో దాడి చేయడానికి యత్నించగా సీఐ మంజునాథ్ కాల్పులు జరపడంతో వెంకటరాజు కాలికి తూటా తగిలి పడిపోయాడు. వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించారు. వెంకటరాజుపై సుమారు 9 కిపైగా కేసులు ఉన్నాయి. ఘటనాస్థలిని అదనపు ఎస్పీ నాగరాజ్, డీఎస్పీ మోహన్ చేరుకుని పరిశీలించారు.

ఈ సర్కారు తప్పుకోవాలి

- డీకే అక్రమాలు అనేకం: కుమార
- రెండవరోజుకు కూటమి పాదయాత్ర



పాదయాత్రలో జన సందడి

బనశంకరి/ శివాజీనగర: ముడా కుంభకోణంలో సీఎం సిద్దరామయ్య రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తే బీజేపీ–జేడీఎస్ కూటమి చేపట్టిన మైసూరు చలో పాదయాత్ర ఆదివారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. పాదయాత్ర మొదటి రోజు కెంగేరి నుంచి బిడది వరకు సాగింది, రాత్రికి బిడదిలో బసచేశారు. ఆదివారం ఉదయం బిడదిలో స్థానిక హోటల్లో ప్రసిద్ధ తట్టె ఇడ్లీలను భుజించి నడక ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొలగిపోవాలంటూ నినాదాలు చేస్తూ కరపత్రాలు, ప్లకార్డు ప్రదర్శిస్తూ సాగారు. అధికారం మీద ఆశ లేదు, నేను రెండుసార్లు సీఎం అయ్యానని రాష్ట్రానికి మంచి జరగాలని పోరాటం చేస్తున్నామని కేంద్రమంత్రి హెచ్‌డీ.కుమారస్వామి అన్నారు. పాదయాత్రలో ఆయన ప్రసంగించారు. డీసీఎం డీకే శివకుమార్‌కు అజ్జయ్య శాపం ప్రారంభమైందన్నారు. డీకే దళితులకు చెందాల్సిన 64 ఎకరాల భూమిని కాజేశారని ఆరోపించారు. మాజీ జవాన్ కుమార్తెను అపహరించి భూమిని రాయించుకున్నారన్నారు. సీఎం సిద్దరామయ్య భార్య పేరుతో 15 సైట్లు తీసుకోవడంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. పాదయాత్రలో యడియూరప్ప, విజయేంద్ర, నిఖిల్ తదితర నేతలు పాల్గొన్నారు.

కుమారస్వామి చిట్టా విప్పుతా: డీసీఎం



దొడ్డబళ్లాపురం: జేడీఎస్ నేత, కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఎన్నెన్ని అక్రమాలకు పాల్పడ్డారో నా వద్ద చిట్టా ఉంది. అన్నింటిపై తనిఖీ జరుగుతుందని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చెప్పారు. చెన్నపట్టణలో ఆదివారం జరిగిన కాంగ్రెస్ జనాందోళన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు బిడ్డనని ప్రచారం చేసుకునే కుమారస్వామి పంచె కట్టినంత మాత్రాన రైతు అయిపోడన్నారు. తాను పుట్టుకతో రైతు బిడ్డనన్నారు. తనపై, తన కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు వేయించి జైలుపాలు చేసావు, కాబట్టి నీ అక్రమాలు కూడా వెలికితీస్తానన్నారు. 6 ఏళ్లు రామనగరలో అధికారంలో ఉండి ఏం చేశావు?, నీ కుటుంబం మొత్తం ఎన్ని వేల కోట్లు కూడబెట్టారో చెప్పాలన్నారు. హిట్ అండ్ రన్ కుమారస్వామి అంటూ ఎద్దేవా చేసారు. అందరినీ బెదిరించి బ్లాక్‌మెయిల్ చేసినట్టు తన వద్ద ఆటలు సాగవన్నారు. పాదయాత్ర గురించి జేడీఎస్ నేతలు తలో మాట మాట్లాడి ఇప్పుడు ఏమీ తెలియనట్టు వచ్చి పాదయాత్రలో నడుస్తున్నారు, అసలు నీకు నైతికత ఉందా అంటూ ప్రశ్నించారు.

హైవే గస్తీ ఉద్యోగి దుర్మరణం



ప్రమాద దృశ్యం, మంజునాథ్ (ఫైల్)

బనశంకరి: ఎలక్ట్రానిక్ సిటీ పై వంతెనపై చెడిపోయిన కారును టోయింగ్ చేస్తుండగా గూడ్స్ వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో హైవే గస్తీ సిబ్బంది, గొల్లహళ్లి నివాసి మంజునాథ్ (52) మృతి చెందాడు. కూడ్లు గేట్ వద్ద శనివారం రాత్రి 11.15 సమయంలో ఓ కారు నిలిచిపోవడంతో కారును మరో వాహనంలో ఎక్కించడానికి హైవే ప్రాధికార సిబ్బంది మంజునాథ్, రాజణ్ణ వెళ్లారు. పనిలో ఉండగా వేగంగా వచ్చిన గూడ్స్ వాహనం కారు, టోయింగ్ వాహనాన్ని ఢీకొంది. రాజణ్ణ, మంజునాథ్ తీవ్రంగా గాయపడటంతో ఆసుపత్రికి తరలిస్తుండగా దారిలో మంజునాథ్ చనిపోయాడు.

త్వరలో కూతురి పెళ్లి..

మంజునాథ్ కుమార్తెకు పెళ్లి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం పెండ్లి పత్రికలు పంచి రాత్రి విధులకు వెళ్లాడు. కానీ విధి చిన్నచూపు చూసింది. పెళ్లి వాయిద్యాలతో సంతోషంగా ఉండవలసిన ఇంట్లో విషాదం తాండవించింది. హుళిమావు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

హమ్మయ్యా.. వరదలు తగ్గుముఖం



ఆదివారం శివమొగ్గ నగరం వద్ద తుంగా నదికి మహిళల పూజలు

- నదుల ముంపు అదుపులోకి

యశవంతపుర/ శివమొగ్గ: రాష్ట్రంలోని పశ్చిమ ఘాట్‌లలో వర్షాలు కొనసాగుతున్నాయి. శిరాడి ఘాట్, చార్మాడి ఘాట్‌లో మట్టి చరియలు విరిగి పడుతున్నాయి. చిక్కమగళూరు జిల్లా శృంగేరి దగ్గర గోరి గుడ్డలో మట్టి విరిగిపడింది. గుట్టపై హజరత్ మెహబూబ్‌షా దర్గా ఉండగా, కింద భాగంలో భారీగా మట్టిచరియలు విరిగిపడ్డాయి. గుట్ట కూలీ ఇళ్లపై పడవచ్చని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు బెళగావి జిల్లాలో ఘటప్రభ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. బెళగావి శివార్లలో వరి పొలాలు నీటమునిగాయి. దీంతో రైతుల్లో దిగులు నెలకొంది. కృష్ణా, మలప్రభ తదితర నదుల జోరు కొనసాగుతోంది. శివమొగ్గలో తుంగా నది వరద ముప్పు తగ్గింది. ఆదివారం ఆషాఢ అమావాస్య కారణంగా మహిళలు నదికి గంగ పూజ నిర్వహించారు.

నదిలో అన్వేషణకు నో

ఉత్తర కన్నడ జిల్లా అంకోలా తాలూకా శిరూరు వద్ద హైవే– 66 లో కొండ చరియలు విరిగిపడిన ప్రాంతంలో ప్రముఖ గజ ఈతగాడు ఈశ్వర మల్పె గంగావళి నది లోపలకు వెళ్లి పరిశీలించాడు. అయితే నదిలోపల గాలింపునకు అధికారులు ఒప్పుకోలేదు. జూలై 16న భారీ కొండచరియలు విరిగి పడి 11 మంది అదృశ్యమయ్యారు. రెండు వాహనాలు నదిలోకి పడిపోయాయి. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఆర్మీ సిబ్బంది, ఈశ్వర్‌మల్పె బృందం గాలించగా 8 మంది మృతదేహాలు లభించాయి. శిరూరుకు చెందిన జగన్నాథ నాయ్క, గంగేకొళ్లకు చెందిన లోకేశ్ నాయ్క, కేరళకు చెందిన అర్జున్‌ల ఆచూకీ దొరకలేదు. గాలింపును ఇటీవల బంద్ చేశారు. అమావాస్య కారణంగా నదిలో నీరు ప్రశాంతంగా ఉండడంతో నదిలోకి దిగి వెతకాలని ఈశ్వర్ మల్పె బృందం రాగా, అధికారులు అనుమతించలేదు.

తేరుకున్న శివమొగ్గ

శివమొగ్గ జిల్లాలో భారీ వర్షాలు కొంతమేర తగ్గుముఖం పట్టడటంతో నదులు, డ్యాముల్లోకి వరద కూడా తగ్గుముఖం పట్టింది. ఆదివారం ప్రముఖ జల విద్యుత్కేంద్రమైన లింగనమక్కి జలాశయంలో 36,601 క్యూసెక్కుల నీరు రాగా, వదిలే నీటిని బాగా తగ్గించారు. జలాశయం పూర్తి మట్టం 1,819 అడుగులు కాగా, ఇప్పుడు 1815 అడుగులు ఉంది. తుంగా జలాశయంలోకి వచ్చే వరద నీరు కూడా తగ్గుముఖం పట్టింది. డ్యాం గరిష్ఠ నీటిమట్టంతో ఉంది. 36 వేల క్యూసెక్కులను వదలడంతో ఆ నీరు హొసపేటె తుంగభద్ర జలాశయంలోకి వెళ్తోంది. శివమొగ్గ– దావణగెరె జిల్లాలకు జీవనాడి అయిన భద్రా జలాశయంలోకి ప్రవాహం తగ్గింది, అలాగే డ్యాం నుంచి 29,894 క్యూసెక్కులను వదులుతున్నారు.



బెళగావి జిల్లా గోకాక్ వద్ద ఘటప్రభ నది పరవళ్లు



బెళగావి శివార్లలో ఇంకా ముంపులోనే వరి పొలాలు

డెత్‌నోట్ రాసి.. బ్రిటన్‌వాసి ఆత్మహత్య

- బెంగళూరులో సంఘటన

బనశంకరి: బ్రిటన్ పౌరుడు బెంగళూరు నగరంలో ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం గేవిన్ జేమ్స్ యంగ్ (59) అనే బ్రిటన్ జాతీయుడు కోరమంగల 7వ స్టేజ్‌లోని ఇంట్లో కుళ్లిపోయిన స్థితిలో శవమై తేలాడు. నాలుగురోజుల క్రితం అతిగా మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని పోలీసులు అనుమానం వ్యక్తంచేశారు. కొన్నిరోజుల క్రితం భారత్‌కు వచ్చిన జేమ్స్ ఆన్‌లైన్ ద్వారా కోరమంగలలో ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. గత నెల 27 తేదీన ఇంటి యజమానికి ఫోన్ చేసిన జేమ్స్ 1వ తేదీ వరకు తనను ఎవరూ ఇబ్బంది పెట్టరాదని సూచించాడు. శనివారం ఉదయం ఇంటి యజమాని ఫోన్ చేయగా ఎలాంటి స్పందనరాలేదు. ఇంటి వద్దకు వెళ్లి చూడగా దుర్వాసన రావడంతో భయపడి పోలీసులకు సమాచారమిచ్చాడు. కోరమంగల పోలీసులు గది తలుపు బద్దలు కొట్టి చూడగా బెడ్‌పై నిద్రిస్తున్న స్థితిలో జేమ్స్ మృతదేహం లభ్యమైంది. టేబుల్ మీద, గోడలకు అతికించిన డెత్‌నోట్లు కనిపించాయి. నేను తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నా, నిత్యం మందులు వాడుతున్నా. భార్యతో విడాకులు తీసుకున్న తరువాత పిల్లలు నాతో మాట్లాడడం లేదు, దీంతో ఎంతో కుంగిపోయాను అని రాసి ఉంది. అతని గదిలో కొన్ని సిరంజిలు, ఔషధాలను గుర్తించారు. కేసు నమోదు చేసి బ్రిటన్ రాయబార కార్యాలయానికి సమాచారం అందించారు.



నంది హిల్స్ ప్రవేశ ద్వారం వద్ద కిటకిటలాడుతున్న పర్యాటకులు

జనసంద్రం.. నందిహిల్స్

- వీకెండ్‌కు విపరీతమైన రద్దీ

దొడ్డబళ్లాపురం: ప్రఖ్యాత పర్యాటక ప్రాంతమైన నంది హిల్స్ ఆదివారం టూరిస్టులతో కిటకిటలాడింది. మామూలుగా వీకెండ్‌లో పర్యాటకులు పోటెత్తుతారు. వీకెండ్‌కి తోడు స్నేహితుల దినోత్సవం, భీముని అమావాస్య రావడంతో తెల్లవారుజాము నుండే జనం వాహనాలతో క్యూ కట్టారు. కుటుంబ సమేతంగా వచ్చేవారు కొందరయితే స్నేహితులు, ప్రేమికులతో వచ్చే వారు మరికొందరు. కొండమీద చిరుజల్లులు, పొగమంచుతో భూతల స్వర్గాన్ని కళ్లముందుంచింది. బైక్‌లు, కార్లను నిలపడానికి స్థలం లేకపోయింది. నందికొండ, టిప్పు భవనం, ప్రాచీన ఆలయం తదితరాలను చూసాక పర్యాటకులు కింద ఉన్న భోగనందీశ్వర దేవాలయానికి తరలివచ్చారు. అలాగే కణివె బసవన్న దేవాలయం వద్ద కూడా జనం బారులుతీరారు. కొండ కింద, చుట్టుపక్కల ఉన్న రిసార్ట్‌లు, హోటళ్లు కిటకిటలాడాయి. కోస్తా జిల్లాలు, కేరళ వైపు పర్యాటకులను నిషేధించడంతో చాలామంది నందికొండ వైపు వచ్చారు.



నందికొండ మీద పొగమంచులో పర్యాటకులు

క్లుప్తంగా

హెచ్.డి.కుమారస్వామి అవకాశవాది

• మంత్రి ఎం.బి.పాటిల్

శివాజీనగర: కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి అవకాశవాది అని గతంలో బీజేపీతో, ఆపై కాంగ్రెస్‌తో జతకట్టి ముఖ్యమంత్రి స్థానం అలంకరించారని, ప్రస్తుతం బీజేపీతో కలసి కేంద్రమంత్రి పదవి పొందారని భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎం.బి.పాటిల్ విమర్శించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ పాదయాత్రకు తమ నైతిక మద్దతు లేదన్న కుమారస్వామి ఆ తర్వాత పాదయాత్రలో పాల్గొన్నారన్నారు. ముడా అక్రమాల్లో సీఎం పాత్ర లేదని, అయినా ఆయనపై నిందలు వేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకుడు కే.సీ.వేణుగోపాల్ మంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయటంలో తప్పేమి లేదని, పార్టీ హితదృష్టితో సలహా ఇవ్వవచ్చన్నారు. ఎస్ఐ మృతి విషయంలో అక్కడి కాంగ్రెస్ ఎమ్మెల్యేపాత్ర లేదన్నారు.

భక్తిశ్రద్ధలతో భీముని అమావాస్య



అమ్మవారికి విశేష అలంకరణ

మండ్య: భీముడి అమావాస్యను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండ్య నగరంలోని కాళికాంబ, చాముండేశ్వరి, హోసహళ్లి శ్రీనివాస ఆలయం, శంకరపురలో ఉన్న శ్రీగంగాధరేశ్వర స్వామి ఆలయంలో అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. శ్రీరంగపట్టణంలో ఉన్న శ్రీనిమిషాంబ ఆలయంతోపాటు అనేక ఆలయాల్లో పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పాదయాత్రకు తరలిన బీజేపీ నాయకులు



పాదయాత్రలో పాల్గొన్న బొమ్మనహళ్లి బీజేపీ నాయకులు

బొమ్మనహళ్లి : మూడా అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, జేడీఎస్ సంయుక్తంగా బెంగళూరు నుంచి మైసూరుకు చేపట్టిన పాదయాత్రలో బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మాజీ కార్పొరేటర్లు జల్లి రమేష్, బి.ఎన్.మంజునాథ్ రెడ్డి, మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మురళీధర్, మునిరాము, ఆరికెరెవార్డు అధ్యక్షుడు మంజునాథ్ పాదయాత్రలో పాల్గొన్నారు.

ఢిల్లీ మెట్రోలో ప్రయాణించిన దేవెగౌడ

శివాజీనగర: మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ ఆదివారం ఢిల్లీ మెట్రోలో ప్రయాణించారు. ఈ విషయాన్ని ఎక్స్ ఖాతాలో ఏఎన్ఐ వీడియో పోస్ట్ చేసింది. దేవెగౌడను కొంతమంది అధికారులు కలిసి మాట్లాడారు. మెట్రో సేవలను దేవెగౌడ కొనియాడారు. అనంతరం మ్యూజియంను సందర్శించిన దేవెగౌడ.. అక్కడ అమర్చిన కళాఖండాలను ఆసక్తిగా పరిశీలించారు.

గొంతుకోసి నృత్యం... ఓ భర్త పైశాచికం

యశవంతపుర: మత్తులో భార్య గొంతు కోసి నృత్యం చేసిన భర్త ఉదంతం ఉడుపి జిల్లా కుందాపుర తాలూకా బస్రూరులో జరిగింది. బస్రూరులో లక్ష్మణ, అనిత(38) దంపతులు నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసైన లక్ష్మణ శనివారం రాత్రి మద్యం తాగి వచ్చాడు. అనిత వంట చేస్తుండగా ఆమెతో గొడవ పడ్డాడు. ఓ దశలో చాకుతో గొంతుకోసి ఇంటికి తాళం వేసి బయట నృత్యం చేశాడు. అతని తీరును గమనించిన స్థానికులు భయాందోళనకు లోనయ్యారు. కిటికీ బద్దలు కొట్టి లోపలకు చొరబడి రక్తమడుగులో ఉన్న అనితను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న కండ్లూరు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందిపై కూడా లక్ష్మణ దౌర్జన్యానికి పాల్పడ్డాడు. ఎట్టకేలకు నిందితుడిని అరెస్ట్ చేశారు.

ముగిసిన శతచండికా యాగం



యాగం నిర్వహిస్తున్న స్వామీజీలు

మైసూరు: మైసూరులోని అవధూత గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో జరుగుతున్న శతచండికా యాగం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా దత్త విజయానంద తీర్థ స్వామీజీ హాజరై యాగం పూర్ణాహుతికి ముందు భక్తులకు ఆశీర్వాదాలు అందజేసి మాట్లాడారు. ప్రతి రోజూ నారాయణ నామ స్మరణ చేయాలన్నారు. నారాయణ అని పిలిస్తే చాలు అన్ని రకాల దుఃఖాలు బాధలు మాయమవుతాయన్నారు.

నేత్రపర్వం..చౌడేశ్వరీ మహోత్సవం

బనశంకరి: యలహంక కామాక్షమ్మ లేఔట్‌లో కొలువైన చౌడేశ్వరిదేవి జయంతి మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆదివారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం అర్చకుల బృందం చౌడేశ్వరీదేవి మూలవిరాట్‌కు అభిషేకం, అర్చన, వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేపట్టి విశేష పూజలు నిర్వహించారు. 9 గంటలకు శ్రీచౌడేశ్వరి ఆలయ ట్రస్టు, సలహాసమితి, శ్రీ తొగట వీర క్షత్రియ సంఘం, శ్రీ చౌడేశ్వరీదేవి సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు జరిగింది. వేల సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. 12 గంటలకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. చింతలపల్లి శ్రీనివాసులు కంచికామాక్షి ఆస్థాన విద్వాంసులు భక్తిగీతాలాపన కార్యక్రమం భక్తులను అలరించింది. చైతన్య మెడికల్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చౌడేశ్వరీదేవి జయంతి మహోత్సవంలో ప్రవాసాంధ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



ఉత్సవమూర్తి వద్ద ఆలయ ట్రస్టు సభ్యులు



ప్రత్యేక అలంకరణలో యలహంక చౌడేశ్వరీదేవి



చౌడేశ్వరి ఉత్సవమూర్తి ఊరేగింపు

పొలాల్లో ఏనుగుల విధ్వంసం



అరటిచెట్లను పెకలించివేసిన దృశ్యం

మండ్య: మండ్య జిల్లా శ్రీరంగపట్టణం తాలూకాలోని గ్రామాల్లో ఏనుగులు విధ్వంసం సృష్టిస్తున్నాయి. గుంపులుగా పొలాల్లోకి చొరబడి పంటలను తొక్కిపడేస్తున్నాయి. శనివారం రాత్రి మొత్తహళ్లి సమీపంలోకి పొలాల్లోకి వెళ్లి రైతు కుమార్‌కు చెందిన 30 సెంట్లలోని బీన్స్ పంటను కాళ్లతో తొక్కిపడేశాయి. రైతు సునీల్‌కు చెందిన తోటలోకి వెళ్లి తొండంతో అరటిచెట్లను పెకలించాయి. ప్రదీప్ అనే రైతుకు చెందిన టమాట పంటను నాశనం చేశాయి. సిద్ధ అనే రైతు 20 సెంట్లలో సాగు చేసిన చెరకు పంటను ఆరగించాయి. కుమార్ అనే రైతుకు చెందిన కాకర పంటను తొక్కిపడేశాయి. దీంతో అన్నదాతలకు లక్షల్లో పంటనష్టం వాటిల్లింది.

రాజ్‌భవన్‌ను వాడుకున్నది కాంగ్రెస్సే: బొమ్మై

శివాజీనగర: రాజభవన్‌ను అత్యధికంగా దుర్వినియోగం చేసుకున్న చరిత్ర కాంగ్రెస్‌ది. దేశంలో సుమారు 56 కంటే ఎక్కువసార్లు ప్రభుత్వాలను కూల్చివేసినది కాంగ్రెస్ అని బీజేపీ ఎంపీ బసవరాజ బొమ్మై ఆరోపించారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర బీజేపీ నాయకులు రాజభవన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నం చేశారని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై స్పందించారు. గతంలో గవర్నర్ హంసరాజ భరద్వాజ్ తమ నాయకుడైన బీ.ఎస్.యడియూరప్పపై ఎలాంటి కేసు లేకుండగా ఆయనపై విచారణకు ఆదేశించారు. కాంగ్రెస్ ఇందుకు క్షమాపణ కోరుతుందా అని ప్రశ్నించారు. యాదగిరిలో ఎస్ఐ మరణం గురించి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుండే బదిలీ దందా ఆరంభమైందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నాయకులంతా బదిలీల్లోనే సంపాదన చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారన్నారు.

ఉపాధ్యాయులు మార్గదర్శకులు

కోలారు : ఉపాధ్యాయులు విద్యార్థులకు జ్ఞానంతో పాటు దారి చూపే మార్గదర్శకులని కర్ణాటక మానవ హక్కుల కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్వై మోహన్ తెలిపారు. తాలూకాలోని హరటి గ్రామంలో ఏర్పాటు చేసిన వృత్తి- నివృత్తి కార్యక్రమంలో భాగంగా నివృత్త ఉపాధ్యాయుడు పిఎం గోవిందప్ప సన్మాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు తమ కలలను సాకారం చేసుకోవడానికి స్ఫూర్తిని అందిస్తారన్నారు. విద్యార్థులకు జ్ఞానం మహత్యాన్ని తెలియజేయడం ద్వారా సమాజానికి తమదైన సేవలను అందిస్తున్నారన్నారు. జిల్లా వయోజన విద్యా అధికారి సి ఆర్ అశోక్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఎస్ నారాయణస్వామి, ఆర్టీసీ సంస్థ నివృత్త అధికారి ఎం వెంకట మునియప్ప, విద్యా సంయోజకుడు నంజుండగౌడ, సమూహ సంపన్మూల వ్యక్తి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లోపం, విద్యార్థులకు శాపం



కిటికీలకు తలుపులు లేకపోవడంతో అట్టలతో మూసి ఉంచిన దృశ్యం



అపరిశుభ్రత మధ్య కూరగాయల నిల్వ



ఓ గదిలో పేరుకుపోయిన చెత్త

• అస్తవ్యస్తంగా వీవీ పీజీ హాస్టల్
• విద్యార్థుల అవస్థలు
• సదుపాయాలు నిల్

రాయచూరు రూరల్: రాయచూరు విశ్వ విద్యాలయం అనుబంధంగా ఉన్న హాస్టల్‌లో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాయచూరు వీవీలో అంబేడ్కర్ హాస్టల్‌లో పీజీ విద్యార్థులు 354 మంది ఉన్నారు. వీరికి గదులతో పాటు కనీస సౌకర్యాలు కూడా లేకుండా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ హాస్టల్ అటవీ ప్రాంతంలో ఉంది. ఇక్కడ వంట గదులు, భోజనం చేసే చోటు, శౌచాలయాలు, స్నానపు గదులు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఇక కరెంట్ వైర్లు బయటకు వచ్చి భయపెడుతున్నాయి. ఇక గదులకు తలుపులు లేవు, బల్బులు ఉండవు, ఫ్యాన్లు తిరగవు ఇలా అన్నీ సమస్యలే. హాస్టల్ వార్డెన్ ఇవేమి పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు అంతస్తుల ఈ భవనం వర్షం వచ్చినప్పుడు నీరు మొత్తం కిందకు కారుతుందని తెలిపారు. అసౌకర్యాల నడుమ ఎలా చదువుకోవాలని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగు పరచండి

వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రాయచూరు వర్సిటీని కళ్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి కార్యదర్శి సుందరేష్ బాబు సందర్శించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న సుందరేశ్‌బాబు

శనివారం సాయంత్రం అంబేడ్కర్ హాస్టల్‌ను పరిశీలించారు. అక్కడ సౌకర్యాలను వెంటనే మెరుగు పరచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా వీసీ హరీస్ రామస్వామి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

మహారాష్ట్రలో ఆగని వర్షాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న భీమానది



నీట మునిగిన పంటలు

• దూద్‌గంగా, కృష్ణా పరిధిలో 16 వంతెనలు మునక

రాయచూరు రూరల్: మహారాష్ట్రలోని పడమటి కనుమల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల దూద్‌గంగా, కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో 16 వంతెనలు నీట మునిగాయి. బెళగావి జిల్లా నిప్పాణి తాలూకా కారదగ బెంగాలీ బాబా దర్గా నీటిలో మునిగింది. ఇక మహారాష్ట్ర జాపుర డ్యామ్ నుంచి లక్ష క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేశారు. ఆదివారం యాదగిరిలోని బీమానది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉత్తర, కల్యాణ కర్ణాటక నదీ తీర ప్రాంత వాసులను అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

స్వామీజీ చాతుర్మాస దీక్ష

రాయచూరు రూరల్: మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదంగల్ చాతుర్మాస దీక్ష చేపట్టారు. ఆదివారం మంత్రాలయం రాఘవేంద్ర స్వాముల మఠంలో విశేష పూజలతో పాటు సాముహిక అష్టోత్తర పారాయణం చేశారు. అంతకు ముందు ఆయన భక్తులతో కలిసి తుంగభద్ర నదిలో స్నానాలు ఆచరించారు.

అరాధనకు అడ్డంకుల్లేవ్ :

తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉన్నా రాఘవేంద్ర స్వాముల అరాధనకు అడ్డంకులు లేవని మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదంగల్ వెల్లడించారు. ఆదివారం మఠంలో అయన విలేకరులతో మాట్లాడారు. నీటి ఉధృతి ఉన్న మఠంలోకి, గుడిలోకి వరద నీరు వచ్చే ప్రమాదం లేదన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు.



దీక్షలో స్వామీజీ

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాజీజాన్ సైదా

• 15 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్
• రూ.17.10 లక్షల నగదు స్వాధీనం

పెనుకొండ: మండల పరిధిలోని శెట్టిపల్లి వద్ద పేకాట స్థావరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. 15 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.17.10 లక్షలు, 5 వాహనాలు, 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను డీఎస్పీ బాజీజాన్ సైదా శనివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. పుట్టపర్తికి చెందిన రవి అనే వ్యక్తి శెట్టిపల్లి వద్ద పేకాట స్థావరం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ యుగంధర్, ఎస్ఐలు రాజేష్, రంగడు వారి సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. కర్ణాటక, కడప, కర్నూలు ప్రాంతాలకు చెందిన 15 మందిని అరెస్టు చేశారు. భారీగా నగదు, సెల్ ఫోన్లు, వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు రవితో పాటు మరికొందరు అక్కడి నుంచి తప్పించుకున్నారు.

రాయచూరు-సింధనూరు రైల్వే పనులు పూర్తి చేస్తాం



యాదగిరిలో వందేభారత్ రైలుకు పచ్చ జెండా ఊపుతున్న ఎమ్మెల్యే తదితరులు

రాయచూరు రూరల్: 2027 నాటికి రాయచూరు- సింధనూరు రైల్వే పనులు పూర్తి చేస్తామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్న వెల్లడించారు.

శనివారం రాత్రి బెంగళూరు రైల్వే స్టేషన్‌లో రిమోట్ కంట్రోల్ ద్వారా బెంగళూరు-కలబుర్గి వందే భారత్ రైలును యాదగిరిలో స్టాపింగ్‌కు పచ్చజెండాను చూపి ప్రారంభించారు. యాదగిరి రైల్వే స్టేషన్‌లో గురుమిఠకల్ ఎమ్మెల్యే శరణే గౌడ ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు ధనుంజయ, విజయ్‌కుమార్, అశోక్ కుమార్ మీనా, హేమ రాజ్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊడిన ఆర్టీసీ బస్సు స్టీరింగ్

• అదుపుతప్పి వంతెనకు ఢీ.
• 30 మందికి గాయాలు

రాయచూరు రూరల్: ఆర్టీసీ బస్సు స్టీరింగ్ విరిగిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారు గాయపడిన ఘటన ఆదివారం నందిహాళ వద్ద చోటుచేసుకుంది. వివరాలు... మాన్వి పట్టణం నుంచి సింధనూరు పట్టణానికి బయల్దేరిన బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు వేగంగా వస్తుండగా ఒక్కసారిగా స్టీరింగ్ ఊడిపోయింది. దీంతో బస్సు నియంత్రణ కోల్పోయి పక్కనే ఉన్న వంతెనను ఢీకొని పొలంలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను హుటాహుటిన మాన్వి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



పొలంలోకి దూసుకెళ్లిన దృశ్యం



కోలారు వార్తలు...

చిక్కతిరుపతి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

కోలారు: తాలూకాలోని ప్రసిద్ధ చిక్కతిరుపతి ప్రసన్న వేంకటరమణ స్వామి దేవాలయంలో ఆదివారం భీమ అమావాస్య పండుగను పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

మాదిగ దండోరా హర్షం



సమావేశమైన మాదిగ దండోరా కార్యకర్తలు

శ్రీనివాసపురం: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై మాదిగ దండోరా కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సమావేశమైన దండోరా కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు హూహళ్లి కృష్ణప్ప మాట్లాడుతూ...సదాశివ కమిషన్ నివేదికను అమలు చేయాలని కొన్నేళ్లుగా పోరాటం చేస్తూ వచ్చామని, నేడు అది ఒక కొలిక్కి వచ్చిందన్నారు. సదాశివ కమిషన్ అమలు కోసం మాజీ కేంద్ర మంత్రి ఎ నారాయణస్వామి హైకోర్టులో కేసు వేశారు. సముదాయం మొత్తం ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తోందన్నారు. ఈ సందర్భంగా మాదిగ దండోరా తాలూకా అధ్యక్షుడు గురుమూర్తి, మాది దండోరా ఉపాధ్యక్షుడు నరసింహప్ప, ప్రధాన కార్యదర్శి నంబిహళ్లి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోలారు: ప్రస్తుత ఏడాదిలో కనక నౌకరుల సంఘం, కురుబ సముదాయం నుంచి పదో తరగతిలో 85 శాతం, ఇంటర్‌లో 80 శాతం పైగా మార్కులు సాధించిన సముదాయ విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని రాష్ట్ర కనక నౌకరుల సంఘం జిల్లా అధ్యక్షుడు బిఎం నారాయణస్వామి తెలిపారు. ఆదివారం నగరంలోని కనక భవనంలో జిల్లా కురుబర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూర్వ సిద్ధతా సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు తమ ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, మార్కుల జాబితా, ఫొటో జత చేసి సమర్పించాలని తెలిపారు. అప్పు స్పోర్ట్స్, కనక మందిరం వద్ద లేదా చంద్రు ఫొటో స్టుడియో కురుబరపేటకు ఈ నెల 20 లోగా సమర్పించాలని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కురుబర సంఘం డైరెక్టర్ కెఎన్ సరస్వతమ్మ, సంఘం గౌరవ సలహాదారు మునియప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీరామేగౌడ, కోశాధికారి హరీష్, పదాధికారులు పాల్గొన్నారు.



సమావేశమైన సంఘం పదాధికారులు

కన్నడ జ్యోతి రథానికి ఘన స్వాగతం

మాలూరు : కర్ణాటక రాష్ట్రమని నామకరణం చేసి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న కన్నడ జ్యోతిరథ యాత్రకు మాలూరు పట్టణంలో ఘన స్వాగతం లభించింది. తహసీల్దార్ రమేష్ రథానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె రమేష్ మాట్లాడుతూ... కన్నడ జ్యోతి రథం అన్ని తాలూకాల్లో పర్యటిస్తుందని, ఇలాంటి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కావాలన్నారు. ఈ సందర్భంగా తాపం ఈఓ కృష్ణప్ప, పురసభ ముఖ్యాధికారి ప్రదీప్, కసాప అధ్యక్షుడు ఎం వి హనుమంతయ్య, కరవే సంఘటన చాకనహళ్లి నాగరాజ్, ఎస ఎమ్ రాజు, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణాన్ని పరిరక్షించాలి

కోలారు: పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని రోటరీ కోలారు నందిని అధ్యక్షుడు స్కౌట్స్ బాబు తెలిపారు. గ్లోబల్ వార్మింగ్ నియంత్రణకు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. ఆదివారం తాలూకాలోని కెంబోడి గ్రామంలో ఉన్న జనతా పబ్లిక్ పాఠశాల ప్రాంగణంలో ఆర్ జాలప్ప మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల బృందం, జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ, రోటరీ నందిని ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వాతావరణంలో సమతౌల్యత లోపించడంతో అనూహ్య మార్పులు సంభవిస్తున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ పుట్టిన రోజు సందర్భంగా ఏటా మొక్కలను నాటడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సుమంత్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్, మునిరాజు, రామకృష్ణ, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

క్లుప్తంగా

నిరంతర సాధనతో క్రీడల్లో రాణింపు



క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

గౌరిబిదనూరు : నిరంతర సాధనతో క్రీడల్లో రాణించవచ్చని తీర్థ ట్రస్ట్ డాక్టర్ కేవీ ప్రకాశ్ తెలిపారు. పట్టణంలోని ఆచార్య క్రీడా మైదానంలో బ్యాంక్ క్రికెట్ క్లబ్(బీసీసీ), బెస్కాం జట్ల మధ్య ఆదివారం జరిగిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. పారీస్‌లో జరుగుతున్న ఒలింపిక్ పోటీల్లో కాంస్య పతకం సాధించి దేశానికి ఖ్యాతి తెచ్చిన మనూ ప్రభాకర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. బెస్కాం జట్టు నాయకుడు పరమేశ్వరరెడ్డి, బీసీసీ జట్టు నాయకుడు మల్లికార్జున, వినయ్, గౌతం, మధు, లాల్‌సింగ్, కిరణ్, అశోక్ పాల్గొన్నారు.

డెంగీతో యువకుడి మృతి



మిథున్ (ఫైల్)

గౌరిబిదనూరు: డెంగీతో యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలో వెలుగు చూసింది. రైల్వే స్టేషన్ రోడ్డులో దుకాణం నిర్వహిస్తున్న మంజునాథ్ కుమారుడు మిథున్ (26) నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించగా నయం కాలేదు. బెంగళూరుకు తరలించగా వైద్యులు పరీక్షలు చేసి డెంగీ జ్వరమని తేల్చి చికిత్స కొనసాగించారు. పరిస్థితి విషమించి మిథున్ శనివారం మృతి చెందాడు.

రూ.10 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

మైసూరు : చామరాజనగర జిల్లా కొళ్లెగాల క్రైం పోలీసులు భారీగా చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. చోరీలకు పాల్పడుతున్న మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా హెడతలె గ్రామానికి చెందిన గిరిష్ కుమార్ అనే దొంగను అరెస్ట్ చేసి అతని వద్దనుంచి రూ.10.65 లక్షల విలువైన 204 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు.

అన్నదాతను బలిగొన్న అప్పులు



రైతు నాగరాజు(ఫైల్)

మైసూరు : ఆరుగాలం శ్రమించి దేశప్రజలకు అన్నం పెడుతున్న అన్నదాతలు అప్పుల ఊబిలో చిక్కి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పంటల చేతికందక అప్పులు తీర్చే మార్గం కనిపించక మైసూరు జిల్లా కేఆర్ నగర తాలూకా గంధనహళ్లికి చెందిన రైతు బలవన్మరణం చెందాడు. గ్రామానికి చెందిన నాగారాజు తనకున్న కొద్దిపాటి పొలంలో పంటలు సాగు చేస్తున్నాడు. పెట్టుబడుల కోసం పలువురి వద్ద రూ. 6 లక్షలు అప్పులు చేశాడు. అయితే పంటలు చేతికందక అప్పులు తీర్చే మార్గం కనిపించక పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని కేఆర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై కేఆర్ నగర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రైతుపై చిరుత దాడి

మైసూరు : చిరుత దాడిలో రైతు తీవ్రంగా గాయపడ్డాడు. ఈఘటన మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా సింధువళ్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు బసవణ్ణ తన పొలంలో పనిచేసుకుంటుండగా మాటువేసిన చిరుత దాడిచేసింది. సమీపంలోని రైతులు కేకలు వేయడంతో చిరుత ఉడాయించింది. తీవ్రంగా గాయపడిన రైతును నంజనగూడు ఆస్పత్రికి తరలించారు. కాగా సింధువళ్లి చుట్టుపక్కల అడవుల నుంచి చిరుతలు గ్రామ సమీపంలోకి వస్తున్నాయని, వాటిని బంధించాలని అటవీశాఖకు విన్నవించినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బలిజ కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పీసీ మోహన్

తుమకూరు : మాజీ ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై హయాంలో ఏర్పాటు చేసిన బలిజ కార్పొరేషన్‌కు రూ.వంద కోట్ల నిధులు కేటాయించాలని బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీ.సిమోహన్ ప్రభుత్వాన్ని కోరారు. తుమకూరు జిల్లా బలిజ సంఘం ఆధ్వర్యంలో తుమకూరులో ఆదివారం జరిగిన యోగినారాయణ యతీంద్రుల 189వ జీవసమాధి మహోత్సవం, ప్రతిభాపురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బలిజ సముదాయ విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లేందుకు దాతలు సహకారం అందజేయాలన్నారు. రాష్ట్రంలోని బలిజ సముదాయ బాలబాలికలకు హాస్టల్ సదుపాయం కల్పించాలన్నారు. అనంతరం ప్రతిభావంతులకు పురస్కారాలు అందజేశారు.

నిరుద్యోగులపై కేటుగాళ్ల పంజా

- నకిలీ నియామక పత్రాలు అందజేసి మోసం
- లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్న నిరుద్యోగులు
- సిలికాన్ సిటీలో వెలుగు చూస్తున్న మోసాలు







బనశంకరి: నిరుద్యోగ సమస్యను ఆసరా చేసుకొని వంచకులు రెచ్చిపోతున్నారు. ఉద్యోగాల వేటలో అలసిపోయిన నిరుద్యోగులను గుర్తించి వారిలో ఆశలు రేపి డబ్బు తీసుకొని నకిలీ నియామకపత్రాలు అందజేసి వంచనకు పాల్పడుతున్నారు. లక్షలాది డబ్బు పోగొట్టుకొని నిరుద్యోగులు లబోదిబోమంటున్నారు. ఇలాంటి ఘటనలు సిలికాన్ సిటీలో వెలుగు చూస్తున్నాయి.

కాంట్రాక్టు ఉద్యోగికి రూ.40 లక్షల టోకరా

భారతీయ విజ్ఞాన సంస్థ కాంట్రాక్టు ఉద్యోగి బసవరాజుకు ఏపీకి చెందిన రాజేశ్ అనే వ్యక్తి ద్వారా షణ్ముఖరాజ్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తమిళనాడు నెల్లికుప్పలో ఎల్ఐసీ కార్యాలయంలో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, డబ్బు ఇస్తే ఉద్యోగం ఇస్తామని బసవరాజుకు ఆశపెట్టారు. దీంతో బసవరాజు తన భార్య స్నేహితులను ఎల్ఐసీలోకి చేర్చే ఉద్దేశంతో రూ 1.50 లక్షనుంచి రూ. 5 లక్షల వరకు మొత్తం రూ.40 లక్షలు సేకరించాడు. ఫోన్‌పే ద్వారా షణ్ముఖరాజ్‌కు నగదు జమచేశారు. అనంతరం అందరికీ మొబైల్ ద్వారా నియామక పత్రాలు పంపించి హడ్సన్ సర్కిల్ వద్ద ఉన్న ఎల్ఐసీ కార్యాలయం వద్దకు రావాలని షణ్ముగరాజ్ సూచించాడు. డబ్బు ఇచ్చినవారు అక్కడికి వెళ్లగా నియామక కమిటీలో తనకు చోటు కల్పించలేదని, వచ్చేసారి మీకు అవకాశం ఇస్తామని నమ్మించి వెనక్కు పంపించాడు. తమ ఉద్యోగాల విషయంపై బాధితులు పలుమార్లు షణ్ముఖరాజ్‌కు ఫోన్ చేయగా అదిగో ఇదిగో అంటూ వాయిదా వేస్తూ వచ్చాడు. షణ్ముగరాజ్ ఇచ్చిన నియామక పత్రాలను ఎల్ఐసీ కార్యాలయంలో చూపించగా నకిలీవని నిర్ధారణ అయ్యింది. దీంతో బాధితులు నగరంలోని సీసీబీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. షణ్ముగరాజ్, వైష్ణవి, రాజేశ్‌షెట్టిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కోర్టులో ఉద్యోగం ఇప్పిస్తామని రూ.40 లక్షలు వంచన

ఆర్‌టీ నగర నివాసి అబ్దుల్‌రజాక్ నాగరబావి పాపిరెడ్డిపాళ్యలో పీజీ నిర్వహించడంతో పాటు ఎన్‌జీఓ సంస్థ కూడా ఉంది. 2023లో అతనికి కొప్పళకు చెందిన సిద్ధలింగయ్య హీరేమఠ్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. సహకారనగరలో ఉన్న అతడి కార్యాలయానికి వెళ్లగా తనకు న్యాయమూర్తులు పరిచయమని, నేరుగా నియామకాలు ద్వారా సర్వర్, గుమాస్తా ఉద్యోగాలు ఇప్పిస్తానని సిద్ధలింగయ్య నమ్మబలికాడు. ఒక్కో ఉద్యోగానికి రూ.7 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపాడు. అబ్దుల్‌రజాక్ తన చిన్నాన్న కుమారుడు జావీద్‌కు సర్వర్ పోస్టు కోసం రూ.7 లక్షలు సిద్ధలింగయ్యకు అందజేశారు. 2023 మార్చిలో సిటీ సివిల్‌కోర్టు వద్దకు జావీద్‌ను పిలిపించి సంతకం చేయించి ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపాడు. అనంతరం న్యాయమూర్తుల పేరుతో నియామకపత్రం అందించాడు. మరో ఆరుమందితో రూ. 7లక్షలు వసూలు చేసి నియామకపత్రాలు అందజేశాడు. ఆ పత్రాలను కోర్టులో చూపించగా నకిలీవని తేలింది. దీంతో బాధితులు సీసీబీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆక్రమణల తొలగింపునకు టాస్క్‌ఫోర్స్

- మంత్రి ఈశ్వర ఖండ్రె

శివాజీనగర: పశ్చిమ కనుమలు, ఇతర కొండ ప్రదేశాల్లో ఆక్రమణలు తొలగించేందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైందని అటవీ శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రె తెలిపారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 10 జిల్లాల్లో విస్తరించిన పశ్చిమ కనుమలతోపాటు అన్ని కొండ ప్రదేశాల్లో అక్రమంగా వెలసిన రిసార్ట్, హోం స్టేలను తొలగిస్తామన్నారు. ప్రధాన అటవీ సంరక్షణాధికారి నేతృత్వంలో ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైందన్నారు. 2015 తర్వాత చోటు చేసుకున్న ఆక్రమణలకు సంబంధించి 64ఎ ప్రక్రియ పూర్తయిన అన్ని కేసుల్లో ఆక్రమణల తొలగింపు సోమవారం నుంచి ప్రారంభం కానుందన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని 64ఏ కేసులను పరిష్కరించేందుకు ఏసీఎఫ్ ఉన్నత శ్రేణి అధికారులను ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు.

నగరంలో ఆవుల గోల



రోడ్డు మధ్యలో పడకేసిన ఆవులు

తుమకూరు: తుమకూరు నగరంలో వీధి ఆవుల బెడద అధికమైంది. ఆవులు గుంపులుగా తిరుగుతూ తమకు ఇష్టం వచ్చిన చోట పడకేస్తున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యజమానులు పాలు పితికిన అనంతరం ఆవులను వీధుల్లోకి వదులుతున్నారు. ఇలా యథేచ్ఛగా వదలకుండా యజమానులకు సూచించాలని అధికారులకు సూచిస్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాజ్‌కుమార్ అభిమానికి బెదిరింపు

దొడ్డబళ్లాపురం: దర్శన్ జైలుపాలైనా అభిమానులు మాత్రం మారడం లేదు. మొన్నటి వరకూ నటుడు ప్రథమ్‌ను వేధించిన అభిమానులు ఇప్పుడు యోగి అనే రాజ్‌కుమార్ అభిమానిని బెదిరించారు. అంతుచూస్తామని సోషల్ మీడియా వేదికగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. డీ బాస్ అభిమానుల చేతికి దొరికితే ఏమవుతుందో తెలుసా అంటూ హెచ్చరిస్తున్నారు. దీంతో బాధితుడు యోగి ముందు జాగ్రత్తగా బెంగళూరు వెస్ట్ జోన్ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కన్నడ సాహిత్యంపై మక్కువ చూపాలి



రచయితలకు అప్ప అవార్డులు అందజేసి సత్కరించిన దృశ్యం

తుమకూరు : యువత సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలని నాడోజా డాక్టర్ బరగూరు రామచంద్రప్ప అన్నారు. బహుముఖి యువకుల సంఘం, సుద్ది సంగాతి, అపూర్వ ప్రకాశన ఆధ్వర్యంలో తుమకూరు నగరంలోని కన్నడ భవనంలో ఆదివారం చేసిన అప్ప అవార్డుల ప్రదానం, రాష్ట్రస్థాయి కవిగోష్ఠిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సాహిత్య వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కవులను ప్రోత్సహించాలన్నారు. కన్నడ సాహిత్యంపై దృష్టి పెట్టాలన్నారు. నెళదాయ పరిమళ పుస్తక రచయిత స్మిత అమృతరాజ్, దీడెకెరె జమీను పుస్తకం రాసిన మల్లికార్జున శెల్లికెరె, కన్నడ నాటకాల పుస్తకం రాసిన రచయిత డాక్టర్ టి.వెంకటేశ మూర్తి, ట్రంకు తట్టి పుస్తకం రాసిన గురు ప్రసాద్‌కంటీలగెరెలకు అప్ప అవార్డులను ప్రదానం చేసి సత్కరించారు.

భార్యపై ఎస్ఐ దాడి



భార్యతో ఎస్ఐ ఉద్దప్ప

యశవంతపుర: ప్రజలకు రక్షణ కల్పించే బాధ్యతాయుతమైన విధుల్లో ఉన్న ఎస్ఐ ఏకంగా తన భార్యపై దాడికి పాల్పడ్డాడు. ఈఘటన బెళగావిలో జరిగింది. ఉద్దప్ప కట్టికార ఎస్ఐగా పనిచేస్తున్నాడు. ఈయన గతంలో ఉత్తరకన్నడ జిల్లా అంకోలాలో పని చేస్తుండగా భార్య ప్రతిమపై దాడి చేశాడు. ఘటనపై అంకోలా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టు సూచనల మేరకు ప్రతిమ బెళగావి పట్టణంలోని రామమూర్తి నగరలో నివాసం ఉంటోంది. పిల్లల ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డు ఇవ్వాలని ప్రతిమ కోరగా ఎస్ఐ దాడి చేశాడు. గొంతు, కన్ను వద్ద బలమైన గాయాలైనట్లు బాధితురాలు బెళగావి బీమ్స్ ఆస్పత్రిలో చేరింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో బెళగావి నగర మాళమారుతీ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా స్నేహితుల దినం

మండ్య : మండ్య నగరం కెంపెగౌడ లేఔట్ స్మితా బాలు నివాసంలో ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రచయిత్రి భవాని లోకేష్, జీవితా ఎస్. పుష్పా గర్జి, మానస, లతా అనంత్, శృతి, దివ్య, ప్రభ, విద్య పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో రైతు మృతి



నాగరాజ తిమ్మప్పగౌడ(ఫైల్)

యశవంతపుర: ట్రాక్టర్ ప్రమాదంలో రైతు మృతి చెందిన ఘటన ఉత్తర కన్నడ జిల్లా అంకోలా తాలూకా మోరళ్లి వద్ద ఆదివారం జరిగింది. మోగటా గ్రామ పంచాయతీ వ్యాప్తిలోని మోరళ్లి గ్రామానికి చెందిన నాగరాజ తిమ్మప్పగౌడ(37) ఆదివారం ఉదయం రైతు సురేష్ నాయక్‌కు చెందిన పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్నాడు. ఆ సమయంలో భారీ వర్షం కురిసింది. దీంతో టిల్లర్‌ను తీసుకొని ఇంటికి వెళ్లాడు. వర్షం తగ్గిన తర్వాత మళ్లీ పొలానికి వెళ్లి దుక్కి దున్నుతుండగా టిల్లర్‌లో కారు ఇరుక్కుపోయి రక్తస్రావమై మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆకట్టుకున్న యక్షగానం



తుమకూరు : తుమకూరు నగరంలోని కన్నడ భవనంలో గాండీవ యక్షగానం నాటకం ప్రజలను కనువిందు చేసింది. ప్రసిద్ధి చెందిన కళాకరుడు బేగార్ శివకుమార్ అభినయం ఆకట్టుకుంది. సైందవ, ద్రోణ పాత్రలను కళాకారులు రక్తికట్టించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

యశవంతపుర: బెళగావి నగర సమీపంలోని మార్కండేయ నదిలో గల్లంతైన యువకుడు శవమై తేలాడు. అలతగా గ్రామానికి చెందిన ఓంకార పాటిల్(23) తన స్నేహితుడు జ్యోతినాథ పాటిల్‌తో కలిసి బైక్‌పై కంగ్రాళికి వెళ్తుండగా అదుపుతప్పి మార్కండేయ నదిలో పడిపోయారు. జ్యోతినాథ ప్రాణాలతో బయట పడగా ఓంకార పాటిల్ నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. ఆదివారం పోలీసులు గాలిస్తుండగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.



అలరించిన నృత్యోత్సవం

బొమ్మనహళ్లి : బెంగళూరు నగరంలోని రవీంద్ర కళామందిరంలో కన్నడ సంస్కృతి శాఖ ఏర్పాటు చేసిన నాట్యాంజలి 21వ నాట్యోత్సవం కళా అభిమానులను అలరించింది. అగ్రపూజలు అందుకునే వినాయకుడి స్తుతితో ప్రారంభమైన నృత్యోత్సవం శివుడి పాత్రధారి స్వామి అభినయంతో ముగిసింది. సుమారు 300 మంది నాట్యకారులు తమ ప్రతిభను చాటారు. అంతకుముందు నృత్య కళామందిరం అధ్యక్షురాలు స్మితాశ్రీపతి మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ నాట్యన్ని, కళాకారులను ఆదరించాలన్నారు.



హత్యకు దారి తీసిన భూ వివాదం





హతుడు బాబురెడ్డి, నిందితులు గోపాల్‌రెడ్డి, భరత్‌ను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులు

కృష్ణరాజపురం: భూ వివాదం ఒకరి హత్యకు దారి తీసింది. స్వయానా బంధువులే ఒక వ్యక్తిని కడతేర్చారు. ఈఘటన బెంగళూరు నగరం కృష్ణరాజపురంలోని రామ్మూర్తినగర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... బాబురెడ్డికి, బంధువులకు మధ్య భూ వివాదం ఉంది. ఈ విషయం కోర్టులో ఉంది. ఈక్రమంలో ఆదివారం రాజీ ప్రయత్నాలు జరిగాయి. ఓ దశలో బాబురెడ్డిపై అతని చెల్లెలి భర్త గోపాల్ రెడ్డి, అన్న కుమారుడు భరత్ కత్తితో దాడి చేశారు. ఘటనలో బాబరెడ్డి తీవ్ర రక్తస్రావమై మృతి చెందాడు. రామ్మూర్తి నగర పోలీసలు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి భరత్, గోపాల్‌రెడ్డిని అరెస్ట్ చేశారు.

హోసూరు వార్తలు..

కూతురి కిడ్నాప్, ప్రశ్నిస్తే హత్య



హత్యకు గురైన మునిరాజ్ (ఫైల్)

కెలమంగలం: కెలమంగలం సమీపంలో వ్యక్తి దారుణహత్యకు గురైయ్యాడు. వివరాల మేరకు డెంకణీకోట తాలూకా జే. కారుపల్లి పంచాయతీ కామనపాళ్యం గ్రామానికి చెందిన నారాయణప్ప కొడుకు మునిరాజ్ (45), జే.కారుపల్లి కూడలి రోడ్డులోని ఓ మామిడి తోటలో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. ఇతని కూతురుని జే. కారుపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రేమిస్తూ వచ్చాడు. కూతురిని కిడ్నాప్ చేసినట్లు తెలుసుకొన్న మునిరాజ్ నిందితులను నిలదీసేందుకెళ్లాడు. ఈ సమయంలో దుండగులు ఇనుపరాడుతో దాడి చేయడంతో మునిరాజ్ గాయాలతో ఘటనా స్థలంలోనే చనిపోయాడు. కెలమంగలం పోలీసులు చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

ఏదీ శాంతి భద్రతలు?

కాగా, ప్రేమ పేరుతో చుట్టుపక్కల ప్రాంతాలలో పోకిరీల ఆగడాలు పెరిగిపోయినట్లు ప్రజలు ఆరోపించారు. కూతురిని కిడ్నాప్ చేయడమే కాకుండా ప్రశ్నించిన ఆమె తండ్రిని దుండగులు హత్య చేయడం దారుణమని, హంతకులను కఠినంగా శిక్షించి శాంతి భద్రతలను కాపాడాలని డిమాండ్ చేశారు.

తిరుమలకు పాదయాత్ర

కెలమంగలం: డెంకణీకోట వేంకటేశ్వరస్వామి పాదయాత్ర కమిటీ ద్వారా 200 మందికి పైగా తిరుమల తిరుపతికి శనివారం పాదయాత్రను ప్రారంభించారు. గత 12 ఏళ్లుగా శ్రావణ మాసంలో మొదటి శనివారం ఆలయానికి చేరుకొని స్వామివారి దర్శనం చేసుకోవడం కొందరు భక్తులకు ఆనవాయితీగా ఉంది. శనివారం డెంకణీకోటలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. 10వ తేదీ తిరుమలకు చేరుకొని స్వామివారిని దర్శించుకుంటామని తెలిపారు.

మఠాధిపతికి పదవీ గండం

యశవంతపుర: చిత్రదుర్గ జిల్లా సిరిగెరెలోని తరళబాళు గురుపీఠం డాక్టర్ శివమూర్తి శివచార్య స్వామికి పదవీ గండం ఏర్పడింది. ఆయన్ను పీఠాధిపతి స్థానం నుంచి దించాలని ఎమ్మెల్యే శామనూరు శివశంకరప్ప నేతృత్వంలో ఆదివారం దావణగెర సమీపంలోని ఒక హోటల్‌లో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

దంపతులను ఢీకొన్న లారీ.. భర్త మృతి

బనశంకరి: లారీ దూసుకొచ్చి భార్య కళ్లెదుటే భర్త మృతి చెందిన ఘటన హెబ్బగోడి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఇద్దరు దంపతులు తమ కుమారుడితో కలిసి ఆదివారం ఉదయం బైక్‌లో వెళ్తుండగా హెబ్బగోడి వద్ద వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు రెండు కాళ్లు తెగిపోయాయి. కుమారుడు ప్రాణాలతో బయట పడ్డాడు. ఘటన స్థలంలో బాధితురాలి ఆర్తనాదంతో మిన్నంటింది. స్థానికులు స్పందించి ఆమెను ఆస్పత్రికి తరలించారు. హెబ్బగోడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటి ఏనుగు సంచారం



కురుబరపల్లి ప్రాంతంలో సంచరిస్తున్న ఒంటి ఏనుగు

క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలోని చిన్నారు, కురుబరపల్లి ప్రాంతంలో ఒంటి ఏనుగు సంచరిస్తూ స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని, అటవీశాఖాధికార్లు ఆ ఏనుగును బంధించాలని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. బెంగళూరు బన్నేరుఘట్ట అటవీ ప్రాంతం నుంచి వలస వచ్చిన ఏనుగుల మందలో కొన్ని జవళగిరి, డెంకణీకోట, శ్యానమావు అటవీ ప్రాంతాల్లో మకాం వేశాయి. సూళగిరి సమీపంలోని చిన్నారు ప్రాంతంలో ఒంటి ఏనుగు తిరుగుతోంది. అది ప్రాణహాని కలిగించకముందే కట్టడి చేయాలని ప్రజలు కోరారు. ఈ ఏనుగు ప్రధానంగా హోసూరు– క్రిష్ణగిరి హైవేలో సంచరించడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు.

ఇద్దరు భార్యల పోరు పడలేక..

హోసూరు: ఇద్దరు భార్యల హింస భరించలేక కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన హడ్కోలో జరిగింది. వివరాల మేరకు పట్టణంలోని పాత వసంత్‌నగర్ ప్రాంతానికి చెందిన సందీప్ (39), ఇతనికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య చెన్నైలో ఉంటుంది. రెండవ భార్యతో కలిసి హోసూరులో నివాసముంటున్నాడు. భార్యలతో తరచూ గొడవలు జరిగేవి, దీంతో శనివారం రాత్రి విరక్తి చెందిన సందీప్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు.

మరో యువకుడు ఆత్మహత్య ..

తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. హోసూరు రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన కాంతరాజ్ కొడుకు జగదీష్ (22), పూల దుకాణంలో కూలీగా పనిచేసేవాడు. రోజూ రాత్రి 11 గంటలకు పైగా ఇంటికి రావడంతో తల్లిదండ్రులు ఎందుకు ఆలస్యంగా వస్తున్నావని నిలదీశారు. ఆవేదనకు గురైన జగదీష్ ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. రెండు ఘటనలపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

రైల్వే రోడ్డు పనులు పూర్తి చేయాలి: ఎంపీ

హోసూరు: హోసూరులో రైల్వే రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారని క్రిష్ణగిరి ఎంపి కే.గోపినాథ్ ఆరోపించారు. హోసూరు – డెంకణీకోట మార్గంలో రైల్వే వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ హోసూరులో జరుగుతున్న రైల్వే రోడ్డు విస్తరణ పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. కానీ ఏడాది గడిచినా రైల్వే రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. వాహనదారులు సుమారు 10 కిలోమీటర్ల దూరం చుట్టి వెళ్లవలసి వస్తుంది. వర్షాకాలంలో వరద నీరు సొరంగ మార్గాల్లో నిలిచి వాహనదారులు మరింత ఇబ్బందులకు గురైతున్నారు. 90 శాతం పనులు పూర్తి చేశారని, మిగిలిన 10 శాతం పనులను వెంటనే పూర్తి చేసి హోసూరు– డెంకణీకోట మార్గాన్ని ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు కుప్పుస్వామి, నీలకంఠన్, చిన్నగుట్టప్ప, సాధిక్‌ఖాన్ ఉన్నారు.

బైక్ ప్రమాదంలో ఐటీ ఉద్యోగి మృతి

హోసూరు: నిలిపి ఉన్న మినీ బస్సును ఢీకొని ఐటీ ఉద్యోగి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల మేరకు నాగై జిల్లాకు చెందిన సతీష్‌కుమార్ (39), భార్య వినోదిని(33)తో కలిసి హోసూరు అలసనత్తంలో నివాసముంటూ బెంగళూరులోని ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో హోసూరు బస్టాండు వైపు వెళుతుండగా అమ్మా హోటల్ వద్ద నిలిపి ఉన్న మినీబస్సును ఢీకొన్నాడు. తీవ్ర గాయాలేర్పడిన సతీష్‌కుమార్‌ని స్థానికులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో చనిపోయాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఒళ్లు గగుర్పొడిచేలా మొక్కులు



భక్తుల విన్యాసాలు

కెలమంగలం: కెలమంగలం పట్టణంలో ప్రసిద్ధ పటాలమ్మ ఆలయంలో ఆదివారం ఆషాడ అమావాస్య విశేష పూజలను నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు శరీరానికి శూలాలు గుచ్చుకొని, క్రేన్లకు వేలాడుతూ పురవీధుల్లో ఊరేగింపుగా సాగారు. మహిళా భక్తులు పాలకుండలు, అగ్నికుండలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు.

మరో సర్కారీ హత్య

పోలీసుల కళ్లెదుటే కత్తులు దూసిన టీడీపీ నేతలు

- శ్రీశైలం నియోజకవర్గం సీతారామాపురంలో అతి కిరాతకంగా వైఎస్సార్‌సీపీ నేత హతం
- ఎస్‌ఐ, కానిస్టేబుళ్ల కళ్లెదుటే సుబ్బరాయుడిని ఇంట్లో నుంచి బయటికి లాగి చంపిన వైనం



సుబ్బరాయుడు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న శిల్పా చక్రపాణి రెడ్డి, కాటసాని రామిరెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, విరూపాక్షి, ఇసాక్ బాషా, కాటసాని రాంభూపాల్ రెడ్డి, శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

సాక్షి ప్రతినిధి కర్నూలు: నంద్యాల జిల్లా మహానంది మండలం సీతారామాపురంలో శనివారం అర్ధరాత్రి 12.20 గంటలకు టీడీపీ నేతలు పోలీసుల సమక్షంలో వైఎస్సార్‌సీపీ నేత పసుపులేటి సుబ్బరాయుడు అలియాస్ పెద్దన్న(65) ఇంట్లోకి వెళ్లి బయటకు లాగి.. కత్తులు, రాడ్లు, రాళ్లతో దాడి చేసి కిరాతకంగా హత్య చేశారు. పోలీసులు గుడ్లప్పగించి చూస్తుండగా సుబ్బరాయుడు అతి దారుణంగా ప్రాణాలు కోల్పోయాడు. హత్య జరిగే ప్రమాదముందని మూడు గంటల ముందే పోలీసులకు సమాచారం ఇచ్చినా, కనీస చర్యలు తీసుకోకపోవడంతో ఈ దారుణం చోటుచేసుకుంది. హత్య జరిగిన తీరు, ఘటన పూర్వాపరాలు నిశితంగా పరిశీలిస్తే ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహం, పోలీసుల వైఫల్యమే ఇందుకు కారణమని స్పష్టమవుతోంది. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. సీతారామాపురంలో రాత్రి 9.45 గంటలకు టీడీపీ నేత శేఖర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నేత పెద్దిరెడ్డి ఇంటికి వెళ్లాడు. పెద్దిరెడ్డి ఇంట్లో లేకపోవడంతో మహిళలను ఇష్టానుసారం బూతులు తిట్టాడు. ఊళ్లో కేకలు వినపడటంతో వైఎస్సార్‌సీపీ నేత జయనారపురెడ్డి వెళ్లి మహిళలను దూషించడం సరికాదని చెప్పారు. దీంతో శేఖర్‌రెడ్డి వెనుదిరిగాడు. 'నారపురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయాళ్ల కథ తేల్చాల్సిందే..' అని ముఠాను పోగు చేశాడు. ఆ గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి నంద్యాలలో ఉంటే అతనికి సమాచారం ఇచ్చాడు. ఇదంతా గమనించిన జయనారపురెడ్డి.. ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్‌కు ఫోన్ చేసి పరిస్థితి వివరించాడు. ఫోన్ చేసిన 40 నిమిషాలకు ఎస్‌ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు, హోంగార్డుతో అక్కడికి వచ్చారు. టీడీపీ నేతలు గుంపులు గుంపులుగా వచ్చి శేఖర్‌రెడ్డి ఇంటి వద్ద పోగవుతుండటాన్ని చూస్తూనే ఉన్నారు. ఇంతలోనే శ్రీనివాసరెడ్డి మూడు కార్లతో తన ఇటుకల ఫ్యాక్టరీ, గోడౌన్ సమీపానికి చేరుకున్నారు.

జయనారపురెడ్డిని పథకం ప్రకారం పక్కకు పంపి..

ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్.. జయనారపురెడ్డిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. మహానంది పోలీసుస్టేషన్‌కు వెళ్లి, అక్కడ ఫొటో దిగి తన వాట్సాప్‌కు పంపాలని చెప్పారు. ఇక్కడ ఇంత జరుగుతుంటే తాను పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం ఏంటని.. పోలీసు బందోబస్తును పిలిపించండని నారపురెడ్డి కోరాడు. 'సీఐ, డీఎస్పీకి ఫోన్ చేసినా స్పందించడం లేదు.. నువ్వు స్టేషన్‌కు వెళ్లు.. నేను చూసుకుంటా' అని ఎస్‌ఐ చెప్పడంతో ఐదుగురితో కలిసి నారపురెడ్డి మహానంది స్టేషన్‌కు వెళ్లి ఫొటో దిగి ఎస్‌ఐకి పంపారు. నారపురెడ్డి ఊరు దాటగానే శ్రీనివాసరెడ్డి ముఠా ఒక్కసారిగా ఊళ్లోకి దూసుకొచ్చింది. శ్రీనివాసరెడ్డి, శేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పుల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డితో పాటు 30 మంది నేరుగా సుబ్బరాయుడి ఇంటిపై పడ్డారు. తొలుత



హత్యకు గురైన పసుపులేటి పెద్ద సుబ్బరాయుడు

సుబ్బరాయుడిని ఇంట్లోంచి బయటికి లాక్కొచ్చారు. అడ్డొచ్చిన భార్య సుబ్బమ్మపై రాడ్లతో దాడి చేసి గాయ పరిచారు. ఆమె చేయి, కాళ్లకు గాయాలయ్యాయి. పోలీసులు జోక్యం చేసుకోకూడదని బెదిరిస్తూ శ్రీనివాస రెడ్డి ముఠా విధ్వంసం సృష్టించింది. అప్పటికే ఊళ్లో వాళ్లంతా అక్కడికి చేరుకున్నారు. మరో వైపు పోలీసులు చూస్తూనే ఉన్నారు. అందరి కళ్లెదుటే సుబ్బరాయుడిని కత్తులతో పొడిచి.. రాడ్లు, రాళ్లతో కొట్టి అతి కిరాతకంగా చంపేశారు. అనంతరం శ్రీనివాసరెడ్డి ముఠా ఊరు దాటి వెళ్లిపోయింది.

హత్య విషయం ఎమ్మెల్యేకు ముందే తెలుసా?

ఎన్నికల ఫలితాల తర్వాత చెప్పినట్లు 'అందరి కథా తేలుస్తా.. చర్మం వలుస్తా.. ఎవ్వర్నీ వదిలేదే లేదు' అని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హెచ్చరించిన నేపథ్యంలో ఈ హత్య ఆయనకు తెలిసే జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్యను నివారించేందుకు సమయం ఉన్నా బందోబస్తు రాకపోవడం.. సీఐ, డీఎస్పీ మిన్నకుండిపోవడం, ఒక మనిషిపై హత్యకు తెగిస్తుంటే ఎస్‌ఐ ఫైరింగ్ ఓపెన్ చేయక పోవడం.. ఇవన్నీ చూస్తుంటే ఒక పథకం ప్రకారం వ్యవహరించి ఈ హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.




శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డితో ప్రధాన నిందితుడు బుడ్డారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

ముందుగానే ఎందుకు బందోబస్తు పంపలేదు?

రాత్రి 9.30 గంటలకు గొడవ జరిగింది. జయనారపురెడ్డి పోలీసులకు అప్పుడే ఫోన్ చేసి చెప్పాడు. 10.10 గంటలకు ఎస్‌ఐ వచ్చాడు. ఎస్‌ఐ ముందే హత్యకు ప్రణాళికలు జరుగుతున్నా, ఎందుకు అదనపు బందోబస్తును పిలిపించలేకపోయాడు? సీఐకి విషయం తెలుసు. ఆపై డీఎస్పీ నోటీసుకు వెళ్లింది. అయినా ఎందుకు బందోబస్తు పంపలేదు? మూడు గంటల పాటు రాని బందోబస్తు 12.30 గంటలకు సుబ్బరాయుడు హత్య జరిగాక.. అదీ శ్రీనివాసరెడ్డి ముఠా ఊరు దాటిన తర్వాత మాత్రమే ఎందుకొచ్చింది? సీతారామాపురం నుంచి డీఎస్పీ, ఎస్పీ ఆఫీసుకు 12 కిలోమీటర్లు. 10 నిమిషాల్లో రావచ్చు. ఎందుకు 3 గంటల తర్వాత బందోబస్తు ఊళ్లోకి వచ్చింది? ఈ ప్రశ్నలకు పోలీసులు, ప్రభుత్వ పెద్దలు సమాధానం చెప్పాలి.

హంతకులు పారిపోయాక స్పందిస్తారా?

ఊళ్లో ఏం జరుగుతుందో తెలీక జయనారపురెడ్డి మానంగా పోలీస్‌స్టేషన్‌లో కూర్చుని ఉన్నాడు. ఇంతలో సుబ్బరాయుడి కుమారుడు ప్రసాద్ ఫోన్ చేసి 'నాన్న ఇంగ లేడు. వాళ్లు సంపేసినారు' అని బోరున విలపించాడు. దీంతో అర్ధరాత్రి 12.59కి జయనారపురెడ్డి ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాకు ఫోన్ చేశాడు. 'సీతారామాపురంలో టీడీపీ వాళ్లు దాడులు చేస్తున్నారని, చంపడానికి వచ్చారని 9.30 నుంచి ఎస్‌ఐకి చెప్పాం. సీఐ, డీఎస్పీకి కూడా చెప్పాం. బందోబస్తు పంపాలని కోరాం. అయినా పంపలేదు. మనిషిని చంపేశారు' అని రోదించారు. జయనారపురెడ్డి అర్ధరాత్రి 1.02 గంటలకు మళ్లీ ఎస్పీకి ఫోన్ చేశాడు. శ్రీనివాసరెడ్డి కార్లు తమ ఇంటి ముందు నుంచి వెళుతున్నాయని, తన ఫోన్‌లోని సీసీ కెమెరాల ద్వారా చూస్తే తెలిసిందని వాళ్లు ఏ దారిలో వెళతారో కూడా చెప్పాడు. 1.08 గంటలకు మళ్లీ ఫోన్ చేసి, తాము ఎస్పీ ఆఫీసుకు వస్తున్నామని తెలిపారు. 3.18 గంటలకు మరోసారి ఫోన్ చేశాడు. హంతకుల ముఠాలోని 'రమణ' అనే వ్యక్తిని పట్టుకున్నామని, వాడిని అప్పగించడానికి ఎస్పీ ఆఫీసు వద్దకు వచ్చామని, బయటే ఉన్నామని చెప్పాడు. 3.20 గంటలకు ఎస్పీ తిరిగి జయనారపురెడ్డికి ఫోన్ చేశారు. 'రమణ'ను 3వ పట్టణ పోలీస్‌స్టేషన్లో అప్పగించాలని చెప్పారు. పోలీసులపై నమ్మకం లేదని మీకు అప్పగిస్తామని జయనారపురెడ్డి చెప్పారు. దీంతో కొందరు పోలీసులు వచ్చి రమణను ఎస్పీ ఆఫీసులోకి తీసుకెళ్లారు.



జయనారపురెడ్డి నంద్యాల ఎస్పీకి అర్ధరాత్రి ఐదుసార్లు ఫోన్ చేసిన కాల్ హిస్టరీ స్క్రీన్ షాట్

నెత్తి నోరు కొట్టుకుని చెప్పా.. పట్టించుకోలేదు



శనివారం రాత్రి 9.30 గంటలకు ఎస్‌ఐకి ఫోన్ చేశా.. ఎస్‌ఐ ముందే శేఖర్ రెడ్డి మందిని గుంపు చేసినాడు. రాడ్లు తీసుకుని తిరుగుతున్నారు. బందోబస్తును పిలిపించు సార్ అని నెత్తి నోరు కొట్టుకుని చెప్పా.. సీఐ, డీఎస్పీ కూడా పట్టించుకోలేదు. నన్ను స్టేషన్‌కు వెళ్లి ఫొటో దిగి పంపమన్నారు. అలా ఎందుకు చెప్పారో తెలీదు. నేను వెళ్లిన తర్వాత సుబ్బరాయుడిని చంపేశారని ఆయన కొడుకు ఫోన్ చేసి సెప్పి ఏడ్చాడు. పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే ఈ హత్య జరిగి ఉండేది కాదు.

– జయనారపురెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత

ఏపీలో ముఠాల పాలన

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వం స్థానంలో ముఠాల పాలన కనిపిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. రెండు నెలలుగా ఏపీ అంటేనే రాజకీయ హింసకు మారుపేరుగా మారిపోయిందని, పరిస్థితిలో ఏమాత్రం మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహంతో జరిగే ఘటనలు, అధికారంలో తమ పార్టీ ఉందనే ధీమాతో చేస్తున్న దాడులు, రాజకీయ ప్రేరేపిత దుశ్చర్యలు.. రాష్ట్రంలో ప్రతిరోజూ జరుగుతూనే ఉన్నాయి. నంద్యాల జిల్లాలో నిన్న రాత్రి జరిగిన హత్య, ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో జరిగిన దాడి ఘటనలు వీటికి నిదర్శనం. ప్రజలకిచ్చిన హామీలను చంద్రబాబు నిలబెట్టుకోలేకపోవడంతో, ఎవరూ ప్రశ్నించ కూడదని, రోడ్డుపైకి రాకూడదని ప్రజలను, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయడానికే ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. బాధితులకు అండగా ఉంటూ, పోరాటాన్ని కొనసాగిస్తాం' అని ఆదివారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విటర్)లో పోస్టు చేశారు.

సామాన్యులకు ఎంత రక్షణ ఉందో తెలుస్తోంది

సుబ్బరాయుడు హత్య అత్యంత దారుణం. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత జయనారపురెడ్డిని రెండుసార్లు చంపేందుకు యత్నించారు. రాష్ట్రంలో 36 హత్యలు జరిగాయని ఢిల్లీలో మాజీ సీఎం జగన్ ధర్నాచేస్తే ఎక్కడ జరిగాయని అడుగుతున్న టీడీపీ నేతలు సీతారామపురం ఘటనపై ఏం సమాధానం చెప్తారు? పోలీసులు, టీడీపీ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తాం. అర్ధరాత్రి శ్రీనివాసరెడ్డి 30 మంది అనుచరులతో మహిళలు, వృద్ధులపై దాడిచేయడం హేయమైన చర్య. గ్రామంలో మరికొందరికి ప్రాణహాని ఉంది. పోలీసులు స్పందించాలి.

– శిల్పా చక్రపాణిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, శ్రీశైలం

చేత కాదని చెప్పండి, మా రక్షణ మేం చూసుకుంటాం..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచకాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. మళ్లీ ఫ్యాక్షన్ విష సంస్కృతిని టీడీపీ నేతలు ప్రోత్సహిస్తున్నారు. దౌర్జన్యాలతో ఏమీ సాధించలేరు. ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. పోలీసులు చేతకాదని చెప్పండి, మా నేతలు, కార్యకర్తలను మేమే రక్షించుకుంటాం.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నంద్యాల

సామాన్యులకు రక్షణ ఎక్కడ?

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్యులకు రక్షణ కరువైంది. అధికారంలోకి వచ్చింది పరిపాలన కోసమా, రాజకీయ హత్యల కోసమా? వరుస హత్యలపై జగన్ ధర్నాచేస్తే అంతా బూటకమన్న హోం మంత్రి వనిత ఇప్పుడే సమాధానం చెప్తారు? ఎస్‌ఐ మీదనే పెట్రోల్ పోసి తగలబెడతామంటూ బెదిరిస్తుంటే మీరేమి చేస్తారు? డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సమాధానం చెప్పాలి. జగన్ హత్యా రాజకీయాలకు ఫుల్‌స్టాప్ పెడితే మీరు మళ్లీ ప్రోత్సహిస్తున్నారు.

– విరూపాక్షి, ఎమ్మెల్యే, ఆలూరు

సంపద సృష్టి అంటే చంపడమా!?

రాష్ట్రంలో సంపద సృష్టించడమంటే వైఎస్సార్‌సీపీ నేతలను చంపడమా? మహిళలు, వృద్ధులపై కత్తులు, కర్రలతో దాడులు చేయడం సిగ్గుచేటు. కాపు కులానికి చెందిన సుబ్బరాయుడును కిరాతకంగా చంపడం దారుణం. ఎస్పీకి కాల్‌చేసి చెప్పినా స్పందించలేదు. గ్రామంలోని వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలు జయనారపురెడ్డి, జమాల్‌రెడ్డి, పెద్దిరెడ్డి, మరికొంతమందికి రక్షణ కల్పించాలి. వారికేమైనా జరిగితే పోలీసులు, ప్రభుత్వానిదే బాధ్యత.

– కాటసాని రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

రాష్ట్రంలో హింసాకాండ ఆగడంలేదు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. పోలీసుల కళ్లెదుటే వైఎస్సార్‌సీపీ వారిని వెంటాడి చంపడం బాధాకరం. హత్యలు చేయడమే అభివృద్ధా. రాయలసీమలో ఫ్యాక్షనిస్టులు మహిళల జోలికి వెళ్లరని అంటారు. కానీ, ఇక్కడ మహిళలపైనా దాడిచేయడం సిగ్గుచేటు. అధికారంలోకి వచ్చే ముందు ఏం చెప్పారు, ఇప్పుడేం చేస్తున్నారన్నది రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఓపికతో ఉన్నారు. సహనం నశిస్తే ఎలా ఉంటుందో పోలీసులు ఆలోచించాలి.

– శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

భయపెడితే వెనక్కి తగ్గం..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుచేస్తే వెనక్కి తగ్గం. కలిసికట్టుగా పోరాడి సీతారామపురంలోని నాయకులు, కార్యకర్తలకు కాపాడుకుంటాం. రాష్ట్రాన్ని ఏం చేయాలనుకుంటున్నారు? మహిళలని కూడా చూడకుండా దాడులు చేయడం హేయం.

– ఇసాక్‌బాషా, ఎమ్మెల్సీ, నంద్యాల

హత్యా రాజకీయాలు ఆపాలి

రాష్ట్రంలో హత్యా రాజకీయాలు ఆపాలి. ప్రశాంతంగా ఉన్న సీతారామపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుబ్బరాయుడును చంపడం సిగ్గుచేటు. రాష్ట్రంలో పాలన ఏ విధంగా ఉందో ప్రజలకు అర్థమవుతోంది. వైఎస్సార్‌సీపీకి ఓటేస్తే చంపేస్తారా? బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది.

– ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

మీపైనా పెట్రోల్ పోసి తగలబెడతాం

సీతారామపురంలో పోలీసులకు పచ్చమూకల హెచ్చరిక.. 'రెడ్‌బుక్' పాలనకు ఇదే నిదర్శనం

- మహిళలని కూడా చూడకుండా చేయి చేసుకున్న గూండాలు
- పెరాలసిస్‌తో బాధ పడుతున్న వ్యక్తినీ లాక్కొచ్చి ఇంటి బయట పడేసిన ముఠా
- కత్తులు, కర్రలు, రాడ్లు, రాళ్లతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన వైనం
- సుబ్బరాయుడి ఇంటి వద్దకు చేరుకుని ఆరుపులు, కేకలు, దాడి
- చనిపోయాడనుకుని వెనుదిరుగుతూ పరీక్షించి చూసిన వైనం
- 'వీడింకా బతికే ఉన్నాడు' అంటూ మళ్లీ బండరాయితో తలపై మోది హత్య

సాక్షి, నంద్యాల: అధికారం అండ చూసుకుని తెలుగుదేశం పార్టీ నేతలు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా విచక్షణ రహితంగా హత్యకు తెగించారు. ఇష్టానుసారం దాడులకు పాల్పడ్డారు. కొడవళ్లు, కర్రలు, రాళ్లతో విధ్వంసం సృష్టించారు. 'అడ్డు వస్తే మిమ్మల్ని కూడా పెట్రోల్ పోసి తగలబెడతాం..' అంటూ పోలీసులను సైతం బెదిరించారు. సీతారామాపురం గ్రామంలో టీడీపీ ముఖ్యనేత బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి సుమారు 30 మంది అనుచరులతో శనివారం రాత్రి విధ్వంసం సృష్టించిన తీరు నివ్వెర పరుస్తోంది. 'రెడ్డిబుక్' పాలనకు నిదర్శనంగా నిలుస్తోంది. శనివారం రాత్రి 11.30 గంటలకు శ్రీనివాసరెడ్డి సమీప బంధువైన బుడ్డారెడ్డి గారి పెద్దిరెడ్డి ఇంట బీభత్సం సృష్టించారు. శేఖర్‌రెడ్డి ముందుండి దౌర్జన్యకాండను నడిపించాడు. పెద్దిరెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఆయన తల్లి లక్ష్మిదేవిని దుర్భాషలాడుతూ దాడి చేశారు. వాడు (పెద్దిరెడ్డి) ఎక్కడున్నాడో చెప్పండి లేదంటే మిమ్మల్ని కూడా చంపేస్తామని హెచ్చరించారు. ఇంట్లోనే ఉన్న ఆమె కుమార్తె పద్మజపైనా చేయి చేసుకున్నారు. వాడిని వదిలేసే ప్రసక్తే లేదని, కచ్చితంగా చంపేస్తామంటూ హెచ్చరికలు చేస్తూ పెద్దిరెడ్డి ఇంటి నుంచి బయటికి వచ్చారు. తర్వాత 12 గంటల ప్రాంతంలో పల్లపు శేఖర్ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో శేఖర్ ఇంట్లో లేడు. ఆయన తండ్రి పల్లపు సుబ్బరాయుడు పెరాలసిస్‌తో బాధ పడుతున్నాడు. మంచంలో ఉన్న అతన్ని ఇంట్లో నుంచి బయటికి లాక్కెళ్లి పడేశారు. ఇంటి ముందున్న బండిని ధ్వంసం చేశారు. ఆ తర్వాత 12.20 గంటలకు పసుపులేటి సుబ్బరాయుడు ఇంటికి శ్రీనివాస్‌రెడ్డి, మరో 30 మంది వెళ్లారు. ఆ సమయంలో ఆయన భార్య పసుపులేటి బాలసుబ్బమ్మ సోఫాలో పడుకుని ఉంది. ఆమెను బలవంతంగా బయటికి లాక్కొచ్చారు. భర్త ఎక్కడ ఉన్నాడో చెప్పాలని బెదిరిస్తూ దాడికి పాల్పడ్డారు. ఇంటి తలుపులు గట్టిగా తట్టడంతో ఇంట్లో నిద్రిస్తున్న సుబ్బరాయుడు తలుపులు తెరవగానే వెంట తెచ్చుకున్న కర్రలు, రాళ్లతో ఇష్టమొచ్చినట్లు కొట్టారు. రోడ్డు మీదకు లాక్కొచ్చి మరోసారి కొడవలి, కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేశారు. తలకు దెబ్బలు తగలడంతో తీవ్రంగా రక్తస్రావం కావడంతో స్పృహ తప్పిపడిపోయాడు. చనిపోయాడనుకుని వెళ్లిపోతూ.. మళ్లీ వెనక్కి వచ్చి పరీక్షించి చూశారు. 'వీడు చావలేదు' అంటూ పక్కనే ఉన్న బండరాయితో తల మీద గట్టిగా కొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తర్వాత ఇంట్లో నిద్రిస్తున్న రెండో కుమారుడు జమాలయ్య, మూడో కుమారుడు నాగప్రసాద్‌తో పాటు ఇంట్లో ఉన్న ఇద్దరు కోడళ్లను చంపేందుకు ప్రయత్నిస్తే వాళ్లు తప్పించుకుని పారిపోయారు. దీంతో ఎవరిని వదిలేసే ప్రసక్తే లేదని ఈ ఐదేళ్లలో అందరినీ అంతమొందిస్తామని హెచ్చరిస్తూ వెళ్లిపోయారు.



మృతుడు సుబ్బరాయుడు ఇంటి వద్ద రక్తపు ధార

పోలీసులకూ హెచ్చరిక

సుబ్బరాయుడిని హత్య చేసే సమయంలో మహానంది ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్‌తో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు అక్కడే ఉన్నారు. శ్రీనివాసరెడ్డి ముఠాకు వారు నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా.. 'మీరు ఇక్కడి నుంచి వెళ్లిపోండి.. లేదంటే మిమ్మల్ని కూడా పెట్రోల్ పోసి తగలబెడతాం' అని హెచ్చరించారు. వారిని పక్కకు తోసేసి ముందుకెళ్లారు. కాగా, దాడిలో గాయపడిన పసుపులేటి బాలసుబ్బమ్మను నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సుబ్బరాయుడి మృతదేహాన్ని ఆదివారం ఉదయం 7.30 గంటలకు పోస్టుమార్టం కోసం నంద్యాలకు తీసుకొచ్చారు. మృతుడి కుటుంబ సభ్యులతో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించి టీడీపీ నేత బుడ్డారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బుడ్డారెడ్డి ప్రభాకర్ రెడ్డి, వంగాల లక్ష్మిరెడ్డి, బుడ్డారెడ్డి శేఖర్‌రెడ్డి, వంగాల పుల్లారెడ్డి, కంటరెడ్డి భరత్‌రెడ్డి, తాలూరి శ్రీనివాస్, మరికొంత మందిపై హత్య, హత్యాయత్నం, ఆస్తి ధ్వంసం, పోలీసుల విధులకు ఆటంకం కల్పించడం తదితరాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీకి ఓటెయ్యలేదని చంపేశారు



నా భర్త సుబ్బరాయుడు ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి ఓటు వేశారు. తన మాట వినకుండా వైఎస్సార్సీపీకి ఓటు వేసినందుకు టీడీపీ నేత బుడ్డా శ్రీనివాసరెడ్డి మాపై కక్ష పెంచుకున్నాడు. శనివారం రాత్రి 30 మంది టీడీపీ గూండాలు మా ఇంటి వద్దకు వచ్చి బయట నిద్రిస్తున్న నన్ను లేపి నీభర్త ఎక్కడున్నాడు అని అడిగారు. లేదని చెప్పడంతో నాపై ఇనుప రాడ్డుతో దాడి చేశారు. చేతిని కత్తితో నరికారు. ఇంట్లోకి దూసుకెళ్లి నిద్రిస్తున్న నా భర్తను నడిరోడ్డుపై పడేసి ఇష్టం వచ్చినట్లు కర్రలతో, రాళ్లతో, కత్తులతో దాడి చేశారు. నా భర్త తలపై పెద్ద బండ రాయి వేసి అక్కడికక్కడే ప్రాణాలు తీశారు. వదిలేయాలని కాళ్లావేళ్లా పడినా వినిపించుకోలేదు.

– పసుపులేటి బాలసుబ్బమ్మ (మృతుడి భార్య)

ఊళ్లో భద్రత కరువైంది



వైఎస్సార్‌సీపీకి ఓటు వేసినందుకు మా ఇంటిపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. బయట నిద్రిస్తున్న మా తల్లి బాలసుబ్బమ్మపై దాడి చేసి గాయపరిచారు. ఇంట్లో నిద్రిస్తున్న మా నాన్నను దుర్భాషలాడుతూ బయటకు లాక్కెళ్లారు. రోడ్డుపై పడేసి కొడవళ్లు, రాళ్లు, రాడ్లతో దాడి చేశారు. పథకం ప్రకారం కొట్టి హతమార్చారు. 'మాకు వ్యతిరేకంగా చేస్తారా.. మీ అంతు చూస్తాం' అని బెదిరించారు. ఊళ్లో అందరికీ భద్రత కరువైంది.

– జమాలయ్య, మృతుడు సుబ్బరాయుడు కుమారుడు

భయపడొద్దు.. రక్షణ కల్పిస్తాం

డీఐజీ కోయ ప్రవీణ్ కుమార్

మహానంది: సీతారామాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పసుపులేటి పెద్ద సుబ్బరాయుడు హత్య ఘటనలో నిందితులను 24 గంటల్లోగా పట్టుకుంటామని డీఐజీ కోయ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన జిల్లా ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణాతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. 'ఊళ్లో ఉంటే మమ్మల్ని చంపేస్తానన్నాడని, ఎలా జీవిస్తారో చూస్తామంటూ బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి బెదిరించాడు' అని సుబ్బరాయుడు భార్య బాలసుబ్బమ్మ, ఇద్దరు కోడళ్లు డీఐజీకి వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. బెదిరింపులకు భయపడద్దని, అన్ని విధాలుగా రక్షణ కల్పిస్తామని డీఐజీ చెప్పారు. ప్రధాన నిందితుడు బుడ్డా రెడ్డి శ్రీనివాసరెడ్డి, అనుచరులపై కేసులు నమోదు చేశామన్నారు. కాగా, శనివారం రాత్రి శ్రీనివాసరెడ్డి ముఠా చేతిలో గాయపడ్డ బుడ్డా రెడ్డి లక్ష్మిదేవి అనే మహిళ ఇంటి వద్దకు కూడా డీఐజీ, ఎస్పీలు వెళ్లారు. ఆమెతో కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరూపాక్షి, మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డిలు హత్య ఉదంతంపై డీఐజీతో చర్చించారు.



మమ్మల్ని కాపాడాలని డీఐజీతో మొరపెట్టుకుంటున్న మృతుడు సుబ్బరాయుడు భార్య

30మందితో వచ్చి..



టీడీపీ నేత బుడ్డా శ్రీనివాసరెడ్డి, మరో 30 మంది టీడీపీ గూండాలు మా ఇంటి మీద పడి కర్రలు, రాళ్లు, కత్తులతో వీరంగం సృష్టించారు. మా నాయన్ను గ్రామంలో అందరూ చూస్తుండగానే నడి రోడ్డుపై బండరాళ్లతో మోది హత్య చేశారు. శ్రీనివాసరెడ్డి గతంలో గ్రామంలో ఫ్యాక్షన్ గొడవలకు తెరలేపి అమాయకుల ప్రాణాలు పొట్టన పెట్టుకున్నాడు. పేదల ఆస్తులు లాక్కుని పెత్తందారుగా ఎదిగాడు. గుడి నిర్మిస్తున్నానని చెప్పి ఎకరాకు రూ.6 వేలు రైతుల నుంచి బలవంతంగా వసూలు చేశాడు. కానీ గుడి నిర్మించలేదు. ప్రశ్నించిన వారి ఇళ్లపై ఇలా దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేయటం ఆయనకు అలవాటు.

– నాగప్రసాద్ (మృతుడి కుమారుడు)

రాజకీయ కక్షతోనే ఈ దారుణం

- తొలిసారి నిన్నటి ఎన్నికల్లో సీతారామాపురంలో వైఎస్సార్‌సీపీ తరపున ఏజెంట్లు
- హత్యకు గురైన సుబ్బరాయుడి కుమారుడు నాగ ప్రసాద్ ఏజెంటుగా కూర్చున్నాడని అక్కసు
- భూ కబ్జాలు, రైతుల ధాన్యం చోరీ, సెటిల్‌మెంట్లతో నిత్యం వివాదాలే
- ఇటీవలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని ఎస్సీ కాలనీకి నీళ్లు నిలిపేసిన వైనం

సాక్షి ప్రతినిధి కర్నూలు: మహానంది మండలం సీతారామాపురంలో హత్యకు గురైన సుబ్బరాయుడిది వివాద రహిత కుటుంబం. ఎవ్వరి జోలికి వెళ్లరు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే అభిమానం. సీతారామాపురంలో టీడీపీకి తప్ప మరో పార్టీ తరపున ఏజెంట్లు కూర్చోలేని పరిస్థితి. ఎన్నిక ఏదైనా టీడీపీ నేతలు రిగ్గింగ్, సైక్లింగ్ చేసుకునే వారు. టీడీపీ నేత బుడ్డారెడ్డి గారి శ్రీనివాసరెడ్డి గ్రామంలో ఏకఛత్రాధిపత్యం చెలాయించేవాడు. వేరే వర్గం అంటూ లేకుండా తన గూండాయిజంతో బెదిరింపులకు పాల్పడేవాడు. గతంలో గ్రామంలో ఓట్లు వేయాలంటేనే భయపడే పరిస్థితి. స్వతంత్రంగా ఓటేయాలంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సిన దుస్థితి. శ్రీనివాసరెడ్డి ఎవరికి చెబితే వాళ్లకే ఓటేయాలి. లేదంటే ఊరు వదిలేసి వెళ్లేలా బెదిరింపులకు పాల్పడేవాడు. గ్రామ పంచాయతీలో 210, 211 పోలింగ్ బూత్‌ల పరిధిలో 1,488 ఓట్లున్నాయి. వీటిలో 1,305 ఓట్లు పోలయ్యాయి. టీడీపీకి 733, వైఎస్సార్ సీపీకి 572 ఓట్లు వచ్చాయి. వీటిలో ఒక పోలింగ్ బూత్‌లో మృతుడు సుబ్బరాయుడు కుమారుల్లో ఒకరైన నాగప్రసాద్ ఏజెంట్‌గా కూర్చున్నాడు. దీంతో వైఎస్సార్‌సీపీకి అన్ని ఓట్లు రావడాన్ని జీర్ణించుకోలేని శ్రీనివాసరెడ్డి ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి గ్రామంలో బెదిరింపుల పర్వం ప్రారంభించాడు. తనకు వ్యతిరేకంగా ఉన్నా, వైఎస్సార్‌సీపీ కోసం పనిచేసినా చంపేస్తానని బెదిరించేవాడు. రెండు నెలల వ్యవధిలోనే మూడు సార్లు వైఎస్సార్ సీపీ నేత నారపురెడ్డిపై దాడికి పాల్పడ్డాడు. ఇతనిపై నంద్యాల, ఆళ్లగడ్డ, మహానంది మండలాల పరిధిలో 57 కేసులు నమోదయ్యాయంటే ఎంతటి కరుడుగట్టిన నేరస్తుడో అర్థమవుతోంది. ఇప్పటికీ కొన్ని కేసులపై కోర్టుకు హాజరవుతున్నాడు.



చంద్రబాబుతో హత్యకు పాల్పడిన ప్రధాన నిందితుడు, బుడ్డారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)



ఒలింపిక్ పతకం నెగ్గేంతవరకు నిష్క్రమించను: ఆర్చర్ దీపిక కుమారి

పారిస్ ఒలింపిక్స్‌లో త్రుటిలో పతకం చేజార్చుకున్న భారత స్టార్ ఆర్చర్ దీపిక కుమారి.. విశ్వక్రీడల్లో మెడల్ గెలిచేంత వరకు కెరీర్‌కు రిటైర్మెంట్‌ను ప్రకటించనని వెల్లడించింది. వరుసగా నాలుగోసారి ఒలింపిక్స్ బరిలోకి దిగిన దీపిక... మహిళల వ్యక్తిగత విభాగం క్వార్టర్ ఫైనల్లో ఓడి నిష్క్రమించింది. అంతర్జాతీయ టోర్నీల్లో లెక్కకు మిక్కిలి పతకాలు నెగ్గిన ప్రపంచ మాజీ నంబర్‌వన్ దీపికకు ఒలింపిక్ మెడల్ మాత్రం అందని ద్రాక్షలానే ఊరిస్తోంది. 'కెరీర్ కొనసాగిస్తా. ఒలింపిక్ పతకం గెలవాలని బలంగా కోరుకున్నా. అది సాధించేవరకు ఆట నుంచి విశ్రాంతి తీసుకోను, నిష్క్రమించను. మరింత కఠోర సాధన చేసి బలంగా తిరిగి పుంజుకుంటా. వేగంగా బాణాలు వేయడంపై దృష్టి పెడతా. ఈ వేదికపై పొరబాట్లకు తావివ్వకూడదు. వాటి నుంచి పాఠాలు నేర్చుకుంటా' అని దీపిక వెల్లడించింది. కీలక పోరులో 7 పాయింట్లు సాధించడం ఫలితంపై తీవ్ర ప్రభావం చూపిందని పేర్కొంది. అదొక్కటి మినహా పారిస్‌లో మంచి ప్రదర్శనే చేశానని దీపిక వివరించింది.

వాండెర్సే వలలో చిక్కిన భారత్

రెండో వన్డేలో 32పరుగులతో ఓడిన టీమిండియా

- 6 వికెట్లతో మెరిసిన శ్రీలంక స్పిన్నర్ వాండెర్సే
- రోహిత్ శర్మ మెరుపులు వృథా

కొలంబో: భారత్ ముందున్న లక్ష్యం 241. రోహిత్ శర్మ మెరుపులతో 13.2 ఓవర్లలోనే భారత్ (97/0) వందకు చేరువైంది. ఈ స్కోరు చూసిన వారెవరికైనా భారత్ గెలుపు సులువే అనిపిస్తుంది. కానీ 'హిట్‌మ్యాన్' అవుటవడంతోనే భారత్ మెడకు లంక స్పిన్ ఉచ్చు బిగించింది. అంతే 208 పరుగులకే భారత్ కుప్పకూలింది. దీంతో తొలి వన్డేను 'టై' చేసుకున్న ఆతిథ్య శ్రీలంక రెండో వన్డేలో 32 పరుగులతో విజయం సాధించింది. టి20ల్లో క్లీన్‌స్వీప్ అయిన లంక వన్డేల్లో 1–0తో ఇక సిరీస్ కోల్పోలేని స్థితిలో నిలిచింది. మొదట శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. అవిష్క ఫెర్నాండో (62 బంతుల్లో 40; 5 ఫోర్లు), కమిందు మెండిస్ (44 బంతుల్లో 40; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. వాషింగ్టన్ సుందర్ 3, కుల్దీప్ యాదవ్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం టీమిండియా 42.2 ఓవర్లలో 208 పరుగులకే ఆలౌటైంది. రోహిత్ శర్మ (44 బంతుల్లో 64; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (44 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లెగ్ స్పిన్నర్ జెఫ్రీ వాండెర్సే (6/33) ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అసలంక 3 వికెట్లు తీశాడు. సిరీస్‌లోని చివరిదైన మూడో వన్డే బుధవారం జరుగుతుంది.

తొలి బంతికే వికెట్...

ఫామ్‌లో ఉన్న ఓపెనర్ నిసాంక (0)ను ఇన్నింగ్స్ తొలి బంతికే భారత బౌలర్ సిరాజ్ పెవిలియన్ చేర్చాడు. మరో ఓపెనర్ అవిష్క ఫెర్నాండో, కుశాల్ మెండిస్ (42 బంతుల్లో 30; 3 ఫోర్లు) కుదురుగా ఇన్నింగ్స్‌ను నడిపించారు. అయితే సుందర్ తన వరుస ఓవర్లలో ఫెర్నాండో, కుశాల్‌లను అవుట్ చేయడంతో 74 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. దీంతోపాటు 79 పరుగుల వద్ద మూడు వికెట్లను కోల్పోయింది. తర్వాత కెప్టెన్ చరిత్ అసలంక (42 బంతుల్లో 25; 3 ఫోర్లు), సమరవిక్రమ (14) జట్టు స్కోరును వంద పరుగులు దాటించారు. అక్షర్ ఈ జోడీని ఎక్కువసేపు నిలువనీయలేదు. సమరవిక్రమను అవుట్ చేయడంతో 111 పరుగుల వద్ద నాలుగో వికెట్ పడింది. కొద్దిసేపటి తర్వాత జనిత్ లియనగే (12)ను కుల్దీప్, అసలంకను సుందర్ అవుట్ చేయడంతో లంక ఒక దశలో 136 పరుగులకే 6 వికెట్లను కోల్పోయింది. ఇలాంటి పరిస్థితిలో భారత బౌలర్లు పట్టుబిగించకుండా కమిందు మెండిస్ (44 బంతుల్లో 40; 4 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. దునిత్ వెలలగే (35 బంతుల్లో 39; 1 ఫోర్, 2 సిక్స్‌లు)తో కలిసి కమిందు ఏడో వికెట్‌కు చకచకా 72 పరుగులు జోడించడం లంకను నిలబెట్టింది. దునిత్ అవుటయ్యాక కూడా స్కోరులో వేగం తగ్గకుండా కమిందు, అకిల ధనంజయ (15; 2 ఫోర్లు) పరుగులు సాధించడంతో ఆఖరి 5 ఓవర్లలో శ్రీలంక 44 పరుగులు చేసింది. సిరాజ్, అక్షర్ పటేల్‌లకు చెరో వికెట్ దక్కింది.

రోహిత్ ఉన్నంత వరకే...

ఓపెనర్లు రోహిత్, శుబ్‌మన్ గిల్ (44 బంతుల్లో 35; 3 ఫోర్లు) తొలి వన్డే కంటే మరింత పటిష్టమైన పునాది వేశారు. నాలుగో ఓవర్ నుంచి కెప్టెన్ రోహిత్ దూకుడు పెంచాడు. వెలలగే వేసిన ఆ ఓవర్లో మూడు బౌండరీలు బాదాడు. అసిత ఏడో ఓవర్లో ఫోర్, సిక్సర్ కొట్టాడు. దీంతో జట్టు స్కోరు 50కి చేరింది. తర్వాత ధనంజయ, కమిందు మెండిస్ ఓవర్లలో భారీ సిక్సర్లతో రోహిత్ 29 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. 10 ఓవర్లలో భారత్ స్కోరు 76/0. వెలలగే వేసిన 13వ ఓవర్లో సిక్స్ కొట్టిన రోహిత్... తర్వాతి వాండెర్సే బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ ఆడి నిసాంక చేతికి చిక్కాడు. దీంతో 97 పరుగుల ఓపెనింగ్ వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కోహ్లి బౌండరీతో ఆ ఓవర్లోనే జట్టు స్కోరు వంద దాటింది. కానీ కాసేపటికే వాండెర్సే ఒకే ఓవర్లో గిల్, దూబే (0)లను అవుట్ చేశాడు. తన తదుపరి ఓవర్లలో కోహ్లి (14), శ్రేయస్ అయ్యర్ (7) వికెట్లు తీశాడు. దీంతో 133 పరుగులకే భారత్ సగం వికెట్లను కోల్పోయింది. అక్షర్ ధాటిగా ఆడుతుంటే... ఇంకోవైపు కేఎల్ రాహుల్ (0)ను వాండెర్సే డకౌట్ చేశాడు. అక్షర్, సుందర్ (15) కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నప్పటికీ జట్టును ఒడ్డున పడేయలేకపోయారు. వీళ్లిద్దరితో పాటు సిరాజ్‌ను అసలంక పెవిలియన్ చేర్చడంతో 201 పరుగుల వద్దే భారత్ 9వ వికెట్ కోల్పోయింది. అర్ష్‌దీప్ (3) రనౌట్ కావడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.



వాండెర్సే



రోహిత్

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) రాహుల్ (బి) సిరాజ్ 0; అవిష్క (సి అండ్ బి) సుందర్ 40; కుశాల్ మెండిస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సుందర్ 30; సమరవిక్రమ (సి) కోహ్లి (బి) అక్షర్ 14; అసలంక (సి) అక్షర్ (బి) సుందర్ 25; జనిత్ (సి అండ్ బి) కుల్దీప్ 12; వెలలగే (సి) దూబే (బి) కుల్దీప్ 39; కమిందు (రనౌట్) 40; ధనంజయ (రనౌట్) 15; వాండెర్సే (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు)** 240. **వికెట్ల పతనం:** 1–0, 2–74, 3–79, 4–111, 5–136, 6–136, 7–208, 8–239, 9–240. **బౌలింగ్:** సిరాజ్ 8–1–43–1, అర్ష్‌దీప్ 9–0–58–0, అక్షర్ 9–0–38–1, శివమ్ దూబే 2–0–10–0, సుందర్ 10–1–30–3, కుల్దీప్ 10–1–33–2, రోహిత్ 2–0–11–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) నిసాంక (బి) వాండెర్సే 64; గిల్ (సి) కమిందు (బి) వాండెర్సే 35; కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) వాండెర్సే 14; దూబే (ఎల్బీడబ్ల్యూ) (బి) వాండెర్సే 0; అక్షర్ (సి అండ్ బి) అసలంక 44; అయ్యర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వాండెర్సే 7; రాహుల్ (బి) వాండెర్సే 0; సుందర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అసలంక 15; కుల్దీప్ (నాటౌట్) 7; సిరాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అసలంక 4; అర్ష్‌దీప్ (రనౌట్) 3; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (42.2 ఓవర్లలో ఆలౌట్)** 208. **వికెట్ల పతనం:** 1–97, 2–116, 3–116, 4–123, 5–133, 6–147, 7–185, 8–190, 9–201, 10–208. **బౌలింగ్:** అసిత ఫెర్నాండో 7–0–31–0, వెలలగే 6–0–41–0, ధనంజయ 10–1–54–0, కమిందు మెండిస్ 3–0–19–0, వాండెర్సే 10–0–33–6, అసలంక 6.2–2–20–3.

పారుల్... రెండో 'సారీ'

3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లోనూ హీట్స్‌లోనే అవుట్

పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో మనవాళ్లు ఏమాత్రం ఆకట్టుకోలేకపోతున్నారు. ఇప్పటికే మహిళల 5000 మీటర్ల పరుగులో నిరాశ పరిచిన పారుల్ చౌధరీ 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లోనూ హీట్స్‌లోనే వెనుదిరిగింది. ఆదివారం జరిగిన పోటీల్లో పారుల్ 9 నిమిషాల 23.39 సెకన్లలో లక్ష్యాన్ని చేరి హీట్స్‌లో 9వ స్థానంలో నిలిచింది. ఒక్కో హీట్‌లో తొలి ఐదు స్థానాల్లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత సాధించారు. గమ్యాన్ని చేరేందుకు తన అత్యుత్తమ టైమింగ్ (9 నిమిషాల 15.31 సెకన్లు) కంటే ఎక్కువ సమయం తీసుకున్న పారుల్ ఓవరాల్‌గా 21వ స్థానంతో సరిపెట్టుకుంది. గత ఏడాది ఆసియా క్రీడల్లో పారుల్ 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో రజతం, 5000 మీటర్లలో స్వర్ణం సాధించింది. అయితే తొలిసారి ఒలింపిక్స్‌లో పాల్గొన్న పారుల్ నిరాశపరిచింది. ఇక పురుషుల లాంగ్‌జంప్‌లో జెస్విన్ ఆల్డ్రిన్ గ్రూప్ 'బి'లో 13వ స్థానంలో నిలిచాడు. 7.61 మీటర్ల దూరం లంఘించిన జెస్విన్ మొత్తంగా 26వ స్థానంతో 'పారిస్' క్రీడల నుంచి నిష్క్రమించాడు. ఈ విభాగంలో 8.15 మీటర్లు దాటిన అథ్లెట్లు ఫైనల్‌కు అర్హత సంపాదించారు.



పారుల్

పిస్టల్ 'మిస్' ఫైర్

ఫైనల్ చేరలేకపోయిన భారత షూటర్లు



విజయ్‌వీర్

పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో... మహిళల స్కీట్ ఈవెంట్‌లో భారత క్రీడాకారులకు నిరాశ ఎదురైంది. ఆదివారం క్వాలిఫికేషన్ రౌండ్ ఆరంభంలో ఆకట్టుకున్న భారత షూటర్లు విజయ్‌వీర్ సిద్ధూ, అనీశ్ భన్వాలా చివరి వరకు అదే జోరు కొనసాగించలేక.. ఫైనల్ చేరే అవకాశాన్ని కోల్పోయారు. విజయ్‌వీర్ 583 పాయింట్లతో తొమ్మిదో స్థానానికి పరిమితం కాగా... అనీశ్ 582 పాయింట్లతో 13వ స్థానంలో నిలిచాడు. ఒక దశలో రెండో స్థానానికి చేరి ఆశలు రేపిన విజయ్‌వీర్ ఆ తర్వాత గురి తప్పడంతో తుదిపోరుకు చేరకుండానే వెనుదిరిగాడు. తొలి ఆరు స్థానాల్లో నిలిచిన షూటర్లు ఫైనల్‌కు అర్హత సాధించారు. మహిళల స్కీట్ విభాగంలో మహేశ్వరి చౌహాన్ (118 పాయింట్లు) 14వ స్థానం, రైజా ధిల్లాన్ (113 పాయింట్లు) 23వ స్థానాలతో సరిపెట్టుకున్నారు. నేటితో ఒలింపిక్స్‌లో షూటింగ్ ఈవెంట్ ముగుస్తుంది. చివరిరోజు స్కీట్ మిక్స్‌డ్ విభాగంలో భారత్ నుంచి మహేశ్వరి చౌహాన్, అనంత్‌జీత్ సింగ్ నరూకా జోడీ పోటీపడనుంది. మొత్తం 15 జోడీలు క్వాలిఫయింగ్‌లో ఉన్నాయి. టాప్–4లో నిలిచిన జోడీలు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. టాప్–2లో నిలిచిన రెండు జంటలు స్వర్ణ–రజత పతకాల కోసం... మూడు–నాలుగు స్థానాల్లో నిలిచిన రెండు జోడీలు కాంస్య పతకం కోసం పోటీపడతాయి.

శుభాంకర్ 40వ స్థానంలో...

పారిస్ ఒలింపిక్స్ గోల్ఫ్ పురుషుల వ్యక్తిగత స్ట్రోక్ ప్లేలో భారత్‌కు నిరాశ తప్పలేదు. ఈ విభాగంలో పోటీపడిన శుభాంకర్ శర్మ 40వ స్థానంలో నిలవగా ... గగన్‌జీత్ సింగ్ భుల్లర్ 45వ ప్లేస్‌తో సరిపెట్టుకున్నాడు. శుభాంకర్ ఓవరాల్‌గా 283 పాయింట్లు సాధించగా.. గగన్‌జీత్ 285 పాయింట్లతో ఆకట్టుకోలేకపోయారు. సెయిలింగ్ డింగీ విభాగంలో 8 రేసులు ముగిసేసరికి పురుషుల విభాగంలో భారత సెయిలర్ విష్ణు శరవణన్ 18వ స్థానంలో.. మహిళల విభాగంలో నేత్ర కుమానన్ 25వ స్థానంలో నిలిచారు. నేడు మరో రెండు రేసులు జరగాల్సి ఉంది. మొత్తం పది రేసుల్లో టాప్–10లో నిలిచిన సెయిలర్లు పతక పోరుకు అర్హత సాధిస్తారు.

సినిమా

విశ్వంభర యాక్షన్



● చిరంజీవి
● అల్లు అర్జున్

చిరంజీవి హీరోగా నటిస్తున్న సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్ మూవీ 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. యాక్షన్ కొరియోగ్రాఫర్ అన్ల్ అరసు నేతృత్వంలో 'విశ్వంభర' క్లైమాక్స్ సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ''చిరంజీవి చరిష్మాటిక్ ప్రెజెన్స్‌తో 'విశ్వంభర' మునుపెన్నడూ లేని ఎక్స్‌పీరియన్స్‌ను ప్రేక్షకులకు అందించడానికి రెడీ అవుతోంది. 'విశ్వంభర' క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ విజువల్ వండర్‌లా ఉండబోతోంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 10న రిలీజ్ కానుంది.

చిరంజీవి కోటి విరాళం

కేరళలో కురుస్తున్న భారీ వర్షాలకు వయనాడ్‌లో భారీ ఎత్తున ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో దక్షిణాదికి చెందిన నటీనటులు తమవంతుగా ఆపన్న హస్తం అందిస్తున్నారు. తాజాగా హీరో చిరంజీవి, ఆయన తనయుడు రామ్‌చరణ్ కోటి రూపాయలు విరాళాన్ని కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి అందిస్తున్నట్లు ప్రకటించారు.

అల్లు అర్జున్ 25లక్షల విరాళం

వయనాడ్ వరద బాధితుల సహాయార్థం హీరో అల్లు అర్జున్ కూడా 25 లక్షలు విరాళం ప్రకటించారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కి ఆ మొత్తాన్ని అందించనున్నట్లు ఆయన తెలిపారు.



తంగలాన్ సర్‌ప్రైజ్ చేస్తుంది

- విక్రమ్

''తంగలాన్' తమిళ సినిమానో, తెలుగు సినిమానో కాదు. ఓ మంచి సినిమా. నా మనసుకు దగ్గరైన సినిమా. 'తంగలాన్' చూసి ఆడియన్స్ సర్‌ప్రైజ్ అవుతారు. ఈ సినిమాలో ఎమోషన్స్, అడ్వెంచర్స్, మెసేజ్.. ఇలా చాలా అంశాలు ఉన్నాయి'' అని విక్రమ్ అన్నారు. ఆయన హీరోగా నటించిన పీరియాడికల్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. పార్వతీ తిరువోతు, మాళవికా మోహనన్ హీరోయిన్స్. పా. రంజిత్ దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. తెలుగులో మైత్రీ మూవీ మేకర్స్ రిలీజ్ చేస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 'తంగలాన్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విక్రమ్ మాట్లాడుతూ–''వందేళ్ల క్రితం జరిగిన కథ 'తంగలాన్'. 'మద్రాస్' సినిమా నుంచి పా.రంజిత్‌తో వర్క్ చేయాలనుకుంటే 'తంగలాన్'తో కుదిరింది. నాకు మంచి రోల్ ఇచ్చిన రంజిత్‌కు థ్యాంక్స్. జ్ఞానవేల్ రాజా గారు బాగా సపోర్ట్ చేశారు. నేను గతంలో నటించిన పాత్రల్ని (శివపుత్రుడు, నాన్న, సేతు, అపరిచితుడు, ఐ..) ఈ వేదికపై చూడగానే భావోద్వేగంగా అనిపించింది. ఇలాంటి విభిన్నమైన పాత్రలు ఇంకా చేయాలనే స్ఫూర్తి కలిగింది'' అన్నారు. పా. రంజిత్ మాట్లాడుతూ–''తంగలాన్' రెగ్యులర్ మూవీ కాదు. దేశ స్వాతంత్య్రానికి పూర్వం ఉంటుంది. విక్రమ్‌గారు అద్భుతంగా నటించారు. ఆయన దొరకడం నా అదృష్టం. 'తంగలాన్' ప్రేక్షకులందరికీ నచ్చుతుంది'' అన్నారు. ''తెలుగు ప్రేక్షకులకు సినిమా అంటే ప్రాణం. 'తంగలాన్'ని సపోర్ట్ చేయండి. ఆగస్టు 15న విడుదలవుతున్న 'మిస్టర్ బచ్చన్', 'డబుల్ ఇస్మార్ట్', 'ఆయ్' వంటి సినిమాలూ విజయాలు సాధించాలి'' అన్నారు నిర్మాత జ్ఞానవేల్ రాజా. ''ఈ చిత్రంలో 'గంగమ్మ' పాత్రలో నటించాను. విక్రమ్‌లాంటి కో స్టార్‌ని నేను ఇప్పటి వరకూ చూడలేదు'' అన్నారు పార్వతి తిరువోతు. ''విక్రమ్‌గారితో స్క్రీన్ షేర్ చేసుకోవాలనుకున్న నా కల 'తంగలాన్'తో నిజమైంది'' అన్నారు మాళవికా మోహనన్. ''ఇదొక అద్భుతమైన మూవీ'' అన్నారు నటుడు డేనియల్. ఈ కార్యక్రమంలో హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్, స్టూడియోగ్రీన్ ఎగ్జిక్యూటివ్ సీఈవో ధనుంజయన్, నిర్మాతలు 'మధుర' శ్రీధర్, దామోదర ప్రసాద్, ప్రసన్నకుమార్, ఎస్‌కేఎన్, దర్శక–నిర్మాత సాయిరాజేష్, దర్శకుడు కరుణకుమార్, మైత్రీ మూవీస్ శశి మాట్లాడారు.



● జ్ఞానవేల్ రాజా, మాళవికా మోహనన్, విక్రమ్, పార్వతి, పా.రంజిత్

అంతకుమించి వేదా ఉంటుంది

- తమన్నా

''వేదా' మూవీ ట్రైలర్‌కి అద్భుతమైన స్పందన వస్తోంది. అయితే రెగ్యులర్ యాక్షన్ సినిమాల్లానే ఈ కాన్సెప్ట్ ఉందంటూ కొందరు కామెంట్లు చేస్తున్నారు. ట్రైలర్ చూసి ఇతర సినిమాలతో 'వేదా'ని పోల్చకండి. యాక్షన్ చిత్రాలకు మించి మా 'వేదా' ఉంటుంది'' అంటున్నారు హీరోయిన్ తమన్నా భాటియా. జాన్ అబ్రహాం హీరోగా నటించిన తాజా చిత్రం 'వేదా'. నిఖిల్ అద్వానీ దర్శకత్వం వహించిన ఈ మూవీలో తమన్నా భాటియా, శార్వరీ వాఘ్, అభిషేక్ బెనర్జీ నటించారు. 'సలామ్ ఏ ఇష్క్' (2007) వంటి హిట్ మూవీ తర్వాత జాన్ అబ్రహాం, నిఖిల్ అద్వానీ కాంబినేషన్‌లో ఈ చిత్రం రూపొందింది. జాన్ అబ్రహాం, మోనీషా అద్వానీ, మధు భోజ్వాని నిర్మించిన ఈ మూవీ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. కాగా ఇటీవల ముంబైలో 'వేదా' మూవీ ట్రైలర్ లాంచ్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న తమన్నా 'వేదా' మూవీపై స్పందించారు. ''మన దేశంలోని గొప్ప యాక్షన్ హీరోల్లో జాన్ అబ్రహాం ఒకరు. ఆయన 'వేదా' వంటి వైవిధ్యమైన కథతో ప్రేక్షకులను అలరించేందుకు వస్తున్నారు. అలాగే డైరెక్టర్ నిఖిల్ అద్వానీ ఏడేళ్ల తర్వాత మళ్లీ మెగాఫోన్ పట్టారు. ఈ సినిమా ప్రేక్షకులకు తప్పకుండా కొత్త అనుభూతిని పంచుతుంది. ఈ మూవీ రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా'' అన్నారు తమన్నా భాటియా.

చెలిమికి నిన్న మొన్న లేదుగా..!



● ప్రియదర్శితో బాల నటీనటులు

'ఓ'రోరి పిల్లగా... బుడి బుడి అడుగులు బడి చేరగా... రోజూ హడావిడి జోరుగా... చెలిమికి నిన్న మొన్న లేదుగా.. ఎప్పుడూ కొత్తగా... లేరోయ్ స్నేహంలోన టాపరు.. దోస్తే లేని వాడే లూజరు..'అంటూ సాగుతుంది 'సయ్యారే సయ్యారే..' సాంగ్. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ లీడ్ రోల్స్‌లో నటించిన '35 – చిన్న కథ కాదు' సినిమాలోనిది ఈ పాట. నంద కిషోర్ ఈమాని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో ఈ నెల 15న ఈ చిత్రం విడుదల కానుంది. కాగా ఈ మూవీ నుంచి ఫ్రెండ్‌షిప్ ఆంథమ్‌గా 'సయ్యారే..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. వివేక్ సాగర్ సంగీతం అందించిన ఈ పాటకి కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించగా కార్తీక్ పాడారు.

ఉత్తమ హీరో నాని.. ఉత్తమ చిత్రం బలగం

- ఘనంగా ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక



● వేణు యెల్దండి


హైదరాబాద్‌లో 69వ 'శోభ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ –2024' వేడుక ఘనంగా జరిగింది. శనివారం రాత్రి జరిగిన ఈ వేడుకకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ చిత్ర పరిశ్రమలకు చెందిన నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. టాలీవుడ్ నుంచి ఉత్తమ చిత్రంగా 'బలగం' ఎంపికైంది. అలాగే ఉత్తమ నటుడిగా నాని (దసరా), ఉత్తమ నటిగా కీర్తి సురేష్ (దసరా), ఉత్తమ దర్శకుడిగా వేణు యెల్దండి (బలగం), ఉత్తమ తొలి చిత్ర దర్శకులుగా శ్రీకాంత్ ఓదెల (దసరా), శౌర్యువ్ (హాయ్ నాన్న), ఉత్తమ సహాయ నటులుగా రవితేజ (వాల్తేరు వీరయ్య), బ్రహ్మానందం (రంగ మార్తాండ) నిలిచారు. వివిధ విభాగాల్లో 'దసరా' చిత్రానికి 6 అవార్డులు రాగా, 'బేబి' మూవీకి ఐదు అవార్డులు వచ్చాయి. అలాగే 'బలగం' సినిమా మూడు అవార్డులు సొంతం చేసుకుంది. వీటితో పాటు మరికొన్ని విభాగాల్లో పలువురు నటీనటులు, సాంకేతిక నిపుణులు 'శోభ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్' ని అందుకున్నారు.



● శ్రీకాంత్ ఓదెల, కీర్తి సురేశ్, నాని

సింబలో మంచి సందేశం ఉంది

- సంపత్ నంది



● అనసూయ, సంపత్ నంది, రాజేందర్ రెడ్డి, మురళీమనోహర్

''సింబ' మూవీ ప్రారంభం కావడానికి కారణం ఉదయభాను. గ్రీన్‌ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ఆమె నన్ను ఛాలెంజ్ చేసింది. ఆ తర్వాత కేసీఆర్, సంతోష్‌గార్లు తలపెట్టిన హరితహారం గురించి తెలుసుకున్నాను. ఆ సమయంలోనే నేను 'సింబ' కథ విన్నాను. నవ్విస్తూనే అందరికీ కనువిప్పు కలిగేలా మంచి సందేశం ఉన్న సినిమా ఇది'' అని డైరెక్టర్ సంపత్ నంది అన్నారు. అనసూయ, జగపతిబాబు లీడ్ రోల్స్‌లో మురళీ మనోహర్ దర్శకత్వం వహించిన చిత్రం 'సింబ'. సంపత్‌నంది టీమ్ వర్క్స్, రాజ్ దాసరి ప్రొడక్షన్స్‌పై సంపత్ నంది, రాజేందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అనసూయ మాట్లాడుతూ– ''ప్రేక్షకుల ప్రశంసలు, అభిమానం వల్లే నేను 'సింబ' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేయగలుగుతున్నాను'' అన్నారు. ''సంపత్‌గారి కథకు నేను దర్శకత్వం వహించాను. 'సింబ' ఓ కొత్త పాయింట్‌తో రాబోతోంది'' అన్నారు మురళీ మనోహర్. ''కోటికిపైగా మొక్కలు నాటిన వనజీవి రామయ్య వంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని ఈ సినిమా నిర్మించాం'' అన్నారు రాజేందర్ రెడ్డి. ఈ కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్, ఎమ్మెల్యేలు విజయ రమణారావు, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, నటీనటులు దివి, భానుచందర్ తదితరులు మాట్లాడారు.

నువ్వే నా పొట్టేల్!

'పతాహై మై కౌన్ హూ' అంటూ రామ్ చెప్పే డైలాగ్‌తో 'డబుల్ ఇస్మార్ట్' ట్రైలర్ మొదలవుతుంది. హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన తాజా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. 'ఇస్మార్ట్ శంకర్' (2019)కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందింది. కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటించిన ఈ మూవీలో సంజయ్ దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రలు చేశారు. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మించిన ఈ మూవీ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని ఆదివారం వైజాగ్‌లో నిర్వహించారు. 'ఉస్తాద్ ఇస్మార్ట్ శంకర్ అలియాస్ డబుల్ ఇస్మార్ట్', 'మీ వదినేమో కుతుబ్‌మినార్.. మనమేమో చార్‌మినార్.. రెండూ గుద్దుకుంటే ఎట్లుంటది రా', 'కర్మకాండ చేస్తా నా కొడకా', 'నువ్వే నా పొట్టేల్' అంటూ రామ్ చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ ట్రైలర్ లాంచ్ వేడుకలో రామ్ పోతినేని, కావ్యా థాపర్, అలీ, పూరి కనెక్ట్ సీఈఓ విష్ తదితరులు పాల్గొన్నారు.



● రామ్



లవ్లీనా పంచ్ సరిపోలేదు

విశ్వక్రీడల్లో భారత బాక్సర్లకు నిరాశ ఎదురైంది. ఆరుగురు బాక్సర్లతో పారిస్‌లో అడుగు పెట్టిన భారత బృందం.. రిక్త హస్తాలతో తిరిగి రానుంది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన లవ్లీనా బొర్గొహైన్ ఈసారి ఆకట్టుకోలేకపోయింది. ఆదివారం జరిగిన మహిళల 75 కేజీల క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ చాంపియన్ లవ్లీనా 1–4తో లీ కియాన్ (చైనా) చేతిలో పరాజయం పాలైంది. బౌట్ ప్రారంభం నుంచే చైనా బాక్సర్ లెఫ్ట్ హుక్స్‌తో విరుచుకుపడగా.. వాటిని తప్పించుకుంటూ లవ్లీనా కొన్ని మంచి పంచ్‌లు విసిరింది. అయినా తొలి రౌండ్ కియాన్‌కు అనుకూలంగా ఫలితం వచ్చింది. ఆ తర్వాత లవ్లీనా పుంజుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పంచ్‌ల ధాటి నుంచి నేర్పుగా తప్పించుకున్న కియాన్... కీలక సమయాల్లో జాబ్స్, హుక్స్‌తో పైచేయి సాధించింది. భారత్ నుంచి పారిస్ క్రీడలకు ఆరుగురు బాక్సర్లు అర్హత సాధించగా.. అందరూ క్వార్టర్ ఫైనల్లోపే పరాజయం పాలయ్యారు.



జొకోవిచ్ కల నెరవేరగా...

- ఒలింపిక్స్‌లో ఎట్టకేలకు స్వర్ణం సాధించిన సెర్బియా స్టార్
- ఫైనల్లో అల్‌కరాజ్‌పై విజయం

పారిస్: కెరీర్‌లో 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్, 7 ఏటీపీ ఫైనల్స్ టైటిల్స్, ఎనిమిది సార్లు నంబర్‌వన్‌గా ఏడాది ముగింపు, 2 సార్లు కెరీర్ గోల్డెన్ మాస్టర్స్ సిరీస్ టైటిల్స్, డేవిస్‌కప్ విజేత, 428 వారాల పాటు వరల్డ్ నంబర్‌వన్... టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ అత్యద్భుత ఆటతో సాధించిన అసాధారణ ఘనతలివి. అయితే ఇన్ని గొప్ప విజయాల తర్వాత కూడా జొకోవిచ్ కెరీర్‌లో ఒలింపిక్స్ స్వర్ణ పతకం ఒకటి ఇప్పటి వరకు లోటుగా ఉండిపోయింది. కానీ ఇప్పుడు జొకో దానిని కూడా సాధించి తన కెరీర్‌ను పరిపూర్ణం చేసుకున్నాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన జొకోవిచ్ పసిడి పతకం కోసం ఎంతో తపించాడు. దాని కోసం పోరాడుతూ వచ్చాడు. ఇప్పుడు 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ఆ కల నెరవేరింది. 'కెరీర్ గోల్డెన్‌స్లామ్' నెగ్గిన అరుదైన ఆటగాళ్ల జాబితాలో అతను తన పేరును లిఖించుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో జొకో 7–6 (7/3), 7–6 (7/2) స్కోరుతో కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)పై విజయం సాధించాడు. ఇటీవలే వింబుల్డన్ ఫైనల్లో తనను ఓడించి ఒలింపిక్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన అల్‌కరాజ్‌పై తన అనుభవాన్నంతా ఉపయోగించి టైబ్రేక్‌లో సెర్బియా స్టార్ పైచేయి సాధించాడు. 37 ఏళ్ల జొకో అతి పెద్ద వయసులో ఒలింపిక్ టెన్నిస్‌లో స్వర్ణం సాధించిన ఆటగాడిగా నిలిచాడు. విజయం తర్వాత సెర్బియా జాతీయ పతాకంతో తన కుటుంబసభ్యులు, టీమ్ వద్దకు పరుగెత్తిన జొకోవిచ్ కన్నీళ్లపర్యంతమయ్యాడు. తన కొడుకు, కూతురును కౌగిలించుకొని అతను ఏడ్చేసిన తీరు అతని దృష్టిలో ఈ పతకం విలువేమిటో చూపించింది.



'దస్' కా దమ్...



'షూటౌట్'లో బ్రిటన్ ప్లేయర్ ఫిలిప్ రాపర్ షాట్‌ను నిలువరిస్తున్న భారత గోల్‌కీపర్ శ్రీజేశ్

ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు మరో అద్భుతాన్ని చూపించింది. టోక్యోలో మూడేళ్ల క్రితం నాటి జోరును పునరావృతం చేస్తూ సెమీఫైనల్‌కు చేరింది. అప్పటిలాగే ఈసారి కూడా ప్రత్యర్థి బ్రిటన్. నాడు నిర్ణీత సమయంలోనే భారత్ విజయం సాధించగా, ఇప్పుడు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ షూటౌట్‌కు చేరింది. తుది ఫలితం మాత్రమే సేమ్ టు సేమ్. భారత ఆటగాళ్లంతా చురుకైన ఆటతో సత్తా చాటగా, ఎప్పటిలాగే గోల్ కీపర్ శ్రీజేశ్ అసాధారణ గోల్ కీపింగ్ జట్టును గెలిపించింది. మూడు క్వార్టర్ల పాటు ఒక ఆటగాడిని కోల్పోయి పది మందితోనే టీమిండియా కొనసాగినా... పదునైన డిఫెన్స్‌తో మన జట్టు ప్రత్యర్థిని నిలువరించగలిగింది. మరో మ్యాచ్ గెలిచి ఫైనల్ చేరితే గత ఒలింపిక్స్‌కంటే మెరుగైన ఫలితంతో భారత్ సగర్వంగా నిలుస్తుంది.

10 మంది ఆటగాళ్లతో ఆడి క్వార్టర్స్‌లో బ్రిటన్‌పై విజయం

సెమీఫైనల్లోకి దూసుకెళ్లి పతకం రేసులో భారత్

'షూటౌట్'లో టీమిండియా పైచేయి ● శ్రీజేశ్ అద్భుత గోల్ కీపింగ్

పారిస్: ఒలింపిక్స్‌లో వరుసగా రెండో పతకం సాధించే దిశగా భారత పురుషుల హాకీ జట్టు ఆశలు రేపుతోంది. స్ఫూర్తిదాయక ఆటతీరు కనబర్చిన మన జట్టు పారిస్‌ఒలింపిక్స్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టు 'షూటౌట్'లో బ్రిటన్‌ను ఓడించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 1–1తో సమంగా నిలవగా... 'షూటౌట్'లో భారత్ 4–2తో పైచేయి సాధించింది. ఇరు జట్లు హోరాహోరీగా తలపడిన పోరులో భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 22వ నిమిషంలో, బ్రిటన్ తరఫున లీ మార్టన్ 27వ నిమిషంలో గోల్స్ సాధించారు.

'షూటౌట్'లో భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, రాజ్‌కుమార్ గోల్స్ చేయగా... బ్రిటన్ ఆటగాళ్లలో జేమ్స్ అల్బరీ, జాక్ వలాస్ మాత్రమే గోల్స్ కొట్టారు. కానర్ విలియమ్సన్, ఫిలిప్ రాపర్ విఫలమయ్యారు. రాపర్ గోల్‌ను శ్రీజేశ్ అద్భుతంగా నిలువరించిన తర్వాత భారత్ 3–2తో ఆధిక్యంలో నిలవగా... నాలుగో షాట్‌ను రాజ్‌కుమార్ గోల్‌గా మలచడంతో భారత బృందం సంబరం చేసుకుంది. ఫలితం తేలిపోవడంతో చివరిదైన ఐదో షాట్‌ను బ్రిటన్ తీసుకోలేదు. జర్మనీ, అర్జెంటీనా జట్ల మధ్య జరిగే నాలుగో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ విజేతతో భారత జట్టు మంగళవారం జరిగే సెమీఫైనల్లో తలపడుతుంది. ఒకవేళ సెమీఫైనల్లో భారత్ ఓడిపోతే గురువారం కాంస్య పతకం కోసం పోటీపడుతుంది. సెమీస్‌లో గెలిస్తే మాత్రం 1980 మాస్కో ఒలింపిక్స్ తర్వాత మళ్లీ విశ్వ క్రీడల్లో భారత్‌కు ఫైనల్ బెర్త్ ఖరారవుతుంది. ఆరంభంలో బ్రిటన్ చాలా దూకుడుగా ఆడుతూ వరుసగా దాడులు చేసింది. తొలి ఐదు నిమిషాల్లోనే ఆ జట్టుకు రెండు పెనాల్టీ కార్నర్‌లు లభించగా, భారత్ వాటిని నిలువరించింది. 11వ నిమిషంలో కూడా బ్రిటన్ జట్టు పెనాల్టీ కార్నర్ ద్వారా చేసిన ప్రయత్నం వృథా అయింది. భారత్ కూడా తొలి క్వార్టర్‌లో రెండు పెనాల్టీలు సంపాదించినా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. రెండో క్వార్టర్ కూడా ఇదే తరహాలో సాగింది. అయితే 22వ నిమిషంలో లభించిన పెనాల్టీని హర్మన్‌ప్రీత్ గోల్‌గా మలచడంతో ఆధిక్యం దక్కింది. కానీ మరో ఐదు నిమిషాలకే వేగంగా దూసుకొచ్చిన లీ మార్టన్ చేసిన గోల్ ప్రయత్నాన్ని కీపర్ శ్రీజేశ్ ఆపడంలో విఫలం కావడంతో స్కోరు సమమైంది. మూడో క్వార్టర్‌లో కూడా బ్రిటన్‌కు మూడు పెనాల్టీలు రాగా శ్రీజేశ్ సమర్థంగా అడ్డుకున్నాడు. ఆ తర్వాత చివరి వరకు ఇరు జట్లు మరో గోల్ కోసం ఎంతగా ప్రయత్నించినా సఫలం కాలేకపోయాయి.



రోహిదాస్‌కు రెడ్ కార్డ్

మ్యాచ్‌లో జరిగిన ఒక అనూహ్య ఘటన భారత్‌ను మ్యాచ్ ఆసాంతం ఇబ్బంది పెట్టింది. 17వ నిమిషంలో భారత డిఫెండర్ అమిత్ రోహిదాస్ స్టిక్ బ్రిటన్ ఫార్వర్డ్ విలియమ్ కల్నాన్ తలకు తగిలింది. వీడియో రీప్లే చూస్తే అతను ఉద్దేశపూర్వకంగా చేసినట్లు అనిపించకపోయినా... మ్యాచ్ రిఫరీ తీవ్ర చర్య తీసుకున్నాడు. రోహిదాస్‌కు 'రెడ్ కార్డ్' చూపించడంతో అతను మైదానాన్ని వీడాల్సి వచ్చింది. దాంతో మిగిలిన మ్యాచ్ మొత్తం భారత్ 10 మందితోనే ఆడింది. మిడ్ ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ డిఫెండర్‌గా బాధ్యత తీసుకోవాల్సి వచ్చింది. దీనిపై భారత జట్టు అప్పీల్ చేసింది. దీనిపై వాదనల అనంతరం రోహిదాస్ తప్పు చేసినట్లు తేలితే అతనిపై ఒక మ్యాచ్ నిషేధం (సెమీఫైనల్) పడే అవకాశం ఉంది.



ఓటమి తర్వాత బ్రిటన్ ప్లేయర్ లీ మోర్టాన్ నిరాశ

బెల్జియంకు షాక్

మరోవైపు డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న బెల్జియం జట్టు పారిస్ ఒలింపిక్స్ నుంచి నిష్క్రమించింది. ఆదివారం జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ 3–2తో టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత బెల్జియం జట్టును బోల్తా కొట్టించింది. తద్వారా 2008 బీజింగ్ ఒలింపిక్స్ తర్వాత స్పెయిన్ జట్టు మళ్లీ సెమీఫైనల్‌కు చేరుకుంది. మూడో క్వార్టర్ ఫైనల్లో నెదర్లాండ్స్ 2–0తో ఆస్ట్రేలియా జట్టును ఓడించి సెమీఫైనల్లో స్పెయిన్‌తో పోరుకు సిద్ధమైంది.



గోల్‌కీపర్ శ్రీజేశ్‌తో భారత ఆటగాళ్ల సంబరం

"చివరి వరకు స్కోరును సమంగా ఉంచడం తప్ప మాకు మరో ప్రత్యామ్నాయం లేకపోయింది. అందుకే పూర్తిగా డిఫెన్స్‌పైనే దృష్టి పెట్టాల్సి వచ్చింది. పది మందితో ఆడటం మ్యాచ్‌లో కఠిన సమయం. కానీ ఏమీ చేయలేం. ఆటగాళ్లంతా సమష్టి ప్రదర్శన కనబర్చారు. పరిస్థితులు ఎలా ఉన్నా ఇదే తరహా మానసిక దృఢత్వంతో సెమీస్ ఆడతాం. శ్రీజేశ్ దిగ్గజం. తొలి మ్యాచ్ నుంచి అతను మమ్మల్ని ఆదుకుంటూనే ఉన్నాడు. –హర్మన్‌ప్రీత్ సింగ్, భారత కెప్టెన్

గోల్ కీపర్‌గా నా బాధ్యత నెరవేర్చాను. ఈ రోజు భారత్‌కు కలిసొచ్చింది. షూటౌట్‌లో షాట్ తీసుకున్న భారత ఆటగాళ్లెవరూ నిరాశపర్చలేదు. వారు స్కోరు చేయడం వల్ల నాలో నమ్మకం మరింత పెరిగింది. మైదానంలోకి అడుగు పెట్టినప్పుడు ఇది నా ఆఖరి మ్యాచ్ కావచ్చు లేదా బాగా ఆడితే మరో రెండు మ్యాచ్‌లు ఆడవచ్చని అనుకున్నాను. సెమీస్ ప్రత్యర్థి ఎవరైనా ఇలాగే ఆడతాం. –పీఆర్ శ్రీజేశ్, భారత గోల్‌కీపర్

7 ఒలింపిక్స్ హాకీలో బ్రిటన్ జట్టుపై భారత్ గెలుపొందడం ఇది ఏడోసారి. రెండు జట్లు విశ్వ క్రీడల్లో ఇప్పటి వరకు పది సార్లు తలపడ్డాయి. మూడు మ్యాచ్‌ల్లో బ్రిటన్ నెగ్గింది. చివరిసారి 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో భారత జట్టుపై బ్రిటన్ గెలిచింది.

52 వరుసగా రెండు ఒలింపిక్స్ క్రీడల్లో భారత పురుషుల హాకీ జట్టు సెమీఫైనల్ చేరడం 52 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. భారత జట్టు 1936 బెర్లిన్ ఒలింపిక్స్ నుంచి 1972 మ్యూనిక్ ఒలింపిక్స్ వరకు కనీసం సెమీఫైనల్ దశ దాటింది. 1976 మెక్సికో ఒలింపిక్స్‌లో భారత్ గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. 1980 మాస్కో ఒలింపిక్స్‌లో ఫైనల్ చేరడంతోపాటు స్వర్ణ పతకాన్ని సాధించింది.

ఇక కాంస్యం లక్ష్యంగా...



సెమీఫైనల్లో ఓడిన లక్ష్య సేన్

- డిఫెండింగ్ చాంపియన్ అక్సెల్‌సన్ చేతిలో ఓటమి
- నేడు కాంస్య పతక పోరులో లీ జీ జియాతో పోరు

పారిస్: తొలి గేమ్‌లో 17–11తో ఆరు పాయింట్ల ఆధిక్యం... ఆ తర్వాత 20–17 వద్ద తొలి గేమ్ సొంతం చేసుకునే అవకాశం... రెండో గేమ్ ఆరంభంలో 7–0తో ముందంజ... ప్రపంచ రెండో ర్యాంకర్, డిఫెండింగ్ ఒలింపిక్ చాంపియన్ విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) సెమీఫైనల్ మ్యాచ్‌లో వేర్వేరు దశల్లో భారత షట్లర్ లక్ష్య సేన్‌కు లభించిన అవకాశాలివి. కానీ దురదృష్టవశాత్తూ అనుభవలేమి, ఒత్తిడితో చివరకు అతనికి ఓటమే ఎదురైంది. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో 22వ ర్యాంకర్ లక్ష్య సేన్ 20–22, 14–21 స్కోరుతో అక్సెల్‌సన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. 54 నిమిషాల పాటు సాగిన సమరంలో సేన్ పదునైన ఆటతో చెలరేగినా... అక్సెల్‌సన్ ముందు అది సరిపోలేదు. డెన్మార్క్ స్టార్ చేతిలో సేన్ ఓడిపోవడం ఇది ఎనిమిదో సారి. సెమీస్ ఓటమితో సేన్ ఇక కాంస్యపతకం కోసం పోరాడతాడు. మూడో స్థానం కోసం నేడు జరిగే 'ప్లే ఆఫ్' మ్యాచ్‌లో ప్రపంచ 7వ ర్యాంకర్ లీ జీ జియా (మలేసియా)ను లక్ష్య సేన్ ఎదుర్కొంటాడు. రెండో సెమీఫైనల్లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ వితిద్‌సర్న్ కున్లావత్ (థాయ్‌లాండ్) 21–14, 21–15తో లీ జీ జియాపై గెలుపొందాడు. ఆరంభంలో 2–5తో వెనుకబడినా ఆ తర్వాత చక్కటి క్రాస్ కోర్ట్ షాట్‌లు, ర్యాలీలతో పాయింట్లు సాధించిన లక్ష్య 8–7తో ముందంజ వేశాడు. అక్సెల్‌సన్ వరుసగా తప్పులు చేయడంతో 15–9తో దూసుకుపోయిన సేన్... స్కోరును 17–11 వరకు చేర్చాడు. కానీ ఇక్కడే అక్సెల్‌సన్ నుంచి అద్భుత ఆట బయటకు వచ్చింది. కోర్టు నలుమూలల నుంచి షాట్‌లతో సుదీర్ఘ ర్యాలీలు ఆడుతూ వరుస పాయింట్లు సాధించిన అతను ఆధిక్యాన్ని 16–18కి తగ్గించాడు. ఆపై స్కోరు 17–20కి చేరింది. కానీ ఇక్కడ మళ్లీ మళ్లీ షటిల్‌ను నెట్‌కు కొట్టిన సేన్ వరుసగా ఐదు పాయింట్లు కోల్పోయి గేమ్‌నే చేజార్చుకున్నాడు. రెండో గేమ్‌లో 7–0తో జోరుగా మొదలు పెట్టినా దానిని భారత ఆటగాడు కొనసాగించలేకపోయాడు. డిఫెన్స్‌లో పడిన సేన్ అనవసర తప్పిదాలు చేయగా...కోలుకున్న అక్సెల్‌సన్ స్కోరును 7–8కి, ఆపై 15–12కు తీసుకెళ్లాడు. అనంతరం ఎదురు లేకుండా దూసుకుపోయిన డెన్మార్క్ ప్లేయర్ ఫోర్‌హ్యాండ్ స్మాష్‌లతో వరుస పాయింట్లు రాబట్టి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

"తొలి గేమ్‌ను గెలుచుకొని ఉంటే మ్యాచ్ కూడా గెలిచే వాడిని. నేను డిఫెన్స్‌లో పడిపోకుండా మరింత అటాకింగ్ గేమ్ ఆడాల్సింది. ఆ తర్వాత రెండో గేమ్‌లో పట్టు బిగించలేకపోయాను. ఈ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని కాంస్య పతక పోరులో బాగా ఆడతాను. ఈ మ్యాచ్‌లో నాకు మద్దతు ఇచ్చిన అభిమానులు సోమవారం కూడా అలాగే సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నా. –లక్ష్య సేన్

లక్ష్య సేన్ చాలా మంచి ఆటగాడు. తన పదును ఏమిటో అతను ఒలింపిక్స్‌లో చూపించాడు. అయితే కీలక సమయంలో నేను ప్రశాంతంగా ఆడి పైచేయి సాధించగలిగాను. ఇక్కడ నా అనుభవం పని చేసింది. గతంలో ఏ భారత ఆటగాడూ సాధించని విధంగా అతను సెమీస్ చేరాడు. దాంతో అతనిపై ఒత్తిడి బాగా పెరిగి తప్పులు చేశాడు. వచ్చేసారి ఒలింపిక్స్‌లో అతను స్వర్ణం గెలిచే అవకాశం ఉందని నేను నమ్ముతున్నా. –అక్సెల్‌సన్

దిగ్గజాల సరసన లెడెకీ, డ్రెసెల్

ఒలింపిక్స్‌లో 9 స్వర్ణాల చొప్పున గెలిచిన అమెరికా స్విమ్మర్లు



లెడెకీ



డ్రెసెల్

పారిస్: విశ్వ క్రీడల్లో అతికొద్ది మందికే సాధ్యమైన ఘనతను అమెరికా స్విమ్మర్లు కేటీ లెడెకీ, సెలబ్ డ్రెసెల్ సాధించారు. ఒలింపిక్స్ క్రీడల చరిత్రలో అత్యధిక స్వర్ణాలు సాధించిన క్రీడాకారుల జాబితాలో వీరిద్దరు మరో నలుగురితో కలిసి ఉమ్మడిగా రెండో స్థానానికి చేరుకున్నారు. తాజాగా పారిస్ ఒలింపిక్స్‌లో లెడెకీ, డ్రెసెల్ రెండు స్వర్ణాల చొప్పున సాధించారు. దాంతో ఓవరాల్‌గా ఒలింపిక్స్ క్రీడల్లో వీరిద్దరు నెగ్గిన పసిడి పతకాల సంఖ్య 9కి చేరుకుంది. ఇప్పటికే 'పారిస్'లో 1500 మీటర్లలో బంగారు పతకం గెలిచిన లెడెకీ ఆదివారం జరిగిన 800 మీటర్ల విభాగంలోనూ పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. మరోవైపు డ్రెసెల్ 4x100 మీటర్ల ఫ్రీస్టయిల్ టీమ్ స్వర్ణానికి 4x100 మీటర్ల మిక్స్‌డ్ మెడ్లే పసిడి పతకాన్ని జత చేశాడు. ఒలింపిక్స్‌లో అత్యధిక స్వర్ణ పతకాలు గెలిచిన రికార్డు అమెరికా స్విమ్మర్ మైకేల్ ఫెల్ప్స్ (23 స్వర్ణాలు) పేరిట ఉంది. ఆ తర్వాత 9 స్వర్ణాలతో లారిసా లాతినినా (జిమ్నాస్టిక్స్; సోవియట్ యూనియన్), పావో నుర్మీ (అథ్లెటిక్స్; ఫిన్‌లాండ్), మార్క్ స్పిట్జ్ (స్విమ్మింగ్; అమెరికా), కార్ల్ లూయిస్ (అథ్లెటిక్స్; అమెరికా), కేటీ లెడెకీ, డ్రెసెల్ ఉమ్మడిగా రెండో స్థానంలో ఉన్నారు.



నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

రెజ్లింగ్

మహిళల 68 కేజీల ఫ్రీస్టయిల్ ప్రీక్వార్టర్స్: నిషా దహియా X సోవా రిజ్కో (ఉక్రెయిన్) (సాయంత్రం గం. 6:30 నుంచి)

టేబుల్ టెన్నిస్

మహిళల జట్టు ప్రీక్వార్టర్ ఫైనల్: భారత్ X రొమేనియా (మధ్యాహ్నం గం. 1:30 నుంచి)

సెయిలింగ్

మహిళల డింగీ రేసులు: (మధ్యాహ్నం గం. 3:45 నుంచి). పురుషుల డింగీ రేసులు: (సాయంత్రం గం. 6:10 నుంచి)

అథ్లెటిక్స్

మహిళల 400 మీటర్ల పరుగు తొలి రౌండ్: కిరణ్ పహల్ (హీట్ 5) (మధ్యాహ్నం గం. 3:57 నుంచి). పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్ తొలి రౌండ్: అవినాశ్ సాబ్లే (హీట్ 2) (రాత్రి గం. 10:50 నుంచి)

బ్యాడ్మింటన్

పురుషుల సింగిల్స్ కాంస్య పతక పోరు: లక్ష్యసేన్ X లీ జీ జియా (మలేసియా) (సాయంత్రం గం. 6:00

షూటింగ్

స్కీట్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్: మహేశ్వరి చౌహాన్X అనంత్ జీత్ సింగ్ నరుకా (మధ్యాహ్నం గం. 12:30 నుంచి). ఫైనల్ (అర్హత సాధిస్తే): సాయంత్రం గం. 6:30 నుంచి.

పతకాల పట్టిక

ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	19	15	11	45
2	అమెరికా	18	26	25	69
3	ఫ్రాన్స్	12	14	18	44
4	ఆస్ట్రేలియా	12	10	7	29
5	బ్రిటన్	10	12	15	37
6	దక్షిణ కొరియా	10	7	7	24
7	జపాన్	8	5	10	23
8	ఇటలీ	7	9	5	21
9	నెదర్లాండ్స్	6	5	4	15
10	జర్మనీ	5	5	2	12
11	కెనడా	4	4	8	16
57	భారత్	0	0	3	3

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	886	80,982
నిఫ్టీ ▽	293	24,718

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	16,776	▽	418
డోజోన్స్	39,737	▽	611
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,175	▽	109
డాక్స్	17,661	▽	422
షాంఘై	2,905	▽	27
నికాయ్	35,910	▽	2,217

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.33	84.35
£	బ్రిటన్ పౌండ్	106.36	108.95
€	యూరో	89.54	91.45
¥	జపాన్ ఎన్ (100)	54.53	55.34
AU$	ఆస్ట్రేలియా డాలర్	53.56	55.49
S$	సింగపూర్ డాలర్	60.45	65.00
SAR	సౌదీ రియాల్	21.45	23.01
UAE D	యూఏఈ దిర్హామ్	21.86	23.62
¥	చైనా యువాన్	10.72	12.45

ఇల్లు అమ్మితే పన్ను భారం!



- ఇండెక్సేషన్ ప్రయోజనం తొలగింపు
- మూలధన లాభాల పన్ను తగ్గింపు
- దీంతో అధికంగా చెల్లించాల్సిన పరిస్థితి
- ధరలు గణనీయంగా పెరిగితేనే అనుకూలం
- అన్నీ పరిశీలించిన తర్వాతే నిర్ణయం

సొంతిల్లు.. చాలా మందికి జీవితకాల కష్టార్జితం. అలాంటి సొంతింటిని అవసరార్థమై విక్రయించినప్పుడు వచ్చిన లాభంపై పన్ను చెల్లించాలన్న విషయం ఎంత మందికి తెలుసు? మరీ ముఖ్యంగా ఇటీవలి బడ్జెట్‌లో చేసిన తాజా ప్రతిపాదన ప్రకారమైతే.. ఈ పన్ను మరింత చెల్లించాల్సి రావచ్చు. దీర్ఘకాల మూలధన లాభాల పన్నును 20 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గించడం సానుకూల నిర్ణయమేగా అని అనుకోవచ్చు. కానీ, ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తొలగించారు. దీని కారణంగా నికరంగా చెల్లించాల్సిన పన్ను గణనీయంగా పెరగనుంది. అసలు ఇండెక్సేషన్ ప్రయోజనం తొలగింపు ఎవరికి అనుకూలం? తాజా పన్ను ప్రతిపాదన ఎవరికి లాభం..? తమపై పడే భారం ఎంత..? నిపుణుల విశ్లేషణ ఆధారంగా ఈ వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఇప్పటి వరకు..

ప్రాపర్టీ (ఇల్లు లేదా ఇంటి స్థలం/గ్రామీణ వ్యవసాయ భూమి కాకుండా)ని క్యాపిటల్ అస్సెట్‌గా ఆదాయపన్ను చట్టం చెబుతోంది. కనుక ప్రాపర్టీ విక్రయం మూలధన లాభాల పన్ను పరిధిలోకి వస్తుంది. కొనుగోలు చేసిన రెండేళ్ల తర్వాత విక్రయించిన సందర్భాల్లో అది దీర్ఘకాల మూలధన లాభాల పన్ను పరిధిలోకి వస్తుంది. వచ్చిన లాభంపై లోగడ (జూలై 23కు ముందు) 20% పన్ను అమలు చేసేవారు. కరెన్సీ విలువను ఏటా కొంత శాతం చొప్పున ద్రవ్యోల్బణం హరిస్తుందని తెలుసు. ఈ ద్రవ్యోల్బణాన్ని ప్రాపర్టీ కొనుగోలు ధరతో సర్దుబాటు చేసే వారు. దీన్నే ఇండెక్సేషన్ బెనిఫిట్‌గా చెబుతారు. ఉదాహరణకు 6% ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు రూ.100 విలువ ఏడాది తర్వాత రూ.94గా మారుతుంది. పేరుకు మన దగ్గర రూ.100 ఉంటుంది. కానీ, దాని అసలు విలువ రూ.94. ఇదే మాదిరి రూ.100 పెట్టి కొనుగోలు చేసిన ప్రాపర్టీ.. అసలు కొనుగోలు ధర ఏడాది తర్వాత ఇండెక్సేషన్‌తో కలిపితే రూ.106గా మారుతుంది. పాత విధానంలో ప్రాపర్టీ అసలు కొనుగోలు ధర ఇండెక్సేషన్ ప్రయోజనంతో గణనీయంగా పెరిగేది. దీంతో నికరంగా చెల్లించే పన్ను తక్కువగా ఉండేది. ఆదాయపన్ను శాఖ ఏటా ద్రవ్యోల్బణం సర్దుబాటు ఆధారంగా కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ (సీఐఐ/ద్రవ్యోల్బణ వ్యయ సూచీ)ను ఖరారు చేస్తుంది. దీన్ని కేంద్ర ప్రభుత్వం గెజిట్ ద్వారా విడుదల చేస్తుంది. దీన్ని ప్రామాణికంగా తీసుకునేవారు. ఇప్పుడు ప్రాపర్టీకి ఈ ప్రయోజనాన్ని తొలగించారు. ఇది మెజారిటీ ఇంటి యజమానులకు నిజంగా మేలు చేస్తుందని కేంద్రం చెబుతోంది. కానీ, నిపుణులు మాత్రం తాజా సవరణలతో పన్ను భారం పెరుగుతుందని గణాంకాల సహితంగా వివరిస్తున్నారు. ప్రాపర్టీ కొనుగోలు చేసిన రెండేళ్లలోపు విక్రయిస్తే అది స్వల్పకాల మూలధన లాభాల పన్ను కిందకు వస్తుంది. ఈ మొత్తం తమ ఆదాయానికి కలిపి పన్ను రిటర్నుల్లో చూపించాలి. ఏ శ్లాబు పరిధిలోకి వస్తే ఆ రేటు ప్రకారం పన్ను చెల్లించాలి. వ్యవసాయ భూమి క్యాపిటల్ అస్సెట్ కాదు కనుక దీని విక్రయంపై మూలధన లాభాల పన్ను వర్తించదు.

ఎవరికి ప్రయోజనం?



జూలై 23 ముందు వరకు ఉన్న ఇండెక్సేషన్ ఆధారిత దీర్ఘకాల మూలధన లాభాల పన్ను విధానంతో అందరికీ ప్రయోజనం ఉండేది. కరెన్సీ విలువ క్షీణత ప్రభావం తీసివేసిన తర్వాత మిగిలిందే అసలైన లాభం కనుక, దానిపై పన్ను చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడు నూతన విధానంతో మెజారిటీ యజమానులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ద్రవ్యోల్బణం రేటుకు మించి ప్రాపర్టీ ధరలు గణనీయంగా పెరిగినప్పుడే నష్టం లేకుండా ఉంటుంది. కొనుగోలు నుంచి విక్రయించే మధ్యకాలంలో ధరల్లో పెద్దగా వృద్ధి పెద్దగా లేకపోతే నష్టమే. ఏటా ప్రాపర్టీ ధరలు 9 శాతంలోపే వృద్ధి చెందితే నష్టపోవాల్సి వస్తుంది. కనీసం 10 శాతం, అంతకంటే ఎక్కువ పెరిగితేనే కొత్త విధానంతో లాభపడొచ్చు. 2013 మార్చి నుంచి 2024 మార్చి మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 36 పట్టణాల్లో ప్రాపర్టీ ధరలు సగటున 5.11 శాతం చొప్పునే పెరిగినట్టు నేషనల్ హౌసింగ్ బ్యాంక్ 'రెసిడెక్స్' స్పష్టం చేస్తోంది. ఈ కాలంలో ఒక్క హైదరాబాద్‌లోనే ఇది 8.56 శాతం సీఏజీఆర్‌గా ఉంది. దీర్ఘకాలంలో రియల్ ఎస్టేట్ రాబడులు 12–16 శాతం (వార్షిక) మధ్య ఉంటున్నాయని, కనుక నూతన విధానం లాభదాయకమని ప్రభుత్వం అంటుంటే.. అన్ని ప్రాంతాల్లోనూ ఆ విధమైన ధరల వృద్ధి లేదంటూ నిపుణులు తోసిపుచ్చుతున్నారు. ఆర్‌బీఐ హౌసింగ్ ప్రైజింగ్ ఇండెక్స్‌ను చూసినా ప్రముఖ పట్టణాల్లో గడిచిన దశాబ్ద కాలంలో ధరల వృద్ధి 1–9 శాతం మధ్యే ఉన్నట్టు తెలుస్తోంది.

ధరలు ఏటా 4 శాతం చొప్పున పెరిగితే..

కొనుగోలు చేసిన సంవత్సరం	2004	2009	2014	2019
కొనుగోలు ధర (రూ.లలో)	5 లక్షలు	15 లక్షలు	25 లక్షలు	50 లక్షలు
కొనుగోలు చేసిన ఏడాది కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్(సీఐఐ)	113	148	240	289
ఏటా 4 శాతం వృద్ధితో ప్రాపర్టీ విక్రయ ధర	10.96లక్షలు	27.01లక్షలు	37లక్షలు	60.83లక్షలు
2024-25 సీఐఐ	363	363	363	363
ఇండెక్సేషన్‌తో మారిన కొనుగోలు ధర	16.06లక్షలు	36.79లక్షలు	37.81లక్షలు	62.80లక్షలు
ఇండెక్సేషన్ తర్వాత మూలధన లాభం	మైనస్ 5.10లక్షలు	మైనస్ 9.78లక్షలు	మైనస్ 80,639	మైనస్ 1.97లక్షలు
ఇండెక్సేషన్‌తో గత విధానంలో చెల్లించాల్సిన 20 శాతం పన్ను	0	0	0	0
ఇండెక్సేషన్ లేకుండా మూలధన లాభం	5.96 లక్షలు	12.01 లక్షలు	12 లక్షలు	10.83 లక్షలు
దీనిపై 12.5 శాతం పన్ను (కొత్త విధానం) (రూ..లో)	74,445	1.50 లక్షలు	1.50 లక్షలు	1.35 లక్షలు
కొత్త విధానంలో ఆదా	మైనస్ 74,445	మైనస్ 1.50 లక్షలు	మైనస్ 1.50 లక్షలు	మైనస్ 1.35 లక్షలు

నోట్: మైనస్ అంటే నికరంగా నష్టపోతున్నదని అర్థం.

ధరలు ఏటా 8 శాతం చొప్పున పెరిగితే

కొనుగోలు చేసిన సంవత్సరం	2004	2009	2014	2019
కొనుగోలు ధర (రూ.లలో)	5 లక్షలు	15 లక్షలు	25 లక్షలు	50 లక్షలు
కొనుగోలు చేసిన ఏడాది కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ (సీఐఐ)	113	148	240	289
ఏటా 8 శాతం వృద్ధితో ప్రాపర్టీ విక్రయ ధర	23.30 లక్షలు	47.58 లక్షలు	53.97 లక్షలు	73.47 లక్షలు
2024-25 సీఐఐ	363	363	363	363
ఇండెక్సేషన్‌తో మారిన కొనుగోలు ధర	16.06 లక్షలు	36.79 లక్షలు	37.81 లక్షలు	62.80 లక్షలు
ఇండెక్సేషన్ తర్వాత మూలధన లాభం	7.24 లక్షలు	10.79 లక్షలు	16.16 లక్షలు	10.67 లక్షలు
ఇండెక్సేషన్‌తో గత విధానంలో చెల్లించాల్సిన 20 శాతం పన్ను	1.45 లక్షలు	2.16 లక్షలు	3.23 లక్షలు	2.13 లక్షలు
ఇండెక్సేషన్ లేకుండా మూలధన లాభం	18.30 లక్షలు	32.58 లక్షలు	28.97 లక్షలు	23.47 లక్షలు
దీనిపై 12.5 శాతం పన్ను (కొత్త విధానం)	2.29 లక్షలు	4.07 లక్షలు	3.62 లక్షలు	2.93 లక్షలు
కొత్త విధానంలో పన్ను ఆదా	మైనస్ 83,953	మైనస్ 1.91 లక్షలు	మైనస్ 38,951	మైనస్ 80,057

ప్రాపర్టీ ధరలు ఏటా 12 శాతం చొప్పున పెరిగితే

కొనుగోలు చేసిన సంవత్సరం	2004	2009	2014	2019
కొనుగోలు ధర (రూ.లలో)	5 లక్షలు	15 లక్షలు	25 లక్షలు	50 లక్షలు
కొనుగోలు చేసిన ఏడాది కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్(సీఐఐ)	113	148	240	289
ఏటా 12 శాతం వృద్ధితో ప్రస్తుత విక్రయ ధర	48.23 లక్షలు	82.10 లక్షలు	77.65 లక్షలు	88.12 లక్షలు
2024-25 సీఐఐ	363	363	363	363
ఇండెక్సేషన్‌తో మారిన కొనుగోలు ధర	16.06 లక్షలు	36.79 లక్షలు	37.81 లక్షలు	62.80 లక్షలు
ఇండెక్సేషన్ తర్వాత మూలధన లాభం	32.17 లక్షలు	45.31 లక్షలు	39.83 లక్షలు	25.31 లక్షలు
ఇండెక్సేషన్‌తో గత విధానంలో చెల్లించాల్సిన 20 శాతం పన్ను	6.43 లక్షలు	9.06 లక్షలు	7.97 లక్షలు	5.06 లక్షలు
ఇండెక్సేషన్ లేకుండా మూలధన లాభం	43.23 లక్షలు	67.10 లక్షలు	52.64 లక్షలు	38.12 లక్షలు
దీనిపై 12.5 శాతం పన్ను (కొత్త విధానం)	5.40 లక్షలు	8.39 లక్షలు	6.58 లక్షలు	4.76 లక్షలు
కొత్త విధానంలో పన్ను ఆదా	1.03 లక్షలు	67,465	1.39 లక్షలు	29,823

కొన్ని ఉదాహరణలు చూద్దాం...



- 2009లో ప్రాపర్టీని రూ.15లక్షలు పెట్టి కొన్నారని అనుకుందాం. ఏటా ధర 4% చొప్పున పెరిగింది. దీంతో ప్రస్తుత విక్రయ ధర రూ.27 లక్షలు అవుతుంది. కానీ, ఇండెక్సేషన్ సర్దుబాటుతో కొనుగోలు ధర రూ.36.79 లక్షలుగా మారుతుంది. అంటే 2009లో కొనుగోలుకు వెచ్చించిన రూ.15 లక్షలకు ఏటా ఇండెక్సేషన్ ప్రభావాన్ని కలిపితే ఈ ధర వస్తుంది. దీంతో పోల్చితే విక్రయించిన ధర తక్కువ కనుక పాత విధానంలో ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఏర్పడదు. కానీ నూతన విధానంలో 2009 నాటి కొనుగోలు ధరనే ప్రామాణికం. దీంతో రూ.12 లక్షలు లాభం వచ్చినట్టు తేలుతుంది. దీనిపై 12.5% పన్ను కింద రూ.1.5 లక్షలు చెల్లించాల్సి వస్తుంది. ప్రాపర్టీ ధర ద్రవ్యోల్బణం కంటే తక్కువగా పెరగడం వల్ల వాస్తవంగా ఈ కేసులో నష్టం వచ్చినట్టు అర్థం చేసుకోవాలి. అయినా కానీ, కొత్త విధానం పన్ను చెల్లించాల్సిందే.



- 2009లోనే రూ.15 లక్షలు పెట్టి కొనుగోలు చేసిన ప్రాపర్టీ ధర ఒకవేళ ఏటా 8% కాంపౌండెడ్ చొప్పున పెరిగితే ప్రస్తుత విక్రయ ధర రూ. 47.58 లక్షలు అవుతుంది. ఇండెక్సేషన్ తో సర్దుబాటు చేస్తే కొనుగోలు ధర రూ.36.79 లక్షలు అవుతుంది. దీంతో పాత విధానంలో నికర లాభం రూ.10.79 లక్షలు అవుతుంది. దీనిపై 20% మూలధన లాభం కింద రూ.2.16 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. కొత్త విధానంలో ఇండెక్సేషన్ లేదు కనుక నికర లాభం రూ.32. 58 లక్షలు అవుతుంది. దీనిపై 12.5% పన్ను కింద రూ. 4.07 లక్షలు చెల్లించాల్సి వస్తుంది.



- 2009లోనే రూ.15లక్షలు పెట్టి కొనుగోలు చేసిన ఇదే ప్రాపర్టీ ధర ఒకవేళ ఏటా 12 శాతం కాంపౌండెడ్ చొప్పున పెరిగితే ప్రస్తుత విక్రయ ధర రూ.82.10 లక్షలు అవుతుంది. ఇండెక్సేషన్‌తో సర్దుబాటు చేసిన తర్వాత వాస్తవ కొనుగోలు ధర రూ.36.79 లక్షలుగా మారుతుంది. దీని ప్రకారం నికర లాభం రూ.45.31 లక్షలు అవుతుంది. దీనిపై 20 శాతం పన్ను కింద 9.06 లక్షలు చెల్లించాలి. అదే ఇండెక్సేషన్ లేకుండా చూస్తే నికర మూలధన లాభం రూ.67.10 లక్షలు అవుతుంది. దీనిపై 12.5 శాతం పన్ను కింద రూ.8.39 లక్షలు చెల్లించాలి. కొత్త విధానం కారణంగా ఈ కేసులో రూ.67 వేలు ఆదా అవుతోంది.

వివిధ పట్టణాల్లో ధరల వృద్ధి

నిజానికి గడిచిన ఐదేళ్లలో ప్రముఖ పట్టణాల్లో ఇళ్ల ధరల పెరుగుదల 10 శాతంలోపే ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్ మినహా ఇతర ప్రముఖ పట్టణాల్లో ధరల వృద్ధి 9 శాతంలోపే ఉన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఐదేళ్ల క్రితం ప్రాపర్టీలు కొనుగోలు చేసిన వారిపై కొత్త పన్ను విధానం కారణంగా ఎక్కువ ప్రభావం పడనుంది.

పట్టణం	ఇంటి ధర చ.అ. (రూ.లో) 2024 జనవరి-మార్చి	గత ఐదు ఆర్థిక సం.ల్లో సీఏజీఆర్ పెరుగుదల (శాతంలో)
హైదరాబాద్	11,323	10
ఎన్‌సీఆర్	9,757	9
బెంగళూరు	10,377	7
అహ్మదాబాద్	7,176	6
కోల్‌కతా	7,727	5
పుణె	9,448	5
చెన్నై	7,710	2
ముంబై ఎంఎంఆర్	20,361	1
దేశవ్యాప్తంగా సగటు	10,485	5

నోట్: ప్రైస్ ఫొరాస్, కొలియర్స్ నివేదిక ఆధారంగా ఈ ధరలు.

పన్ను తగ్గించుకునే మార్గం..?



ఇంటి విక్రయంపై దీర్ఘకాల మూలధన లాభం వస్తే.. అంతేసి పన్ను చెల్లించడం వల్ల మిగిలేదేమీ లేదని భావపడక్కర్లేదు. పన్ను భారం తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. ఇందుకోసం మెరుగైన ఆప్షన్ తిరిగి ఇంటిని కొనుగోలు చేయడమే. ప్రాపర్టీ విక్రయం ద్వారా వచ్చిన మూలధన లాభంతో రెండేళ్లలో తిరిగి ఇల్లు కొనుగోలు చేయాలి. ప్రాపర్టీ విక్రయించడానికి ముందు ఏడాది కాలంలో మరో ఇంటిని కొనుగోలు చేసినా కానీ, సెక్షన్ 54 కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. కొత్త ఇంటిని నిర్మించుకునేట్టు అయితే అందుకు మూడేళ్ల వ్యవధి ఉంటుంది. ఇలా మరో ఇంటిని కొనుగోలు చేసి పన్ను మినహాయింపు పొందిన వారు.. ఆ ప్రాపర్టీని మూడేళ్లు నిండిన తర్వాతే విక్రయించాలి. లేదంటే గతంలో పొందిన పన్ను మినహాయింపును కోల్పోవాల్సి వస్తుంది. మూలధన లాభం రూ.2 కోట్లకు మించి ఉంటే, పన్ను మినహాయింపునకు కొత్త ఇల్లు ఒక్కటే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మూలధన లాభం రూ.2 కోట్లలోపు ఉంటే రెండు ఇళ్లపై వెచ్చించినా పన్ను మినహాయింపు లభిస్తుంది. ఒక్కసారి ఈ ప్రయోజనం క్లెయిమ్ చేసుకుంటే, ఇక తర్వాత మరోసారి అవకాశం ఉండదు. సెక్షన్ 54 కింద గరిష్ఠ పన్ను మినహాయింపు ప్రయోజనం రూ.10 కోట్లు. ఇంతకుమించి మూలధన లాభం ఉంటే దానిపై పన్ను చెల్లించాల్సిందే. ఉదాహరణకు ఒక వ్యక్తి ఇంటిని విక్రయించడం ద్వారా రూ.15 కోట్ల మూలధన లాభం ఆర్జిస్తే.. తిరిగి మరో ఇల్లు కొనుగోలు లేదా నిర్మాణంపై రూ.10 కోట్లపైనే పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోగలరు. విక్రయించిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రిటర్నుల దాఖలులోపు ఇంటిని కొనుగోలు చేయలేకపోతే.. అప్పుడు ఆర్జించిన మూలధన లాభాల మొత్తాన్ని ఎంపిక చేసిన బ్యాంకు శాఖల్లో క్యాపిటల్ గెయిన్స్ స్కీమ్ అకౌంట్ (సీజీఏఎస్)లో డిపాజిట్ చేయాలి. లేదంటే లాభం మొత్తాన్ని క్యాపిటల్ గెయిన్ బాండ్లలో ఇన్వెస్ట్ చేసినా పన్ను లేకుండా చూసుకోవచ్చు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), ఆర్ఈసీ, పీఎఫ్‌సీ, ఐఆర్ఎఫ్‌సీ ఈ తరహా బాండ్లను జారీ చేస్తుంటాయి. వీటిపై కూపన్ రేటు 6 శాతంలోపే ఉంటుంది. వీటి కాల వ్యవధి ఐదేళ్లు. ఇంటిని విక్రయించిన తేదీ నుంచి ఆరు నెల్లలోపు ఈ బాండ్లలో ఇన్వెస్ట్ చేయాలన్నది నిబంధన.

నష్టం వస్తే..?

ప్రాపర్టీ విక్రయంపై నష్టం వస్తే ఏంటి పరిస్థితి..? ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. సంబంధిత ఆర్థిక సంవత్సరంలో ఇతర మూలధన లాభాలతో సర్దుబాటు చేసుకోవచ్చు. ఒకవేళ ప్రాపర్టీ విక్రయించిన సంవత్సరంలో ఇతర పెట్టుబడి సాధనాలపై ఎలాంటి దీర్ఘకాల మూలధన లాభాలు నమోదు చేయని వారు.. తదుపరి ఆర్థిక సంవత్సరానికి క్యారీ ఫార్వార్డ్ చేసుకోవచ్చు.

ప్రాపర్టీ కొనుగోలు ధర..?

మెజారిటీ నిపుణుల విశ్లేషణ ప్రకారం ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 48 కింద అసలు కొనుగోలు ధర, చెల్లించిన స్టాంప్ డ్యూటీ చార్జీలు, రిజిస్ట్రేషన్ చార్జీలు, ఇంటి కొనుగోలుకు రుణం తీసుకుంటే అందుకు చేసిన వడ్డీ చెల్లింపులు (దీనిపై ఆదాయపన్ను మినహాయింపులు క్లెయిమ్ చేయకపోతేనే) అన్నింటినీ మూలధన లాభం లెక్కింపులోకి పరిగణనలోకి తీసుకుంటారు. ''ఉదాహరణకు ఎక్స్ అనే వ్యక్తి రూ.50 లక్షల ప్రాపర్టీని కొనుగోలు చేశారు. దీనిపై రూ.3.5 లక్షలు స్టాంప్ డ్యూటీ కింద చెల్లించారు. ఇందులో రూ.1.5 లక్షలను అదే ఆర్థిక సంవత్సరంలో సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు పొందారు. కొనుగోలుకు రుణం తీసుకోగా, దీనిపై మొత్తం మీద రూ.10 లక్షలు వడ్డీ రూపంలో చెల్లించారు. ఇందులో రూ.4 లక్షల వడ్డీ చెల్లింపులపైనే సెక్షన్ 24(బీ) కింద పన్ను మినహాయింపు పొందారు. దీంతో అసలు రూ.50 లక్షలు, స్టాంప్ డ్యూటీలో పన్ను మినహాయింపు క్లెయిమ్ చేయని రూ.2 లక్షలు, గృహ రుణంపై వడ్డీ చెల్లింపుల్లో పన్ను మినహాయింపు క్లెయిమ్ చేయకుండా మిగిలిన రూ.6 లక్షలు కలిపితే మొత్తం రూ.58 లక్షలను ప్రాపర్టీ కొనుగోలు ధర కింద పరిగణనలోకి తీసుకుంటారు''అని ఖైతాన్ లీగల్‌కు చెందిన జోరావాలా తెలిపారు.

2001 ఏప్రిల్ 1కి ముందు కొనుగోలు చేస్తే..?

ఇంటిని 2001 ఏప్రిల్ 1 లేదా ఆ తర్వాత కొనుగోలు చేసిన వారికి వాస్తవ కొనుగోలు వ్యయాన్ని మూలధన లాభాలకు సంబంధించి పరిగణనలోకి తీసుకుంటారు. అంతకుముందు కొనుగోలు చేసిన వారికి 'గ్రాండ్ ఫాదరింగ్' ప్రొవిజన్ అమలవుతుంది. 2001 ఏప్రిల్ 1కి ముందు కొనుగోలు చేసిన కేసుల్లో సహేతుక మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుంటారు. మరి ఈ సహేతుక మార్కెట్ విలువ అన్న దానికి ఇంకా స్పష్టమైన నిర్వచనం ఇవ్వలేదు. మార్కెట్ విలువలకు, రిజిస్ట్రేషన్ విలువలకు మధ్య గతంలో ఎంతో అంతరం ఉండేది. రిజిస్ట్రేషన్ వ్యాల్యూనే పరిగణనలోకి తీసుకుంటే మరింత పన్ను భారం ఎదుర్కోవాల్సి రావచ్చు.

నికర పన్ను పన్ను 14.95 %

దీర్ఘకాల మూలధన లాభంపై 12.5 శాతం పన్నుకు అదనంగా 15 శాతం సర్‌చార్జ్, 4 శాతం సెస్సు కూడా కలిపితే మొత్తం రూ.14.95 శాతం పన్ను కింద చెల్లించాలన్నది గుర్తుంచుకోవాలి.

ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సిందే..?

ప్రభుత్వం పన్ను నిబంధనలు మార్చిన నేపథ్యంలో.. పెట్టుబడుల దృష్ట్యా ఇల్లు, స్థలాలను కొనుగోలు చేసే వారు ముందు జాగ్రత్తలు తీసుకోక తప్పదు. ముఖ్యంగా తాము ఇన్వెస్ట్ చేస్తున్న ప్రాంతంలో ధరలు ఏటా కనీసం 10 శాతం, అంతకంటే ఎక్కువ పెరిగినప్పుడే ప్రయోజనం దక్కుతుంది. లేదంటే ఒకవైపు పన్ను భారం, మరోవైపు ద్రవ్యోల్బణ ప్రభావం కలిపి నికరంగా మిగిలేదేమీ ఉండదని నిపుణులు సూచిస్తున్నారు.

ఎప్పుడో కొని ఉంటే పన్ను భారం

10–20 ఏళ్లకు ముందు కొనుగోలు చేసిన వారు తాజా పన్ను ప్రతిపాదనతో ఎక్కువ పన్ను భారాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే అప్పటి నుంచి ఇప్పటికి ప్రాపర్టీ ధరల్లో గణనీయమైన పెరుగుదల చోటు చేసుకుంది. ఇండెక్సేషన్ ప్రయోజనం తొలగించడం వల్ల మూలధన లాభాలు ఎక్కువగా కనిపిస్తాయి. దీంతో ఎక్కువ పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఇక నాన్ మెట్రో పట్టణాల్లో, పల్లెల్లో ప్రాపర్టీ ధరల పెరుగుదల అంతగా లేదు. వీటిని విక్రయించినప్పుడు ద్రవ్యోల్బణ ప్రభావం పోను నికరంగా నష్టమే వస్తుంది. అయినా కానీ, నూతన విధానంలో వీరు పన్ను చెల్లించాల్సి వస్తుందని నిపుణులు అంటున్నారు.

పదేళ్లకు మించితే భారమే...

ఇండెక్సేషన్ ప్రయోజనం తొలగించడం వల్ల పదేళ్లకు పైగా ప్రాపర్టీలను హోల్డ్ చేసిన వారిపై గణనీయమైన ప్రభావం పడుతుంది. దీనివల్ల పదేళ్లకు మించిన ఆస్తులను విక్రయించే వారు అధిక పన్ను చెల్లించాల్సి వస్తుంది.

– నిరంజన్ హీరనందాని, నరెడ్కో చైర్మన్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-8-2024	
విశాఖ	450–00
చిత్తూరు	493–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	440–00
విజయవాడ	450–00
హైదరాబాద్	440–00

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఒలింపిక్స్ నేర్పించే పెట్టుబడి పాఠాలు..
బలహీనంగానే మార్కెట్ సెంటిమెంట్

న్యూ ఫండ్ ఆఫర్స్

ఇన్వెస్కో ఇండియా మాన్యుఫాక్చరింగ్ ఫండ్



ఇన్వెస్కో మ్యుచువల్ ఫండ్ కొత్తగా ఇన్వెస్కో ఇండియా మాన్యుఫాక్చరింగ్ ఫండ్‌ను ప్రకటించింది. ఈ ఫండ్ ఆఫర్ ఆగస్టు 8తో ముగుస్తుంది. కనీసం రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. సిప్ పద్ధతిలో రూ. 500 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. యూనిట్స్ కేటాయించిన 3 నెలల్లోపు వైదొలిగితే 0.50 శాతం ఎగ్జిట్ లోడ్ ఉంటుంది. తయారీ రంగ కంపెనీల ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సాధనాల్లో 80–100 శాతం ఇన్వెస్ట్ చేయడం ద్వారా పెట్టుబడి వృద్ధికి ఈ ఫండ్ తోడ్పడనుంది. వివిధ మార్కెట్ క్యాపిటలైజేషన్లవ్యాప్తంగా పోర్ట్‌ఫోలియోలో 50–60 స్టాక్స్ ఉంటాయి.

కోటక్ మహీంద్రా నిఫ్టీ మిడ్‌క్యాప్ 50 ఇండెక్స్ ఫండ్



కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ తాజాగా కోటక్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 50 ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఆగస్టు 8తో ముగుస్తుంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ ప్రాతిపదికన నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ నుంచి టాప్ 50 షేర్లు నిఫ్టీ మిడ్‌క్యాప్ 50 సూచీలో ఉంటాయి. ఎన్ఎస్ఈ ఎఫ్అండ్‌వో సెగ్మెంట్లో ట్రేడయ్యే వాటికి ప్రాధాన్యం ఇస్తారు. పేరొందిన మిడ్‌క్యాప్ సంస్థల్లో తక్కువ వ్యయాలతో, పారదర్శకంగా ఇన్వెస్ట్ చేయడం ద్వారా ప్రయోజనాలు పొందేందుకు ఈ ఫండ్ ఉపయోగకరంగా ఉంటుందని సంస్థ ఎండీ నీలేష్ షా తెలిపారు.

ఎస్‌బీఐ ఎంఎఫ్ ఇన్నోవేటివ్ ఆపర్చునిటీస్ ఫండ్



ఇన్నోవేషన్ థీమ్ ఆధారిత సంస్థల్లో ఇన్వెస్ట్ చేసే విధంగా ఇన్నోవేటివ్ ఆపర్చునిటీస్ ఫండ్‌ను ఎస్‌బీఐ మ్యుచువల్ ఫండ్ ఆవిష్కరించింది. కొత్త ఆవిష్కరణల వ్యూహాలను అమలు చేయడం ద్వారా ప్రయోజనం పొందే కంపెనీల ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత సాధనాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఇన్వెస్టర్లకు మెరుగైన రాబడులు అందించడం ఈ స్కీము లక్ష్యం. దీనికి నిఫ్టీ 500 టీఆర్ఐ ప్రామాణికంగా ఉంటుంది. ఈ ఓపెన్ ఎండెడ్ ఫండ్ ఆగస్టు 12తో ముగుస్తుంది. ఇన్నోవేషన్ థీమ్ ఆధారిత సంస్థల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఇన్వెస్టర్లు ప్రయోజనాలు పొందవచ్చు.

హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ 500 మల్టీక్యాప్ ఇండెక్స్ ఫండ్



హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ కొత్తగా నిఫ్టీ500 మల్టీక్యాప్ 50:25:25 ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. నిఫ్టీ500 మల్టీక్యాప్ 50:25:25 ఇండెక్స్‌ను ట్రాక్ చేసే ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఆగస్టు 20తో ముగుస్తుంది. ఒకే స్కీము ద్వారా వివిధ మార్కెట్‌క్యాప్‌లవ్యాప్తంగా ఇన్వెస్ట్ చేసేలా డైవర్సిఫికేషన్ ప్రయోజనాలను ఇది అందిస్తుంది. నిఫ్టీ 500 సూచీలోని లార్జ్ క్యాప్‌లకు 50 శాతం, మిడ్‌క్యాప్.. స్మాల్ క్యాప్‌లకు చెరి 25 శాతం చొప్పున ఇందులో వెయిటేజీ ఉంటుంది. వీటిని ప్రతి మూణ్నెల్లకోసారి సవరిస్తారు. ఇందులో కనీసం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు.

‘తాయెత్తు’ కోసం..



ఆదివారం అమావాస్య రావడంతో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పాతబస్తీలోని ఇస్లాం పేట జెండా చెట్టు వద్దకు తాయెత్తు కోసం ఉదయమే జనం భారీగా తరలివచ్చారు. జెండా చెట్టు నుంచి రోడ్డు చివర వరకు క్యూలో గంటల తరబడి వేచియుండి మరీ తాయెత్తు కట్టించుకుని వెళ్లారు. – వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ)

సొర.. ధరహాసం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది సముద్ర తీరంలో జాలర్ల వలకు మూడు భారీ సొర చేపలు చిక్కాయి. ఒక్కోటి 80 కేజీల చొప్పున మూడు 240 కేజీల బరువు తూగాయి. వీటిని రూ.24 వేలకు కొనుగోలు చేసిన వ్యాపారులు కోల్‌కతా మార్కెట్‌కు తరలించారు. – సఖినేటిపల్లి

శారీ వాక్..



విశాఖలోని ఆర్కే బీచ్‌లో ఆదివారం హ్యాండ్లూం శారీ వాక్ నిర్వహించారు. సీఎంఆర్ యాజమాన్యం ఆధ్వర్యంలో 1,000 అడుగుల చీరను ప్రదర్శించారు. ఈ చీర రూపొందించడానికి రూ.6 లక్షలు ఖర్చు అయినట్లు సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తెలిపారు. 10,000 మంది మహిళలు శారీవాక్‌లో పాల్గొన్నారు. – బీచ్‌రోడ్డు (విశాఖ జిల్లా)

చిరుత కళ్లు చమక్కు



సాధారణంగా ఏ జంతువుకైనా రెండు కళ్లు ఒకే రంగులో ఉంటాయి. కానీ కర్ణాటక రాష్ట్రం చామరాజనగర జిల్లాలోని బండీపుర అభయారణ్యంలో ఓ చిరుత పులి రెండు రంగుల కనుగుడ్లు కలిగి విచిత్రంగా ఉంది. ఇలాంటి చిరుతలు చాలా అరుదుగా ఉంటాయని రాష్ట్ర వన్యజీవుల ఫొటోగ్రాఫర్ ధృవ పాటిల్ తెలిపారు. తన కెమెరాలో బంధించిన ఈ చిరుత అపురూపమైనదని పేర్కొన్నారు. శాస్త్రీయంగా దీనిని హెటెరోక్రోమియా ఇరిడం అని పిలుస్తారని తెలిపారు. – మైసూరు

ఆయువు తీస్తున్న వాయువు

ప్రపంచవ్యాప్తంగా నిత్యం 2వేల మంది చిన్నారుల మృత్యువాత

కలుషిత గాలిని పీల్చడంతోనే బలి

2021లో గాలి కాలుష్యంతో 80 లక్షల మంది మృతి

పొగాకు వినియోగం, అధిక రక్తపోటు తర్వాత కాలుష్య మరణాలే ఎక్కువ

హెల్త్ ఎఫెక్ట్స్ ఇన్‌స్టిట్యూట్ నివేదికలో వెల్లడి

ఇప్పటి దాకా ఐదేళ్ల లోపు చిన్నారుల్లో మరణానికి పోషకాహార లోపం ప్రధాన పాత్ర వహిస్తుంటే... తాజాగా ఈ జాబితాలోకి వాయు కాలుష్యం కూడా చేరింది. ప్రపంచ వ్యాప్తంగా రోజూ దాదాపు 2వేల మంది చిన్నారులు కలుషిత గాలిని పీల్చడం వల్ల మృత్యువాత పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అపరిశుభ్రత, కలుషిత నీరు కంటే గాలి కాలుష్యంతోనే ఆరోగ్యంప్రమాదంలో పడుతోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. హెల్త్ ఎఫెక్ట్స్ ఇన్‌స్టిట్యూట్ (హెచ్‌ఈఐ) విడుదల చేసిన కొత్త అధ్యయనం ప్రకారం..2021లో 80లక్షల మందికిపైగా కలుషిత గాలి కారణంగా మృతి చెందారు. వీరిలో చిన్నారులతో పాటు వయోజనులు ఉండటం గమనార్హం. ఇదిలా ఉంటే... ఇంట్లో కూడా కాలుష్యం పెరుగుతుండటంతో గాలి నాణ్యత మరింత క్షీణించి అనారోగ్య సమస్యలు విజృంభిస్తున్నాయి. - సాక్షి, అమరావతి



ప్రపంచవ్యాప్తంగా పొగాకు వినియోగం, అధిక రక్తపోటు తర్వాత మనిషి ప్రాణాలకు వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకరంగా తయారైంది. అధిక ఆదాయ దేశాల్లో కంటే ఆఫ్రికాలోని చాలా ప్రాంతాల్లో 500 రెట్లు చిన్నారుల మరణాల రేటు ఎక్కువగా ఉండటం గమనార్హం. పీఎం 2.5గా పిలిచే చిన్న కణాలు.. అంటే 2.5 మైక్రోమీటర్ల వ్యాసం కంటే చిన్నవిగా గాల్లో కలిసిపోయి ఉండే వివిధ రకాల ధూళి కణాలు ప్రపంచ వాయు కాలుష్య మరణాల్లో 90 శాతం కంటే ఎక్కువగా కారణం అవుతున్నాయని నివేదిక పేర్కొంది.

పొగాకు, రక్తపోటు తర్వాత ఇదే..



వాయు కాలుష్యం గణాంకాలు ఇలా..

ప్రపంచవ్యాప్తంగా రోజూ మృతి చెందుతున్న చిన్నారుల సంఖ్య	2021లో మృతి చెందినవారి సంఖ్య	కాలుష్య కారకాలు ఓజోన్‌లోకి ప్రవేశించడం వల్ల మృతి చెందినవారి సంఖ్య	శుభ్రమైన వంట ఇంధనాలు అందుబాటులో లేనివారి సంఖ్య
2,000	80 లక్షలు	5 లక్షలకుపైగా	230 కోట్లు

వాయు కాలుష్యంతో నష్టాలు..



- శ్వాస తీసుకున్నప్పుడు గాలి ద్వారా ధూళి కణాలు రక్తంలోకి ప్రవేశించి శరీరంలోని అవయవాల పనితీరును తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.
- ఊపిరితిత్తుల వ్యాధులు సంభవిస్తున్నాయి.
- గుండెజబ్బులు, మధుమేహం, చిత్త వైకల్యం తలెత్తుతున్నాయి
- మహిళల్లో గర్భస్రావాలు

వాయు కాలుష్యానికి కారణాలు..



- చెట్ల నరికివేత, అడవుల్లో కార్చిచ్చు
- తీవ్రమైన కరువులు, భూములు ఎండిపోవడం
- తీవ్ర గాలులు, తుపానులు
- వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు
- వాయు మార్గంలో ప్రయాణాలతో నైట్రోజన్ ఆక్సైడ్‌ల విడుదల

వాతావరణ సంక్షోభమే కారణమా?

వాతావరణ సంక్షోభం కూడా గాలి నాణ్యతను దిగజారుస్తోందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. కాలుష్య కారకాలు ఓజోన్‌లోకి ప్రవేశించడం ద్వారా 2021లో ఐదు లక్షల మందికిపైగా మరణాలకు కారణమైనట్టు నివేదిక తెలిపింది. ప్రధానంగా బయోమాస్, బొగ్గు, పారాఫిన్, ముడి ఇంధనాలతో వంట చేయడంతోనూ కాలుష్యం పెరిగి చిన్నారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని గుర్తించింది. **సోలార్** స్టవ్‌ల వినియోగం అందుబాటులోకి వస్తే పీఎం 2.5 ఉద్గారాలు, కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను చాలా వరకు తగ్గించవచ్చని స్పష్టం చేస్తోంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 230 కోట్ల మందికి శుభ్రమైన వంట ఇంధనాలు అందుబాటులో లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది.

క్లుప్తంగా...

క్యాన్సర్ నివారణకు చర్యలు చేపట్టండి

కేంద్ర ఆరోగ్య, కుటుంబ, సంక్షేమశాఖ మంత్రికి ఎంపీ గురుమూర్తి లేఖ



తిరుపతి మంగళం: క్యాన్సర్ కారణంగా దేశంలో ఏడాదికి 8.5 లక్షల మరణాలు నమోదవుతున్నాయని, ప్రతి 9 మందిలో ఒకరు క్యాన్సర్ బారినపడుతున్నారని, ఇది ఆందోళన కలిగించే అంశమని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి పేర్కొన్నారు. ఏపీలో క్యాన్సర్ స్క్రీనింగ్, ముందస్తుగా గుర్తించడం, చికిత్స, నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాసినట్లు ఎంపీ గురుమూర్తి ఆదివారం తెలిపారు. ఆ లేఖకు మంత్రి స్పందిస్తూ క్యాన్సర్ సహా గుండె వ్యాధులు, హైపర్ టెన్షన్, మధుమేహంలాంటి వ్యాధులను నియంత్రించడానికి కేంద్ర ఆరోగ్య కుటుంబ, సంక్షేమ శాఖ పరిధిలోని ఆఫ్ నాన్–కమ్యూనికబుల్ డిసీజెస్ విభాగంతో జాతీయ కార్యక్రమాన్ని అమలు చేస్తామని చెప్పినట్లు ఎంపీ పేర్కొన్నారు.

రాష్ట్రంలో 'మిషన్ లైఫ్' అమలు

సీఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్



సాక్షి, అమరావతి: బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) అమలు చేస్తున్న మిషన్ లైఫ్ కార్యక్రమం ప్రభుత్వం అమలు చేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ తెలిపారు. మిషన్ లైఫ్ అమలులో దేశంలోనే ట్రెండ్ సెట్ చేసే దిశగా ఏపీ మార్గదర్శిగా మారనుందని ఆయన స్పష్టం చేశారు. బీఈఈ, విద్యుత్‌మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రభుత్వం తరపున ఏపీలో మిషన్ లైఫ్ అమలు చేసేందుకు అనుసరించాల్సిన ఉత్తమ పద్ధతులపై సమగ్ర నివేదికను బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి సీఎస్ నీరభ్ కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. మిషన్ లైఫ్ కార్యక్రమాలు ఆరోగ్యం, ఆర్థిక, పర్యావరణ పరిస్థితుల్ని మెరుగుపరుస్తూ జీవన ప్రమాణాలు గణనీయంగా పెంచేందుకు దోహదపడతాయని సీఎస్ అన్నారు. ఎల్ఈడీ బల్బులు, ప్రజా రవాణా, స్వల్ప దూర ప్రయాణాలకు సైకిళ్లు, సీఎన్‌జీ, కార్లు, సోలార్ విద్యుత్ వినియోగం వల్ల ఇంధనం ఆదా చేయవచ్చని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు.

ఆర్గానిక్ సబ్బుల తయారీలో ప్రపంచ రికార్డు


గోకవరం మహిళకు వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



సర్టిఫికెట్, మెడల్‌తో లలితజ్యోతి

గోకవరం: నిమిషంలో ఎక్కువ ఆర్గానిక్ సబ్బులు తయారు చేసి తూర్పు గోదావరి జిల్లాలోని మండల కేంద్రమైన గోకవరం గ్రామానికి చెందిన దామోదర లలిత జ్యోతి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. బెంగళూరుకు చెందిన శశి క్లాసెస్ సంస్థ అధినేత వి.మృదులారెడ్డి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా నిమిషంలో ఎక్కువ ఆర్గానిక్ సబ్బుల తయారీపై జూన్ 26న పోటీ నిర్వహించారు. ఇందులో 27 మంది బృందంగా ఏర్పడి 2,008 సబ్బులు తయారు చేసి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. వీరిలో గోకవరానికి చెందిన లలిత జ్యోతి ఆదివారం వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి మెడల్, సర్టిఫికెట్ అందుకున్నారు.

ఏపీ ఆర్కియాలజీకి జాతీయ స్థాయి గుర్తింపు



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ ఆర్కియాలజీకి జాతీయస్థాయి గుర్తింపు లభించింది. 'యుగయుగీన్ భారత్ మ్యూజియం' విస్తరణ నిమిత్తం 3 రోజుల పాటు కేంద్ర పర్యాటక శాఖ నిర్వహించిన కాన్‌క్లేవ్, వర్క్‌షాపులో ఏపీ సేకరణలు, అభ్యాసాలకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. సౌత్‌జోన్ నుంచి ఆంధ్రప్రదేశ్‌ను విజేతగా నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏపీకి ఆర్కియాలజీ కమిషనర్ జి.వాణీమోహన్ ప్రాతినిధ్యం వహించారు.

వైద్య రంగంలో కీలకం కానున్న మైక్రోబయాలజీ

- పద్మభూషణ్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి
- జీఎస్ఎల్‌లో ముగిసిన సౌత్ జోన్ వైద్య విజ్ఞాన సదస్సు



రాజానగరం : వ్యాధి నిర్ధారణ, చికిత్సలకు వచ్చే ఐదారేళ్లలో మైక్రోబయాలజీ మూలాధారమవుతుందని అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, పద్మభూషణ్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆధ్వర్యాన తూర్పు గోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న సౌత్ జోన్ వైద్య విజ్ఞాన సదస్సు ఆదివారంతో ముగిసింది. ముఖ్య అతిథి డాక్టర్ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ సహజ స్వాభావిక ఆహారం, అవసరమైన బ్యాక్టీరియాను ఇవ్వడమే వ్యాధులకు రాబోయే కాలంలో చికిత్స కాగలదని చెప్పారు. పేగుల్లో నివసించే వెయ్యి రకాల బ్యాక్టీరియాల్లో హెచ్చు తగ్గులు రకరకాల వ్యాధులకు కారణమవుతున్నాయన్నారు. ప్రధానంగా ఆహారంలో మార్పుల వలన బ్యాక్టీరియాలో సమతూకం దెబ్బతిని రకరకాల వ్యాధులొస్తున్నాయని తెలిపారు. సిజేరియన్ కాకుండా సహజ ప్రసవం ద్వారా పుట్టిన పిల్లలు, కనీసం ఆరు మాసాల పాటు తల్లి పాలు తాగిన పిల్లలు, ఆరు నెలల్లోపు యాంటీబయాటిక్స్ వాడని పిల్లల్లో మంచి బ్యాక్టీరియా ఉండటంతో ఆరోగ్య సమస్యలుండటం లేదని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇంటి భోజనం తీసుకునే వారికి, బయట జంక్ ఫుడ్ తీసుకునే వారికి బ్యాక్టీరియాల్లో ఉన్న తేడాలను తమ సంస్థ ప్రయోగాల్లో గమనించిందని వెల్లడించారు. మన వాతావరణానికి సరిపడే ఇడ్లీ, దోశ, పెరుగు వంటివి తింటున్న వారిలో క్యాన్సర్ నెమ్మదించిందని అధ్యయనాలు చెబుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వాడ్రేవు రవి(కాకినాడ), డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి (అమలాపురం), డాక్టర్ వాణీమాధవి(జీఎస్ఎల్), డాక్టర్ పీఎస్ఎస్ శర్మ(అమలాపురం), డాక్టర్ సోమనాథ్‌దాస్ (జీఎస్ఎల్) తదితరులు పాల్గొన్నారు.

డీజీపీ ఆఫీస్ సమీపంలో దారుణం

- యువతిపై ప్రేమోన్మాది హత్యాయత్నం
- మెడ, మణికట్టుపై బ్లేడుతో దాడి
- ప్రతిఘటించి యువకుడిని పోలీసులకు అప్పగించిన యువతి స్నేహితులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు



ఆస్పత్రిలో బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు

తాడేపల్లిరూరల్ : సాక్షాత్తు రాష్ట్ర డీజీపీ కార్యాలయం సమీపంలోనే ఓ ప్రేమోన్మాది చెలరేగిపోయాడు.. ప్రేమ పేరుతో ఓ యువతి గొంతు కోసి హత్య చేసేందుకు యత్నించాడు. ఆమె స్నేహితులు ప్రతిఘటించడంతో.. ఆ యువతి గాయాలతో బయటపడింది. కృష్ణా జిల్లా అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని సీతాయలంక మండలీపురానికి చెందిన యువతి తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రిలో జీఎస్ఎం స్టాఫ్ నర్సుగా పనిచేస్తూ వడ్డేశ్వరంలోని ఓ హాస్టల్లో ఉంటోంది. గుంటూరు జిల్లా క్రోసూరుకు చెందిన వరగంజి క్రాంతిమౌళి, ఈ యువతి కృష్ణా జిల్లా మొవ్వ గ్రామంలో ఇంటర్ కలిసి చదువుకున్నారు. ఆ తర్వాత ఆమె గుంటూరులో నర్సింగ్ చేస్తుండగా, క్రాంతిమౌళి గుంటూరులో ఐటీఐ చేశాడు. ఈ క్రమంలో వీరిద్దరికి పరిచయమేర్పడింది. అప్పుడప్పుడూ ఫోన్‌లో మాట్లాడుకుంటామని బాధితురాలు తెలిపింది. చదువుల అనంతరం తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రిలో జీఎస్ఎం స్టాఫ్ నర్సుగా యువతి పనిచేస్తుండగా.. క్రాంతిమౌళి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. తరచూ ఆమెకు క్రాంతి ఫోన్ చేసి విసిగిస్తుండటంతో ఈ మధ్యకాలంలో క్రాంతిని దూరం పెట్టింది. దీంతో కోపం పెంచుకున్న క్రాంతిమౌళి.. హైదరాబాద్ నుంచి వడ్డేశ్వరంలో యువతి నివాసముంటున్న హాస్టల్ వద్దకు వచ్చి ఫోన్ చేశాడు. యువతి తన స్నేహితురాలితో కలిసి చర్చి వద్ద ఉన్నానని చెప్పగా.. క్రాంతిమౌళి అక్కడకు వెళ్లాడు. యువతి తన స్నేహితురాలితో కలిసి ఆటో ఎక్కుతుండగా వాళ్లతో పాటు ఆటో ఎక్కి ఆటోలోనే ఆమెతో గొడవకు దిగాడు. హాస్టల్ వద్దకు వచ్చిన బాధితురాలు హాస్టల్లోకి వెళుతుండగా జుట్టు పట్టుకుని మెడపై బ్లేడుతో దాడి చేశాడు. పక్కనే ఉన్న ఆమె స్నేహితురాలు అతడ్ని గట్టిగా నెట్టివేసే ప్రయత్నం చేసింది. క్రాంతిమౌళి మళ్లీ యువతి మెడ, మణికట్టుపై దాడి చేశాడు. అక్కడే ఉన్న తోటి నర్సులు ప్రతిఘటించి. అతడిని పట్టుకుని తాడేపల్లి పోలీసులకు అప్పగించారు. తీవ్రంగా గాయపడిన యువతిని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు చెప్పారు.

‘కోర్బా-విశాఖ’ రైలు బోగీలో మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, రైల్వే సిబ్బంది

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): విశాఖ రైల్వేస్టేషన్‌లో నిలిపి ఉన్న రైలులోంచి మంటలు వ్యాపించాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది, అధికారులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం చేరవేశారు. అగ్నిమాపక, రైల్వే సిబ్బంది 2 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కోర్బా-విశాఖ (18517) ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం 6.30 గంటలకు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం 4కు చేరుకుంది. ప్రయాణికులు దిగిపోయిన తరువాత నిర్వహణ పనుల కోసం రైలును అదే ప్లాట్‌ఫాంపై నిలిపి ఉంచారు. ఉదయం 9.45 గంటల ప్రాంతంలో బి–7 థర్డ్ ఏసీ కోచ్ నుంచి దట్టమైన పొగ వచ్చి భారీ మంటలు వ్యాపించాయి. సిబ్బంది అప్రమత్తమై రైల్వే ఉన్నతాధికారులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. కాసేపటికి బి–7కి ఇరువైపులా ఉన్న బి–6, ఎం–1 కోచ్‌లకు కూడా మంటలు వ్యాపించాయి. వెంటనే అధికారులు మంటలను అదుపు చేసి బి–7 కోచ్ నుంచి మిగిలిన కోచ్‌లను వేరు చేశారు. దీంతో ప్రమాద తీవ్రత తగ్గింది. ఈ ఘటనలో బి–7 కోచ్ పూర్తిగా కాలిపోయింది. మంటలు అదుపులోకి రావడంతో రైలును కోచింగ్ కాంప్లెక్స్‌కు పంపించారు. ఈ ఘటనకు షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. కాగా, కోర్బా నుంచి విశాఖ వచ్చిన ఈ రైలు మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ నుంచి బయల్దేరి కడప వెళ్లాల్సి ఉంది. ఘటన జరిగిన వెంటనే కోచింగ్ కాంప్లెక్స్‌లో యుద్ధప్రాతిపదికన పూర్తిగా పాడైన బి–7, పాక్షికంగా దెబ్బతిన్న బి–6, ఎం–1 కోచ్‌లను రైలు నుంచి తప్పించి ఈ కోచ్‌ల స్థానంలో వేరే కోచ్‌లను ఏర్పాటు చేసి, మధ్యాహ్నం 2.15 గంటలకు విశాఖ–కడప(17488) తిరుమల ఎక్స్‌ప్రెస్ బయల్దేరింది.

త్వరలో మూడో స్థానానికి భారత్ ఆర్థిక వ్యవస్థ

కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ



సాక్షి, అమరావతి/తిరుమల/కాణిపాకం: భారత దేశ ఆర్థిక వ్యవస్థ త్వరలో మూడో స్థానానికి చేరుతుందని కేంద్ర భారీ పరిశ్రమలు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. ఆయన ఆదివారం వీఐపీ విరామ సమయంలో తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల పాత్రికేయులతో మాట్లాడారు. గత ఐదేళ్లలో ఏపీ ఏమాత్రం అభివృద్ధి చెందలేదని.. హిందూ దేవాలయాలను చిన్న చూపు చూసారని విమర్శించారు. ఏపీలో దేవాలయాలను రక్షిస్తామని, మరిన్ని ఆలయాలను పునరుద్ధరిస్తామన్నారు. ఏపీకి కొత్త పరిశ్రమలను తీసుకొస్తామని, భారీ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని వివరించారు. అనంతరం కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. అక్కడ ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, అది కేంద్ర ప్రభుత్వం నిర్ణయం కాదని చెప్పారు.

ఇల్లులేని పేదలందరికీ ఇళ్లు : మంత్రి సారథి

రాష్ట్రంలో ఇల్లులేని పేదవాళ్లకు ఇళ్లు నిర్మిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఆదివారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. జర్నలిస్టులకు సరసమైన ధరలకు ఇళ్లు అందజేస్తామన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం టార్గెట్ పెట్టుకుని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. వాటిని ఈఎంఐ పద్ధతిలో లబ్ధిదారులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే రాష్ట్ర చిన్న,మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

టీచర్లకు ఆదాయ పన్ను మినహాయించండి

సేవా రంగంలో ఉండి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే టీచర్లను ఆదాయపన్ను నుంచి మినహాయించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను కోరింది. ఆదివారం తిరుపతిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి గట్ల సాంబిరెడ్డి తదితర నేతలు మంత్రిని కలిసి వినతి పత్రమిచ్చారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. ప్రాథమిక విద్య మాతృభాషలోనే బోధించాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుపై ఇచ్చిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లోని ఇబ్బందులను తొలగించి అన్ని కేడర్ల ప్రమోషన్లకు మార్గం సుగమం చేయాలన్నారు.

వర్ధమాన మహావీరుని శిల్పాన్ని కాపాడుకోవాలి

పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి




వర్ధమాన మహావీరుని విగ్రహాన్ని పరిశీలిస్తున్న పూరావస్తు పరిశోధకులు

కర్నూలు కల్చరల్: వెయ్యేళ్లనాటి వర్ధమాన మహావీరుని శిల్పాన్ని కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి కోరారు. 'ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టేరిటీ' కార్యక్రమంలో భాగంగా ప్లీచ్ ఇండియా సభ్యులు కల్లూరు మండలం నాయకల్లు గ్రామ శివారులో నిర్లక్ష్యంగా పడి ఉన్న శిల్పాలను ఆదివారం పరిశీలించారు. జైనుల 24వ తీర్థంకుడైన వర్ధమాన మహావీరుని శిల్పం, స్తంభం, పీఠాలను గ్రామానికి తరలించి భద్రపరిచి, చారిత్రక వివరాలతో పలకను ఏర్పాటు చేయాలని సూచించారు.

ఉద్యోగాల పేరిట మోసం

- 3,400 మంది నుంచి రూ. 200 కోట్లు వసూలు
- నలుగురు ఉత్తరాది యువకుల అరెస్టు



సాక్షి, చెన్నై : విదేశీ ఉద్యోగాల పేరిట 3,400 మంది నుంచి రూ.200 కోట్లు వసూలు చేసి ఆనక ఉడాయించిన నలుగురు ఉత్తరాది యువకులను పుదుచ్చేరి సైబర్ క్రైమ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పుదుచ్చేరి లాజ్ పేటకు చెందిన రమేశ్ కుమార్ విదేశాల్లో ఉద్యోగం కోసం ఫేస్‌బుక్‌లో ప్రకటన చూసి ఏజెన్సీని సంప్రదించాడు. అందులో ఓ వ్యక్తి కెనడాలో ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చాడు. వీసా, వైద్య పరిశోధనలు, ఇన్సూరెన్స్ నిమిత్తం డబ్బు డిపాజిట్ చేయాల్సిందిగా కోరాడు. అతడి మాటలు నమ్మిన సురేశ్‌కుమార్ రూ.17.71 లక్షలు డిపాజిట్ చేశాడు. రోజులు గడుస్తున్నకొద్దీ తనకు ఉద్యోగం రాకపోయేసరికి మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు బెంగళూరులో ఓ ముఠాను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం మధ్యప్రదేశ్‌కు చెందిన శుభం శర్మ, బిహార్‌కు చెందిన నవాడా దీపక్‌కుమార్, గణేష్ పూరా నీరజ్ కుమార్, ఉత్తరప్రదేశ్ చెందిన రాజ్‌కొట్ ఈ మోసాలకు బాధ్యులని తేల్చారు. ఓ ముఠాగా ఏర్పడి వీరు దేశవ్యాప్తంగా 3,400 మంది నుంచి రూ.200 కోట్లకు పైగా వసూలు చేసినట్లు పేర్కొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

పోలీస్ క్వార్టర్స్‌కు భూమిపూజ


భూమిపూజలో ఎమ్మెల్యే, ఎస్పీ తదితరులు

సిరుగుప్ప: నగరంలో పోలీస్ క్వార్టర్స్ నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే బీఎం నాగరాజు, ఎస్పీ శోభారాణి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పోలీసు సిబ్బందికి అన్ని విధాలా అనుకులంగా ఉండే విధంగా రూ. 5.40 కోట్ల వ్యయంతో క్వార్టర్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాయచూరు-సింధనూరు రైల్వే పనులు పూర్తి చేస్తాం


యాదగిరిలో వందేభారత్ రైలుకు పచ్చ జెండా ఊపుతున్న ఎమ్మెల్యే తదితరులు

రాయచూరు రూరల్: 2027 నాటికి రాయచూరు- సింధనూరు రైల్వే పనులు పూర్తి చేస్తామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్న వెల్లడించారు. శనివారం రాత్రి బెంగళూరు రైల్వే స్టేషన్‌లో రిమోట్ కంట్రోల్ ద్వారా బెంగళూరు-కలబుర్గి వందే భారత్ రైలును యాదగిరిలో స్టాపింగ్‌కు పచ్చజెండాను చూపి ప్రారంభించారు. యాదగిరి రైల్వే స్టేషన్‌లో గురుమిఠకల్ ఎమ్మెల్యే శరణే గౌడ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు ధనుంజయ, విజయ్‌కుమార్, అశోక్ కుమార్ మీనా, హేమరాజ్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊడిన ఆర్టీసీ బస్సు స్టీరింగ్

- అదుపుతప్పి వంతెనకు ఢీ
- 30 మందికి గాయాలు


ప్రమాద దృశ్యం

రాయచూరు రూరల్: ఆర్టీసీ బస్సు స్టీరింగ్ విరిగిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారు గాయపడిన ఘటన ఆదివారం నందిహాళ వద్ద చోటుచేసుకుంది. వివరాలు... మాన్వి నుంచి సింధనూరు వస్తున్న బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు వేగంగా వస్తుండగా ఒక్కసారిగా స్టీరింగ్ ఊడిపోయింది. దీంతో బస్సు నియంత్రణ కోల్పోయి పక్కనే ఉన్న వంతెనకు ఢీకొంది. డ్రైవర్‌తో పాటు 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను మాన్వి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా పరుగు పోటీ

సాక్షి, బళ్లారి: నగరంలో బళ్లారి సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో స్టీల్ సిటీ రన్ ఆదివారం నగర శివార్లలోని విజ్డం ల్యాడ్ ఆవరణలో ప్రారంభించారు. దేశంలోని 11 రాష్ట్రాల నుంచి 4 వేల మంది పరుగు పోటీలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. 10 కిలో మీటర్ల పోటీలో మహారాష్ట్రకు చెందిర రాహుల్‌సింగ్వి, 5 కి.మీ. పందెంలో బెళగావికి చెందిన లక్ష్మణ్ సిగారె ప్రథమ స్థానం నిలిచారు. ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, జిల్లా ఎస్పీ శోభారాణి విజేతలకు బహుమతులు అందజేశారు.

అదుపుతప్పి టీస్టాల్‌లోకి..


హోటల్‌లోకి దూసుకెళ్లిన టిప్పర్ లారీ

బళ్లారి అర్బన్: బళ్లారి జిల్లాలోని హోస్పేట్ రోడ్డు ఎన్‌హెచ్ 67 ప్రధాన రోడ్డులో ఆదివారం రెండు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కుడితిని సమీపంలోని ప్రధాన రోడ్డులో టిప్పర్ లారీ డివైడర్‌ను ఢీకొంది. దీంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. అదే విధంగా సండూరు రోడ్డులో బానట్టి గ్రామంలో టిప్పర్ లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో హోటల్‌లోకి దూసుకు పోయింది. అయితే ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు. ఆ సమయంలో హోటల్ బంద్ ఉంటంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.


కుడితిని సమీపంలో జరిగిన మరో ప్రమాదం

నిర్వహణ లోపం, విద్యార్థులకు శాపం


కిటికీలకు తలుపులు లేకపోవడంతో అట్టలతో మూసి ఉంచిన దృశ్యం


అపరిశుభ్రత మధ్య కూరగాయల నిల్వ


ఓ గదిలో పేరుకుపోయిన చెత్త

- అస్తవ్యస్తంగా వీవీ పీజీ హాస్టల్
- విద్యార్థుల అవస్థలు
- నదుపాయాలు నిల్

రాయచూరు రూరల్: రాయచూరు విశ్వ విద్యాలయం అనుబంధంగా ఉన్న హాస్టల్‌లో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాయచూరు వీవీలో అంబేడ్కర్ హాస్టల్‌లో పీజీ విద్యార్థులు 354 మంది ఉన్నారు. వీరికి గదులతో పాటు కనీస సౌకర్యాలు కూడా లేకుండా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ హాస్టల్ అటవీ ప్రాంతంలో ఉంది. ఇక్కడ వంట గదులు, భోజనం చేసే చోటు, శౌచాలయాలు, స్నానపు గదులు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఇక కరెంట్ వైర్లు బయటకు వచ్చి భయపెడుతున్నాయి. ఇక గదులకు తలుపులు లేవు, బల్బులు ఉండవు, ఫ్యాన్లు తిరగవు ఇలా అన్నీ సమస్యలే. హాస్టల్ వార్డెన్ ఇవేమి పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు అంతస్తుల ఈ భవనం వర్షం వచ్చినప్పుడు నీరు మొత్తం కిందకు కారుతుందని తెలిపారు. అసౌకర్యాల నడుమ ఎలా చదువుకోవాలని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

హాస్టల్లో సౌకర్యాలు మెరుగు పరచండి

వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రాయచూరు వర్సిటీని కళ్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి కార్యదర్శి సుందరేష్ బాబు సందర్శించారు. శనివారం సాయంత్రం అంబేడ్కర్ హాస్టల్‌ను పరిశీలించారు. అక్కడ సౌకర్యాలను వెంటనే మెరుగు పరచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా వీసీ హరీస్ రామస్వామి తదితరులు ఆయన వెంట ఉన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న సుందరేశ్‌బాబు

కొనసాగుతున్న వరద


తుంగభద్ర డ్యాం

హొసపేటె: తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. ఆదివారం డ్యామ్‌కు సుమారు లక్ష 20 వేల క్యూసెక్కుల వరద నీరు చేరడంతో డ్యామ్‌కు సంబంధించిన మొత్తం 29 గేట్లను రెండున్నర అడుగులు మేర పైకెత్తి దిగువకు లక్షా ఎనిమిది వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నీటినిల్వ 98.88 టీఎంసీలకు వరకు చేరుకొంది. ప్రస్తుతం డ్యాం నీటిమట్టం 1631.26 అడుగులకు చేరుకొంది. ఏ సమయంలో అయినా డ్యామ్ గేట్లను మరింత పైకెత్తి దిగువుకు నీటిని విడుదల చేసే ప్రమాదం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు చేశారు.

యాదగిరిలో సీఐడీ విచారణ

రాయచూరు రూరల్: యాదగిరి ఎస్‌ఐ పరశురామ్ మృతికి సంబంధించి సీఐడీ అధికారులు విచారణ చేపట్టారు. ఆదివారం సీఐడీ డీఎస్పీ పునీత్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టారు. ఎఫ్ఐఆర్, పంచనామ నివేదిక తదితర వాటిపై సమాచారాన్ని సేకరించారు.

ఎమ్మెల్యేపై చర్యలు చేపట్టాలి

ఎస్‌ఐ పరశురామ్ మృతికి కారకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త మానప్ప హడపద స్పీకర్ యూటీ ఖాదర్‌కు లేఖ రాశారు. ఎస్ఐల బదిలీలకు సదరు ఎమ్మెల్యే డబ్బులు తీసుకున్నట్లు ఆ లేఖలో ఆరోపించారు.

సైక్లింగ్ యాత్రికులకు సన్మానం


సైక్లిస్టులను సన్మానిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో సైక్లింగ్ యాత్రికులను ఘనంగా సన్మానించారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో రాయచూరు సైకిల్ రైడర్స్ సంఘంలోని 16 మందికి ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో విశ్వనాథ్ స్వామి పాల్గొన్నారు. శ్రీ నగర్ నుండి కార్గిల్ వరకు 416 కి.మీ.దూరం సైకిల్ తొక్కుతూ వెళ్లడం ఎంతో కష్టమన్నారు. కార్యక్రమంలో డా.బసవరాజ్ పాటిల్, డా.సకలేష్ పాటిల్, మల్లికార్జున, రవి, బసవరాజ్, సందీప్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భజన పోటీలు ప్రారంభం

రాయచూరు రూరల్ : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవరచుకోవాలని ఆర్డీఏ సభ్యుడు రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మెల్ రోజ్ జర్నలిజం కళాశాలలో అవదూత దత్తపీఠం గణపతి సచ్చిదానంద ఆశ్రమం ఆధ్వర్యంలో భజన పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో రాజా శ్రీనివాస నాయక్, సత్యవతి, నాగిరెడ్డి, మోనికా, లక్ష్మి, పూజితా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నరేగా ఉపాధి పనులు కరువు

- 800 మంది కూలీలకు గాను 60 మందికే జాబ్ కార్డులు

రాయచూరు రూరల్: జిల్లాలో వ్యవసాయ కూలీలకు పనులు కల్పించి వారి జీవనోపాధికి ఆసరాగా మారిన మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉద్యోగ ఖాత్రి పథకం (నరేగా) పనుల్లో కూలీలకు పనులు కల్పించకుండ అధికారులు యంత్రాలకు పనులు కల్పించిన ఘటనలు జిల్లాలో చోటు చేసుకున్నాయి. అందులో భాగంగా రాయచూరు తాలూకా జంబలదిన్ని గ్రామ పంచాయతీలో రూ.40 లక్షలు నిధులు మంజూరు అయ్యాయి. జంబలదిన్ని గ్రామ పంచాయతీ పరిధిలో పుచ్చలదిన్ని, మిడగల దిన్ని గ్రామాల్లో 800 మంది కూలీలకు గాను 60 మందికి జాబ్‌కార్డులున్న వారికి పనులు కల్పించి మిగిలిన వాటికి బోగస్ బిల్లులు సృష్టించి నిధులు దిగ మింగారని లోకాయుక్త అధికారులకు పంచాయతీ ఉపాధ్యక్షురాలు యల్లమ్మ ఫిర్యాదు చేశారు. పీడీఓ బంధువుల పేరుతో పనులు చేశారని ఆరోపించారు. గ్రామాల్లో నీటికుంటలు, కాలువల్లో పూడికతీతలకు వ్యవసాయ కూలీలకు పనులు ఇవ్వకుండ యంత్రాలతో పనుల చేయించుకుని బోగస్ బిల్లులు తయారు చేసి నిధులు నొక్కేశారని అన్నారు. తాలూకా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మూకప్ప మాట్లాడుతూ నరేగా పనుల్లో జరిగిన పనులపై విచారణ జరిపిస్తామన్నారు.

స్వామీజీ చాతుర్మాస దీక్ష


స్నానాలు ఆచరిస్తున్న స్వామీజీ, భక్తులు


దీక్షలో స్వామీజీ

రాయచూరు రూరల్: మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదంగల్ చాతుర్మాస దీక్ష చేపట్టారు. ఆదివారం మంత్రాలయం రాఘవేంద్ర స్వాముల మఠంలో విశేష పూజలతో పాటు సాముహిక అష్టోత్తర పారాయణం చేశారు. అంతకు ముందు ఆయన భక్తులతో కలిసి తుంగభద్ర నదిలో స్నానాలు ఆచరించారు.

అరాధనకు అడ్డంకుల్లేవ్ :

తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉన్నా రాఘవేంద్ర స్వాముల అరాధనకు అడ్డంకులు లేవని మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదంగల్ వెల్లడించారు. ఆదివారం మఠంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నీటి ఉధృతి ఉన్న మఠంలోకి, గుడిలోకి వరద నీరు వచ్చే ప్రమాదం లేదన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు.

మహారాష్ట్రలో ఆగని వర్షాలు


ఉధృతంగా ప్రవహిస్తున్న భీమానది


నీట మునిగిన పంటలు

- దూద్‌గంగా, కృష్ణా పరిధిలో 16 వంతెనలు మునక

రాయచూరు రూరల్: మహారాష్ట్రలోని పడమటి కనుమల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల దూద్‌గంగా, కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో 16 వంతెనలు నీట మునిగాయి. బెళగావి జిల్లా నిప్పాణి తాలూకా కారదగ బెంగాలీ బాబా దర్గా నీటిలో మునిగింది. ఇక మహారాష్ట్ర జాపుర డ్యామ్ నుంచి లక్ష క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేశారు. ఆదివారం యాదగిరిలోని బీమానది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉత్తర, కల్యాణ కర్ణాటక నదీ తీర ప్రాంత వాసులను అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

సిద్ధరామయ్య రాజీనామా చేయాలి

హుబ్లీ: కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి తాండవం చేస్తోందని, ఏడాదిన్నర పాలనలోనే సీఎంపై తీవ్రమైన ఆరోపణలు రావడం దురదృష్టకరమని, సీఎం సిద్ధరామయ్య నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నగరంలోని మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రే అవినీతిలో కూరుకుపోయారని, ఇక ఎమ్మెల్యేలు ఊరుకుంటారా అని ఎద్దేవా చేశారు. ముడా కుంభకోణంలో సీఎం హస్తం ఉందని ఆరోపించారు. వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో అవినీతి సొమ్మును కాంగ్రెస్ అధిష్టానంకు ఇవ్వలేదని నిరూపించుకోవాలన్నారు. సిద్ధరామయ్య నిజాయితీ నిరూపించుకోవాలంటే సీబీఐతో దర్యాప్తు చేయించుకోవాలని అన్నారు.

సేవలు విస్తరించాలి

రాయచూరు రూరల్: సమాజానికి విద్యార్థుల సేవలు విస్తరించాలని భారత్ రేజర్ అధ్యక్షుడు బసవరాజ బోరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు పాఠ్యేతర విషయాల్లో కూడా అవగాణ కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా వివిధ సేవలు అందించిన వారిని సన్మానించారు.

ఎస్‌ఐ కుటుంబ సభ్యులకు పరామర్శ


ఎస్‌ఐ పరశురాం ఇంటి వద్ద ఆర్ అశోక్

హొసపేటె: గుండెపోటుతో మృతి చెందిన యాదగిరి ఎస్‌ఐ పరశురామ్ కుటుంబ సభ్యులను బీజేపీ నేతలు ఆదివారం పరామర్శించారు. కరటగి తాలూకా సోమనాల గ్రామంలో పరశురాం ఇంటికి వచ్చిన మాజీ మంత్రి ఆర్ అశోక్, పరశురాం తండ్రి జనకరాజు, తల్లి గంగమ్మలను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయనతో పాటు నేతలు దొడ్డనగౌడ పాటిల్, మాజీ మంత్రులు హాలప్ప ఆచార్, రాజుగౌడ, మాజీ ఎంపీ శివరామగౌడ, జేడీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సీవీ చంద్రశేఖర్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

ఆకట్టుకున్న నాటకం


నాటకంలోని ఓ సన్నివేశంలో కళాకారుల అభినయం


బళ్లారి అర్బన్: బళ్లారి నగరంలోని రాఘవ కళా మందిరంలో రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు బళ్లారి రాఘవ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాన్న...నేనొచ్చేస్తా సాంఘిక తెలుగు నాటకం శ్రీ అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ గుంటూరు బృందం, టి.వెంకటేశ్వర్రావ్, దర్శకులు అమృత లహరి, వీరి నాటకం బళ్లారి వాసులకు అలరింపచేసింది. తిరుపతికి చెందిన కోనేటి సుబ్బరాజు, బళ్లారి రాఘవ అవార్డును అందుకొని రాఘవ గురించి కొనియడారు. కార్యక్రమంలో రిటైర్డ్ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి డాక్టర్.మంజుల చెల్లూరు, నటుడు ఆంధ్ర ప్రదేశ్ వాడ్రేవ్ సుందర్ రావ్, రాఘవ మెమోరియల్ అధ్యక్షుడు కే.కోటేశ్వర రావ్, గౌరవ అధ్యక్షులు చెన్నప్ప, పదాధికారులు రమేష్‌గౌడ పాటిల్, విష్ణువర్ధన్‌రెడ్డి, ధనుంజయ, నామ నాగరాజ్, రామాంజినేయలు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అమావాస్య పూజలు


కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు



బళ్లారి అర్బన్: ఆషాఢ అమావాస్య పూజలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం బళ్లారి నగర ఆరాధ్య దైవం శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి వెండి ఆభరణాల అలంకరణ, ప్రత్యేక పూజలు చేసినట్లు ఈఓ హనుమంతప్ప తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారికి దర్శనానికి భక్తులు విశేషంగా విచ్చేసి మొక్కులను తీర్చుకున్నారు. అదే విధంగా సండూరు తాలూకాలో వెలసిన శ్రీ కుమారస్వామి దేవస్థానంలో, లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో, పాత దరోజి బసవేశ్వర ఆలయంలో, బళ్లారి సమీపంలోని అల్లీపూర్ మహదేవ తాత మఠంలో, ఆంధ్ర సరిహద్దులో ఉన్న శ్రీ ఎర్రితాత ఆలయంలో, నగరంలోని స్థానిక ఆలయాల్లో అమావాస్య పూజలను చేశారు.


లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ

కోలారు వార్తలు...

చిక్కతిరుపతి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

కోలారు: తాలూకాలోని ప్రసిద్ధ చిక్కతిరుపతి ప్రసన్న వెంకటరమణ స్వామి దేవాలయంలో ఆదివారం భీమా అమావాస్య పండుగను పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఉపాధి బకాయి చెల్లించాలి

హుబ్లీ: ఉపాధి బకాయిలు తక్షణమే చెల్లించాలని అఖిల భారత రైతు వ్యవసాయ కార్మికుల సంఘం ధార్వాడలో ఆందోళన చేపట్టింది. కళా భవన్ మైదానం నుంచి ప్రారంభమైన ప్రదర్శన జిల్లాధికారి కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంఘం జిల్లాధ్యక్షుడు దీప ధార్వాడ మాట్లాడుతూ...22 ఏళ్ల తరువాత ఈసారి రైతులు తీవ్రమైన కరువును చూశారని, వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. 15 నెలల్లో 1185 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని రాష్ట్ర లెక్కలు చెబుతున్నాయన్నారు. ఒక్క ధార్వాడ జిల్లాలోనే 104 మంది రైతన్నలు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. అన్నదాత ఆత్మహత్యల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం ప్రముఖులు శరణగోనవార, హనుమేష, మారుతీ పూజార తదితరులు పాల్గొన్నారు.

మాదిగ దండోరా హర్షం

శ్రీనివాసపురం: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై మాదిగ దండోరా కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలో సమావేశమైన దండోరా నేతలు సమావేశమై మాట్లాడారు.జిల్లా అధ్యక్షుడు హూహళ్లి కృష్ణప్ప మాట్లాడుతూ...సదాశివ కమిషన్ నివేదికను అమలు చేయాలని కొన్నేళ్లుగా పోరాటం చేస్తూ వచ్చామని, నేడు అది ఒక కొలిక్కి వచ్చిందన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం


సమావేశమైన సంఘం పదాధికారులు

కోలారు: ప్రస్తుత ఏడాదిలో కనక నౌకరుల సంఘం, కురుబ సముదాయం నుంచి పదో తరగతిలో 85 శాతం, ఇంటర్‌లో 80 శాతం పైగా మార్కులు సాధించిన సముదాయ విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని రాష్ట్ర కనక నౌకరుల సంఘం జిల్లా అధ్యక్షుడు బిఎం నారాయణస్వామి తెలిపారు. ఆదివారం నగరంలోని కనక భవనంలో జిల్లా కురుబర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూర్వ సిద్ధతా సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు తమ ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, మార్కుల జాబితా, ఫొటో జత చేసి సమర్పించాలని తెలిపారు. అప్పు స్పోర్ట్సు, కనక మందిరం వద్ద లేదా చంద్రు ఫొటో స్టుడియో కురుబరపేటకు ఈ నెల 20 లోగా సమర్పించాలని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కురుబర సంఘం డైరెక్టర్ కెఎస్ సరస్వతమ్మ, సంఘం గౌరవ సలహాదారు మునియప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీరామేగౌడ, కోశాధికారి హరీష్, పదాధికారులు పాల్గొన్నారు.

కన్నడ జ్యోతి రథానికి ఘన స్వాగతం



మాలూరు : కర్ణాటక రాష్ట్రమని నామకరణం చేసి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న కన్నడ జ్యోతిరథ యాత్రకు మాలూరు పట్టణంలో ఘన స్వాగతం లభించింది. తహసీల్దార్ రమేష్ రథానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కే రమేష్ మాట్లాడుతూ... కన్నడ జ్యోతి రథం అన్ని తాలూకాల్లో పర్యటిస్తుందని, ఇలాంటి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కావాలన్నారు. ఈ సందర్భంగా తాపం ఈఓ కృష్ణప్ప, పురసభ ముఖ్యాధికారి ప్రదీప్, కసాప అధ్యక్షుడు ఎం వి హనుమంతయ్య, కరవే సంఘటన చాకనహళ్లి నాగరాజ్, ఎస్ఎమ్ రాజు, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కోలారు: పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని రోటరీ కోలారు నందిని అధ్యక్షుడు స్కాట్స్ బాబు తెలిపారు. గ్లోబల్ వార్మింగ్ నియంత్రణకు స్కాట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. ఆదివారం తాలూకాలోని కెంబోడి గ్రామంలో ఉన్న జనతా పబ్లిక్ పాఠశాల ప్రాంగణంలో ఆర్ జాలప్ప మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల బృందం, జిల్లా స్కాట్స్ అండ్ గైడ్స్ సంస్థ, రోటరీ నందిని ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వాతావరణంలో సమతౌల్యత లోపించడంతో అనూహ్య మార్పులు సంభవిస్తున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ పుట్టిన రోజు సందర్భంగా ఏటా మొక్కలను నాటడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సుమంత్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్, మునిరాజు, రామకృష్ణ, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.